
శుక్రవారం 3-1-2025

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 17 సంచిక: 283

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలు పాడిపంటలతో పులకించాలి'


రోహిత్‌ను తప్పించి...
తుది సమరానికి టీమిండియా.. నేటి నుంచి ఆసీస్‌తో భారత్ చివరి టెస్టు.
-15లో


బుల్.. రప్పా రప్పా!
సెన్సెక్స్ 1,436 పాయింట్లు ప్లస్
నిఫ్టీ లాభం 446 పాయింట్లు
-15లో


మోదీతో భేటీ ఎందుకు?
పంజాబ్‌లో ఆందోళన చేస్తున్న రైతులను పట్టించుకోకుండా గాయకుడు దిల్జిత్ ప్రధానిని కలవడంపై రైతు సంఘాలు మండిపడ్డాయి.
వివరాలు 6లో ▸


చైనాలో కొత్త వైరస్
చైనాలో కొత్తగా హ్యూమన్ మెటాప్నూమో వైరస్ వ్యాప్తిచెందుతోందని అంతర్జాతీయ మీడియాలో వార్తలొచ్చాయి.
వివరాలు 6లో ▸


చొరబాటుదార్లకు బీఎస్ఎఫ్ దన్ను
బంగ్లాదేశ్ నుంచి చొరబడే వారిని వదిలేస్తూ తమ రాష్ట్రాన్ని అస్థిర పర్చేందుకు బీఎస్ఎఫ్ యత్నిస్తోందని మమతా బెనర్జీ ఆరోపించారు.
వివరాలు 6లో ▸


అమెరికాలో వరుస దాడులు
కొత్త సంవత్సరం తొలి 24 గంటల్లోనే అమెరికాలో మూడు భీకర దాడులు జరిగాయి. 16 మంది మరణించారు.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

జన్యు వ్యాధులపై పోరు

జన్యు లోపాలతో మనుషుల్లో వచ్చే వ్యాధులపై పోరాటాన్ని భారత్ మరింత తీవ్రం చేసింది. వీటిపై ప్రజల్లో అవగాహన పెంచటంతో పాటు వ్యాధి నిర్ధారణను సులభతరం చేసేందుకు 15 పరిశోధన సంస్థలకు చెందిన శాస్త్రవేత్తలతో 'ప్రాజెడ్'ను కేంద్ర బయోటెక్నాలజీ విభాగం ప్రారంభించింది.
- వివరాలు 16లో▶

చైల్డ్ పోర్న్‌ను షేర్ చేసినా పట్టిస్తుంది!

చైల్డ్ పోర్నోగ్రఫీపై ప్రపంచవ్యాప్తంగా నిషేధం కొనసాగుతోంది. అమెరికాకు చెందిన ఓ సంస్థ ప్రపంచవ్యాప్తంగా సోషల్ మీడియా ఖాతాలను జల్లెడపడుతూ పోర్న్ వీడియోలు చూసిన లేదా షేర్ చేసిన వారిపై నిఘా పెడుతోంది.
- వివరాలు 16లో▶

త్వరలో మహిళా ఫైర్ ఫైటర్స్

తెలంగాణ అగ్నిమాపక శాఖలో త్వరలో మహిళా ఫైర్ ఫైటర్లు అందుబాటులోకి రానున్నారు. మహిళా సిబ్బంది నియామకానికి సంబంధించి ఇప్పటికే అగ్నిమాపకశాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అనుమతి రాగానే మహిళా సిబ్బంది నియామకానికి నోటిఫికేషన్ ఇవ్వనున్నారు.
- వివరాలు 16లో▶

యాదగిరీశుడికి మదర్ డెయిరీ నుంచే నెయ్యి

ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో లడ్డూ, ఇతర ప్రసాదాల తయారీకి మరికొంత కాలం మదర్ డెయిరీ నుంచే నెయ్యిని కొనుగోలు చేయనున్నారు. తదుపరి ఆదేశాలు వచ్చే వరకు మదర్ డెయిరీ నెయ్యినే వాడనున్నారు.
- వివరాలు 12లో▶

ఉగాదికి సన్న బియ్యం!

రేషన్‌కార్డు లబ్ధిదారులకు ఉచితంగా పంపిణీ

దొడ్డు బియ్యానికి బదులు సన్నాల సరఫరాకు సర్కారు ఏర్పాట్లు

మొత్తంగా నెలకు 2 లక్షల టన్నుల చొప్పున ఏటా 24 లక్షల టన్నులు అవసరమని అంచనా

89.6 లక్షలు రాష్ట్రంలో రేషన్‌కార్డులు

2.81 కోట్లు లబ్ధిదారులు

ఒక్కొక్కరికి నెలకు 6 కిలోల చొప్పున పంపిణీ



ప్రస్తుతం బియ్యంపై రాష్ట్రం భరిస్తున్న సబ్సిడీ రూ.3,600 కోట్లు.. సన్నబియ్యంతో మరో రూ.1,500 కోట్లు పెరిగే చాన్స్

ఇప్పటికే సంక్షేమ హాస్టళ్లు, అంగన్‌వాడీలకు మధ్యాహ్న భోజనానికి సన్న బియ్యం

కొత్త రేషన్ కార్డుల కోసం మరో 20 లక్షల మంది ఎదురుచూపులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పేదలందరికీ రేషన్‌కార్డులపై ఉచితంగా సన్న బియ్యం అందించాలని ప్రభుత్వం భావిస్తోంది. కుటుంబంలో ఒక్కొక్కరికి 6 కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీని.. ఉగాది నుంచి ప్రారంభించాలని ప్రాథమికంగా నిర్ణయానికి వచ్చినట్టు తెలిసింది. ఖరీఫ్ (వానాకాలం)లో రైతులు పండించిన సన్న ధాన్యాన్ని క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇచ్చి సేకరిస్తున్న ప్రభుత్వం.. ఆ ధాన్యాన్ని మిల్లింగ్ చేసి రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తోంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన శనివారం సచివాలయంలో జరిగే రాష్ట్ర మంత్రివర్గ
మిగతా 3వ పేజీలో ▶

బియ్యం బాగుంటాయన్న సూచనలతో..
సంక్రాంతి నుంచే సన్నబియ్యం పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. కానీ వానాకాలంలో రైతుల నుంచి సేకరించిన సన్నవడ్లను కనీసం రెండు మూడు నెలలైనా మాగనిచ్చి మిల్లింగ్ చేస్తేనే బియ్యం బాగుంటాయని నిపుణులు సూచించడంతో.. రెండు నెలల తర్వాతే సన్న వడ్లను మిల్లింగ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నేపథ్యంలో ఉచిత సన్న బియ్యం పంపిణీ పథకాన్ని ప్రారంభించడానికి కొంత సమయం పడుతుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. మంత్రివర్గంలో చర్చించిన అనంతరం దీనిపై స్పష్టమైన ప్రకటన చేసే అవకాశం ఉందని అంటున్నాయి. ఉగాది (మార్చి నెలాఖరు) నుంచి సన్న బియ్యం పంపిణీ ప్రారంభించే అవకాశం ఉందని పేర్కొంటున్నాయి.

రైతు భరోసాకు కొత్తగా దరఖాస్తులు! మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు 2లో



నలుగురికి ఖేల్‌రత్న

మనూ భాకర్, గుకేశ్, హర్మన్‌ప్రీత్, ప్రవీణ్‌లకు దేశ అత్యున్నత క్రీడా పురస్కారం

జ్యోతి యర్రాజీ, దీప్తి జివాంజిలకు 'అర్జున అవార్డు'

అంతర్జాతీయ వేదికపై తమ ప్రదర్శనతో దేశ ప్రతిష్టను ఇనుమడింపజేసిన మనూ భాకర్, దొమ్మరాజు గుకేశ్, హర్మన్‌ప్రీత్ సింగ్, ప్రవీణ్ కుమార్‌లకు దేశ అత్యున్నత క్రీడా పురస్కారం 'మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న' లభించింది. మనూ భాకర్ పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్య పతకాలు గెలిచింది. తమిళనాడుకు చెందిన గుకేశ్ ప్రపంచ చెస్ చాంపియన్‌గా అవతరించి కొత్త రికార్డు సృష్టించాడు. హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలో భారత పురుషుల హాకీ జట్టు పారిస్ ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సొంతం చేసుకుంది. పారిస్ పారాలింపిక్స్‌లో ప్రవీణ్ కుమార్ హైజంప్‌లో పసిడి పతకంతో మెరిశాడు. మరోవైపు 32 మంది 'అర్జున' జాబితాలో ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ జ్యోతి యర్రాజీ, తెలంగాణకు చెందిన పారాఅథ్లెట్ దీప్తి జివాంజి ఉన్నారు.
వివరాలు 15లో

రాష్ట్ర వాటా విడుదల ఎప్పుడో!



ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు అందని ఉపకార వేతనాలు, ఫీజులు

రూ.450 కోట్లు తన వాటాగా విడుదల చేసిన కేంద్రం

- దాదాపు నెలన్నర కావస్తున్నా స్పందించని రాష్ట్ర ప్రభుత్వం
- కేంద్ర నిధులు సకాలంలో వినియోగించుకోకుంటే వెనక్కే..!

సాక్షి, హైదరాబాద్: పోస్టు మెట్రిక్ కోర్సులు చదువుతున్న విద్యార్థుల ఉపకార వేతనాల కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేసినా ఇంకా ఎదురుచూపులు తప్పడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా విడుదల చేయకపోవడమే ఇందుకు కారణం. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఇస్తున్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వాటాలున్నాయి. గిరిజన సంక్షేమ శాఖకు సంబంధించి కేంద్రం 75% నిధులు ఇస్తుండగా.. రాష్ట్ర ప్రభుత్వం 25% నిధులు భరిస్తుంది. ఎస్సీ అభివృద్ధి శాఖకు సంబంధించి కేంద్రం 60% నిధులు ఇస్తుండగా.. 40% రాష్ట్రం చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి కేంద్రం తన వాటాను విడుదల చేసినా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన వాటాలు విడుదల చేయలేదు. విద్యార్థులు ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు ఎదురుచూస్తూనే ఉన్నారు.

రూ.450 కోట్లు అందుబాటులో ఉన్నా..

ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులకు ప్రస్తుతం రూ.450 కోట్లు అందుబాటులో ఉన్నట్లు అధికారవర్గాల సమాచారం. ఇందులో ఎస్సీ అభివృద్ధి శాఖలో రూ.275 కోట్లు, గిరిజన సంక్షేమ శాఖ పరిధిలో రూ.175 కోట్లు ఉన్నాయి. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఈ మొత్తాన్ని కేంద్రం విడుదల చేసింది. గతేడాది ఫిబ్రవరి నుంచి జూన్ వరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగడంతో గత ఆర్థిక సంవత్సర నిధులు విడుదలలో జాప్యం జరిగింది. అయితే నెలన్నర క్రితం అప్పటి నిధులను క్లియర్
మిగతా 3వ పేజీలో ▶



13 నుంచి సీఎం విదేశీ పర్యటన


15 వరకు ఆస్ట్రేలియాలో..

క్రీడలకు ప్రోత్సాహం, శిక్షణపై అధ్యయనం చేయనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

- 19 నుంచి 21 వరకు సింగపూర్‌లో పర్యాటక అభివృద్ధిపై పరిశీలన
- 21 నుంచి 23 వరకు దావోస్‌లో..
- వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో పాల్గొననున్న రేవంత్

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ నెల 13 నుంచి విదేశాల్లో పర్యటించనున్నారు. 13న ఆస్ట్రేలియా వెళ్లనున్న ఆయన.. అక్కడ క్వీన్స్‌ల్యాండ్ స్పోర్ట్స్ యూనివర్సిటీని సందర్శిస్తారు. అక్కడ క్రీడాకారులకు అందిస్తున్న శిక్షణ, మౌలిక సదుపాయాలను పరిశీలిస్తారు. రాష్ట్రంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీని ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో
మిగతా 12వ పేజీలో ▶

సరికొత్తగా 'డిగ్రీ'



యూజీసీ మార్గదర్శకాల మేరకు కోర్సులు, సిలబస్

ఏఐ, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్‌చైన్ టెక్నాలజీ కోర్సులు

నాలుగేళ్ల ఆనర్స్ కోర్సులకు పెరుగుతున్న డిమాండ్

క్లాస్ రూం లెర్నింగ్‌తో పాటు ఇంటర్న్‌షిప్ కూడా..

అధ్యయనం చేస్తున్న తెలంగాణ ఉన్నత విద్యా మండలి

విద్యార్థి నైపుణ్యాలకు మెరుగులు అద్దటమే లక్ష్యం

మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి వెల్లడి

వివరాలు 2లో▶

పరిహారం తేల్చకుండానే టెండర్లా?

రీజినల్ రింగ్ రోడ్డు నిర్వాసిత రైతుల్లో తీవ్ర ఆందోళన



- చట్ట ప్రకారం చెల్లిస్తామంటున్న అధికారుల తీరుపై విమర్శలు
- మా జీవనాధారం కోల్పోతున్నాం.. పరిహారంపై స్పష్టత ఏది?
- ఎంతో విలువైన భూములివి.. ఎకరా రూ.కోటి చెల్లించాల్సిందే
- లేకుంటే భూములు ఇచ్చేదే లేదంటున్న నిర్వాసితులు
- ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను కలసి విజ్ఞప్తులు

3 లో

ఇందుకేనా (కార్టూన్)



వావ్! సూపర్ గ్రాఫిక్స్ చేసుకోవచ్చు సార్!

కొత్త ఏడాదిలో

10 లక్షల కొలువులు!



రాష్ట్ర ప్రభుత్వం, ఐటీ పరిశ్రమ వర్గాల అంచనా

ఏఐ, క్లౌడ్‌కంప్యూటింగ్, జీసీసీల ద్వారా అవకాశాలు

రిటైల్ రంగంలోనూ అవకాశాలు మెండుగా ఉన్నాయంటూ లెక్కలు

కీలకంగా మారనున్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల రాక

ఉద్యోగాల కల్పన, మార్కెట్ వృద్ధి, సామర్థ్యాల పెంపుదల్లో జీసీసీల ముఖ్యపాత్ర

ఎంఎస్ఎంఈలదీ పెద్ద పాత్రే..
ప్రస్తుతం సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) ద్వారా రాష్ట్రంలో 5.6 లక్షల మంది ఉద్యోగాల్లో ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆవిష్కరించిన ఎంఎస్ఎంఈ పాలసీ ద్వారా ఈ ఏడాది ఈ రంగంలో ఉద్యోగాల కల్పన 10 నుంచి 15 శాతం మేర పెరిగే అవకాశమున్నట్లు అధికారులు చెప్తున్నారు.

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక మాంద్యం ఉద్యోగాల కల్పనపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతోంది. కృత్రిమ మేధస్సు (ఏఐ) వంటి అధునాతన సాంకేతికత కూడా ఈ అంశాన్ని ప్రభావితం చేస్తోందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే కొత్త ఏడాదిలో తెలంగాణలో మాత్రం ఉద్యోగాల కల్పన జోరందుకునే అవకాశం ఉందని రాష్ట్ర ప్రభుత్వంతో పాటు ఐటీ పరిశ్రమ వర్గాలు అంచనా వేస్తున్నాయి. 2025–26 ఆర్థిక సంవత్సరంలో ఒక్క తెలంగాణలోనే వివిధ రంగాల్లో పది లక్షల మేర సాధారణ ఉద్యోగాల కల్పన సాధ్యమని అంటున్నాయి. ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్‌తో పాటు ఇతర ఎమర్జింగ్ టెక్నాలజీలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు (జీసీసీలు), బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ) రంగాలతో పాటు రిటైల్ రంగంలో పెద్ద ఎత్తున ఉద్యోగాలొచ్చే అవకాశాలున్నాయని రాష్ట్ర ఐటీ పరిశ్రమల విభాగం అధికారులు చెప్తున్నారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలు కూడా ఉద్యోగాల కల్పనకు దోహదపడతాయని అంటున్నారు. గత ఏడాదిలో తెలంగాణలో నిరుద్యోగిత రేటు 8.8 శాతం నుంచి 7.1 శాతానికి తగ్గగా, 2025లో ఇది మరింత తగ్గుతుందని
మిగతా 12వ పేజీలో ▶

కార్యకర్తలే పార్టీకి పునాది రాళ్లు



కాంగ్రెస్ నిరంకుశ పాలనపై మీ పోరు అపూర్వం

కష్ట కాలంలో పోరాట స్ఫూర్తి చూపారు : కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్‌కు పునాది రాళ్లు, మూల స్తంభాలు కార్యకర్తలేనని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గులాబీ జెండాకు వెన్నెముకలా ఉంటూ అలుపెరగని పోరాటం చేస్తున్నారని కొనియాడారు. రేపటి తెలంగాణ రాజకీయ ముఖ చిత్రంపై బీఆర్ఎస్ పక్షాన మెరిసే వజ్రాయుధాలు మీరేనంటూ కార్యకర్తల్లో 'ఎక్స్'వేదికగా ఉత్సాహం నింపారు. 'ప్రాణ సమానులైన బీఆర్ఎస్ తోబుట్టువులారా.. ఏడాదిగా కాంగ్రెస్ నిరంకుశ పాలనపై పోరాట స్ఫూర్తిని చూపినందుకు శిరస్సు వంచి సలాం చేస్తున్నా. గెలుపోటములతో సంబంధం లేకుండా మీరు చూపిన ఉత్సాహం రాష్ట్రస్థాయిలో నాయకత్వానికి కొండంత స్ఫూర్తినిచ్చింది. ప్రజల పక్షాన కార్యకర్తలు విరామం లేకుండా పోరాడుతున్నారు. రైతులు, నేత కార్మికులు, మహిళలు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల పక్షాన సమరభేరి మోగించడంతో పాటు.. ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రజాక్షేత్రంలో ఎండగట్టారు. మూసీలో మూటల వేట మొదలుకుని లగచర్ల లడాయి వరకు జరిగిన ఉద్యమాల్లో బాధితుల పక్షాన నిలిచారు. అదానీకి రూ.100 కోట్లు వెనక్కి ఇచ్చేలా చేయటం, లగచర్ల అంశంలో కాంగ్రెస్‌ను దోషిగా నిలబెట్టడంలో పార్టీ యంత్రాంగం విజయం సాధించింది. అక్రమ కేసులతో ప్రభుత్వం వేధించినా పార్టీ వెంట కార్యకర్తలు నిలిచిన తీరు అపూర్వం, అసాధారణం'అని కేటీఆర్ అన్నారు.

క్లుప్తంగా...

లగచర్ల రైతుల 'ముందస్తు బెయిల్'పై వైఖరేంటి?

పోలీసులకు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: వికారాబాద్ జిల్లాలో చోటుచేసుకున్న లగచర్ల ఘటనకు సంబంధించి బొమ్రాస్‌పేట్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ రైతులు దాఖలు చేసిన పిటిషన్‌పై వైఖరేంటో చెప్పాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేస్తామని, సమయం కావాలని ప్రభుత్వ న్యాయవాది పల్లె నాగేశ్వర్‌రావు కోరడంతో న్యాయస్థానం అనుమతించింది. విచారణను ఈ నెల 9కి వాయిదా వేసింది. గతేడాది నవంబర్ 11న వికారాబాద్ జిల్లా లగచర్లలో భూసేకరణపై చర్చ సందర్భంగా కలెక్టర్ సహా పలువురు అధికారులపై దాడి జరగడం తెలిసిందే. ఈ దాడిలో పలువురిపై పోలీసులు కేసు నమోదు చేయగా సంబంధం లేకున్నా కేసులో ఇరికించారని.. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని దేవిదాస్ పవార్ నాయక్ సహా 12 మంది రైతులు, కూలీలు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

ఒకటో తేదీన పడని 'ప్రభుత్వ' వేతనాలు

సాంకేతిక కారణాలతోనే..: ఆర్థిక శాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులకు కొత్త సంవత్సరం మొదటి నెలలో ఒకటో తారీఖున వేతనాలు జమ కాలేదు. రెండో తేదీ గురువారం 2 లక్షల మందికి వేతనాలు పడ్డాయని, మిగిలిన లక్షన్నర మందికి నేడు జమయ్యే అవకాశం ఉందని తెలుస్తోంది. వేతనాలు ఒకటో తేదీన పడకపోవడంపై ఆసక్తికర చర్చ జరుగుతుంది. ఒకటో తేదీ బుధవారం ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించిన కారణంగానే ఉద్యోగులకు వేతనాలు రాలేదని, గురువారం జీతాలను జమచేసే ప్రక్రియ కొనసాగిందని ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి. కేవలం సాంకేతిక కారణంతోనే వేతనాల చెల్లింపు ప్రక్రియలో జాప్యం జరిగిందని ఆ శాఖ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

హైకోర్టులో న్యాయమూర్తులను భర్తీ చేయాలి

బీఆర్‌ఎస్ మాజీ ఎంపీ వినోద్ కుమార్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణకు ప్రత్యేక హైకోర్టు ఏర్పడి ఐదేళ్లు గడిచినా పూర్తి స్థాయిలో న్యాయమూర్తుల నియామకం జరగడం లేదని బీఆర్‌ఎస్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ అన్నారు. 2019 డిసెంబర్ 31న తెలంగాణకు ప్రత్యేక హైకోర్టు ఏర్పడిందని, 42 మంది జడ్జిలకుగాను ఈ సంఖ్య 23కు మించడం లేదని చెప్పారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ న్యాయమూర్తుల్లో ఎస్సీ, ఎస్టీ సామాజికవర్గాలకు సంబంధించిన వారు ఎవరూ లేరని, పూర్తి స్థాయిలో న్యాయమూర్తుల నియామకం జరిగితే దళిత, గిరిజన వర్గాలకు కూడా న్యాయం జరుగుతుందన్నారు. పూర్తి స్థాయిలో జడ్జిలు లేకపోవడంతో పెండింగు కేసుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని తెలిపారు. న్యాయవ్యవస్థలోనూ సామాజిక న్యాయం పాటించాలన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందినవారు తెలంగాణ హైకోర్టులో నలుగులు జడ్జిలు ఉన్నారని పేర్కొన్నారు.

అక్రిడిటేషన్లపై 'పొంగులేటి'కి నివేదిక



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టుల మీడియా అక్రిడిటేషన్ల జారీపై నివేదికను సమాచార, పౌరసంబంధాలశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి అధికారులు అందజేశారు. సచివాలయంలో గురువారం మంత్రి పొంగులేటిని.. సమాచార, పౌరసంబంధాల శాఖ కమిషనర్ డాక్టర్ ఎస్.హరీశ్, మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి కలిసి నివేదికను అందజేశారు. రాష్ట్ర హెడ్ క్వార్టర్స్, జిల్లా, మండల వర్కింగ్ జర్నలిస్టుల మీడియా అక్రిడిటేషన్ల జారీ కోసం మార్గదర్శకాలను సమీక్షించి, రూపొందించడానికి ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేయడం తెలిసిందే. ఈ కమి టీ ఇప్పటి వరకు ఆరుసార్లు భేటీ అయి.. మీడియా అక్రిడిటేషన్ల నిబంధనలపై విస్తృతంగా సమీక్షించి నివేదికను మంత్రికి అందజేసింది.

బదిలీలపై దేవాదాయ శాఖ కమిషనర్‌కు వినతి

సాక్షి, హైదరాబాద్: దేవాదాయ శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలపై టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్, ప్రధాన దేవాలయాల జేఏసీ చైర్మన్ జి.రమేశ్‌బాబు తదితరులు.. గురువారం దేవాదాయ శాఖ కమిషనర్ ఈ.శ్రీధర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన దేవాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను వివరించారు. అనారోగ్య సమస్యలున్న వారిని, వేర్వేరు చోట్ల ఉద్యోగాలు చేస్తున్న దంపతులను బదిలీ చేయాలని కోరారు. జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్ కేడర్లలో పనిచేస్తూ బదిలీలైన వారిని మాతృసంస్థలకు పంపించాలని విజ్ఞప్తి చేశారు. అందుకు కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు టీఎన్‌జీవో, దేవాదాయ శాఖ జేఏసీ నాయకులు తెలిపారు.

సరికొత్తగా 'డిగ్రీ'

యూజీసీ మార్గదర్శకాల మేరకు కోర్సులు, సిలబస్

- ఏఐ, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్‌చైన్ టెక్నాలజీ కోర్సులు
- నాలుగేళ్ల ఆనర్స్ కోర్సులకు పెరుగుతున్న డిమాండ్
- క్లాస్ రూం లర్నింగ్‌తో పాటు ఇంటర్న్‌షిప్ కూడా..
- అధ్యయనం చేస్తున్న తెలంగాణ ఉన్నత విద్యా మండలి
- విద్యార్థి నైపుణ్యాలకు మెరుగులు అద్దటమే లక్ష్యం
- మండలి చైర్మన్ బాలకిష్టారెడ్డి వెల్లడి

సాక్షి, హైదరాబాద్: సంప్రదాయ డిగ్రీ కోర్సులను సరికొత్తగా తీర్చిదిద్దేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) మార్గదర్శకాలకు అనుగుణంగా డిగ్రీలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టడం, సంప్రదాయ కోర్సుల్లో ఆధునిక అవసరాలకు తగ్గట్లుగా సిలబస్‌ను మార్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. యూజీసీ మార్గదర్శకాలపై అధ్యయనానికి తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఇప్పటికే కమిటీ వేసింది. త్వరలో సిలబస్‌ను ఖరారు చేయబోతోంది. త్వరలోనే విధివిధానాలను వెల్లడిస్తామని మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థి పూర్తి నైపుణ్యంతో ధైర్యంగా ఉపాధి కోసం వెళ్లేలా సిలబస్ ఉండబోతోందని చెప్పారు. దేశవ్యాప్తంగా ఆనర్స్ కోర్సులకు ప్రాధాన్యత పెరుగుతుండటాన్ని కూడా పరిగణనలోనికి తీసుకుంటున్నామని అధికారులు చెబుతున్నారు.

క్రెడిట్స్‌కే ప్రాధాన్యం..

ప్రపంచవ్యాప్తంగా విద్యా విధానం క్రెడిట్ స్కోర్ ఆధారంగా నడుస్తోంది. టెన్త్, డిగ్రీ, పీజీ, సాంకేతిక విద్యకు ప్రత్యేకంగా క్రెడిట్స్ ఇవ్వనున్నారు. ఈ విధానం వల్ల ఇతర దేశాల్లోనూ ఉపాధి కోసం వెళ్లవచ్చని అధికారులు అంటున్నారు. విద్యార్థులు మూడేళ్లలో 120 క్రెడిట్లు పూర్తి చేస్తేనే అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ) డిగ్రీకి అర్హులవుతారు. అదే విద్యార్థి నాలుగేళ్లలో 160 క్రెడిట్లను పూర్తి చేస్తేనే యూజీ ఆనర్స్ డిగ్రీ పట్టా లభిస్తుంది. ఆనర్స్ డిగ్రీ కోర్సుల్లో చేరేవారు రీసెర్చ్ కోసం వెళ్లాలనుకుంటే నాలుగేళ్ల కోర్సులోనే ప్రాజెక్టులను చేపట్టాల్సి ఉంటుంది. మొదటి ఆరు సెమిస్టర్లలో 75 శాతం.. అంతకంటే ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు యూజీ స్థాయిలో పరిశోధనలు చేపట్టాలనుకుంటే నాలుగో ఏడాది పరిశోధనా ప్రాజెక్టును ఎంచుకోవచ్చు. దీన్ని పూర్తి చేస్తే వారికి యూజీ (ఆనర్స్ విత్ రీసెర్చ్) డిగ్రీని ప్రదానం చేస్తారు.

ఆనర్స్‌కు కొత్త బోధనా ప్రణాళిక..

ప్రస్తుతం మూడేళ్ల డిగ్రీ కోర్సులు చేస్తున్నవారు కూడా నాలుగేళ్ల ఆనర్స్ కోర్సులకు మారేందుకు కొత్త కరిక్యులం ఫ్రేమ్ వర్క్ అవకాశం కల్పిస్తోంది. ఇప్పటికే ఛాయిస్ బేస్డ్ క్రెడిట్ సిస్టమ్ (సీబీసీఎస్) ప్రకార మూడేళ్ల యూజీ కోర్సుల్లో పేర్లు నమోదు చేసుకున్న, అభ్యసిస్తున్న విద్యార్థులు కూడా నాలుగేళ్ల యూజీ ఆనర్స్ కొనసాగించడానికి అర్హులని కొత్త నిబంధనల్లో పేర్కొన్నారు. అయితే, ఆనర్స్ కోర్సుల్లోకి మారడానికి ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్‌లో వర్సిటీలు అందించే బ్రిడ్జ్ కోర్సులు చేయటం తప్పనిసరి. నాలుగేళ్ల యూజీ ఆనర్స్ కోర్సుల్లో విద్యార్థులకు బహుళ ప్రవేశ, నిష్క్రమణలకు అవకాశం కల్పించబోతున్నారు. మొదటి ఏడాది పూర్తి చేస్తే సర్టిఫికెట్ లభిస్తుంది. రెండేళ్లు చదివితే డిప్లొమా ఇస్తారు. మూడేళ్లు చదివితే బ్యాచిలర్ డిగ్రీ పట్టా లభిస్తుంది. నాలుగేళ్లు పూర్తి చేస్తే ఆనర్స్ బ్యాచిలర్ డిగ్రీ పట్టా అందుతుంది. ఈ మేరకు విద్యార్థులు తమ ప్రాధాన్యతలను ఎంచుకోవడానికి అనుమతిస్తారు. నాలుగేళ్ల ఆనర్స్‌లో చేరినవారు మూడేళ్లలోపు నిష్క్రమిస్తే, అప్పటి నుంచి మూడేళ్లలోపు మళ్లీ కోర్సులో చేరేందుకు అవకాశం ఇస్తారు. అలాంటి వారు ఏడేళ్ల వ్యవధిలో కోర్సు పూర్తి చేయాల్సి ఉంటుంది.



కొన్నేళ్లుగా డిగ్రీలో చేరిన విద్యార్థుల సంఖ్య ఇలా..

డిగ్రీలోనూ ఏఐ కోర్సులు

డిగ్రీలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోర్సులకు ప్రాధాన్యం ఇవ్వాలని యూజీసీ మార్గదర్శకాల్లో సూచించింది. తెలంగాణలో నాలుగేళ్ల బీఎస్సీ (హానర్స్) కంప్యూటర్స్‌ను 50కి పైగా కాలేజీల్లో అందుబాటులోకి తెచ్చారు. ఏఐ, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్ చైన్ టెక్నాలజీ వంటి అంశాలు హానర్స్‌లో చోటు చేసుకోబోతున్నాయి. కంప్యూటర్ పరిజ్ఞానంతో కూడిన అనలిస్టులు, అకౌంటెంట్లకు మంచి వేతనాలతో కూడిన ఉపాధి లభిస్తోంది. ఈ కారణంగా డిగ్రీ కోర్సుల్లో కామర్స్‌ను ఎంచుకునే వారి సంఖ్య 36 శాతం నుంచి 41 శాతానికి పెరిగింది. బ్యాచిలర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (బీబీఏ) లో చేరికలు కూడా ఆరేళ్లలోనే ఏడు రెట్లు పెరిగాయి. బ్యాచిలర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (బీసీఏ)లో ప్రవేశాలు 9 రెట్లు పెరిగాయి. దీంతో బీకాం కోర్సులను అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నారు. బీకాం జనరల్‌తో పాటు, కంప్యూటర్స్, ట్యాక్సేషన్, ఆనర్స్, బిజినెస్ అనలిటిక్స్ వంటి కొత్త స్పెషలైజేషన్లను తీసుకొచ్చారు. బీమా, స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెరగడం, జీఎస్టీ తీసుకురావడంతో ట్యాక్స్ నిపుణుల అవసరం రెట్టింపైంది. బ్యాంకింగ్, ఫైనాన్స్, ఈ కామర్స్, రిటైల్ సంస్థల పెరుగుదల కూడా కలిసివచ్చింది.

భూభారతితో మెరుగైన సేవలు

- రెవెన్యూ సంఘాల నేతలతో సీఎం రేవంత్‌రెడ్డి
- కొత్త సంవత్సరం డైరీ ఆవిష్కరణ



టీజీటీఏ, టీజీఆర్‌ఎస్‌ఏ డైరీని ఆవిష్కరించిన సీఎం రేవంత్. చిత్రంలో ఉద్యోగ సంఘాల నేతలు

సాక్షి, హైదరాబాద్: త్వరలో అమల్లోకి రానున్న కొత్త ఆర్వోఆర్ చట్టంతోనే భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. రాష్ట్రంలోని రైతులకు మెరుగైన రెవెన్యూ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. తెలంగాణ తహసీల్దార్స్ అసోసియేషన్ (టీజీటీఏ), తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ (టీజీఆర్‌ఎస్‌ఏ) రూపొందించిన నూతన సంవత్సర డైరీని సీఎం గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యోగుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి తదితరులతో..కొత్త ఆర్వోఆర్ చట్టం, దానిలోని అంశాల గురించి సీఎం చర్చించారు. ధరణితో రాష్ట్రంలో భూసమస్యలు పెరిగాయని, సమస్యలు పరిష్కరించడంతో పాటు రైతులకు, ప్రజలకు రెవెన్యూ సేవలను వేగంగా, సులభంగా అందించే లక్ష్యంతోనే భూభారతిని తీసుకొచ్చినట్లు తెలిపారు. కొత్త చట్టంలో రెవెన్యూ అధికారులకు వివిధ స్థాయిల్లో అధికారాలను కల్పించిన విషయాన్ని గుర్తు చేశారు. కొత్త చట్టాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే కాకుండా సమర్థవంతంగా అమలు చేయాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులు, ఉద్యోగులపైనే ఉందన్నారు. కాగా రాష్ట్రంలో ఎన్నికల సమయంలో తహసీల్దార్లను వివిధ జిల్లాలకు బదిలీ చేశారని, వారిని సొంత జిల్లాలకు పంపాల ని సీఎంను లచ్చిరెడ్డి కోరారు. దీంతో సాధ్యమైనంత త్వరలోనే బదిలీల ప్రక్రియ జరిగేలా చర్యలు తీసుకుంటామని సీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, టీజీటీఏ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చట్టం అమలుకు ఉద్యోగులు కృషి చేయాలి

భూభారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసేందుకు రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది సమష్టిగా, చిత్తశుద్ధితో కృషి చేయాలని రేవంత్‌రెడ్డి కోరారు. రెవెన్యూ వ్యవస్థలో స్పష్టమైన మార్పు కనిపించాలని ఆకాంక్షించారు. కొత్త ఏడాది పురస్కరించుకుని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా) రాష్ట్ర అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర కార్యవర్గం గురువారం ముఖ్యమంత్రిని, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని, సీసీఎల్ఏ నవీన్ మిత్తల్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేసింది. భూభారతి అమలుకు పూర్తిస్థాయిలో సహకరిస్తామని సంఘం నేతలు ఈ సందర్భంగా తెలియజేశారు. సంఘం ప్రధాన కార్యదర్శి కె.గౌతమ్ కుమార్, ఉపాధ్యక్షుడు కె.నిరంజన్‌రావ్ ఈ బృందంలో ఉన్నారు.

దీప్తికి సీఎం అభినందనలు

పారా ఒలింపిక్స్‌లో కాంస్య పతకం గెలిచి అర్జున పురస్కారానికి ఎంపికైన తెలంగాణ యువ అథ్లెట్, వరంగల్ జిల్లా యువతి దీప్తి జివాంజీకి ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి అభినందనలు తెలియజేశారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడల్లో సత్తా చాటే యువ క్రీడాకారులను ప్రోత్సహించాలనే ప్రజాప్రభుత్వ క్రీడా విధానంలో భాగంగా.. ఇటీవల దీప్తికి రూ.కోటి, కోచ్ నాగపురి రమేశ్‌కు రూ.10 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశామని గుర్తు చేశారు. దీప్తికి గ్రూప్–2 ఉద్యోగంతో పాటు వరంగల్‌లో 500 గజాల స్థలం కేటాయించాలని నిర్ణయించామన్నారు. ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డుకు ఎంపికైన గుకేష్ (చెస్), హర్మన్‌ప్రీత్ సింగ్(హాకీ), ప్రవీణ్‌కుమార్ (పారా అథ్లెటిక్స్), మనుబాకర్(షూటింగ్) తదితరులకు కూడా సీఎం అభినందనలు తెలిపారు.

సచివాలయానికి జన జాతర

- పాస్‌ల కోసం పెద్దసంఖ్యలో క్యూ కట్టిన సందర్శకులు
- వాహనాలు నిలిపేందుకు ఇబ్బందులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సచివాలయం గురువారం సందర్శకులతో కిటకిటలాడింది. నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పడానికి కొందరు వస్తే.. మరికొందరు తమ సొంత పనుల కోసం సచివాలయానికి వచ్చారు. అధికారులను, మంత్రులను కలిసేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి భారీఎత్తున మంత్రుల అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. దీంతో సచివాలయం బయట ప్రాంగణంతోపాటు లోపల ఫ్లోర్లు కిటకిటలాడాయి. సాధారణంగా సచివాలయంలోకి వెళ్లడానికి పాస్‌లు జారీచేసి సాయంత్రం 3 గంటల నుంచి మాత్రమే అనుమతినిస్తారు. అయితే, జన సందోహం పెరగటంతో ఉదయం నుంచే పాస్‌ల కౌంటర్ వద్ద క్యూలు కట్టడం గమనార్హం. మరి కొందరు మంత్రులు, అధికారుల పేషీల నుంచి ఫోన్లు చేయించుకొని లోపలికి వెళ్లారు.

పార్కింగ్ కోసం ఇక్కట్లు..

భారీ ఎత్తున ప్రజలు రావడంతో వాహనాలు నిలిపేందుకు ఇబ్బంది పడ్డారు. గేట్ –2 దగ్గర సచివాలయం లోనికి వెళ్లేందుకు కార్లు క్యూ కట్టాయి. సచివాలయం ప్రాంగణంలో కూడా భారీగా వాహనాలు నిలపడంతో కార్లతో నిండిపోయింది. సందర్శకులను నియంత్రించేందుకు భద్రతా సిబ్బంది తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.

సచివాలయంలో భారీ ఎల్‌ఈడీ స్క్రీన్

ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి పనుల ప్రచారం కోసం ఏర్పాటు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సచివాలయం ప్రాంగణం లోపల భారీ ఎల్‌ఈడీ స్క్రీన్ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. 'ప్రభుత్వం ఏం చేస్తుంది.. ఏం చేయబోతోంది.. ఇప్పటి వరకు ఏం చేసింది?' అనే అంశాలను ప్రజలకు వీడియోల రూపంలో వివరించేందుకు ఈ స్క్రీన్‌ను ఏర్పాటు చేస్తోంది. సచివాలయంలోకి సందర్శకులు వచ్చే మార్గం వద్ద దీనిని ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. సచివాలయానికి రోజుకు రెండు వేల మందికిపైగా వివిధ పనుల మీద వస్తుంటారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు వారికి తెలిసేలా ఈ స్క్రీన్‌పై ప్రదర్శిస్తారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఆయా శాఖల మంత్రులు, అధికారులు, పథకాల వీడియోలు, ఫొటోలు స్క్రోల్ అవుతూ ఉంటాయి. ఇప్పటికే మంత్రుల పేషీల ముందు చిన్నచిన్న ఎల్‌ఈడీ స్క్రీన్‌లు ఉన్నా.. అవి అందరికీ కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో పెద్ద స్క్రీన్‌ను సచివాలయం ముందు ఏర్పాటు చేయడం ద్వారా విస్తృత ప్రచారం చేయటానికి ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

జనవరి 3న మహిళా టీచర్ల దినోత్సవం

- సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా నిర్ణయం
- ఉత్తర్వులు జారీచేసిన సీఎస్ శాంతికుమారి



సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే సతీమణి సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా జనవరి 3వ తేదీని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రతి సంవత్సరం జనవరి 3న అధికారికంగా ఈ ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్సవాలు అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఇందుకు సంబంధించిన ఖర్చులను విద్యాశాఖ బడ్జెట్ నుంచి చెల్లించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఉత్సవాల నిర్వహణకు తగిన చర్యలు తీసుకోవాలని విద్యాశాఖను ఆదేశించారు.

ప్రభుత్వ నిర్ణయం హర్షణీయం

సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం పట్ల పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. దేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా అణగారిన మహిళలకు అక్షర జ్ఞానం అందించిన మహనీయురాలు సావిత్రిబాయి పూలే అని కొనియాడారు. ఆ మహనీయురాలి జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకోవడం మహిళలందరికీ గర్వకారణమని పేర్కొన్నారు. ప్రభుత్వ నిర్ణయంపై టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

'స్థానికం'లో లబ్ధికి 8.5 లక్షల నకిలీ ఓటర్ కార్డులు

కాంగ్రెస్ పార్టీపై కేంద్ర ఎన్నికల కమిషన్‌కు సామాజిక కార్యకర్త బక్క జాడ్సన్ ఫిర్యాదు

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ యూత్ కాంగ్రెస్‌పై ప్రముఖ సామాజిక కార్యకర్త బక్క జాడ్సన్ సంచలన ఆరోపణలు చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు రాష్ట్రవ్యాప్తంగా 8.5 లక్షల మంది ప్రజల ఓటరు గుర్తింపు కార్డులను చట్టవిరుద్ధంగా డౌన్‌లోడ్ చేసుకొని వాటి ద్వారా నకిలీ కార్డులు సృష్టించిందని ఆరోపించారు. అలాగే అసెంబ్లీ ఎన్నికల ముందు యూత్ డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ తెలంగాణ ప్రజల్ని మోసగించారని మండిపడ్డారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో కేంద్ర ఎన్నికల సంఘానికి జడ్సన్ వేర్వేరు ఫిర్యాదులు చేశారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను ఈసీకి అప్పగించినట్లు చెప్పారు. తన ఫిర్యాదులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈసీని కోరారు.

దర్యాప్తు ఎప్పుడు పూర్తి చేస్తారు?

ఫోన్ ట్యాపింగ్ కేసులో తిరుపతన్న పాత్రపై తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ప్రశ్న

- దర్యాప్తునకు ఎంత సమయం పడుతుందో రాత పూర్వకంగా చెప్పాలని ఆదేశాలు
- బెయిల్ పిటిషన్‌పై విచారణ ఈ నెల 27కు వాయిదా



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న అదనపు ఎస్పీ మేకల తిరుపతన్న బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టు తదుపరి విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది. ఈ కేసులో తిరుపతన్న గతేడాది అక్టోబర్‌లో దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై గురువారం జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ కోటేశ్వర్‌సింగ్ ధర్మాసనం విచారణ జరిపింది. తెలంగాణ ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా.. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తిరుపతన్న ప్రధాన నిందితుడని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఫోన్ ట్యాపింగ్‌తో పాటు ఆధారాలు చెరిపివేయడంలోనూ తిరుపతన్న కీలకంగా వ్యవహరించారని.. 2023 డిసెంబర్ 3న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు రాగానే ఆధారాలు ధ్వంసం చే శారని లూథ్రా తెలిపారు. రాజకీయ నేతల ఆదేశాల మేరకు పలువురి ఫోన్లను ట్యాప్ చేశారని, హైకోర్టు జడ్జిల ఫోన్లు కూడా ఇందులో ఉన్నాయని వివరించారు.

మరోవైపు తిరుపతన్న 9 నెలలుగా జైలులో ఉన్నారని.. ఆయన పాత్రపై ఇప్పటికే చార్జిషీట్ దాఖలైందని తిరుపతన్న తరపు న్యాయవాది సిద్ధార్థ దవే వాదించారు. బెయిల్ పొందడం హక్కు అని.. తప్పనిసరైతేనే జైలులో ఉంచాలని సుప్రీం కోర్టు గతంలో తీర్పులిచ్చిందని దవే ప్రస్తావించారు. కాగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తిరుపతన్న పాత్రపై దర్యాప్తు సుదీర్ఘకాలం కొనసాగడం సరికాదన్న ధర్మాసనం... విచారణను ఎప్పటికి పూర్తిచేస్తారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అంతేగాక దర్యాప్తు పేరుతో పిటిషనర్ స్వేచ్ఛను అడ్డుకోలేరని ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. దర్యాప్తు పూర్తికి ఇంకా ఎంత సమయం పడుతుందో రాతపూర్వకంగా తమకు ఇవ్వాలని ఆదేశించింది. అయితే విచారణ పూర్తయ్యేందుకు మరో 4 నెలలు సమయం పడుతుందని, అఫిడవిట్ దాఖలుకు సమయం కావాలని ప్రభుత్వ తరపు న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ధర్మాసనాన్ని కోరారు. దీంతో తదుపరి విచారణను జస్టిస్ నాగరత్న ధర్మాసనం జనవరి 27కు వాయిదా వేసింది.

రైతు భరోసాకు కొత్తగా దరఖాస్తులు!

- ప్రభుత్వానికి మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు
- రేపు కేబినెట్ భేటీలో రైతు భరోసాతో పాటు సబ్ కమిటీ సిఫారసులకు ఆమోద ముద్ర
- ఈ నెల 5 నుంచి 7 వరకు గ్రామసభల్లో దరఖాస్తుల స్వీకరణ!
- పథకంపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం



సాక్షి, హైదరాబాద్: సంక్రాంతి నుంచి అమలు చేయాలని భావిస్తున్న 'రైతు భరోసా'కోసం రైతుల నుంచి కొత్తగా దరఖాస్తులు తీసుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల 5 నుంచి 7వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించి అర్హులైన రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని మంత్రి వర్గ ఉపసంఘం ప్రభుత్వానికి సూచించింది. గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని సబ్ కమిటీ మరోసారి సమావేశమై వివిధ అంశాలను చర్చించింది. మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి తదితరులు సమావేశమై రైతు భరోసా విధివిధానాలకు తుదిరూపు ఇచ్చారు. ఈ నెల 4న జరిగే మంత్రివర్గ సమావేశంలో 'రైతు భరోసా'కు, కేబినెట్ కమిటీ సిఫారసులకు ఆమోదముద్ర వేయనున్నారు.

సెల్ఫ్ డిక్లరేషన్‌పై భిన్నాభిప్రాయాలు

ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు రైతు భరోసాపై రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించాలని కమిటీ సమావేశంలో నిర్ణయించారు. ఒక మండలాన్ని మూడు భాగాలుగా విభజించి ఆ మూడురోజుల్లోనే గ్రామ సభలు నిర్వహించి, రైతు భరోసా కోసం దరఖాస్తులు ఆహ్వానించాలనే అభిప్రాయానికి వచ్చారు. రైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్ తీసుకోవాలన్న నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం కావడంతో ఈ దరఖాస్తుల అంశాన్ని తెరపైకి తెచ్చినట్లు సమాచారం. ఇప్పటివరకు మంత్రులు చెప్పిన అభిప్రాయాలు, ప్రజల నుంచి వచ్చిన స్పందన, ముఖ్యమంత్రి సూచనలతో పూర్తిస్థాయి నివేదికను రూపొందించి శనివారం మంత్రివర్గ సమావేశం ముందుంచనున్నారు.

సాగుచేసే రైతులందరికీ భరోసా

రాష్ట్రంలో భూమి సాగు చేసే రైతులందరికీ తప్పనిసరిగా సాయం అందించాలనే నిర్ణయానికి సబ్ కమిటీ వచ్చినట్లు తెలిసింది. శాటిలైట్ మ్యాపింగ్, అధికారుల సర్వేకు అనుగుణంగా రైతు సాగు చేసే భూమిని ప్రతి సీజన్‌లో లెక్క కట్టే అంశాన్ని నిబంధనల్లో చేర్చాలని స్పష్టంగా పేర్కొనట్లు సమాచారం. ధరణి పోర్టల్ ప్రకారం రాష్ట్రంలో కోటీ 53 లక్షల ఎకరాల వ్యవసాయ భూమి ఉండగా, సాగుభూమి కోటీ 30 లక్షల ఎకరాలుగా ప్రభుత్వం ప్రాథమికంగా గుర్తించింది. ఇందులో యాసంగిలో 70 లక్షల ఎకరాల వరకే వివిధ పంటలు సాగవుతాయి. ఈ పరిస్థితుల్లో సీలింగ్‌తో సంబంధం లేకుండా సాగు భూమి మొత్తానికి రైతు భరోసా అమలు చేస్తే ఎలా ఉంటుందనే అంశంపై కూడా చర్చించినట్లు సమాచారం. అలాగే భూగరిష్ట పరిమితిని పరిగణనలోకి తీసుకుంటే వచ్చే సమస్యలపై కూడా మరోసారి చర్చించినట్లు తెలిసింది. ఐటీ చెల్లింపుదారులను రైతు భరోసాకు అనర్హుల్ని చేసే 'పీఎం కిసాన్ సమ్మాన్ నిధి'మార్గదర్శకాలను అమలు చేయకూడదని నిర్ణయించినట్లు తెలిసింది.

విచారణకు రాలేం.. ఇంకాస్త గడువివ్వండి

- ఫార్ములా–ఈ కేసులో ఈడీకి బీఎల్ఎన్ రెడ్డి, అర్వింద్‌కుమార్ లేఖలు
- అంగీకరించిన ఈడీ.. 8, 9 తేదీల్లో హాజరుకావాలని మళ్లీ సమన్లు

సాక్షి, హైదరాబాద్: ఫార్ములా–ఈ రేసు కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న హెచ్ఎండీఏ మాజీ సీఈ బీఎల్ఎన్ రెడ్డి గురువారం ఈడీ ఎదుట జరగాల్సిన విచారణకు గైర్హాజరయ్యారు. విచారణకు హాజరయ్యేందుకు వీలుగా తనకు మరికొంత సమయం కావాలని కోరారు. ఈ మేరకు ఈడీ అధికారులకు ఈ–మెయిల్ పంపారు. సంబంధిత పత్రాలు, ఇతర వివరాలు సమర్పించేందుకు 2–3 వారాల సమయం ఇవ్వాలన్నారు. మరోవైపు శుక్రవారం ఈడీ ఎదుట విచారణకు హాజరుకావాల్సిన ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్ సైతం మరికొంత సమయం కోరారు. దీంతో అందుకు అంగీకరించిన ఈడీ అధికారులు.. వారిద్దరికీ గురువారం మళ్లీ సమన్లు జారీ చేశారు. ఈ నెల 8న బీఎల్ఎన్ రెడ్డిని, 9న అర్వింద్‌కుమార్‌ను హాజరుకావాలని ఆదేశించారు. ముందుగా జారీ చేసిన సమన్ల ప్రకారం గురువారం ఉదయం 10:30 గంటలకు బీఎల్ఎన్ రెడ్డి ఈడీ జాయింట్ డైరెక్టర్ రోహిత్ ఆనంద్ నేతృత్వంలోని అధికారుల బృందం ఎదుట విచారణకు హాజరు కావాల్సి ఉంది.

అదే బాటలో కేటీఆర్?

ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న మున్సిపల్‌శాఖ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ నెల 7న విచారణకు హాజరుకావాల్సి ఉంది. అయితే బీఎల్ఎన్‌రెడ్డి, అర్వింద్‌కుమార్‌లు విచారణకు హాజరయ్యేందుకు ఈడీ సమయం ఇచ్చిన నేపథ్యంలో కేటీఆర్ సైతం ఈడీని మరికొంత సమయం కోరతారా లేదా అనే అంశంపై స్పష్టత రావాల్సి ఉంది. ఏసీబీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్, హెచ్ఎండీఏ అధికారులు ఇచ్చిన ఫిర్యా దు, తమ దర్యాప్తులో గుర్తించిన పలు పత్రాల ఆధారంగా రంగంలోకి దిగిన ఈడీ.. మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు ప్రారంభించడం తెలిసిందే. అదే విధంగా దర్యాప్తులో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా 'ఫారిన్ ఎక్స్ఛేంజ్ మేనేజ్‌మెంట్ యాక్ట్ (ఫెమా)' కింద కూడా ఈడీ దర్యాప్తు కొనసాగనుంది.

పరిహారం తేల్చకుండానే టెండర్లా?

రీజనల్ రింగ్ రోడ్డు నిర్వాసిత రైతుల్లో తీవ్ర ఆందోళన

చట్ట ప్రకారం చెల్లిస్తామంటున్న అధికారుల తీరుపై విమర్శలు

మా జీవనాధారం కోల్పోతున్నాం.. పరిహారంపై స్పష్టత ఏది?

ఎంతో విలువైన భూములివి.. ఎకరాకు రూ.కోటి చెల్లించాల్సిందే

లేకుంటే భూములు ఇచ్చేదే లేదంటున్న నిర్వాసితులు

ఎన్‌హెచ్‌ఏఐ అధికారులను కలసి విజ్ఞప్తులు

పరిహారం నిర్ణయం రెవెన్యూ అధికారులే చేస్తారనడంతో నిరాశగా వెనుదిరుగుతున్న తీరు



సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: రీజనల్ రింగ్ రోడ్ నిర్మాణంతో భూములు కోల్పోతున్న రైతుల్లో తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. తమకు ఇచ్చే పరిహారం ఎంతనేది తేల్చకుండానే.. రహదారి నిర్మాణానికి టెండర్లు పిలవడం ఏమిటని నిర్వాసితులు ప్రశ్నిస్తున్నారు. తరతరాలుగా తమ జీవనాధారమైన భూములను కోల్పోతే ఎలా బతకాలని నిలదీస్తున్నారు. ఎంతో విలువైన ఈ భూములకు కనీసం ఎకరాకు రూ.కోటిపైగా చెల్లించాల్సిందేనని, లేకుంటే భూములు ఇచ్చేదే లేదని పేర్కొంటున్నారు.

త్వరలో భూసేకరణ అవార్డు..

'రీజనల్' ఉత్తర భాగం కింద 161.581 కిలోమీటర్ల మేర ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణానికి కేంద్ర జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) ఇటీవల టెండర్లు పిలిచిన సంగతి తెలిసిందే. తొలివిడతలో సంగారెడ్డి జిల్లా గిర్మాపూర్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ వరకు.. మొత్తం ఐదు ప్యాకేజీలుగా ఈ రహదారిని నిర్మించనున్నారు. దీని కోసం సంగారెడ్డి, మెదక్, సిద్ధిపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల పరిధిలో 3,429 ఎకరాల భూమిని సేకరించాలని నిర్ణయించారు. ఈ మేరకు భూములు కోల్పోతున్న రైతుల వివరాలతో ప్రిలిమినరీ నోటిఫికేషన్ జారీ చేశారు. సర్వే ప్రక్రియ కూడా పూర్తయింది. పరిహారం నిర్ణయించేందుకు... ఆయా గ్రామాల్లో ఇటీవల జరిగిన భూముల క్రయవిక్రయాల వివరాలను అధికారులు సేకరించి ప్రభుత్వానికి పంపారు. కానీ ఎకరానికి ఎంత మొత్తం చెల్లిస్తారనేది తేలలేదు.

రెవెన్యూ అధికారుల తీరుపై విమర్శలు

ఈ భూసేకరణ ప్రక్రియలో రెవెన్యూ ఉన్నతాధికారుల ధోరణిని రైతులు తప్పుపడుతున్నారు. నిర్వాసితులకు కనీస సమాచారం ఇవ్వకుండా, కేవలం చట్ట ప్రకారం వ్యవహరిస్తామంటున్నారే తప్ప ఎలాంటి స్పష్టత ఇవ్వడం లేదని మండిపడుతున్నారు. భూముల విలువలు కొన్నేళ్లుగా భారీగా పెరిగాయని, దానికి తోడు తాము జీవనాధారమూ కోల్పోతున్నామని... ఇలాంటి పరిస్థితుల్లో తగిన పరిహారం ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు.

ప్రాజెక్టు కార్యాలయానికి నిర్వాసితులు..

తమ భూములకు ఇచ్చే పరిహారం తేల్చకుండానే టెండర్ల ప్రక్రియ ప్రారంభమైనా కూడా స్థానిక రెవెన్యూ అధికారులు దాటవేత ధోరణితో వ్యవహరిస్తున్నారంటూ.. నిర్వాసితులు ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల వద్దకు వెళ్లి నిలదీస్తున్నారు. ఈ మేరకు సిద్దిపేట జిల్లా గజ్వేల్‌లో ఉన్న ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టు యూనిట్ కార్యాలయానికి పీడీని కలసి తమ గోడు వెళ్లబోసుకుంటున్నారు. పరిహారంపై నిర్ణయం రెవెన్యూ అధికారులే తీసుకుంటారని వారు చెప్పడంతో నిరాశగా వెనుదిరుగుతున్నారు.

వాళ్లు చెప్పడం లేదు.. వీళ్లు తేల్చడం లేదు..



మా భూముల నుంచి రోడ్డు వేస్తామంటున్నారు. ఈ రోడ్డుకు టెండర్లు కూడా మొదలయ్యాయట. కానీ మా భూములకు ఎంత ఇస్తారో తేల్చడం లేదు. రెవెన్యూ అధికారులను అడిగితే పట్టించుకోవడం లేదు. నేషనల్ హైవే అధికారులను అడిగితే వారు రెవెన్యూ వారే చెబుతారంటున్నారు. ఏం చేయాలో తెలియడం లేదు.

– గొల్ల కృష్ణ, నిర్వాసితరైతు, గిర్మాపూర్, సంగారెడ్డి జిల్లా

చట్ట ప్రకారం చెల్లిస్తాం



రీజనల్ రోడ్డు భూసేకరణ ప్రక్రియపై త్వరలో అవార్డు ప్రకటిస్తాం. నిర్వాసితులకు చట్టప్రకారం పరిహారం చెల్లిస్తాం. ఎకరానికి ఎంత చొప్పున ఇస్తారని లెక్కించేందుకు ఓ విధానం ఉంటుంది. ప్రభుత్వం ఇంకా నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

– రవీందర్‌రెడ్డి, భూసేకరణ అధికారి, రీజనల్ రింగ్ రోడ్డు

క్లుప్తంగా...

అన్నం పెట్టే రైతన్న అడుక్కోవాలా?: కవిత



సాక్షి, హైదరాబాద్: రైతు భరోసా పథకానికి షరతులు, నిబంధనలు విధిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి దేశానికి అన్నం పెట్టే రైతన్న అడుక్కోవాలనే రీతిలో వ్యవహరిస్తున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు భరోసా పథకానికి కూడా దరఖాస్తులను స్వీకరించాలని ప్రభుత్వం నిర్ణయించడం దారుణమని విమర్శించారు. తన నివాసంలో గురువారం బోధన్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో కవిత మాట్లాడారు. గతంలో ప్రజాపాలన పేరిట స్వీకరించిన దరఖాస్తుల అతీగతీ తెలియదని, సాగు చేయాల్సిన రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వచ్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ మంచి ఫలితాలు సాధిస్తుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలసికట్టుగా నడవాలని తెలిపారు. ఈ సమావేశంలో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా ఫాతిమా, నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ గుప్తా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

2024 కాంగ్రెస్ సర్కార్ ఎగవేతల సంవత్సరం

బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 2024 అంతా కూడా కాంగ్రెస్ సర్కార్ హామీల ఎగవేతలు, మోసాల నామ సంవత్సరంగానే సాగిందని బీజేఎల్పీనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో వేల కోట్ల అవినీతి, కుంభకోణాలు జరుగుతున్నాయని, వాటిలో మంత్రుల ప్రమేయాన్ని పూర్తి ఆధారాలతో మరో రెండ్రోజుల్లో బయట పెడతామని ప్రకటించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 390 రోజులు కాగా, ఇప్పటి వరకు రూ.1.38 లక్షల కోట్ల అప్పు తెచ్చారన్నారు. అంటే రోజుకు రూ.354 కోట్లు, గంటకు రూ.14.70 కోట్ల అప్పు చేశారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.30 వేల కోట్ల కోసం 400 ఎకరాల భూమిని తనఖా పెట్టిందని, మరో రూ.30 వేల కోట్ల అప్పు కోసం ప్రణాళికలు సిద్ధం చేసిందని తెలిపారు. ఇదే కాకుండా బాండ్ల రూపంలో మరో రూ.30 వేల కోట్ల అప్పులు తేవాలని చూస్తోందని ఆరోపించారు. రైతు భరోసాపై కమిటీ ఏర్పాటు చేసి 15 రోజుల్లో నివేదిక ఇస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించి 4, 5 నెలలు దాటినా విధివిధానాలు ఎందుకు సిద్ధం కాలేదని నిలదీశారు.

విమర్శలొద్దు.. ఆధారాలుంటే ఇవ్వు

మహేశ్వర్‌రెడ్డికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సవాల్



సాక్షి, హైదరాబాద్: బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి చౌకబారు విమర్శలు, బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మానుకోవాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హితవు పలికారు. ఆయన గురువారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. మహేశ్వర్‌రెడ్డి దగ్గర అవినీతికి ఆధారాలుంటే కోర్టుకు పోయి కొట్లాడాలని, లేకుంటే సీఎం రేవంత్‌రెడ్డికి ఇస్తే విచారణ జరిపించడానికి సిద్ధంగా ఉన్నామని సవాల్ విసిరారు. ఏడున్నర లక్షల కోట్ల అప్పు ఉన్న రాష్ట్రాన్ని.. సీఎం రోజుకు 18 గంటలు కష్టపడి గాడిలో పెడుతున్నారన్నారు. గత ప్రభుత్వ అవినీతి, కేటీఆర్ ఫార్ములా –ఈ రేస్ అక్రమాలను బయటపెడుతుంటే.. మహేశ్వర్‌రెడ్డి వాళ్లను వెనకేసుకు వస్తున్నారని ఆరోపించారు.

రేవంత్ నిర్ణయాలతో అభివృద్ధి కుంటుపడింది

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే వివేకానంద



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనుసరిస్తున్న తిరోగామి నిర్ణయాలతో తెలంగాణ అభివృద్ధి కుంటుపడిందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందే గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం మెట్రో మూడో దశ విస్తరణకు సంబంధించిన నిర్ణయం తీసుకుని, కన్సల్టెంట్‌ను కూడా నియమించిందని పేర్కొన్నారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కేసీఆర్ ఆనవాళ్లు చెరిపేయాలనే దురుద్దేశంతో మెట్రో విస్తరణ ప్రాజెక్టును రేవంత్ రద్దు చేశారని మండిపడ్డారు. పార్టీ ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌తో కలసి గురువారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడుతూ, మెట్రో విస్తరణపై ఏడాదికి పైగా కాలయాపన చేసి, కేసీఆర్ ప్రభుత్వ నిర్ణయాన్నే తాజాగా రేవంత్ మరోమారు ప్రకటించారన్నారు. హైదరాబాద్, తెలంగాణ అభివృద్ధికోసం కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలను పక్కన పెట్టి, రేవంత్ రెడ్డి అన్ని వ్యవస్థలను ధ్వంసం చేశారని మండిపడ్డారు. ప్రజా ఉద్యమంతోనే రేవంత్ ప్రభుత్వం మెడలు వంచి హైదరాబాద్ నార్త్‌కు మెట్రోను సాధించామని వివేకానంద పేర్కొన్నారు. మెట్రో, ఫార్మా ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి రేవంత్ పాలన తీరు తుగ్లక్‌ను మరిపిస్తోందని బాల్క సుమన్ విమర్శించారు.

ఉగాదికి సన్నబియ్యం!

▶ మొదటి పేజీ తరువాయి

సమావేశంలో దీనిపై చర్చించి తుది నిర్ణయం తీసుకోనుంది. మరోవైపు కొత్త రేషన్‌కార్డుల కోసం ఇప్పటికే 20 లక్షల వరకు దరఖాస్తులు వచ్చాయి. అయితే మరోసారి కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు కోరుతూ కేబినెట్ నిర్ణయం తీసుకొనే అవకాశం ఉందని సమాచారం. అదనంగా 10 లక్షల కొత్త కార్డులు ఇవ్వాలని భావిస్తున్నట్టు తెలిసింది.

పేద, దిగువ మధ్య తరగతికి ఊరట

ప్రస్తుతం రాష్ట్రంలో 89.6 లక్షల రేషన్ కార్డుల ద్వారా 2.81 కోట్ల మంది లబ్ధి పొందుతున్నారు. ప్రతి లబ్ధిదారుకు నెలకు 6 కిలోల చొప్పున దొడ్డు బియ్యం పంపిణీ చేస్తున్నారు. దీనికి బదులుగా రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేయనుంది. తద్వారా బియ్యం బ్లాక్ మార్కెటింగ్, రీసైక్లింగ్‌ను పూర్తిగా కట్టడి చేయవచ్చని భావిస్తోంది. ప్రస్తుతం మార్కెట్లో సన్న బియ్యం ధరలు బాగా పెరిగిపోయాయి. సాధారణ రకం సన్న బియ్యం ధర కిలో రూ.60–65 వరకు ఉండగా.. ఫైన్ రకాల బియ్యం ధర రూ.70కిపైగానే ఉంది. దీనితో పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలపై భారం పడుతోంది. ప్రభుత్వం రేషన్‌కార్డులపై ఇస్తున్న దొడ్డు బియ్యాన్ని తినేందుకు ఆసక్తి చూపని మధ్య తరగతి వర్గాల వారు ఆ బియ్యాన్ని కిలో రూ.10–20 చొప్పున దళారులకు విక్రయిస్తున్నారు. ఈ బియ్యం తిరిగి రైస్ మిల్లులకు చేరుతోంది. మిల్లులు ఈ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి కస్టమ్ మిల్లింగ్ కింద ప్రభుత్వానికి అప్పగిస్తున్నట్టు ఆరోపణలున్నాయి. రేషన్‌పై సన్న బియ్యం పంపిణీ ప్రారంభిస్తే దానిని వినియోగించుకుంటారని.. బ్లాక్ మార్కెట్ సమస్య తీరుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అదనపు ఖర్చేమీ లేకుండానే పేద, మధ్యతరగతి కుటుంబాల వారు సన్న



బియ్యం అన్నం తింటారని, ఇది వారికి భారీ ఊరట అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

సర్కార్‌పై మరో రూ.1,500 కోట్ల భారం

రాష్ట్రంలో 89.6 లక్షల రేషన్‌కార్డులు ఉండగా.. అందులో జాతీయ ఆహార భద్రత పథకం కింద కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసినవి 54.5 లక్షలు ఉన్నాయి. అంత్యోదయ అన్న యోజన పథకం కింద మరో ఐదున్నర లక్షల కార్డులున్నాయి. వీరందరికీ కేంద్ర ప్రభుత్వమే ఒక్కొక్కరికి నెలకు 5 కిలోల చొప్పున బియ్యం ఇస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ఇచ్చేదానికి అదనంగా మరో కిలో అదనంగా కలిపి ఆరు కిలోల చొప్పున లబ్ధిదారులకు అందిస్తోంది. ఇవి కాకుండా రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన మరో 35.66 లక్షల ఆహార భద్రత కార్డులపై రాష్ట్ర ఖర్చుతోనే బియ్యం పంపిణీ చేస్తోంది. ఇదంతా దొడ్డు బియ్యం మాత్రమే. అయితే కేంద్రం నేరుగా బియ్యం ఇవ్వకుండా కిలోకు రూ.36 చొప్పున రాష్ట్ర ప్రభుత్వానికి ఇస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం సేకరణ, కస్టమ్ మిల్లింగ్ ద్వారా.. ఈ బియ్యాన్ని సమకూర్చుకుంటుంది. అయితే ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం మొత్తం 89.6 లక్షల కార్డుదారులకు సన్న బియ్యం సరఫరా చేయనుంది. సన్న బియ్యం కోసం కిలోకు రూ.55, ఆపై ఖర్చవుతుందని అంచనా. అంటే కేంద్రం ఇచ్చే నిధులకు అదనంగా రాష్ట్ర ప్రభుత్వమే వ్యయాన్ని భరించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఏటా సుమారు రూ.3,600 కోట్ల సబ్సిడీని భరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంపై సన్న బియ్యం పంపిణీతో మరో రూ.1,500 కోట్ల వరకు భారం పడే అవకాశం ఉందని అధికార వర్గాలు చెబుతున్నాయి.

బీసీల గొంతు కోసిందే బీఆర్‌ఎస్

అధికారం పోయిన తర్వాత బీసీలపై కపట ప్రేమ చూపిస్తున్నారు

టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్రంలోని బీసీలను వంచించిందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. బీసీలకు న్యాయంగా దక్కాల్సిన నిధులను ఏ ఒక్క సంవత్సరంలో కూడా ఖర్చు చేయకుండా వారిని నిట్టనిలువునా ముంచిందని గురువారం ఆయన ఒక ప్రకటనలో దుయ్యబట్టారు. ఇప్పుడు అధికారం పోయిన తర్వాత బీసీలపై కపట ప్రేమ చూపుతూ కల్వకుంట్ల కుటుంబం మొసలికన్నీరు కారుస్తోందని, బీసీలకు కాంగ్రెస్ హయాంలోనే మేలు జరుగుతుందని పేర్కొన్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు అన్యాయం చేసి, వారి గొంతు కోసిందే బీఆర్‌ఎస్ అని, లిక్కర్ స్కాంలో అంటిన మరకలను తొలగించుకునే ప్రయత్నంలో భాగంగానే కవిత.. బీసీల పేరిట కపట నాటకం ఆడుతున్నారని ధ్వజమెత్తారు. అందుకే ఇందిరాపార్క్ వద్ద ధర్నాకు పిలుపునిచ్చారని, విజ్ఞులైన బీసీలు ఈ కుట్రలను గమనించి బీఆర్‌ఎస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలని కోరారు. కాంగ్రెస్ పార్టీ బీసీలకు పెద్దపీట వేస్తుందనడానికి తనను తెలంగాణ అధ్యక్షుడిగా నియమించడమే నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్ర కేబినెట్‌లో కూడా బీసీలకు అధిక ప్రాధాన్యతిచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. మీరు బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడిగా బీసీ నేతను నియమించగలరా? అని ప్రశ్నించారు. బీసీల రిజర్వేషన్ల పెంపు కోసం సమగ్ర కుల సర్వే నిర్వహిస్తున్నామని, పంచాయతీలు, మునిసిపాలిటీల్లో కొత్తగా 23,973 మందికి ప్రాతినిధ్యం లభించేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

'ట్రిపుల్‌ఆర్'ను కేంద్ర ప్రభుత్వమే చేపట్టాలని కోరాం

భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న రీజనల్ రింగ్ రోడ్డు ప్రాజెక్టును పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే చేపట్టాలని కేంద్ర మంత్రి గడ్కరీని సీఎం రేవంత్‌రెడ్డి కోరినట్లు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అయితే ట్రిపుల్‌ఆర్ కోసం ముందుగా భూసేకరణ జరపాలని కేంద్ర మంత్రి సూచించారన్నారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజల సొమ్మును దోచుకుని, దాచుకునే ఆలోచన తమకు లేదని, పారదర్శకంగా ప్రజల కోసమే కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని స్పష్టం చేశారు. ప్రాజెక్టుల వ్యయాన్ని ఇష్టానుసారంగా పెంచి లబ్ధి పొందడం కేటీఆర్‌కు బాగా తెలుసని, అందరు తన లాగే ఉంటారని ఆయన అనుకుంటున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్ తరహాలో ప్రతిపక్షం లేకుండా చేయాలని తాము అనుకోవడం లేదని, బలమైన ప్రతిపక్షం ఉండాలనుకుంటున్నామని అన్నారు. కేసీఆర్ ఎలాగూ అసెంబ్లీకి, ప్రజల్లోకి రారని, హరీశ్‌రావు, కేటీఆర్, కవిత అయినా సమర్థవంతమైన ప్రతిపక్ష పాత్ర పోషిస్తే మంచిదని హితవు చెప్పారు. 2025లో అయినా బీఆర్‌ఎస్ నేతలకు జ్ఞానోదయం కలగాలని, రైతు భరోసా విషయంలో బీఆర్‌ఎస్ తప్పుడు ప్రచారం చేస్తుందని అన్నారు. కేసీఆర్ రైతుబంధులో 22 వేల కోట్ల రూపాయలు అనర్హులకు ఇచ్చారని, ఇది అనాలోచిత నిర్ణయమని విమర్శించారు. ఈ–ఫార్ములా కేసులో కేటీఆర్ రోజుకో మాట మాట్లాడుతున్నారని అన్నారు. అల్లు అర్జున్‌ను అరెస్టు చేయడం ద్వారా రేవంత్‌రెడ్డి పాన్ ఇండియా సీఎం అయ్యారని వ్యాఖ్యానించారు.



గురువారం నల్లగొండలో ర్యాలీ నిర్వహించి క్లాక్‌టవర్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడిన సమగ్ర శిక్ష ఉద్యోగులు

సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెపై ప్రభుత్వం సీరియస్!

సాక్షి, హైదరాబాద్: సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమ్మె వ్యవహారాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. విద్యాశాఖలో విలీనం చేయాలన్న డిమాండ్‌తో 24 రోజులుగా సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులు సమ్మె చేస్తుండటం తెలిసిందే. అయితే, సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులను క్రమబద్ధీకరించడం కష్టమని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేయాలన్న డిమాండ్ న్యాయపరంగా కుదరదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. గతంలో 11 నెలలకోసారి సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులను రెన్యువల్ చేసేవారు. ఈసారి రెన్యువల్ చేసే అవకాశం లేదని ప్రభుత్వ వర్గాల ద్వారా తెలిసింది. ఆందోళన చేస్తున్న వారి స్థానాల్లో కొత్తవారిని నియమించాలన్న ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు తెలుస్తోంది.

రాష్ట్ర వాటా విడుదల ఎప్పుడో!

▶ మొదటి పేజీ తరువాయి

2023–24 విద్యా సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల రిజిస్ట్రేషన్ ఇలా..

కేటగిరీ	రెన్యువల్స్	ఫ్రెషర్స్
ఎస్సీ	1,26,125	87,249
ఎస్టీ	76,320	54,560

చేసిన కేంద్ర ప్రభుత్వం.. రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన మ్యాచింగ్ గ్రాంట్‌ను విడుదల చేసిన వెంటనే ఈ నిధిని వినియోగించాలనే నిబంధన విధించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేస్తేనే విద్యార్థులకు ఎలాంటి ప్రయోజనం చేకూరదు. కేంద్రం ఇచ్చిన నిధులను సకాలంలో వినియోగించుకోకుంటే వాటిని కేంద్రం వెనక్కు తీసుకునే అవకాశం ఉందని అధికారులు ఆందోళన చెందుతున్నారు.

ఆన్‌లైన్‌లో తాజా దరఖాస్తుల ప్రక్రియ: మరోవైపు 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉపకారవేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాలకు సంబంధించిన దరఖాస్తు ప్రక్రియ కొనసాగుతోంది. వాస్తవానికి గత నెల 31తో గడువు ముగిసింది. అయితే విద్యార్థుల నుంచి పెద్దసంఖ్యలో దరఖాస్తులు అందలేదు. దీంతో గడువు పొడిగింపు కోసం సంక్షేమ శాఖలు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించాయి. కానీ ప్రభుత్వం ఆమోదించలేదు. అయితే వెబ్‌సైట్‌లో దరఖాస్తుల స్వీకరణ ఆప్షన్‌ను అందుబాటులో ఉంచినట్లు అధికారులు చెబుతున్నారు.

2,793 చెరువులకు ఎఫ్‌టీఎల్ నోటిఫికేషన్ ఇచ్చాం

హైకోర్టుకు వెల్లడించిన సర్కార్

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌ఎండీఏ) పరిధిలోని చెరువుల ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్‌ను నిర్ధారిస్తూ 765 చెరువులకు తుది నోటిఫికేషన్ జారీ చేశామని ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. 2,793 చెరువులకు ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చామని.. త్వరగా వాటికి కూడా తుది నోటిఫికేషన్ ఇస్తామని పేర్కొంది. దీంతో ఈ వివరాలతో స్థాయీ నివేదిక దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని న్యాయస్థానం ఆదేశిస్తూ తదుపరి విచారణను ఫిబ్రవరి 4కు వాయిదా వేసింది. హెచ్‌ఎండీఏ పరిధిలోని చెరువుల అంశంపై ప్రత్యేకంగా విచారణ జరిపేందుకు సుమోటో పిల్ గా సీజే ధర్మాసనం నంబర్ కేటాయించింది. ఈ పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ పొట్టిగారి శ్రీధర్‌రెడ్డి హాజరై చెరువుల వివరాలు తెలియజేశారు. మిగిలిన చెరువులకు కూడా తుది నోటిఫికేషన్ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

మీకు ఎవరైనా గౌరవభావంతో సలాము చేస్తే వారికి మీరు అంతకంటే ఉత్తమమైన పద్ధతిలో ప్రతి సలాము చేయండి. లేదా కనీసం ఆ విధంగానైనా చెయ్యండి.
– ఇస్లాం ధర్మం

సాక్షి
శుక్రవారం, 3 జనవరి 2025

ట్రంప్ శిబిరంలో వీసా చిచ్చు

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అభ్యర్థి డోనాల్డ్ ట్రంప్ ఘన విజయానికి దోహదపడిన అంశాల్లో కీలకమైన వలసల వివాదం... తిరిగి తిరిగి ఆయన శిబిరంలోనే చిచ్చు పెడుతున్న వైనం కనబడుతోంది. ఆయన ప్రమాణ స్వీకారానికి చాలాముందే అనుచరగణం పరస్పరం కత్తులు దూసుకుంటున్నారు. ఒకరిపై ఒకరు సవాళ్లు విసురుకుంటున్నారు. అమెరికాను మళ్లీ అగ్రస్థానానికి తీసుకెళ్లాలన్న ట్రంప్ 'మాగా' ఉద్యమ మూలపురుషుల్లో ఒకరైన స్టీఫెన్ మిల్లర్‌కూ, స్పేస్ ఎక్స్, టెస్లా సంస్థల అధినేత ఎలాన్ మస్క్‌కూ మధ్య హెచ్1బి వీసాల విషయంలో తాజాగా తలెత్తిన లడాయి ఇప్పట్లో చల్లారడం కష్టమే. తొలిసారి ట్రంప్ విజేతగా నిలిచిన 2016 అధ్యక్ష ఎన్నికల ప్రచారంలో హెచ్1బి వీసాలపై ఆయన దూకుడుగా మాట్లాడటం వెనక మిల్లర్ వ్యూహం ఉంది. స్థానికులను నిర్లక్ష్యం చేసి తక్కువ వేతనాలకు పరాయి దేశాలవారిని ఉద్యోగాల్లో నియమించుకునే సంస్కృతిని సాగనివ్వబోనని అప్పట్లో ట్రంప్ చెప్పేవారు. తమ ఉద్యోగాలన్నీ బయటి దేశాల పౌరులు తన్నుకుపోతున్నారని ఆగ్రహంతో ఊగిపోయిన శ్వేతజాతి అమెరికన్లు ఆయనకు ఎగబడి ఓట్లేశారు. ట్రంప్ ప్రసంగాల రచయిత మిల్లరే. ఈ దఫా సైతం ఆయన ట్రంప్ ఆంతరంగిక బృందంలో ముఖ్యుడిగా ఉండబోతున్నారు.

వలసల విషయంలో ట్రంప్ అనుచరగణంలో స్పష్టత లోపించిందన్న సంగతి ప్రచార సమయంలోనే బట్టబయలైంది. అక్రమ వలసదారులే పెద్ద సమస్యని ట్రంప్ సన్నిహితుడు వివేక్ రామస్వామి అభిప్రాయపడుతున్నారు. ఆయన్ను ఈమధ్యే ప్రభుత్వ సిబ్బందిలో అత్యధికుల్ని సాగనంపేందుకు ఏర్పాటైన ప్రభుత్వ సామర్థ్య విభాగానికి ట్రంప్ ఎంపికచేశారు. ఆ విభాగంలో ఆయనతోపాటు పనిచేయబోయే మస్క్ సైతం వివేక్ అభిప్రాయాన్ని సమర్థిస్తున్నారు. కానీ మిల్లర్‌తోపాటు, తీవ్ర మితవాది అయిన లారా లూమర్, స్టీవ్ బానన్ వంటివారు దీన్ని అంగీకరించటం లేదు. అసలు హెచ్1బి వీసా విధానాన్నే పూర్తిగా ఎత్తేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో అమెరికన్ సంస్కృతి, జీవన విధానం వైపు చర్చ మళ్లడం దీని తీవ్రతను తెలియజేస్తోంది. అమెరికన్లలో అనేకులు సమర్థత నుంచి నాసిరకం సంస్కృతికి మళ్లి చాన్నాళ్లవుతోందని వివేక్ రామస్వామి వ్యాఖ్యానిస్తే... అమెరికన్లు తెగువ, ఆత్మవిశ్వాసం దండిగా ఉన్నవారంటూ 2020లో ట్రంప్ చేసిన ప్రసంగం వీడియోను మిల్లర్ ఎక్స్ వేదికపై వదిలారు.

ఇంతకూ ట్రంప్ ఏమనుకుంటున్నారు? మాకు చురుకైనవాళ్లు, సమర్థులు కావాలని నూతన సంవత్సర వేడుకల సమావేశంలో ట్రంప్ చెప్పడం సహజంగానే అందరినీ ఆశ్చర్యపరిచింది. తానెప్పుడూ హెచ్1బి వీసాల విధానాన్ని వ్యతిరేకించలేదని అనటం అర్థ సత్యమే అయినా ట్రంప్ వైఖరి మారిందని, ఆయనపై మస్క్ ప్రభావం బలంగా ఉన్నదని రిపబ్లికన్లలో బలమైన మితవాద వర్గం గుసగుసలు పోతోంది. ఎవరెలా అనుకున్నా హెచ్1బి వీసాల సంగతలా వుంచి అక్రమ వలసదారుల్ని గెంటేయటం అంత తేలిక కాదు. వారిపై ముందు వలస వ్యవహారాల న్యాయస్థానంలో కేసు దాఖలు చేయాలి. వారు రకరకాల వాదనలతో ముందుకొస్తారు. విచారణ వాయిదాల్లో నడుస్తుంటుంది. ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న కేసులు తేలాలంటేనే 2029 చివరివరకూ పడుతుందని గణాంకాలు చెబుతున్నాయి. కొత్తవారిని గుర్తించి కేసులు పెడితే ఆ భారం మరింత పెరుగుతుంది. చట్టాన్ని సవరిస్తే తప్ప ఇది అంత సులభంగా తేలదు. దానికితోడు అక్రమ వలసదారులను గుర్తించే ఐసీఈ ఏజెంట్లు 6,000 మందికి మించిలేరు. దానికి కేటాయించే నిధులు సైతం ఏ సమయంలోనూ 40,000 మందిని మించి నిర్బంధించేందుకు సరిపోవు. ఒకవేళ అక్రమ వలసదారులందరినీ సాగనంపడానికి గ్రీన్ సిగ్నల్ వచ్చినా, లక్షలమంది తరలింపునకు విమానాలు సమకూర్చడం అసాధ్యం. ఇక డెమాక్రాట్ల ఏలుబడిలో ఉన్న న్యూయార్క్, షికాగో, లాస్‌ఏంజెలెస్, డెన్వర్ వంటి నగరాలు అక్రమ వలసదారుల ఏరివేతకు సహకరించవు. అక్రమ వలసదారుల్ని వెనక్కిపంపిన గతకాలపు అధ్యక్షుడు ఐసెన్ హోవర్ తనకు ఆదర్శమని ట్రంప్ అంటున్నారు. కానీ ఆకాలంలో మెక్సికో మినహా మరే దేశంనుంచీ పెద్దగా వలసలు లేవు. ఇప్పుడలా కాదు... చైనా, భారత్, మారుటేనియా, ఉజ్బెకిస్తాన్ దేశాలనుంచి రికార్డు స్థాయి అక్రమ వలసలున్నాయి. ఇందులో ఎన్ని దేశాలు ట్రంప్‌కు సహకరిస్తాయన్నది ప్రశ్న.

సమస్యలు సృష్టించటం సులభం. కానీ వాటి పరిష్కారం అన్ని సందర్భాల్లోనూ అంత తేలిక కాదు. తగిన అర్హతలున్నవారు స్థానికంగా దొరక్కపోతే బయటి దేశాలనుంచి ఆ నైపుణ్యం ఉన్న వారిని తీసుకురావటం కోసం రూపొందించిన హెచ్1బి వీసాను బడా సంస్థలు ఖర్చు తగ్గించుకోవటానికి వాడుకుంటున్న మాట వాస్తవం. దాన్ని ట్రంప్ తనకు అనుకూలంగా సొమ్ము చేసుకోవటం సైతం నిజం. కానీ ఆ సమస్యే పార్టీలో చిచ్చుపెడుతుందని ఆయన ఊహించి వుండరు. ఇంతకూ ఆయన ఎవరి పక్షమన్న విషయంలో వైరి వర్గాల్లో ఎవరికీ స్పష్టత లేదు. ఎందుకంటే వివేక్, మస్క్, శ్రీరాం కృష్ణన్‌వంటి గతకాలపు వలసదారుల్ని తీసుకున్న ట్రంప్ మరోపక్క వలసలకు పక్కా వ్యతిరేకి అయిన స్టీఫెన్ మిల్లర్‌తోపాటు ఆయన భార్య కేటీ మిల్లర్‌ను సైతం తన బృందంలో చేర్చు కున్నారు. ఏదేమైనా హెచ్1బి వీసాలు పొందినవారిలో అత్యధికులు మనవాళ్లే కనుక వారి మెడపై కత్తి వేలాడుతూనే ఉంటుంది. అలాగే ట్రంప్‌ను మించిన శ్వేతజాతి చాంపియన్ అమెరికా రాజకీయాల్లో ఆవిర్భవించే అవకాశం కూడా లేకపోలేదు.

దిస్సనాయకేకు 'తమిళ' పరీక్ష

విశ్లేషణ


టంకశాల అశోక్

శ్రీలంక ఎన్నికలలో ఘన విజయం సాధించిన అధ్యక్షుడు అనూర కుమార దిస్సనాయకే ముందు రెండు ముఖ్యమైన సమస్యలున్నాయి. ఒకటి, ఆర్థికం కాగా, రెండవది తమిళ, ముస్లిం అల్పసంఖ్యాక వర్గాల సమస్య. మొదటి దాని విషయమై చర్యలు ప్రారంభించారు. రెండవ దానిపై ఇంకా దృష్టి పెట్టవలసి ఉంది. కానీ ఆర్థికం కన్నా ఇది మరింత తీవ్రమైనదై దేశాన్ని కొన్ని దశాబ్దాలపాటు సంక్షోభంలోకి నెట్టివేసింది.

అనూర కుమార దిస్సనాయకేకు చెందిన జనతా విముక్తి పెరమున (జేవీపీ) పార్టీకి ఇతర జాతీయవాద బౌద్ధ పార్టీల వలెనే అల్పసంఖ్యాక వర్గాలపట్ల మొదటి నుంచీ వ్యతిరేకత ఉంది. జేవీపీ మార్క్సిస్టు పార్టీ అయినప్పటికీ, ఇతర సింహళ పార్టీలు ఏ విధంగానైతే తమిళులు, ముస్లిములను వ్యతిరేకించాయో తను కూడా అదే వైఖరి తీసుకుంది. సెప్టెంబర్ అధ్యక్ష ఎన్నికలలో దిస్సనాయకే ఎంత గొప్ప విజయం సాధించినా ఈ వర్గాలు ఆయనకు ఓటు వేయలేదు. కానీ రెండు నెలలు గడిచి నవంబర్‌లో పార్లమెంట్ ఎన్నికలు జరిగినప్పుడు భారీ ఎత్తున బలపరిచాయి. అందుకు కారణం ఆయన వారిని కూడా వెంట కలుపుకొని పోగలనని పదేపదే భరోసా ఇవ్వటమే. దీని ప్రభావం తమిళులు పెద్ద సంఖ్యలో గల కొలంబో నగరంతోపాటు, ఆధిక్యతలో ఉన్న జాఫ్నా, బట్టికలోవా, ట్రింకోమలీ ప్రాంతాలలో కనిపించింది. కొలంబో, బట్టికలోవా కేంద్రాలుగా గల ముస్లిములు కూడా అదే పని చేశారు.

'సామరస్యత' సాధ్యమేనా?

కానీ, తర్వాత ఈ మూడు నెలలుగా ప్రభుత్వం నుంచి ఇంతవరకైతే ఎటువంటి కదలికలు కనిపించటం లేదు. దిస్సనాయకే ఈ డిసెంబర్‌లో ఇండియాను సందర్శించి ప్రధాని మోదీతో సమావేశమైనప్పుడు, ఈ అంశంపై ఏదైనా ప్రకటన రావచ్చునని అనుకున్నారు. కానీ ఇరు నాయకుల సంయుక్త ప్రకటనలోగానీ, ఇతరత్రాగానీ అటువంటిదేమీ ప్రత్యక్షమైన రీతిలో కనిపించటం లేదు. పరోక్ష సూచనలు మాత్రం కొన్నున్నాయి. మోదీ తన వైపు నుంచి 'సామరస్యత', 'రాజ్యాంగాన్ని పూర్తిగా అమలు పరచటం', 'ప్రాంతాల కౌన్సిళ్లకు (ఇండియాలో అసెంబ్లీల వంటివి) ఎన్నికలు' అనే సూచనలు చేయగా, దిస్సనాయకే 'మా ప్రజాస్వామ్యానికి వైవిధ్యత ఒక మూలస్తంభం' అని మాత్రం అన్నారు.

ఇందులో మోదీ మాటలు మూడు కూడా అర్థవంతమైనవే. మైనారిటీలు అనే మాట ఉపయోగించకపోయినా, 'సామరస్యత' అనటం వారి గురించే. రాజ్యాంగం పూర్తిగా అమలు, ప్రాంతీయ కౌన్సిళ్లకు ఎన్నికలు అన్నది రాజీవ్-జయవర్ధనే ఒప్పందం (1987) ప్రకారం శ్రీలంక రాజ్యాంగానికి జరిగిన 13వ సవరణలోని అంశాలకు సంబంధించినది. జయవర్ధనే కాలంలో ఆ ప్రకారం, తమిళులు ఆధిక్యతలోగల జాఫ్నా, బట్టికలోవా ప్రాంతాలను కలిపి ఒక ప్రావిన్స్‌గా మార్చి ఎన్నికలు నిర్వహించారు కూడా. ఆ ఎన్నికలలో వరదరాజ పెరుమాళ్ ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన తర్వాత కొలంబోలోని తన నివాసంలో నాకు ఇంటర్వ్యూ ఇస్తూ, తనపై ఎల్టీటీఈ బెదిరింపులు, జయవర్ధనే ప్రభుత్వ సహాయ నిరాకరణతో విధి లేక రాజీనామా చేసినట్లు చెప్పారు. ఆ వెనుక ఇక ఎన్నికలే జరగలేదు. అదట్లుంచితే, వరదరాజ పెరుమాళ్‌ది తెలుగు కుటుంబం కావటం విశేషం. ఆ మాట శ్రీలంకలో రహస్యమని, ఎక్కడా రాయవద్దని కోరారు. అప్పటి పరిస్థితులన్నీ ఈ సరికి సమసి పోయినందున ఇప్పుడు రాస్తున్నాను. విషయానికి వస్తే, ఫెడరలిజం తరహాలో రాష్ట్రాల ఏర్పాటు, రాష్ట్రాలకు ఎన్నికలు, ఫెడరల్ అధికారాలనే ఆలోచనకే ఇతర సింహళ పార్టీల వలెనే బద్ధ వ్యతిరేకి అయిన జేవీపీ, 13వ


ఇటీవలి భారత పర్యటనలో మోదీతో దిస్సనాయకే

రాజ్యాంగ సవరణను మోదీ పరోక్షంగా సూచించినట్లు అమలు పరచగలదా అన్నది సందేహమే.

వికేంద్రీకరణ జరిగేనా?

ఫెడరలిజం రూపంలో అధికార వికేంద్రీకరణ, 13వ సవరణల సంగతి అట్లుంచినా, ఎల్టీటీఈ అధ్యాయం 2009లో ముగిసినా, అక్కడి ప్రభుత్వాలు గత 15 సంవత్సరాలుగా వాటి పరిష్కారానికి ప్రయత్నించలేదు. ఆ సమస్యలు తమిళులకు సంబంధించి జాఫ్నా ప్రాంతంలో కొనసాగుతున్న సైనిక శిబిరాల ఎత్తివేత, పౌర హక్కుల పునరుద్ధరణ, రకరకాల వివక్షల నిలిపివేత, సైన్యంతోపాటు సింహళీయులు ఆక్రమించిన తమ భూభాగాలను తిరిగి తమకు అప్పగించటం, తమిళ భాషకు తగిన గుర్తింపు వంటివి. అదే విధంగా ముస్లింలకు సంబంధించి, శ్రీలంక ముస్లిం కాంగ్రెస్ (ఎస్ఎల్ఎంసి) అధ్యక్షుడు రవూఫ్ నాకు ఇంటర్వ్యూ ఇస్తూ, తాము సింహళీయుల ఆధిక్యతా వాదానికి, ఆధిపత్య ధోరణులకు వ్యతిరేకమనీ, వారు తమ ప్రాంతాలను కాలనైజ్ చేస్తున్నారనీ, ఇటువంటిది ఆగిపోవాలనీ అన్నారు. తమకు యూనియన్ టెరిటరీ వంటిది ఏర్పాటు చేసి అధికార వికేంద్రీకరణ జరగాలన్నారు.

శ్రీలంక జనాభాలో సింహళీయులు సుమారు 75 శాతం కాగా, తమిళులు 12 శాతం, ఇండియన్ తమిళులు లేదా తేయాకు తోటల కార్మికులు 4 శాతం, ముస్లిములు 10 శాతం ఉంటారు. సంఖ్యల రీత్యా వీరు తక్కువ అయినా, వారి జన సంఖ్యల కేంద్రీకరణ దృష్ట్యా శ్రీలంక ఉత్తర, తూర్పు ప్రాంతాలు కీలకం అవుతున్నాయి. 13వ సవరణను పక్కన ఉంచినా ఈ ప్రశ్నలకు దిస్సనాయకే పరిష్కారాలు ఏమిటన్నది ముఖ్యమవుతున్నది.

సింహళీయులకు ఉన్న దేశం ఇదొక్కటే!

ఇంతకూ ఈ విషయాలపై దిస్సనాయకే ఆలోచనలు ఏ విధంగా ఉన్నాయి? ఆయనను నేను కొలంబో సమీపాన బట్టరముల్లలో గల జేవీపీ ప్రధాన కార్యాలయంలో 2000లో ఇంటర్వ్యూ చేశాను. అపుడాయన వయసు 30 ఏళ్లే అయినా జేవీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎంపీ కూడా. దాదాపు రెండు గంటలపాటు సాగిన ఆ ఇంటర్వ్యూలో ముస్లిముల ప్రస్తావన రాలేదుగానీ తమిళుల ప్రశ్నపై చాలా చెప్పారు. అప్పటినుంచి చాలాకాలం గడిచిన మాట నిజం. తమిళుల ప్రశ్నపై ఇప్పటికీ ఆయన అర్థోక్తులు, అస్పష్టతలను బట్టి చూసినపుడు, ఇంటర్వ్యూ నాటి వివరణలకు ఇంకా విలువ ఉన్నట్లు భావించవలసి ఉంటుంది.

దిస్సనాయకే అన్నదేమిటో ఎటువంటి వ్యాఖ్యానాలు లేకుండా యథాతథంగా అవసరమైన మేర చూద్దాము: 'గ్రేటర్ ఈలం అనే మాట మొదట ఉపయోగించింది ద్రవిడ కజగం పార్టీ. ఈలం ఏర్పడి దానికి ట్రింకోమలి రాజధాని కావాలన్నారు. ప్రపంచవ్యాప్తంగా గల తమిళులు అంతా తిరిగి వచ్చి ఉత్తర శ్రీలంక, తమిళనాడు ప్రాంతాల్లో స్థిరపడాలని పిలుపునిచ్చారు. హిందీ వ్యతిరేక ఉద్యమకాలంలో ఇందుకు బీజాలు పడ్డాయి. ఇక్కడ కూడా సింహళ భాషా వ్యతిరేక ఆందోళనలు జరిగాయి. మా జనాభా 13 మిలియన్లు కాగా, తమిళులు ఇక్కడి రెండు మిలియన్లు, తమిళనాడులోని 60 మిలియన్లు కలిపి మొత్తం 62 మిలియన్లు. మేమిక్కడ మెజారిటీ అయిన మైనారిటీలమనే భావన కలుగుతుంటుంది.

తమిళులు శ్రీలంకను తమ మాతృదేశంగా పరిగణించరు. అపుడపుడు భారతీయ జెండాను ఎగరవేయటం, అక్కడి నాయకుల ఫొటోలు పెట్టుకోవటం వంటివి చేస్తారు. ఇక్కడి సంస్కృతిని పాటించరు. తమిళనాడు ప్రభుత్వం ఇక్కడి యువకులను రప్పించి సాయుధ శిక్షణలు ఇచ్చింది. తనను తాను పెద్దన్నగా భావించి మా వ్యవహారాల్లో జోక్యం చేసుకుంది. సింహళీయులమైన మాకు ఉన్న దేశం ఇదొక్కటే. దానిని మేము కాపాడుకోవాలి.

అధికార వికేంద్రీకరణకు మేము వ్యతిరేకం. అది జరిగితే దేశం సింహళ, తమిళ, ముస్లిముల మధ్య మూడు ముక్కలవుతుంది. ఇక్కడి నాగరికతకు, సంస్కృతికి సింహళ బౌద్ధుల మెజారిటీ సంస్కృతే ఆధారం. ఇంగ్లిష్ విద్య వల్ల మాకన్నా చాలా ముందుకు పోయిన తమిళులు తమకు ఇంకా కావాలంటున్నారు. బ్రిటిష్ వారు పరిపాలనా సౌలభ్యం కోసం కొన్ని భౌగోళిక విభజనలు చేయగా, అవి తమ హోంల్యాండ్స్ అని వాదిస్తున్నారు. మేము ఎవరికీ వ్యతిరేకం కాదు. శ్రీలంక అందరికీ మాతృ దేశమని చెప్తున్నాం.' ఇవీ దిస్సనాయకే చెప్పిన మాటలు. ఇవి వారి ఆలోచనలకు, విధానాలకు పునాదిగా ఉంటూ వచ్చాయి. మారిన పరిస్థితులలో ఇందులో మార్పులేమైనా ఉండవచ్చునా?

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు

సోషల్ మీడియా

అనేయకూడదు



తూర్పు ఆసియన్లు, కొరియన్లు ఎబిసిసి11 జన్యువును కలిగి ఉండరనేందుకు ఆధారాలు ఉన్నాయి. అంత మాత్రాన శరీర వాసనను ఉత్పత్తి చేసే ఆ జన్యువు కేవలం భారతీయులకే ప్రత్యేకం అనటం తప్పు. వాస్తవానికి 98 శాతం యూరోపియన్లు దీన్ని కలిగి ఉన్నారు. భారతీయులలో సగం మందిలోనే ఈ జన్యువు ఉంది.

– డాక్టర్ ఎల్లీ లౌక్స్, 'కేంబ్రిడ్జ్' బోధకురాలు

శుద్ధి-బుద్ధి



భారతదేశం అపరిశుభ్రంగా ఎందుకు ఉంటుందంటే, పారిశుధ్యం అనేది కొన్ని అట్టడుగు కులాల 'జన్మ వృత్తి' గా మాత్రమే పరిగణన పొందుతోంది. ఇక్కడ పరిశుభ్రతకు సంబంధించిన పనిని 'అశుద్ధం'గా చూస్తారు తప్ప, దాన్నొక సామూహిక బాధ్యతగా స్వీకరించరు.

– బిజయ బిస్వాల్, వైద్యురాలు

తల్లీ బిడ్డలు



అడవికి నది తల్లి అని, నదీ ప్రవాహాన్ని అడవి పెంచుతుందని అంటారు. ఇవాళ సాయంత్రం నేను పొలంలో నిలుచుని ఉన్నప్పుడు నా ఎదుట లోతట్టుకు ప్రవహిస్తున్న నది... నాగరికత విత్తనాలను ప్రపంచానికి తీసుకెళుతున్నట్లుగా కనిపించింది.

– పర్వీన్ కాస్వాన్, ఐఎఫ్ఎస్ అధికారి

అందమైన ఏడాది



2025 అందమైన సంఖ్య. $45 \times 45 = 2025$. అలాగే 1 నుంచి 9 వరకు అంకెల ఘనసంఖ్యల మొత్తం కూడితే 2025 వస్తుంది. $1^3+2^3+3^3+4^3+5^3+6^3+7^3+8^3+9^3=2025$. సంతోషపడటానికి చిన్న చిన్న విషయాలు.

– ఎమీ దార్, ఇజ్రాయెల్ యాక్టివిస్ట్

మాస్టర్ మైండ్స్



కృత్రిమ మేధస్సును ఉపయోగించే సాఫ్ట్‌వేర్ 'ఏఐ ఏజెంట్'ను వృద్ధి చేయటంలో భారతీయ నిపుణులు అద్భుతమైన ఫలితాలను సాధిస్తున్నారు. ఏఐలో భారత్ మంచి దూకుడు మీద ఉంది.

– అలెక్స్ లీబ్‌మాన్, 'ఏజెన్.సి' సీఈవో

ఇన్ బాక్స్

మహిళా చైతన్య దీప్తి

మన దేశంలో ఆడపిల్లల చదువు, వారి అభ్యున్నతి గురించి మాట్లాడుకోవాలంటే ముందుగా గుర్తుకు వచ్చేది సావిత్రిబాయి పూలే కృషేనని చెప్పవచ్చు. మహిళల అభివృద్ధికి పాటు పడిన మొట్ట మొదటి బహుజన మహిళ ఆమె. భారతదేశ తొలి ఉపాధ్యాయురాలు. మహారాష్ట్ర, సతారా జిల్లాలోని నయాగావ్ గ్రామంలో 1831 జనవరి 3న ఒక సామాన్య రైతు కుటుంబంలో సావిత్రిబాయి జన్మించారు. నిరక్షరాస్య అమాయక బాల్యంలో జీవిస్తున్న ఆమెకు 9వ యేటనే 12 సంవత్సరాల జ్యోతిరావు పూలేతో వివాహం జరిగింది. సావిత్రిబాయి, భర్త ప్రోత్సాహంతో ఇంట్లోనే అక్షరాభ్యాసం చేసి విద్యావంతురాలై, అహ్మద్‌నగర్‌లో ఉపాధ్యాయ శిక్షణ పొందారు. అనంతరం బాలికా విద్య ఉద్యమానికి పునాది వేశారు.


సావిత్రిబాయి పూలే

విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యమని నమ్మిన సావిత్రిబాయి 1848లో భర్తతో కలిసి బాలికల కోసం పుణెలో మొట్ట మొదటి పాఠశాలను నెలకొల్పి, చదువు చెప్పటం ప్రారంభించారు. మహిళా హక్కులే మానవ హక్కులని నినదించి అనేక సామాజిక సమస్యలపై కూడా అలుపెరుగని పోరాటం చేశారు. స్త్రీలను చైతన్యపరచడానికి 1852లో 'మహిళా సేవా మండల్' అనే మహిళా సంఘాన్ని స్థాపించారు. లింగ వివక్ష, పితృస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడారు. సామాజిక అణిచివేతలను, మూఢ త్వాన్ని పారద్రోలి సత్యాన్ని శోధించడానికి 1873లో భర్తతో కలిసి సత్య శోధక సమాజాన్ని ప్రారంభించారు. భర్త మరణంతో అంతులేని దుఃఖసాగరంలో ఉండి కూడా ఆయన చితికి తానే స్వయంగా నిప్పుపెట్టి కొత్త సంప్రదాయానికి తెరలేపారు.

పుణె నగరాన్ని అతలాకుతలం చేసిన తీవ్ర కరువులో ప్లేగు వ్యాధి గ్రస్తులకు సావిత్రిబాయి అసమాన సేవలు అందించారు. చివరకు ఆమె కూడా అదే వ్యాధి బారినపడి 1897 మార్చి10న తుది శ్వాస విడిచారు. 1997లో భారత ప్రభుత్వం ఆమె జ్ఞాపకార్థం తపాలా స్టాంపును విడుదల చేసింది. పుణె విశ్వవిద్యాలయానికి ఆమె పేరే పెట్టారు. సావిత్రిబాయి పూలే అక్షర ఉద్యమాన్ని ముందుకు నడిపించడానికి ఆమె జయంతి రోజున గతేడాదే 'ధర్మ టీచర్ యూనియన్' ఏర్పాటైంది. సావిత్రిబాయి పూలే జయంతిని జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించాలి. ఇదే ఆమెకు ఇవ్వగలిగిన ఘన నివాళి.

– సంపతి రమేశ్ మహారాజ్ | ధర్మ టీచర్ యూనియన్ తెలంగాణ కమిటీ సభ్యులు
(నేడు సావిత్రిబాయి పూలే జయంతి)

ఎవరు దొంగలు?

అభిప్రాయం


డా॥ ఎస్. తిరుపతయ్య

మంచిర్యాల జిల్లా మందమర్రి పట్టణ విద్యానగర్ ఎస్సీ-ఎస్టీ కాలనీకి చెందిన నలుగురు యువకులు మందమర్రి పోలీసులు తాము చేయని దొంగతనం కేసుల్లో ఇరికిస్తున్నారని ఆరోపిస్తూ డిసెంబర్ 19న సెల్ఫీ వీడియో ద్వారా అభ్యర్థన పెట్టి, హెయిర్ డై తాగి ఆత్మహత్యా ప్రయత్నం చేశారు. ఇదే కాలనీకి చెందిన ఆటో నడుపుకొనే ఎరుకల కులానికి చెందిన మరో యువకుడు ఏడాది కింద పోలీసులు తనపై అనేక కేసులు బనాయిస్తున్నారని భయపడి పోలీస్ స్టేషన్లోనే ఒంటిపై పెట్రోల్ పోసుకుని అంటించుకున్నాడు. దాని కంటే ముందు ఒకసారి గొంతు కోసుకున్నాడు. ఆత్మహత్యా ప్రయత్నాల్ని ఆ యువకులు చనిపోయే ఉద్దేశంతో చేయకపోయినా, తామున్న పరిస్థితి నుండి ఎట్లా బయట పడాలో తెలియక ఈ ప్రమాదకర మార్గాన్ని ఎంచుకుంటున్నారు. ఇలాంటి పెనుగులాటల వెనుక సామాజిక, ఆర్థిక, వ్యవస్థా పరమైన అంశాలున్నాయి.

ఈ ఎస్సీ-ఎస్టీ కాలనీ అనేక ప్రాంతాల నుండి ఒకప్పుడు వలస వచ్చి, కాలరీ ఏరియాలో రోజూవారీ కూలీ చేసుకొని బతికే నిరుపేదలు నివసించే ప్రాంతం. స్థిరపడిన వారిలో మాదిగ, నేతకాని, ఎరుకల కులాలే ప్రధానంగా ఉన్నాయి. వాళ్ల తరువాత తరాలు కూడా ఇక్కడే పుట్టి పెరుగుతున్నాయి. ఈ కాలనీ కుటుంబాలకు నిర్మాణ రంగంలో దొరికే రోజువారీ అడ్డ కూలీ పని, యువకులైతే ఆటోలు నడుపుకోవటం, పాన్ టేలలు, వెల్డింగ్, చిన్న చిన్న మెకానిక్ పనులే జీవనాధారం. తల్లిదండ్రుల జీవితాల్లోనే స్థిరత్వం లేకపోవటం, పరిసరాల ప్రభావం, ఇతర సాంస్కృతిక కారణాల వలన పిల్లలు పెద్దగా చదువులో రాణించటం లేదు. వీళ్లలో కొందరిపై గతంలో చిన్న చిన్న స్క్రాప్, కాపర్ వైర్ల, ఇతర దొంగతనాల కేసులున్నాయి. ఇద్దరిపై గంజాయిని స్థానికంగా అమ్మి పెట్టే కేసులున్నట్లు పోలీసులు చెప్పారు. ఈ కేసుల్లో ఎవ్వరికీ ఎప్పుడూ కోర్టులో శిక్ష పడలేదు.



నేరం జరగటానికి గల సామాజిక, ఆర్థిక నేపథ్యాన్ని వదిలేసి బ్రిటిష్ పాలకులు ఒకప్పుడు కొన్ని తెగలను నేరస్త తెగలుగా ముద్ర వేసి, వారిని క్రిమినల్ ట్రైబ్స్ అని పిలిచేవారు. ఫలితంగా ఆ తెగలో పుట్టిన వారు గతంలో నేరాలు చేసి ఇప్పుడు మానేసినా లేదా అసలు ఎప్పుడూ నేరం చేయకపోయినా నిరంతరం అంతులేని పోలీసు అకృత్యాలకు బలయ్యేవారు. ఆ ముద్ర చెరిపేసుకోవటానికి వారికి కొన్ని తరాలు పట్టింది.

ఇతరుల కళ్ళు గప్పి, మన కష్టార్జితం కాని దాన్ని కైవసం చేసుకోవటమే దొంగతనం. సమాజంలో లంచగొండులు, అక్రమార్జనపరులు, బ్యాంకులను కొల్లగొట్టే వ్యాపారులు, ప్రజల ఉమ్మడి భూములను, వనరులను తమ హస్తగతం చేసుకొనే వైట్‌కాలర్ మనుషులు దొంగలు కారా? సభ్య సమాజం అనబడే దాంట్లో ఎంత మంది ఇవ్వాళ కేవలం వారి నైతికమైన కష్టార్జితం మీద మాత్రమే ఆధారపడి జీవిస్తున్నారు? వీరంతా సమాజంలో ఎంతో దర్జాగా బతుకుతుండగా నిమ్న కులాలకు చెందిన వాళ్లు, కటిక పేదలు మాత్రం పోలీసుల చేతిలో దెబ్బలు తింటున్నారు. కేవలం దొంగతనం రూపంలో తేడా ఉన్నందుకేనా?

పేదరికం, తగిన ఉపాధి మార్గాలు లేకపోవడం, పాలకులే పెంచి పోషించే వ్యసనపర సంస్కృతి, మనుషులందరినీ సమానంగా చూసే ప్రజాస్వామ్య సంస్కృతి లేని పరిపాలనల పర్యవసానంగానే చిన్న చిన్న దొంగతనాలు జరుగుతాయి. దీనికి వ్యక్తిగతంగా వారినే బాధ్యులను చేసి శిక్షించటం కంటే పాలకులే ఆ స్థితికి నైతిక బాధ్యత వహించటం నాగరిక పద్ధతి. నేరం జరగటానికి గల నేపథ్యాన్నీ, నివారించడానికి గల అవకాశాలనూ పరిశీలించకుండా నేరస్తులను మాత్రమే శిక్షించే సాంప్రదాయం సంకుచితమైనది. నేర సంస్కృతి పెరగటానికి కావలసిన భౌతిక పరిస్థితులను పెంచి పోషించే పాలకులే నేరాల అదుపు పేరుతో పేదవర్గాలపై కేసులు బనాయించటం అనైతికమైన విషయం.

దేశంలో కొన్ని వర్గాలు మాత్రమే దొంగలుగా ఉంటారనే సామాజిక విలువలో ఆర్థిక, కుల వివక్ష ఉంది. మేం మాత్రం దొంగలం కాదు సుమా అనే ఆత్మ వంచన కూడా ఉంది. ఈ మానసిక భావనను సమీక్షించుకోవాల్సిన బాధ్యత పాలకులది, సభ్య సమా జానిది. సమాజంలోని పౌరులందరూ గౌరవప్రదమైన ఉపాధితో, సమానమైన హోదా, అవకాశాలతో జీవించేటట్లు చూడాల్సిన రాజ్యాంగ బాధ్యత పాలకులది.

వ్యాసకర్త మానవ హక్కుల వేదిక, తెలంగాణ సభ్యులు
మొబైల్: 98492 28212

కింది నుంచి అనుమతి



సాధారణంగా ప్రభుత్వ ఉద్యోగులు 'పై నుంచి ఆదేశం లేదు, పై నుంచి ఉత్తర్వులు లేవు, పై నుంచి ఇంకా అనుమతి రాలేదు' అని అంటుంటారు. అంటే వారికి వారి పై అధికారుల నుంచి, ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు రాలేదు అని అర్థం. రాజకీయ నాయకులు కనుక 'పై నుంచి అనుమతి లేదు' అని అంటుంటే అధిష్ఠానం నుంచి అనుమతి రాలేదని అర్థం చేసుకోవాలి. అలా కాక ఒకాయన ఎప్పుడూ 'నేను దానం చేయాలనుకుంటాను, కానీ కింది నుంచి అనుమతి రాలేదు. నేను ఆలయాన్ని కట్టించాలనుకున్నాను, కానీ కింది నుంచి ఆజ్ఞ రాలేదు. నేను కాశీ వెళ్లాలనుకున్నాను, కానీ కింది నుంచి సమ్మతి రాలేదు...' అని అంటుండేవాడు. అందరికీ ఆశ్చర్యమయ్యేది.

ఒకాయన అడిగాడు – 'ఏమండీ ఎవరైనా పై నుంచి ఆజ్ఞ రాలేదు, పై నుంచి అనుమతి రాలేదు అని అంటారు గానీ మీరెందుకు కింది నుంచి ఆజ్ఞ రాలేదు, క్రింది నుంచి అనుమతి రాలేదు అని అంటుంటారు? దాని అర్థం ఏంటి?' అని.



అప్పుడు ఆయన – 'దానం చేయాలి, ఆలయాన్ని కట్టించాలి, కాశీకి వెళ్లాలి అనే ఆలోచనలు నాకు ఎక్కడి నుంచి వచ్చాయి? మెదడు నుంచే కదా? అంటే తల నుంచి కదా, తల ఎక్కడుంది? పైన. కానీ నేను తలకు ప్రాధాన్యమివ్వను. తల నుండే అహంకారం ఉద్భవించేది. దైవముండేది ఎక్కడ? హృదయంలో. హృదయం ఉండేది తలకు పైనా, లేక కిందనా? కిందే కదా. ఈ దేహానికి ఏది మంచిదో, ఏది చెడ్డదో చెప్పగలిగేది తల కాదు (అహంకారం కాదు), హృదయమే (దైవమే) అని నా అభిప్రాయం. అందుకే నేను హృదయాన్నే అనుసరిస్తా, తలను కాదు' అని ఆయన వివరించాడు.

స్వామి వివేకానంద అంటారు – 'తలకు ప్రాధాన్యమివ్వవద్దు, హృదయానికి ఇవ్వు' అని. తలకు ప్రాధాన్యమిచ్చేవారు మేధావులు, పండితులు కావచ్చు. హృదయ స్పందనకు విలువ ఇచ్చేవారు ప్రేమమూర్తులు, కరుణామయులు, దయానిధులు అవుతారు. 'బుద్ధిలోగానీ, తర్కంలోగానీ ఏముంది? అది నాలుగు అడుగులు మాత్రం పోయి అక్కడ ఆగిపోతుంది. కానీ హృదయ ద్వారంలో దైవ ప్రేరణ కలుగుతుంది. ప్రేమ... దుస్సాధ్యమైన ద్వారాలను కూడా తెరవగలుగుతుంది. జగద్రహస్యాలన్నిటికీ ప్రేమ సింహ ద్వారం' అంటారు స్వామి వివేకానంద.

– రాచమడుగు శ్రీనివాసులు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, పుష్య మాసం, **తిథి:** శు.చవితి రా.1.00 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** ధనిష్ఠ రా.12.01 వరకు, తదుపరి శతభిషం, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.8.48 నుండి 9.36 వరకు, తదుపరి ప.12.30 నుండి 1.18 వరకు, **అమృత ఘడియలు:** ప.1.55 నుండి 3.29 వరకు; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 6.36, **సూర్యాస్తమయం:** 5.34.

క్లుప్తంగా...

వరాహరూపుడైన రామయ్య



వరాహావతారంలో స్వామివారు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారు గురువారం వరాహావతారంలో దర్శనమిచ్చారు. తొలుత బేడా మండపంలో స్వామివారి వద్ద వేద పండితులు దివ్యప్రబంధం పఠించారు. అనంతరం వరాహావతారంలో అలంకరించిన స్వామివారిని పల్లకీ సేవగా మిథిలా స్టేడియంలో ఏర్పాటు చేసిన వేదికపై కొలువుదీర్చారు. భక్తుల దర్శనానంతరం తిరువీధి సేవ నిర్వహించి, తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు.

పాముతో విద్యార్థుల విన్యాసాలు



పాముతో విద్యార్థి విన్యాసం

నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఖిల్లా ప్రాంతంలో అక్కడి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కొందరు పాముతో విన్యాసాలు చేయడం కలకలం రేపింది. ఏడో తరగతి విద్యార్థులు గురువారం మధ్యాహ్నం.. పాఠశాల సమయంలో బయటికి వచ్చి ఆడుకుంటుండగా పాము కనిపించింది. విద్యార్థులందరూ కలిసి ఒక ప్లాస్టిక్ డబ్బాలో పామును బంధించి దాంతో విన్యాసాలు చేశారు. ఇది చూసిన స్థానికులు ఆందోళన చెందారు. వారు హెచ్చరించడంతో.. విద్యార్థులు పామును అదే డబ్బాలో ఉంచి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

నీటి శాఖ ఇక పటిష్టం!



ఇంజనీర్ల పనితీరు, సామర్థ్యం పెంపుదలపై సర్కారు దృష్టి

- బాధ్యతల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలకు నిర్ణయం
- పదేళ్ల తర్వాత ఇంజనీర్ల పదోన్నతులు, బదిలీలకు చర్యలు
- ఇప్పటివరకు కొనసాగిన అడ్‌హక్ పదోన్నతులకు చెల్లుచీటీ
- ఇకపై రిటైరైన ఇంజనీర్ల పదవీకాలం పొడిగించరాదని నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: నీటిపారుదల శాఖను పటిష్టపరచడంతో పాటు ఇంజనీర్ల పనితీరు, సామర్థ్యం పెంపుదలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఓ వైపు ఇంజనీర్ల సంక్షేమానికి అధిక ప్రాధాన్యతనిస్తూనే మరోవైపు బాధ్యతల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారి విషయంలో కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించింది. ఈ క్రమంలో పలు కీలక చర్యలకు శ్రీకారం చుట్టబోతోంది. ముఖ్యంగా గత పదేళ్లుగా తాత్కాలిక (అడ్‌హక్) పదోన్నతులే కల్పిస్తుండగా, ఇకపై ఈ విధానానికి శాశ్వతంగా ఫుల్‌స్టాప్ పెట్టనుంది. వచ్చే 10–15 రోజుల్లోగా అర్హులైన ఇంజనీర్లందరికీ సాధారణ పదోన్నతులు ఇవ్వడంతో పాటు బదిలీల ప్రక్రియ చేపట్టనుంది.తమ తుది తీర్పునకు లోబడి పదోన్నతులు కల్పించుకోవాలని ఇటీవల రాష్ట్ర హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో పదోన్నతులు, బదిలీలపై కసరత్తు ప్రారంభించింది.

కమిటీ సిఫారసుల మేరకు..

ఏఈ నుంచి చీఫ్ ఇంజనీర్ వరకు అందరికీ ప్రమోషన్లు కల్పించబోతోంది. పదోన్నతుల విషయంలో జోన్–5, జోన్–6 ఇంజనీర్లతో పాటు అసిస్టెంట్ ఇంజనీర్లు (ఏఈ), అదనపు అసిస్టెంట్ ఇంజనీర్ల మధ్య సుదీర్ఘకాలంగా వివాదం నడుస్తోంది. ఒక జోన్ వారికే పదోన్నతుల్లో ప్రాధాన్యత కల్పించడంతో తమకు అన్యాయం జరిగిందని మరో జోన్ ఇంజనీర్లు కోర్టును ఆశ్రయించారు. ఉద్యోగంలో చేరాక డిప్లమా చేసిన వారికి ఏఈఈలుగా పదోన్నతి కల్పిస్తుండడంతో ప్రత్యక్ష నియామకాల పద్ధతిలో నియమితులైన ఏఈఈలు తమ పోస్టులను కోల్పోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ వివాదాల నేపథ్యంలో పదోన్నతులపై అధ్యయనం కోసం నీటిపారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, ఈఎన్‌సీ (జనరల్) జి.అనిల్‌కుమార్, ఈఎన్‌సీ (ఓ అండ్ ఎం) విజయభాస్కర్ రెడ్డితో ప్రభుత్వం ఓ కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీ ఇవ్వనున్న సిఫారసుల ఆధారంగా ఈ నెలాఖరులోగా మెరిట్ కమ్ సీనియారిటీ ఆధారంగా పదోన్నతులు, బదిలీలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. నీటిపారుదల శాఖలో ఖాళీగా ఉన్న ఈఎన్‌సీ (జనరల్), ఈఎన్‌సీ (రామగుండం), ఈఎన్‌సీ (ఓ అండ్ ఎం) పోస్టులతో పాటు 9 సీఈ, 27 ఎస్‌ఈ, 26 ఈఈ పోస్టులను పదోన్నతులు, బదిలీల ద్వారా ప్రభుత్వం భర్తీ చేయనుంది.

సీఈలు క్షేత్ర స్థాయిలోనే ఉండాలి

నీటిపారుదల శాఖలో టెరిటోరియల్ చీఫ్ ఇంజనీర్లుగా కీలక పోస్టుల్లో ఉన్న కొందరు అధికారులు తమ పని ప్రదేశంలో ఉండకుండా హైదరాబాద్‌లో ఉంటున్నారని ప్రభుత్వ దృష్టికి వచ్చింది. ఇంకొందరు సీఈలకు హైదరాబాద్‌లోని జలసౌధలో ప్రత్యేక క్యాంపు కార్యాలయాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సీఈలందరూ ఇకపై క్షేత్ర స్థాయిలోనే తప్పనిసరిగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది. క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండకపోవడం, విధుల్లో నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికే మిర్యాలగూడ ఈఈని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఇదే క్రమంలో ఇటీవల నియమితులైన కొత్త ఏఈఈలు కొంత కాలం పాటు క్షేత్ర స్థాయిలో పనిచేయాల్సిందేనని, బదిలీల్లో వీరికి స్థానచలనం కల్పించరాదని నిర్ణయం తీసుకుంది. వీరిలో బాగా పనిచేసే ఇంజనీర్లకు ప్రోత్సాహకంగా ప్రత్యేక పదోన్నతులు కల్పించే అంశాన్ని పరిశీలిస్తోంది.

రిటైర్ అయితే ఇంటికే..

ఇకపై రిటైరైన ఇంజనీర్ల పదవీ కాలం పొడిగించరాదని ఉన్నత స్థాయిలో నిర్ణయం తీసుకున్నట్టు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. గత పదేళ్లలో కీలకమైన ఈఎన్‌సీలు, చీఫ్ ఇంజనీర్లుగా రిటైరైన ఇంజనీర్లే కొనసాగారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చాలామంది రిటైర్డ్ ఇంజనీర్లను తొలగించింది. ఇటీవల కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించిన ఓ సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వలేక ఎక్స్‌టెన్షన్‌లో ఉన్న ఓ కీలక ఇంజనీర్ నీళ్లు నమిలారు. దీంతో మళ్లీ ఆయన పదవీకాలాన్ని పొడిగించరాదని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ పోస్టులో మరో ఇంజనీర్‌ను అదనపు బాధ్యతల కింద నియమించింది. ఇదే సమయంలో మరో ఇంజనీర్ సైతం తన పదవీకాలం పొడిగింపునకు తీవ్ర ప్రయత్నాలు చేసుకున్నా ఫలించలేదు.

అందరి అభిప్రాయాలను సేకరిస్తున్నాం

- ఎస్సీ వర్గీకరణ అధ్యయన కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్

నిజామాబాద్ అర్బన్: ఎస్సీ వర్గీకరణ అంశంపై అన్ని వర్గాల అభిప్రాయాలను తెలుసుకొని క్షేత్రస్థాయి పరిస్థితులను అధ్యయనం చేసేందుకు ప్రభుత్వం ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేసిందని కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్ పేర్కొన్నారు. గురువారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లాలకు సంబంధించి ఎస్సీ వర్గీకరణ అంశంపై బహిరంగ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటివరకు రాష్ట్రంలో నిజామాబాద్ ఉమ్మడి జిల్లాను కలుపుకొని 9 జిల్లాల్లో తమ పర్యటన పూర్తి చేసుకున్నామని, అందరి అభిప్రాయాలను సేకరించామని తెలిపారు. వర్గీకరణ అంశంతో పాటు సామాజిక స్థితిగతులకు సంబంధించి షెడ్యూల్ కులాలకు చెందిన అన్ని వర్గాల వారు ఎలాంటి ఒత్తిడిలు లేకుండా నిర్భయంగా కమిషన్‌కు తమ అభిప్రాయాలు వెల్లడించవచ్చునని పేర్కొన్నారు. ఏకసభ్య కమిషన్ వస్తుందని తెలియడంతో ఉమ్మడి జిల్లాలోని వివిధ దళిత సంఘాలు పెద్దఎత్తున కలెక్టరేట్‌కు తరలివచ్చాయి. మాల, మాదిగ కులాలతో పాటు చిందులు, బేడ బుడగ జంగాలు ఇతర కులాల వారు కలెక్టరేట్‌కు వచ్చి కమిషన్ చైర్మన్‌కు వినతులు సమర్పించారు. కొన్ని కులాల వారు తమ సంప్రదాయ వేషధారణతో కలెక్టరేట్‌కు రాగా, దళిత సంఘం నాయకులు డప్పులతో వచ్చారు. ఒక్కొక్కరుగా కమిషన్ చైర్మన్‌ను కలుస్తూ వినతి పత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, రాష్ట్ర షెడ్యూల్ కులాల అభివృద్ధి సంస్థ అదనపు సంచాలకులు శ్రీధర్, ఉమ్మడి జిల్లాల అధికారులు పాల్గొన్నారు.



కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు


నేరెళ్ల ఘటనలో ఏం చర్యలు తీసుకున్నారు?

- అక్రమాలకు పాల్పడ్డ పోలీసులపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారా?
- రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు ధర్మాసనం
- నివేదిక దాఖలుకు సమయం కోరిన ఏఏజీ.. విచారణ 20కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: సిరిసిల్ల జిల్లా నేరెళ్ల గ్రామంలో 2017లో దళితులపై జరిగిన దాడికి సంబంధించి పోలీసులపై నమోదు చేసిన కేసు పురోగతి వివరాలను నెల రోజుల్లోగా అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. బాధితులకు పరిహారం ఇచ్చారా? పోలీసులపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారా? లాంటి వివరాలను అందులో పొందుపరచాలని స్పష్టం చేసింది. తొలుత విచారణకు హాజరైన ప్రభుత్వ న్యాయవాదిపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కేసు వివరాలు తెలియకుండా, గడువు కోరడం కోసం ఎందుకు హాజరయ్యారంటూ మందలించింది. తదుపరి విచారణను ఈ నెల 20కి వాయిదా వేసింది.

ఇదీ కేసు నేపథ్యం..

చీర్లవంచ, కొదురుపాక ప్రాంతాల నుంచి వందలాది ఇసుక లారీలు, టిప్పర్లు నడిచేవి. ఇసుకను తరలించే క్రమంలో జరిగిన 42 ప్రమాదాల్లో మొత్తం నలుగురు చనిపోయారు. ముఖ్యంగా 2017 జూలై 2న నేరెళ్లకు చెందిన ఎరుకల భూమయ్య అనే వ్యక్తిని ఇసుక లారీ ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. దీంతో తీవ్ర ఆగ్రహానికి గురైన స్థానికులు ఐదు ఇసుక లారీలను తగలబెట్టారు. దీంతో పోలీసులకు, స్థానికుల మధ్య ఉద్రిక్తత నెలకొనగా 13 మందిపై పోలీసులు కేసు నమోదు చేశారు. రెండు రోజుల తర్వాత రాత్రి 11:30 గంటలకు నేరెళ్లకు చెందిన పెంట బానయ్య, కోలా హరీశ్, చెప్యాల బాలరాజు, పసుల ఈశ్వర్ కుమార్, గంధం గోపాల్, రామచంద్రాపూర్‌కు చెందిన భక్తుల మహేశ్, జిల్లెళకు చెందిన కోరుకొండ గణేశ్, చీకోటి శ్రీనివాస్‌లను పోలీసులు అనుమానితులుగా అదుపులోకి తీసుకొని జూలై 7న అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు.



బాధితులకు పరిహారం ఇచ్చారా?

ఈ ఘటనలో దళితులు, బీసీ యువకులను పోలీసులు చిత్రహింసలకు గురిచేశారని.. బాధ్యులైన ఎస్పీ విశ్వనాథ్, సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌పై చర్యలు తీసుకోవడంతోపాటు బాధితులకు రూ. 10 లక్షలు పరిహారం ఇవ్వాలంటూ హైకోర్టులో రెండు పిల్‌లు దాఖలయ్యాయి. వాటిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జె.శ్రీనివాస్‌రావు ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. అక్రమాలకు పాల్పడిన పోలీసులపై చర్యలు తీసుకున్నారా? ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారా? చార్జిషీట్ దాఖలు చేశారా? బాధితులకు పరిహారం ఇచ్చారా? అని అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌ను ధర్మాసనం ప్రశ్నించింది. ఏజీపీ నుంచి ఎలాంటి సమాధానం రాకపోవడంతో ఆగ్రహంవ్యక్తం చేసింది. అదనపు అఫిడవిట్ దాఖలు చేయడానికి సమయం కావాలని కోరడం కోసమే హాజరుకావడాన్ని తప్పుబట్టింది. దీంతో వెంటనే ఏఏజీ ఇమ్రాన్‌ఖాన్ విచారణకు హాజరయ్యారు. పోలీసులపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశామని కోర్టుకు తెలిపారు. విచారణ ఏ దశలో ఉందని ధర్మాసనం ప్రశ్నించగా పూర్తి వివరాలతో స్థాయీ నివేదిక దాఖలు చేసేందుకు సమయం ఇవ్వాలని కోరారు. దీంతో తదుపరి విచారణను ధర్మాసనం జనవరి 20కి వాయిదా వేసింది.

తొలిరోజు టెట్ ప్రశాంతం

సాక్షి, హైదరాబాద్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీజీ టెట్) గురువారం రాష్ట్రవ్యాప్తంగా ప్రశాంతంగా జరిగింది. తొలిరోజు పేపర్–2 (సోషల్ స్టడీస్ తెలుగు మీడియం) పరీక్ష జరిగింది. 49 కేంద్రాల్లో ఉదయం సెషన్‌లో 12815 మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. 9259 మంది (72.25 శాతం) పరీక్ష రాశారు. సాయంత్రం సెషన్‌లో 52 కేంద్రాల్లో 12734 మంది రాయాల్సి ఉంది. ఇందులో 9637 మంది (75.68 శాతం) పరీక్ష రాశారు.

తండ్రి మందలించాడని పురుగు మందు తాగిన ఇంటర్ విద్యార్థి




గణేశ్

మర్రిగూడ: తండ్రి మందలించాడని ఇంటర్మీడియట్ చదువుతున్న కుమారుడు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని శివన్నగూడలో గురువారం చోటుచేసుకుంది. శివన్నగూడ గ్రామానికి చెందిన సుంకరి ఇంద్రయ్య పెద్ద కుమారుడు గణేశ్ (16) గుర్రంపోడు మండలం పిట్టలగూడెంలో గల మైనార్టీ గురుకుల కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కొన్ని రోజులుగా కళాశాలకు వెళ్లకపోవడంతో గురువారం ఉదయం అతడి తండ్రి గణేశ్‌ను పొలం వద్దకు తీసుకెళ్లి పనులు చేయించాడు. పొలం పనులు సరిగ్గా చేయాలని తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన గణేశ్.. పొలంలో కొద్ది దూరం వెళ్లి అక్కడ ఉన్న పురుగు మందు తాగాడు. అనంతరం తాను పురుగుల మందు తాగానని తండ్రికి చెప్పాడు. దీంతో గణేశ్‌ను తండ్రి స్థానికుల సహాయంతో హుటాహుటిన మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాడు. అప్పటికే గణేశ్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తండ్రి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్‌ఐ కృష్ణారెడ్డి తెలిపారు.

ఫైనాన్స్ వేధింపులతో మహిళ బలవన్మరణం

ధర్మసాగర్: ఫైనాన్స్ వారి వేధింపులు తట్టుకోలేక ఉరేసుకొని ఓ మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఎల్కుర్తి గ్రామంలో గురువారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. ఎల్కుర్తికి చెందిన కేతిరి వెంకటయ్య తన కూతురు ఎలేంద్ర (35)ను స్టేషన్‌ఘన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన అంగడి ఉపేందర్‌కు ఇచ్చి 17 ఏళ్ల క్రితం వివాహం చేశాడు. కూతురు, అల్లుడు స్టేషన్‌ఘన్‌పూర్‌లో సొంత ఇల్లు నిర్మించుకోవడానికి ఆరేళ్ల క్రితం ఆధార్ హౌస్ ఫైనాన్స్‌లో లోన్ తీసుకుని కొంత మేరకు చెల్లించారు. మిగతా డబ్బులు చెల్లించడంలో కొంత ఆలస్యం అయింది. దీంతో ఫైనాన్స్ వారు వచ్చి డబ్బులు పూర్తిగా చెల్లించాలని తరచూ అడగడమే కాకుండా, ఇంటికి నోటీసులు కూడా అంటించారు. దీంతో మనస్తాపం చెందిన ఎలేంద్ర గురువారం ఎల్కుర్తిలోని తన తండ్రి వద్దకు వచ్చి ఇంటి ఎదురుగా ఉన్న చింత చెట్టుకు ఉరేసుకుంది. వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జానీ పాషా తెలిపారు.

అమ్మను అవమానించారని టెన్త్ విద్యార్థి ఆత్మహత్య



శివకిశోర్

గంభీరావుపేట (సిరిసిల్ల): తనపై దాడి చేయడంతో పాటు తల్లిని తిట్టారన్న అవమానభారంతో రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన పదోతరగతి విద్యార్థి చింతకింది శివకిశోర్ (16) ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబసభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాలు.. శివకిశోర్ గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్నాడు. తోటి విద్యార్థినితో మాట్లాడొద్దని చెప్పినా వినడం లేదని ఆ అమ్మాయి తరఫు బంధువులు, అదే గ్రామానికి చెందిన హరిబాబు, నవీన్, రాకేశ్, ప్రవీణ్, శ్రీనివాస్ తీవ్రంగా కొట్టారు. ఆమె తన క్లాస్‌మేట్ అని చెప్పినా వినకుండా దాడి చేశారని జరిగిన విషయాన్ని ఏడుస్తూ శివకిశోర్ తన తల్లితో చెప్పుకున్నాడు. అమ్మాయి తల్లి కూడా కిశోర్ తల్లిని పిలిపించి ఇష్టం వచ్చినట్లు తిట్టింది. తనను కొందరు కొట్టడం, తల్లిని అమ్మాయి తల్లి పిలిపించి అవమానకరంగా తిట్టడంతో మనస్తాపానికి గురైన కిశోర్ బుధవారం రాత్రి ఇంట్లోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి సునీత ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. కాగా.. కిశోర్ తండ్రి గల్ఫ్‌లో ఉంటున్నాడు. సంఘటన సమాచారాన్ని తెలుసుకొని సొంతూరికి బయలుదేరారు. ఒక్కగానొక్క కొడుకు అర్థాంతరంగా తనువు చాలించడంతో ఆ తల్లి రోదనలు పలువురిని కంటతడి పెట్టించాయి.

భోపాల్‌లో విష వ్యర్థాల తొలగింపు

4 దశాబ్దాల తర్వాత చర్యలు చేపట్టిన ప్రభుత్వం

- అత్యంత జాగ్రత్తల మధ్య వ్యర్థాల తరలింపు
- వ్యర్థాలను కాల్చేసి, అవశేషాలను పూడ్చడానికి సన్నాహాలు

భోపాల్: భారత దేశ చరిత్రలో అత్యంత దారుణమైన పారిశ్రామిక ప్రమాదంగా నిలిచిన భోపాల్ గ్యాస్ లీకేజీ ఉదంతంలో 40 సంవత్సరాల తర్వాత కీలక ఘట్టం జరిగింది. విషపూరిత గ్యాస్ లీకేజీ తర్వాత ఇంకా యూనియన్ కార్బైడ్ కర్మాగారంలో మిగిలిపోయిన అత్యంత ప్రమాదకర వ్యర్థాల తొలగింపు ప్రక్రియ ఎట్టకేలకు పూర్తయింది. బుధవారం రాత్రి 9 గంటలపుడు ఏకంగా 337 టన్నుల బరువైన వ్యర్థాలను ప్రత్యేకమైన కంటైనర్లలో జాగ్రత్తగా ప్యాక్‌చేసి 250 కిలోమీటర్ల దూరంలోని వ్యర్థ్యాల దహన కర్మాగారానికి తరలించారు. గురువారం తెల్లవారుజామున నాలుగు గంటలకు ఈ ట్రక్కులన్నీ ధర్ జిల్లాలోని పీతంపూర్ పారిశ్రామిక వాడకు చేరుకున్నాయని ధర్ ఎస్పీ మనోజ్ సిన్హా చెప్పారు. వ్యర్థాలను దహనం చేసి అందులో ఏరకమైన విష పదార్థలు లేవని నిర్ధారణ చేసుకున్నాకే మిగిలిన అవశేషాలను నేలలో పాతిపెట్టనున్నారు. 1984 డిసెంబర్ రెండో తేదీ రాత్రి భోపాల్‌లోని యూనియన్ కార్బైడ్ పురుగుమందుల కర్మాగారం నుంచి అత్యంత విషపూరితమైన మిథైల్ ఐసోసైనేట్ గ్యాస్ లీక్ అయింది. అది ఎక్కడి జనాన్ని అక్కడే విగతజీవులుగా మార్చేసిన దారుణోదంతం తెల్సిందే. విష వాయువులు పీల్చి దాదాపు 5,480 మంది అక్కడిక్కడే చనిపోయారు. వేలాది మంది వికలాంగులయ్యారు. విషవాయువును పీల్చిన ఆనాటి తరం వాళ్లకు ఈ నాలుగు దశాబ్దాల కాలంలో లక్షలాది మంది వైకల్యంతో జన్మించారు. ఇంకెందరో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారు. ప్రపంచంలోని అతిపెద్ద పారిశ్రామిక విపత్తులలో ఒకటిగా ఇది నిలిచిపోయింది. అంబులెన్సులు, పోలీసు వాహనాలు, అగ్నిమాపక దళాల ప్రత్యేక పర్యవేక్షణలో వ్యర్థాల తరలింపు ప్రక్రియ జరిగింది. ఇందుకోసం 250 కిలోమీటర్ల పొడవునా గ్రీన్ కారిడార్‌ను ఏర్పాటుచేశారు. విషపూరిత వ్యర్థాలలో మట్టి, పురుగుమందుల అవశేషాలు, తయారీ ప్రక్రియల్లో మిగిలిపోయిన రసాయనాలతో సహా ఐదు రకాల ప్రమాదకరమైన పదార్థాలు ఉన్నాయి.

మందలించిన హైకోర్టు

రాష్ట్ర రాజధానిలోని ఈ కర్మాగారం నుంచి వ్యర్థాలను తొలగించాలని సుప్రీంకోర్టు గతంలోనే పలుమార్లు ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోలేదు. ఫ్యాక్టరీని ఖాళీ చేయకపోవడంపై మధ్యప్రదేశ్ హైకోర్టు ఇటీవల అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ ఉదాసీనత కొత్త విషాదానికి దారి తీస్తుందని కోర్టు పేర్కొంది. వ్యర్థాలను తొలగించడానికి నాలుగు వారాల గడువు విధిస్తూ డిసెంబర్ మూడో తేదీన తీర్పునిచ్చింది. వ్యర్థాలను 2025 జనవరి ఆరో తేదీలోపు పూర్తిగా తొలగించాలని హైకోర్టు ఆదేశించింది. కోర్టు ఆదేశాలను పాటించకుంటే కోర్టు ధిక్కార చర్యలు తీసుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఈ మేరకు ప్రభుత్వం తరలింపు చర్యలు చేపట్టింది.

అత్యంత భద్రత మధ్య..

వ్యర్థాలను సురక్షితంగా తరలించేందుకు విస్తృత ఏర్పాట్లు చేశారు. కర్మాగారంలో 337 మెట్రిక్ టన్నుల విష వ్యర్థాలున్నాయి. ఆదివారం నుంచే వీటిని మూటలు కట్టే పనులు మొదలుపెట్టారు. వీటిని ప్రత్యేకంగా రూపొందించిన 12 కంటైనర్లలో లోడ్ చేశారు. ప్రతి కంటైనర్‌లో సుమారు 30 టన్నుల వ్యర్థాలను నింపారు. రసాయన చర్యలను నివారించడానికి అత్యంత మందంగా ఉండే పాలిథీన్ సంచుల్లో ప్యాక్ చేశారు. వ్యర్థాల తరలింపుకోసం కర్మాగారం చుట్టూతా 200 మీటర్ల పరిధిలో ఎవరూ రాకుండా నిషేధం విధించారు. సుమారు 200 మంది కార్మికులు ఈ ప్రక్రియలో నిమగ్నమయ్యారు. పీపీఈ కిట్లు ధరించి కట్టుదిట్టమైన భద్రతా ప్రమానాలను పాటిస్తూ వ్యర్థాలను కంటైనర్లలో నింపారు. బుధవారం రాత్రి 9 గంటలకు 12 కంటైనర్ ట్రక్కులు కర్మాగారం నుంచి బయలుదేరాయి. 50 మంది పోలీసులు కంటైనర్లకు రక్షణ కల్పిస్తున్నారు. అత్యున్నత భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా వ్యర్థాలను తరలిస్తున్నామని పోలీసు కమిషనర్ తెలిపారు.

పీతంపూర్‌లో దహన కర్మాగారం..

పీతంపూర్‌లోని వ్యర్థాల దహన కర్మాగారం రాష్ట్రంలోని ఏకైక అత్యాధునిక కర్మాగారం. దీనిని కేంద్ర కాలుష్య నియంత్రణ బోర్డ్ మార్గదర్శకాల ప్రకారం రాంకీ ఎన్విరో ఇంజనీర్స్ నిర్వహిస్తోంది. 2015లో ట్రయల్‌రన్‌లో భాగంగా గంటకు 90 కిలోల వ్యర్థాల చొప్పున 10 టన్నుల యూనియన్ కార్బైడ్ వ్యర్థాలను ప్రయోగాత్మకంగా దహనం చేశారు. ఇది విజయవంతం కావడంతో మిగిలిన వ్యర్థాలను కాల్చేయనున్నారు. భూమికి 25 అడుగుల ఎత్తులో నిర్మించిన ప్రత్యేక వేదికపై వ్యర్థాలను కాల్చనున్నారు. ఈ ప్రక్రియ కోసం కఠినమైన శాస్త్రీయ ప్రోటోకాల్స్‌ను అనుసరిస్తారు. గంటకు 90 కిలోల వ్యర్థాల చొప్పున మొత్తం 337 టన్నుల వ్యర్థాలను కాల్చడానికి సుమారు 153 రోజులు పడుతుంది. ఈ వేగాన్ని గంటకు 270 కిలోలకు పెంచితే 51 రోజుల్లో పూర్తిగా వ్యర్థాలను కాల్చేయొచ్చు.



విషపూరిత పదార్థాలతో పీతంపూర్ వైపు వెళ్తున్న కంటైనర్ ట్రక్కులు

స్థానికుల నుంచి వ్యతిరేకత

2015లో పీతంపూర్‌లో 10 టన్నుల యూనియన్ కార్బైడ్ వ్యర్థాలను ప్రయోగాత్మకంగా కాల్చివేయడం వల్ల సమీప గ్రామాల మట్టి, భూగర్భ జలాలు, నీటి వనరులు కలుషితమయ్యాయని స్థానికులు ఆందోళన తెలిపారు. ఈ నేపథ్యంలో వ్యర్థాల తరలింపునకు స్థానిక ప్రజల నుంచి తీవ్ర నిరసన ఎదురవుతోంది. ఆదివారం పెద్ద సంఖ్యలో ప్రజలు నిరసన ప్రదర్శన చేపట్టారు. వ్యర్థాలను పీతంపూర్‌కు బదులు విదేశాలకు పంపాలని డిమాండ్ చేస్తూ 10కి పైగా సంస్థలు గురువారం బంద్‌కు పిలుపునిచ్చాయి. తగిన ట్రయల్స్ లేకుండా వ్యర్థాల తొలగింపు ప్రక్రియను ప్రశ్నిస్తూ ఇండోర్‌లోని మహాత్మాగాంధీ మెమోరియల్ హాస్పిటల్ పూర్వ విద్యార్థుల సంఘం వైద్యులు పిటిషన్ దాఖలు చేశారు. అయితే అన్ని అభ్యంతరాలను పరిశీలించిన తర్వాతే వ్యర్థాలను కాల్చేయాలని నిర్ణయం తీసుకున్నట్లు భోపాల్ ఘటన సహాయక, పునరావాస విభాగ డైరెక్టర్ స్వతంత్ర కుమార్ సింగ్ తెలిపారు. అన్నీ సవ్యంగా జరిగితే, మూడు నెలల్లో వ్యర్థాలను కాల్చివేస్తామని చెప్పారు. ఏదైనా ఆటంకం జరిగితే తొమ్మిది నెలల వరకు పట్టవచ్చ న్నారు. కాల్చిన తర్వాత, వ్యర్థాల బూడిదలో ఏదైనా హానికరమైన మూలకం మిగిలి ఉందా లేదా అని పరిశీలిస్తామని పేర్కొన్నారు. విషపూరిత మూలకాల జాడలు లేవని నిర్ధారించాక బూడిదను భూగర్భజలంతో కలవని రీతిలో భూమిలో పాతిపెడతామన్నారు. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారుల పర్యవేక్షణలో నిపుణుల బృందం ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

చొరబాటుదార్లకు బీఎస్ఎఫ్ దన్ను

- బెంగాల్‌ను అస్థిరపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర
- సీఎం మమతా బెనర్జీ ఆరోపణలు



కోల్‌కతా: పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ గురువారం సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్)పై తీవ్ర ఆరోపణలు చేశారు. బంగ్లాదేశ్ నుంచి దేశంలోకి చొరబడే వారిని వదిలేస్తూ తమ రాష్ట్రాన్ని అస్థిర పర్చేందుకు బీఎస్ఎఫ్ ప్రయత్నిస్తోందని విమర్శించారు. సరిహద్దులు దాటి ఇక్కడి వచ్చే సంఘ వ్యతిరేక శక్తులు నేరాలకు పాల్పడి, మళ్లీ వెళ్లిపోతున్నారన్నారు. బీఎస్ఎఫ్ చర్యల వెనుక కేంద్ర ప్రభుత్వం హస్తముందని తనకు అనుమానంగా ఉందని చెప్పారు. సరిహద్దు జిల్లాల్లోని కొందరు మేజిస్ట్రేట్లు, ఎస్పీలు సరిహద్దు బలగాల అక్రమాలకు కొమ్ముకాస్తున్నారని వ్యాఖ్యానించారు. 'ఇస్లాంపూర్, సిటాయ్, చోప్రా వంటి సరిహద్దుల ప్రాంతాల ద్వారా ప్రవేశించే చొరబాటుదార్లకు బీఎస్ఎఫ్ సాయం చేస్తున్నట్లు మాకు సమాచారముంది. బీఎస్ఎఫ్ జవాన్లు మహిళలను చిత్ర హింసలకు గురిచేస్తూ, రాష్ట్రాన్ని అస్థిరపర్చేందుకు ప్రయత్నిస్తున్నారు' అని సెక్రటేరియట్‌లో జరిగిన సమీక్ష సందర్భంగా సీఎం మమత వ్యాఖ్యానించారు. 'సరిహద్దుల రక్షణ బాధ్యత బీఎస్ఎఫ్‌దే, మాది కాదు. వీసాల జారీ కూడా కేంద్రమే చూసుకుంటుంది. విమానాల్లో ఇక్కడికి వచ్చే వారి సమాచారం మాకు అందజేస్తారు. ఇప్పుడు అది కూడా మేం తీసుకోవడం లేదు. దీంతో, రాష్ట్రానికి ఎవరు వస్తున్నారో మాకు తెలీదు. అయినప్పటికీ చొరబాట్ల వ్యవహారాన్ని కేంద్రం మాపై నెట్టేయాలని చూస్తోంది. రాష్ట్రాన్ని ఎవరైనా అస్థిరపరిచేందుకు చూస్తే టీఎంసీవైపే వేలెత్తి చూపుతోంది. అందుకే మేం చెప్పేది ఒక్కటే. చొరబాట్లకు బీఎస్ఎఫ్‌దే బాధ్యత. టీఎంసీది కాదు. కానీ, కొన్ని టీవీ చానెళ్లు టీఆర్‌పీ కోసం మాపై దుష్ప్రచారం చేస్తున్నాయి' అని తెలిపారు. ఇలాంటి చర్యలకు నిరసనగా కేంద్రానికి లేఖ రాస్తానన్నారు. సీఎం మమత వ్యాఖ్యలను బీఎస్ఎఫ్ ఖండించింది. తమ జవాన్లు సరిహద్దుల రక్షణలో అత్యంత అప్రమత్తత, చిత్తశుద్ధితో వ్యవహరిస్తున్నామని తెలిపింది. బీఎస్ఎఫ్ పోస్టుల ఏర్పాటుకు స్థలం ఇచ్చేందుకు సైతం నిరాకరించిన మమత తన యంత్రాంగం చేతికానితనాన్ని కప్పి పుచ్చుకునేందుకు బీఎస్ఎఫ్‌పై ఆరోపణలు చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సుకాంత మజుందార్ విమర్శించారు. ఆమె భ్రమల్లో గడుపుతున్నారని ఆయన ఎద్దేవా చేశారు.

కశ్మీర్‌కు త్వరలోనే రాష్ట్ర హోదా



- సీఎం ఒమర్ అబ్దుల్లా ఆశాభావం
- ఎన్‌డీఏలో చేరాలంటూ ఒత్తిళ్లు లేవని స్పష్టీకరణ

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌కు త్వరలోనే రాష్ట్రహోదా ఇచ్చి కేంద్రం తన హామీని నిలబెట్టుకుంటుందని సీఎం ఒమర్ అబ్దుల్లా ఆశాభావం వ్యక్తం చేశారు. కేంద్ర పాలిత ప్రాంత హోదా తాత్కాలికమేనని భావిస్తున్నామన్నారు. సీఎం ఒమర్ గురువారం శ్రీనగర్‌లోని షేర్–ఇ–కశ్మీర్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్(ఎస్‌కేఐసీసీ)లో మీడియాతో ముఖాముఖి మాట్లాడారు. 'రాష్ట్ర హోదాను తిరిగి సాధించుకోవడం మాకు అతిపెద్ద సవాల్. మాకు ఇచ్చిన హామీలు నెరవేరుతాయని ఆశిస్తున్నాం. ఇందులో అతిపెద్ద వాగ్దానం రాష్ట్ర హోదా. దీనిని నెరవేర్చడం ప్రథమ ప్రాధాన్యంగా కేంద్రం భావించాలి. సాధ్యమైనంత త్వరగా జమ్మూకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించాలని సుప్రీంకోర్టు తీర్పిచ్చింది. ఇప్పటికి ఏడాదైంది. ఈ సమయం సరిపోతుందని భావిస్తున్నాం'అని తెలిపారు. 'ఎన్నికల హామీలకు కట్టుబడి ఉన్నాం. మా మేనిఫెస్టో ఐదేళ్ల కాలపరిమితికి సంబంధించినవి. కొన్ని వారాలు లేదా నెలల్లోనే వీటిని అమలు చేయలేం. ఇప్పటికే కొన్ని వాగ్దానాల అమలు మొదలైంది. మరికొన్నిటికి వ్యవస్థాపరమైన మార్పులు అవసరం'అని ఒమర్ పేర్కొన్నారు. లెఫ్టినెంట్ గవర్నర్‌తో అధికారాలు పంచుకోవడంపై ఆయన... 'అధికారాలను పంచుకోవడం ఏమాత్రం ప్రయోజనకరం కాదు. అధికార కేంద్రం ఒక్కటే ఉండాలనేదే నా ఉద్దేశం 'అని అన్నారు.

సుప్రీంను ఆశ్రయించడం.. ఘర్షణే అవుతుంది

నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీని బీజేపీ సారథ్యంలోని ఎన్‌డీఏలో చేరాలంటూ ఒత్తిళ్లు వస్తున్నాయన్న వార్తలను ఆయన ఖండించారు. అవన్నీ అసత్యాలని చెప్పారు. రాష్ట్ర హోదా సాధనపై సుప్రీంకోర్టుకు బదులుగా కేంద్రం వద్దకు వెళ్లడంపై ఆయన వివరిస్తూ..'సుప్రీంకోర్టును ఆశ్రయించడమంటే ఘర్షణకు దిగడమన్నట్లే. ఘర్షణ మొదటి ప్రాధామ్యం కారాదు. దీనిని నేను చిట్టచివరి ఆప్షన్‌గానే తీసుకుంటా. రాష్ట్ర హోదా పునరుద్ధరణపై సుప్రీంకోర్టు, ప్రధానమంత్రి, హోం మంత్రి కూడా మాట్లాడనప్పుడు మాత్రమే మనం కోర్టుకు వెళ్లే అంశాన్ని పరిశీలించాల్సి ఉంటుంది. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం మనకు భరోసా ఇచ్చింది. దానిని నెరవేర్చేందుకు వారికి అవకాశమిద్దాం' అని తెలిపారు.

చైనాలో కొత్త వైరస్ కలకలం

పలు ప్రాంతాల్లో వ్యాపిస్తున్న హ్యూమన్ మెటాప్యూమో వైరస్

బీజింగ్: విశ్వవ్యాప్తంగా మానవాళి మనుగడను ఒక్కసారిగా ప్రశ్నార్థంచేసి మహా మహమ్మారిగా ప్రపంచదేశాలను చుట్టేసిన కరోనా వైరస్ భయాల నుంచి తేరుకున్న పౌరులకు చైనా మరో భయపెట్టే వార్త మోసుకొచ్చింది. చైనాలో ఇప్పుడు కొత్తగా హ్యూమన్ మెటాప్యూమో వైరస్(హెచ్ఎంపీవీ) వ్యాప్తిచెందుతోందని అంతర్జాతీయ మీడియాలో వార్తలొచ్చాయి. కోవిడ్ సంక్షోభం సమసిపోయిన ఐదేళ్లకు మళ్లీ అదే డ్రాగన్ దేశం నుంచి వైరస్ వార్త వెలువడటంతోప్రపంచదేశాలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాయి. కొత్త వైరస్ విజృంభణ, దాని విస్తృతి, సాంక్రమణ శక్తి సామర్థ్యాలపై వెంటనే ఆలోచనల్లో పడ్డాయి. చైనాలో ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీస్తున్నాయి. చైనాలో పలు ప్రాంతాల్లో హెచ్ఎంపీవీ వైరస్ వ్యాప్తి చెందినట్లు వార్తలొచ్చాయి. పుకార్ల వార్తలకు మారుపేరుగా దుష్కీర్తిని మూటగట్టుకున్న సోషల్‌మీడియాలో ఇప్పటికే కొత్త వైరస్‌పై వార్తలు వెల్లువెత్తాయి. చైనాలో హెచ్ఎంపీవీతోపాటు ఇన్‌ఫ్లూయెంజా ఏ, మైసోప్లాస్మా నిమోనియో, కోవిడ్19లు విజృంభించాయని, చైనా అత్యయిక ఆరోగ్య స్థితిని విధించారని సోషల్‌మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. నెటిజన్లు షేర్ చేసిన వీడియోల్లో చైనీయులు ఆస్పత్రులు, శ్మశానాల వద్ద క్యూ లైన్లు కనిపించిన దృశ్యాలున్నాయి. అయితే ఈ వార్తలను ఇంతవరకు చైనా ప్రభుత్వంగానీ, ప్రపంచ ఆరోగ్య సంస్థగానీ ధృవీకరించలేదు. ఇది పాత వైరస్సేనని కొందరు వైద్యులు చెబుతుండటం గమనార్హం.

అమెరికాలో వరుస దాడులు

నూతన సంవత్సరంలో తొలి 24 గంటల్లోనే మూడు ఘటనలు

- 16 మంది మృతి...
- ఉగ్రవాద సంస్థ ఐసిస్ ప్రేరణతో న్యూఆర్లియన్స్‌లో ఘాతుకం
- లాస్ వెగాస్‌లో ట్రంప్ హోటల్ ఎదుట పేలిన కారు
- న్యూయార్క్ నైట్‌క్లబ్‌లో కాల్పులు
- ఉగ్రదాడులుగా అనుమానం

వాషింగ్టన్: కొత్త సంవత్సరంలో అడుగుపెట్టిన తర్వాత తొలి 24 గంటల వ్యవధిలోనే అగ్రరాజ్యం అమెరికాలో మూడు భీకర దాడులు జరిగాయి. 16 మంది మరణించారు. పదుల సంఖ్యలో జనం క్షతగాత్రులుగా మారారు. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం న్యూ ఆర్లియన్స్‌లో జరిగిన దాడిలో 15 మంది మృతి చెందారు. అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ ఐసిస్ ప్రేరణతో ఓ దుండగుడు జనంపైకి వాహనంపై దూసుకెళ్లాడు. తర్వాత విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా సిబ్బంది అతడిని హతమార్చారు. ఈ ఘటన జరిగిన కొన్ని గంటల వ్యవధిలోనే లాస్ వెగాస్‌లోని ట్రంప్ ఇంటర్నేషనల్ హోటల్ సమీపంలో టెస్లా కారు పేలిపోయింది. ఒకరు మరణించారు. మరికొందరు గాయపడ్డారు. తర్వాత బుధవారం రాత్రి న్యూయార్క్ నైట్‌క్లబ్‌లో కాల్పుల ఘటన చోటుచేసుకుంది. అదృష్టవశాత్తూ ప్రాణనష్టం వాటిల్లలేదు. అయితే, ఈ మూడు ఘటనలకూ పరస్పరం సంబంధం ఉందని, ఇవన్నీ ముమ్మాటికీ ఉగ్రవాద దాడులేనని ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. తమ అభిప్రాయాలు సోషల్ మీడియాలో పోస్టు చేస్తున్నారు. ప్రభుత్వ దర్యాప్తు సంస్థలు రెండు ఘటనలను ఉగ్రదాడి కోణంలో విచారణ సాగిస్తుండడం గమనార్హం.

జబ్బార్ ట్రక్కులో ఐసిస్ జెండా

న్యూ ఆర్లియన్స్‌లోని బార్బన్ వీధిలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటున్న జనంపైకి శంషుద్దీన్ జబ్బార్ అనే వ్యక్తి వాహనంతో దూసుకొచ్చాడు. ఫోర్డ్ ఎఫ్–150 అద్దె ట్రక్కుతో ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. తర్వాత రైఫిల్‌తో జనంపైకి కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో 15 మంది చనిపోగా, 35 మంది గాయపడ్డారు. పోలీసుల కాల్పుల్లో జబ్బార్ హతమయ్యాడు. ట్రక్కులో ఐసిస్ జెండాను గుర్తించినట్లు ఎఫ్‌బీఐ అధికారులు చెబుతున్నారు. లాస్ వెగాస్‌లో ట్రంప్ హోటల్ వద్ద టెస్లా కారును పేల్చేసిన వ్యక్తి, జబ్బార్‌కు సంబంధం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకంటే వారిద్దరూ గతంలో ఒకే మిలటరీ స్థావరంలో పనిచేశారు. న్యూ ఆర్లియన్స్ దాడిని ఉగ్రవాద దాడిగానే దర్యాప్తు అధికారులు పరిగణిస్తున్నారు. ఎక్కువ మందిని చంపాలన్న ఉద్దేశంతోనే జబ్బార్ దాడి చేశాడని అంటున్నారు. ఐసిస్‌తో అతడికి సంబంధాలు ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో ఎఫ్‌బీఐ గుర్తించినట్లు తెలుస్తోంది.

రెండు వాహనాలు ఒకే యాప్ నుంచి..

న్యూ ఆర్లియన్స్ దాడికి ఉపయోగించిన ట్రక్కును, లాస్ వెగాస్ దాడిలో ఉపయోగించిన టెస్లా కారును 'టూరో యాప్' నుంచే అద్దెకు తీసుకున్నారు. వాహనంలో బ్యాటరీ వల్ల ఈ పేలుడు జరగలేదని టెస్లా అధినేత ఎలాన్ మస్క్ ధ్రువీకరించారు. కారులో పేలుడు పదార్థాలను అమర్చడం వల్లే అది పేలిందని అన్నారు. కారులో లోపం ఏమీ లేదని స్పష్టంచేశారు. టెస్లా కారు పేలుడు వ్యవహారాన్ని సైతం అధికారులు ఉగ్రవాద దాడి కోణంలోనే దర్యాప్తు చేస్తున్నారు. కొలరాడోలోని కొలరాడో స్ప్రింగ్స్‌లో ఈ వాహనాన్ని దుండగుడు అద్దెకు తీసుకున్నాడు. అక్కడ ఆధారాలు సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. అయితే, సదరు దుండగుడి పేరును ఇంకా బయటపెట్టలేదు. కానీ స్థానిక మీడియా కథనం ప్రకారం... మాథ్యూ లివెల్స్‌బర్గర్ అనే ఈ దుండగుడు కొలరాడో స్ప్రింగ్స్ కారును అద్దెకు తీసుకున్నాడు. కారులో తొలుత నెవడాకు చేరుకున్నాడు. అందులో బాణాసంచా, మోర్టార్స్, గ్యాస్ క్యాన్లు అమర్చాడు. అనంతరం లాస్ వెగాస్‌లో ట్రంప్ హోటల్ ఎదుట పేల్చేశాడు.



న్యూ ఆర్లియన్స్‌లో దుండగుడు జనంపైకి నడిపిన ట్రక్కు. (ఇన్‌సెట్లో) దుండగుడు జబ్బార్

నైట్‌క్లబ్‌లో 30 రౌండ్ల కాల్పులు

మూడో ఘటన విషయానికొస్తే న్యూయార్క్‌లో క్వీన్స్ ప్రాంతంలోని నైట్‌క్లబ్ వద్ద కాల్పులు జరిగాయి. కనీసం 12 మంది గాయపడ్డారు. క్లబ్ బయట వేచి ఉన్న జనంపైకి దాదాపు నలుగురు వ్యక్తులు ఒక్కసారిగా కాల్పులు జరిపారు. కనీసం 30 రౌండ్లు కాల్పులు జరిపినట్లు పోలీసులు గుర్తించారు. కాల్పుల అనంతరం అక్కడి నుంచి దుండుగులు పరారయ్యారు.

12 మందిని కాల్చి ఆపై ఆత్మహత్య

పొడ్గొరిక(మాంటినెగ్రో): నూతన సంవత్సర సంబరాలు జరుగుతున్న వేళ మాంటినెగ్రోలోని సెటింజె పట్టణంలో బుధవారం ఘోర విషాదం చోటుచేసుకుంది. అకో మార్టినోవిక్(45) అనే వ్యక్తి ఉన్మాదిగా మారి బార్ యజమాని, అతడి ఇద్దరు పిల్లలతోపాటు సొంత కుటుంబ సభ్యులను సైతం పొట్టనబెట్టుకున్నాడు. స్థానిక బార్‌లో బుధవారం ఉదయం నుంచి మార్టినోవిక్ గడిపాడు. సాయంత్రం గొడవకు దిగి ఇంటికి వెళ్లిపోయాడు. తిరిగి తుపాకీ తీసుకుని బార్‌లోకి ప్రవేశించిన అతడు బార్‌లోని వారిపైకి కాల్పులకు దిగాడు. అనంతరం బయటకు వెళ్లి మరో మూడు చోట్ల కాల్పులు జరిపాడు. పోలీసులు వెంబడించడంతో అక్కడికి 35 కిలోమీటర్ల దూరంలో ఉన్న పొడ్గొరికకు వెళ్లాడు. పోలీసులు చుట్టుముట్టడంతో తనను తాను కాల్చుకున్నాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా చనిపోయాడు. హింసా ప్రవృత్తి, చంచల స్వభావి అయిన మార్టినోవిక్‌పై గతంలో పలు కేసులున్నాయని పోలీసులు తెలిపారు. యూరప్‌లోని చిన్న దేశం మాంటినెగ్రో జనాభా 6.20 లక్షలు. ఆయుధాలను కలిగి ఉండటం ఇక్కడో సంప్రదాయం. తుపాకీ సంస్కృతి కారణంగా తరచూ నేరాలు జరుగుతుంటాయి. తాజా ఘటన జరిగిన సెటింజెలోనే 2022 ఆగస్టులో ఓ దుండగుడు ఇద్దరు చిన్నారులు సహా 10 మందిని కాల్చి చంపాడు. ఓ వ్యక్తి సకాలంలో అతడిని కాల్చి చంపడంతో మారణ హోమానికి ఫుల్‌స్టాప్ పడింది.

మోదీతో భేటీ ఎందుకు?

- పంజాబీ గాయకుడు దిల్జిత్ దొసాంజ్‌పై రైతు సంఘాల నేతల ఆగ్రహం
- రైతులు ఆందోళన కొనసాగిస్తున్న ప్రాంతానికి రావాలని డిమాండ్



దిల్జిత్ దొసాంజ్‌ను ఆశీర్వదిస్తున్న ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: ప్రముఖ పంజాబీ గాయకుడు, నటుడు దిల్జిత్ దొసాంజ్ నూతన సంవత్సరం సందర్భంగా ప్రధాని మోదీని కలుసుకోవడం వివాదమైంది. బుధవారం వారిద్దరి మధ్య భేటీ జరిగింది. మోదీని దిల్జిత్ కలుసుకోవడం ఇదే మొదటిసారి. బహుముఖ ప్రజ్ఞాశాలి అంటూ దిల్జిత్‌ను మోదీ ప్రశంసించారు. కొత్త సంవత్సరం అద్భుతంగా ప్రారంభమైందంటూ దిల్జిత్ పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి. దిల్జిత్‌పై రైతు సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం పంజాబ్‌లో నెలల తరబడి ఆందోళన కొనసాగిస్తున్న రైతులను పట్టించుకోకుండా ప్రధానిని కలవడం ఏమిటని మండిపడ్డారు. రైతులు ఆందోళన కొనసాగిస్తున్న ప్రాంతానికి దిల్జిత్ రావాలని, వారికి అండగా నిలవాలని డిమాండ్ చేశారు. అన్నదాతల సంక్షేమం కోసం నిరాహార దీక్ష సాగిస్తున్న రైతు సంఘం నాయకుడు జగ్జీత్‌సింగ్ దలేవాల్‌ను పరామర్శించాలని అన్నారు. మోదీని దిల్జిత్ కలవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయని చెప్పారు. రైతుల ఉద్యమానికి దిల్జిత్ గతంలో మద్దతు ప్రకటించారు. 2020 సింఘు సరిహద్దు వద్ద జరిగిన ఆందోళన కార్యక్రమంలో స్వయంగా పాల్గొన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వాన్ని అప్పట్లో కోరారు. మరోవైపు దలేవాల్ నిరాహార దీక్ష బుధవారం 38వ రోజుకు చేరుకుంది. ఆయన ఆరోగ్యం నానాటికీ క్షీణిస్తోంది.

చిన్మయ్ కృష్ణదాస్‌కు దక్కని ఊరట

బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించిన బంగ్లాదేశ్ కోర్టు

ఢాకా: బంగ్లాదేశ్‌లో దేశద్రోహం కేసులో అరెస్టయిన హిందూ గురువు, ఇస్కాన్ మాజీ ప్రతినిధి చిన్మయ్ కృష్ణదాస్‌కు ఊరట లభించలేదు. ఈ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై చట్టోగ్రామ్ కోర్టు తిరస్కరించింది. ఇప్పుడు బెయిల్ ఇవ్వలేమని తేల్చిచెప్పింది. గురువారం కోర్టులో జరిగిన విచారణకు కృష్ణదాస్ వర్చువల్‌గా హాజరయ్యారు. ఆయన తరఫున 11 మంది లాయర్లు వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తు దశలో ఉందని, బెయిల్ ఇవ్వొద్దని ప్రభుత్వం తరఫు లాయర్ కోరారు. దీంతో బెయిల్ పిటిషన్‌ను తిరస్కరిస్తూ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు జడ్జి మొహమ్మద్ సైఫుల్ ఇస్లామ్ నిర్ణయం తీసుకున్నారు. కృష్ణదాస్‌ను గత ఏడాది నవంబర్ 25న ఢాకాలోని హజ్రత్ షాజాలాల్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టులో బంగ్లాదేశ్ పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. బంగ్లాదేశ్ జాతీయ జెండాను అపవిత్రం చేశారన్న ఆరోపణలతో ఆయనపై దేశద్రోహం కేసు నమోదు చేశారు.

సుప్రీంకోర్టుపైనే దుష్ప్రచారమా?

దలేవాల్ దీక్షను భగ్నం చేయమనడం లేదు

- ఆసుపత్రికి తరలించి, చికిత్స అందించాలని చెబుతున్నాం
- పంజాబ్ ప్రభుత్వ అధికారుల తీరుపై న్యాయస్థానం ఆగ్రహం

న్యూఢిల్లీ: నిరాహార దీక్ష కొనసాగిస్తున్న పంజాబ్ రైతు సంఘం నాయకుడు జగ్జీత్‌సింగ్ దలేవాల్ ఆరోగ్య పరిస్థితిపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఆయనను ఆసుపత్రికి తరలించి, చికిత్స అందించడానికి ఎలాంటి ఏర్పాట్లు చేయడం లేదని పంజాబ్ ప్రభుత్వంపై మండిపడింది. పైగా సుప్రీంకోర్టు వల్లే దలేవాల్ దీక్ష కొనసాగిస్తున్నారంటూ పంజాబ్ ప్రభుత్వ అధికారులు, కొందరు రైతు సంఘాల నాయకులు మీడియాలో తప్పుడు ప్రచారానికి పూనుకుంటున్నారని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేసింది. దలేవాల్ దీక్షను భగ్నం చేయాలని తాము చెప్పడం లేదని, ఆయనను ఆసుపత్రికి తరలించి, చికిత్స అందించాలని మాత్రమే సూచిస్తున్నామని వెల్లడించింది. దలేవాల్ గత ఏడాది నవంబర్ 26న దీక్ష ప్రారంభించారు. గురువారం నాటికి 38వ రోజుకు చేరుకుంది. ఆయనకు వైద్య చికిత్స అందించాలని సుప్రీంకోర్టు ఇంతకుముందు ఇచ్చిన ఆదేశాలను పంజాబ్ ప్రభుత్వ అధికారులు లెక్కచేయడం లేదని ఆరోపిస్తూ దాఖలైన పిటిషన్‌పై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. అలాగే రైతుల ఉద్యమంలో కోర్టు జోక్యం చేసుకోవాలని, కేంద్రానికి తగిన ఆదేశాలు జారీ చేయాలని కోరుతూ దలేవాల్ దాఖలు చేసిన తాజా పిటిషన్‌నూ విచారించింది. ''పంజాబ్ ప్రభుత్వ అధికారులు, కొందరు రైతు సంఘాల నేతలు మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు కనిపిస్తోంది. దలేవాల్ దీక్షను భగ్నం చేయడానికి సుప్రీంకోర్టు ప్రయత్నిస్తోందని, అందుకు ఆయన ఒప్పుకోవడం లేదన్న అభిప్రాయాన్ని ప్రజల్లో కల్పిస్తున్నారు. బాధ్యతారాహిత్యంగా ప్రకటనలు చేస్తున్నారు. దలేవాల్ పట్ల రైతు సంఘాల నాయకుల వ్యవహారాల శైలి పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆయన దీక్షను భగ్నం చేయాలని పంజాబ్ ప్రభుత్వాన్ని మేము ఏనాడూ ఆదేశించలేదు. దలేవాల్ ప్రాణాలకు ముప్పు వాటిల్లకుండా ఆసుపత్రి తరించాలని మాత్రమే చెబుతున్నాం. ఆసుపత్రిలో ఆయన దీక్ష కొనసాగించుకోవచ్చు. దలేవాల్ ఆరోగ్యంపై మేము ఆందోళన చెందుతున్నాం. ఆయన రాజకీయ సిద్ధాంతాలకు సంబంధం లేదని నాయకుడు. కేవలం రైతుల సంక్షేమం కోసం పని చేస్తున్నారు. రైతు నాయకుడిగా దలేవాల్ ప్రాణం ఎంతో విలువైంది. ఆసుపత్రిలో చికిత్స పొందేలా దలేవాల్‌ను ఒప్పించడానికి పంజాబ్ ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నాలు చేయలేదు. మంత్రులు గానీ, అధికారులు గానీ ఒక్కసారైనా దీక్షా శిబిరానికి వెళ్లారా? రైతు సంఘాలతో సఖ్యత కుదుర్చుకోవాలన్న ఉద్దేశం ప్రభుత్వానికి ఉన్నట్లు కనిపించడం లేదు'' అని ధర్మాసనం తీవ్రస్థాయిలో విరుచుకుపడింది. తదుపరి విచారణను ఈ నెల 6వ తేదీకి వాయిదా వేసింది.

సాక్షి హైదరాబాద్

శుక్రవారం । 3 । జనవరి । 2025



మేం ఆర్మీ వాళ్లం.. బెండ విత్తులు కావాలి

నగరం కేంద్రంగా విత్తనాలు, పురుగు మందుల వ్యాపారం చేసే వ్యక్తిని టార్గెట్ చేసిన సైబర్ నేరగాళ్లు రూ.2.64 లక్షలు కాజేశారు. -8లో



అక్షర జ్ఞాపకం..

కొంగొత్త ఆశల వేదిక కొత్త ఏడాది.. నూతన సంవత్సరం నేపథ్యంలో ఆనాటి మధుర జ్ఞాపకమైన 'డైరీ' గురించి ఓసారి మననం చేసుకుందాం. - సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
29.0/15.0

వాతావరణం

నగరంలో శుక్రవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం వేళ పొగమంచు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. గరిష్టంగా 29, కనిష్టంగా 15 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.



ఉద్యానంలో ఉల్లాసంగా..

ఉద్యాన్ ఉత్సవ్ గురువారం ఉత్సాహంగా ప్రారంభమైంది. బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో 12 రోజుల పాటు ఇది కొనసాగనుంది. ఇక్కడ మొత్తం 50 స్టాళ్లను ఏర్పాటు చేశారు. ఉద్యాన ప్రియులు వందలాదిగా తరలివచ్చారు. ఒడిశా, మహారాష్ట్ర, తెలంగాణ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన జానపద, ఆదివాసీ కళాకారుల నృత్యాలు సందర్శకులను అమితంగా అలరించాయి. మహా భారతంలోని రాయబార ఘట్టం ఎంతగానో ఆకట్టుకుంది.









అంబేడ్కర్ వర్సిటీ కేలండర్, డైరీ ఆవిష్కరణ



కేలండర్ ఆవిష్కరిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, వీసీ ఘంటా చక్రపాణి

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయ నూతన సంవత్సర డైరీ, కేలండర్‌లను గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వీసీ ఆచార్య ఘంటా చక్రపాణి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ యూనివర్సిటీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై వారు చర్చించారు.

ఈదులకుంట ఎక్కడ?

ఖానామెట్‌లో హైడ్రా సర్వే

సాక్షి, సిటీబ్యూరో: శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లోని ఈదులకుంట ఆనవాళ్లు గుర్తించడంపై హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా గురువారం ఆ ప్రాంతానికి వెళ్లిన అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. సర్వే ఆఫ్ ఇండియా సిబ్బంది సైతం దీనికి సహకరిస్తున్నారు. ఖానామెట్–కూకట్‌పల్లి సరిహద్దులో ఉండాల్సిన ఈ చెరువు మాయమైందంటూ స్థానికులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీనికి ముందే నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్‌ఆర్‌ఎస్‌సీ) నుంచి సేకరించిన హై రిజల్యూషన్ మ్యాప్స్ ఆధారంగా చెరువు ఆనవాళ్లను హైడ్రా గుర్తించింది. నెల రోజుల క్రితం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్ర స్థాయిలోనూ పర్యటించి ఆక్రమణల తీరును పరిశీలించారు. ఓ రియల్ ఎస్టేట్ సంస్థ ఆ స్థలం తమదంటూ చెబుతున్న వారితో పాటు ఫిర్యాదు చేసిన స్థానికులను హైడ్రా కార్యాలయానికి పిలిపించిన ఉన్నతాధికారులు పూర్వాపరాలు వివరించారు. ఈదులకుంట కబ్జాపై తీసుకోవాల్సిన చర్యలు సంబంధించి త్వరలో నిర్ణయం తీసుకోనున్నారు.

వడివడిగా గ్రీన్‌ఫీల్డ్

ఔటర్ టు ఆకుతోటపల్లి

రెవెన్యూ శాఖ నోటిఫికేషన్ జారీ

- తొలి విడతలో 20 కి.మీ.. 449 ఎకరాలు
- రెండో విడతలో 21.5 కి.మీ. 554.35 ఎకరాలు.. 330 అడుగుల రహదారి
- భూ సేకరణ కోసం రెండు విడతల్లో నోటిఫికేషన్లు
- ఈ రహదారి నిర్మాణానికి రూ.2 వేల కోట్ల మంజూరుకు ఆర్థిక శాఖ పచ్చజెండా

ఫేజ్-1లో భూ సేకరణ

మండలం	గ్రామం	రైతులు	భూమి (ఎకరాల్లో)
ఇబ్రహీంపట్నం	ఫిరోజ్‌గూడ	84	1.03
ఇబ్రహీంపట్నం	కొంగరకలాన్	361	55.05
మహేశ్వరం	కొంగరకుర్దు	278	53.20
కందుకూరు	లేమూరు	497	84.28
కందుకూరు	తిమ్మాపూర్	290	47.02
కందుకూరు	రాచలూరు	351	87.22
కందుకూరు	గుమ్మడవెల్లి	(రిజర్వ్‌డ్ ఫారెస్ట్)	32.11
కందుకూరు	పంజాగూడ	(టీఎస్ఐఐసీ)	18.33
కందుకూరు	మీర్‌ఖాన్‌పేట	48	62.08

ఫేజ్-2లో భూ సేకరణ

మండలం	గ్రామం	రైతులు	భూమి (ఎకరాల్లో)
ఆమనగల్	ఆమనగల్	331	68.35
ఆమనగల్	ఆకుతోటపల్లి	229	83.35
యాచారం	కుర్మిద్ద	529	144.75
కడ్తాల్	కడ్తాల్	440	72.67
కడ్తాల్	ముద్విన్	1287	184.76



కొంగరకుర్దులో సర్వే చేస్తున్న అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఔటర్ నుంచి మీర్‌ఖాన్‌పేట మీదుగా ఆకుతోటపల్లి వరకు నిర్మించతలపెట్టిన ఎలివేటెడ్ గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు పనులకు భూసేకరణ వడివడిగా సాగుతోంది. ఇటు ఔటర్ నుంచి అటు ఆర్ఆర్ఆర్ వరకు ఎలాంటి మూల మలుపులకు ఆస్కారం లేకుండా 330 అడుగుల విస్తీర్ణంలో నేరుగా విశాలమైన రోడ్డును నిర్మించే పనులను వేగవంతం చేసింది. రావిర్యాల ఎగ్జిట్ 13 నుంచి ఆర్ఆర్ఆర్ వరకు సుమారు 41.5 కిలోమీటర్ల పరిధిలోని ఈ రోడ్డు పనులను రెండు విడతల్లో చేపట్టనుంది. భూసేకరణ కోసం ఇప్పటికే రెండు వేర్వేరు నోటిఫికేషన్లు జారీ చేసింది. రోడ్డు నిర్మాణ పనుల కోసం రూ.2 వేల కోట్ల మంజూరు ఆర్థికశాఖ అనుమతి ఇచ్చినట్లు తెలుస్తోంది.

ఆరు మండలాలు..14 గ్రామాలు..

మొదటి విడత (ఫేజ్–1)లో ఇబ్రహీంపట్నం, మహేశ్వరం, కందుకూరు మండలాల పరిధిలో తొమ్మిది గ్రామాల మీదుగా 20 కిలోమీటర్ల దూరం చేపట్టనున్న రోడ్డుకు 449.27 ఎకరాల సేకరణకు నోటిఫికేషన్ సహా మార్కింగ్ ప్రక్రియను కూడా పూర్తి చేసింది. రెండో విడత (ఫేజ్ -2)లో యాచారం, కడ్తాల్, ఆమనగల్ మండలాల పరిధిలోని అయిదు గ్రామాల పరిధిలో 21.5 కిలోమీటర్లు చేపట్టనుంది. ఈ రోడ్డు కోసం 554.35 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 4,725 మంది రైతుల నుంచి 1004.22 ఎకరాలు సేకరించనున్నట్లు పేర్కొంది. ఆయా సర్వే నంబర్లలో భూ క్రయ విక్రయాలు, అభివృద్ధి పనులను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ భూసేకరణపై అభ్యంతరాలు ఉంటే 60 రోజుల్లో లిఖితపూర్వకంగా జిల్లా కలెక్టర్‌కు తెలియజేయాల్సిందిగా సూచించింది. దీనిలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు భూసేకరణ చట్టం ప్రకారం పారదర్శకంగా, హేతుబద్ధమైన పరిహారం చెల్లించనున్నట్లు పేర్కొంది.

రెండువైపులా ల్యాండ్ పూలింగ్

ఎలివేటెడ్ కారిడార్ వెంట మెట్రోలైన్ విస్తరణ పనులు చేపట్టడంతో పాటు రోడ్డుకు రెండు వైపులా 60: 40 నిష్పత్తిలో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో ల్యాండ్ పూలింగ్ చేపట్టాలనే ప్రతిపాదనను సైతం తెరపైకి తీసుకొస్తోంది. ఎత్తయిన భవనాలు, వ్యాపార, వాణిజ్య సముదాయాలతో పాటు గేటెడ్ కమ్యూనిటీలు, విల్లా ప్రాజెక్టులను పెద్ద ఎత్తున తీసుకురావాలని యోచిస్తోంది. చేపట్టే నిర్మాణాలన్నీ ఏకరూపంగా ఉండేలా ప్లాన్ చేస్తోంది. రోడ్డుకు రెండు వైపులా అందమైన, ఎత్తయిన చెట్లను నాటించడం ద్వారా అహ్లాదకరమైన వాతావరణం ఉండేలా చూడనుంది. నెట్‌జీరో సిటీగా ఆవిష్కరించనుంది. అంతేకాదు ఇందుకు భూములు ఇచ్చిన రైతులు కూడా లబ్ధి పొందే అవకాశం ఉంది.

ఉత్తరం వైపు ఊరట!

నార్త్ సిటీకి డబుల్ డెక్కర్ మెట్రో

- ఇప్పటికే ఎలివేటెడ్ కారిడార్‌లకు హెచ్ఎండీఏ కార్యాచరణ
- ప్యారడైజ్ నుంచి డెయిరీఫాం వరకు ప్రణాళికలు
- తగ్గనున్న భూసేకరణ భారం
- ఉత్తరం నుంచి అన్ని వైపులకు కనెక్టివిటీ
- లక్షలాది మందికి భారీ ఉపశమనం

సాక్షి, సిటీబ్యూరో: నార్త్‌సిటీ వైపు డబుల్‌డెక్కర్ మెట్రో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ప్యారడైజ్ నుంచి డెయిరీఫామ్ వరకు డబుల్ డెక్కర్‌కు గతంలోనే ప్రతిపాదించారు. అప్పట్లో మెట్రోపై స్పష్టత లేకపోవడంతో వాయిదా పడింది. మేడ్చల్ వరకు తాజాగా మెట్రో రైలుకు ప్రభుత్వం పచ్చజెండా ఊపిన దృష్ట్యా డబుల్‌డెక్కర్ పద్ధతిలో చేపట్టనున్నారు. ప్యారడైజ్ నుంచి డెయిరీఫామ్‌కు, ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ ఓఆర్ఆర్ వరకు ఎలివేటెడ్ కారిడార్‌లకు హెచ్ఎండీఏ కార్యాచరణ చేపట్టింది. ఈ కారిడార్‌లపైనే మెట్రో లైన్‌లు నిర్మిస్తే తక్కువ వ్యయంతో రోడ్డు, రైలు మార్గాలు అందుబాటులోకి రానున్నాయి. మూడు నెలల్లో మెట్రో కారిడార్‌లకు డీపీఆర్ సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశించిన దృష్ట్యా హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైల్ లిమిటెడ్ డబుల్‌డెక్కర్ మెట్రోపై దృష్టి సారించినట్లు సమాచారం. దీనివల్ల మెట్రో నిర్మాణ భారం కూడా తగ్గనుంది. రెండో దశలో 74.6 కిలోమీటర్లకు సుమారు రూ.24,000 కోట్లతో అంచనాలు రూపొందించారు. ఇప్పుడు రెండో దశ 'బి' కింద డబుల్‌డెక్కర్ పద్ధతితో 45 కిలోమీటర్ల నార్త్‌సిటీ కారిడార్‌లకు భూసేకరణ, పిల్లర్ల వ్యయం తగ్గనుంది. దీంతో సుమారు రూ.8,000 కోట్లతో మెట్రో అందుబాటులోకి రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

డెయిరీఫామ్ నుంచి..

ప్యారడైజ్ నుంచి మేడ్చల్ 23 కిలోమీటర్‌లు, జేబీఎస్ నుంచి శామీర్ పేట్ వరకు 22 కిలోమీటర్ల మార్గంలో మెట్రో కారిడార్లను నిర్మించనున్నారు. మేడ్చల్ రూట్‌లో తాడ్‌బండ్, బోయిన్‌పల్లి, సుచిత్ర సర్కిల్, కొంపల్లి, గుండ్లపోచంపల్లి, కండ్లకోయ, ఓఆర్ఆర్ ఎగ్జిట్ వరకు మెట్రో రానుంది. ఇదే మార్గంలో డెయిరీఫామ్ వరకు 5.32 కిలోమీటర్లు ఎలివేటెడ్ కారిడార్ రానుంది. అక్కడి వరకు డబుల్ డెక్కర్ పద్ధతిలో రోడ్డు, మెట్రో నిర్మిస్తే డెయిరీ ఫామ్ నుంచి మరో 17.68 కిలోమీటర్లు భూమిపైనే ఎలివేటెడ్ మెట్రో నిర్మాణం చేపట్టే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం డెయిరీఫామ్ వరకు 55 ఎకరాలకుపైగా భూసేకరణకు హెచ్ఎండీఏ చర్యలు చేపట్టింది. ఇది మినహాయిస్తే.. సుచిత్ర, కొంపల్లి నుంచి మేడ్చల్ ఓఆర్ఆర్ వరకు మెట్రో కోసం ప్రత్యేకంగా కారిడార్‌ను నిర్మించాల్సి ఉంటుంది. రోడ్డు మార్గంలో పెద్దగా భూసేకరణ అవసరం లేకుండానే పిల్లర్లపై వయాడక్ట్‌లు వేయవచ్చని అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం రెండో దశ మెట్రోకు కిలోమీటర్‌లకు సుమారు రూ.310 కోట్లకు పైగా ఖర్చు అయ్యే అవకాశం ఉంది. భూసేకరణ భారం తగ్గడం వల్ల ఈ రూట్‌లో ఖర్చు తగ్గనుంది.

జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ ఓఆర్ఆర్ వరకు..

మెట్రో రెండో దశలో 'బి' విభాగం కింద చేపట్టనున్న నార్త్‌సిటీ కారిడార్‌లలో జేబీఎస్ నుంచి శామీర్‌పేట్ ఓఆర్ఆర్ వరకు 22 కిలోమీటర్ల మరో మార్గం కూడా ఎంతో కీలకమైంది. ఇప్పుడున్న జేబీఎస్ మెట్రో స్టేషన్ నుంచి విక్రంపురి, కార్ఖానా, తిరుమలగిరి, లోతుకుంట, అల్వాల్, బొల్లారం, హకీంపేట్, తూముకుంట, ఓఆర్ఆర్ ఎగ్జిట్ మీదుగా శామీర్ పేట్ వరకు నిర్మించనున్నారు. ఇదే మార్గంలో ప్యారడైజ్ నుంచి ఓఆర్ఆర్ వరకు 18.124 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మించేందుకు హెచ్ఎండీఏ చర్యలు చేపట్టింది. ఈ రూట్‌లో 163.33 ఎకరాల భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోంది. దీంతో మెట్రోరైల్ కోసం మరోసారి భూసేకరణ అవసరం లేకుండా ఇంచుమించు 18 కిలోమీటర్ల వరకు డబుల్ డెక్కర్ నిర్మాణం చేపట్టవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. మిగతా రూట్‌లో ఎలివేటెడ్ పద్ధతిని అనుసరించవచ్చు. ప్రస్తుతం ఈ రెండు రూట్లలో భూసేకరణకు సుమారు రూ.2000 కోట్ల వరకు భూసేకరణ కోసం పరిహారం చెల్లించవలసి ఉంటుందని హెచ్ఎండీఏ అంచనా వేసింది. మేడ్చల్ వైపు మినహాయించి శామీర్‌పేట్ వైపు మెట్రో కోసం పెద్దగా భూసేకరణ అవసరం ఉండదు. అంటే రెండు రకాల నిర్మాణాల కోసం ఒకేసారి భూసేకరణ చేపట్టినట్లవుతుంది. అలాగే పిల్లర్ల నిర్మాణ వ్యయం సహా ఇతర ఖర్చులను హెచ్ఎండీఏ, హెచ్ఏఎంఆర్ఎల్ సమంగా చెల్లించడం వల్ల ఖర్చు తగ్గనుంది.



ప్రయాణికులకు ఎంతో మేలు..

- ఈ రెండు కారిడార్‌లలో రోడ్డు, మెట్రో సదుపాయాలు వినియోగంలోకి వస్తే శామీర్‌పేట్, మేడ్చల్ ప్రాంతాల నుంచి నగరంలోని అన్ని వైపులకు మెట్రో కనెక్టివిటీ ఏర్పడుతుంది. ప్రయాణికులు నేరుగా ఎయిర్‌పోర్టు వరకు రాకపోకలు సాగించవచ్చు. ఐటీ వర్గాలు నార్త్‌లో ఏ ప్రాంతం నుంచైనా ఐటీ సంస్థలకు చేరుకోవచ్చు.
- రెండో దశ వల్ల 2028 నాటికి మెట్రో ప్రయాణికులు 8 లక్షలు దాటవచ్చని ఇప్పటికే అంచనా వేశారు. కొత్తగా నార్త్‌సిటీకి కూడా మెట్రో అందుబాటులోకి వస్తే సుమారు 12 లక్షల మందికి చేరే అవకాశం ఉంది.

మల్లన్నసాగర్ నుంచే గోదావరి రెండో దశ?

రెండు పైపులైన్ల ద్వారా 20 టీఎంసీల నీటి తరలింపు

- పెరిగిన ప్రాజెక్టు అంచనా వ్యయం
- ప్రభుత్వానికి సిఫార్సు చేసిన వ్యాప్కోస్ సంస్థ

సాక్షి, సిటీబ్యూరో: మహా నగర తాగునీటి అవసరాల కోసం గోదావరి రెండో దశ ప్రాజెక్టును మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచే ప్రభుత్వం చేపట్టనుంది. సుమారు రూ.7,300 కోట్ల అంచనా వ్యయంతో రెండు పైపులైన్ల ద్వారా 20 టీఎంసీల నీటి తరలింపుపై శుక్రవారం సీఎం అధ్యక్షతన జరిగే జలమండలి పాలకమండలి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి. గతేడాది ఆగస్టులోనే గోదావరి రెండో దశను మల్లన్న సాగర్ నుంచి చేపట్టేందుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ.. కొండపోచమ్మ కాదని మల్లన్నసాగర్ నుంచి జలాల తరలింపుపై ప్రతిపక్ష బీఆర్ఎస్ అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో రెండింటి నుంచి జలాల తరలింపు సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. దీంతో వ్యాప్కోస్ సంస్థ కొండపోచమ్మ, మల్లన్న సాగర్ ప్రాజెక్టుల నీటి లభ్యత, తరలింపు వ్యయం తదితర అంశాలపై సమగ్ర సర్వే చేసి తాజాగా నివేదిక సమర్పించింది. అందులో గోదావరి రెండో దశను మల్లన్న సాగర్ నుంచే చేపట్టడమే సబబు అని సిఫార్సు చేసింది.

ఇదీ పరిస్థితి...

గోదావరి జలాల్లో హైదరాబాద్ నగర తాగునీటి అవసరాలకు 30 టీఎంసీల నీటి కేటాయింపులుండగా, ప్రస్తుతం గోదావరి మొదటి దశ కింద శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి 10 టీఎంసీల నీటిని తరలిస్తున్నారు. మరో 20 టీఎంసీలు తరలించేందుకు వెసులుబాటు ఉంది. మహా నగరానికి రోజురోజుకూ తాగునీటి అవసరాలు పెరుగుతుండడంతో పాటు నాగార్జునసాగర్, ఎల్లంపల్లి, సింగూర్, మంజీరా, ఉస్మాన్ సాగర్, హిమాయత్‌సాగర్ జలాశయాల నుంచి సుమారు 555 ఎంజీడీల నీరు సరఫరా చేస్తున్నా.. సరిపడని పరిస్థితి నెలకొంది. దీంతో గోదావరి రెండో దశను చేపట్టేందుకు జలమండలి సిద్ధమైంది.

తెరపైకి మల్లన్న సాగర్..

తాజాగా కాళేశ్వరం ఎత్తిపోతలలో భాగంగా నిర్మించిన మల్లన్నసాగర్ రిజర్వాయర్ తెరపైకి వచ్చింది. అయిదేళ్ల క్రితం కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో రెండో అతిపెద్ద జలాశయమైన కొండపోచమ్మ సాగర్ నుంచి హైదరాబాద్ మహా నగరానికి నీటి తరలింపు కోసం ప్రణాళిక సిద్ధమైనా.. భూ సేకరణ వివాదాలతో ముందుకు సాగలేదు. మరోవైపు కొండ పోచమ్మ రిజర్వాయర్ నిల్వ సామర్థ్యం కూడా 15 టీఎంసీల మాత్రమే ఉండటంతో, 50 టీఎంసీల సామర్థ్యమున్న మల్లన్న సాగర్‌పై జలమండలి దృష్టి సారించింది. నగరానికి సమీపంలోని మల్లన్నసాగర్ నుంచి గోదావరి జలాలను శామీర్‌పేట ఘన్‌పూర్ మీదుగా హైదరాబాద్‌కు తరలించే విధంగా ప్రతిపాదనలను సిద్ధం చేసి జలమండలి ప్రభుత్వానికి సమర్పించింది. గతేడాదిలో రాష్ట్ర మంత్రి వర్గం కూడా మల్లన్న సాగర్ నుంచి గోదావరి జలాల తాగునీటి సరఫరా పథకం–2కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది.



నేడు జలమండలి పాలక మండలి సమావేశం

పుష్కర కాలం తర్వాత జలమండలి పాలక మండలి సమావేశం శుక్రవారం జరగనుంది. సమావేశంలో గోదావరి నీటి సరఫరా పథకం రెండో దశపై నిర్ణయం, సుమారు రూ.301 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న జోన్-2 సమగ్ర మురుగునీటి మాస్టర్ ప్లాన్ ప్రాజెక్టు, 39 అమృత్ ఎస్టీపీలు, జంట జలాశయాలపై నాలుగు ఎస్టీపీల నిర్మాణాలు తదితర అంశాలు చర్చించి ఆమోదించే అవకాశాలు కనిపిస్తున్నాయి. పాలకమండలి చైర్మన్, సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో ఎక్స్- అఫీషియో డైరెక్టర్లు మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రటరీ, తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ చైర్మన్, ప్రభుత్వ ఆర్థిక కార్యదర్శి, జీహెచ్ఎంసీ కమిషనర్, డైరెక్టర్లు జలమండలి మేనేజింగ్ డైరెక్టర్, డైరెక్టర్ (టెక్నికల్), డైరెక్టర్ (ఫైనాన్స్)లు పాల్గొననున్నారు.

పెరిగిన ప్రాజెక్టు అంచనా వ్యయం

గోదావరి రెండో దశ ప్రాజెక్టు అంచనా వ్యయం పెరిగినట్లయింది. తొలుత దాదాపు 15 టీఎంసీల నీటి తరలింపు కోసం సుమారు రూ.5,560 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టుకు సమగ్ర నివేదిక రూపకల్పన జరగ్గా.. తాజాగా సుమారు 7,300 కోట్ల అంచనా వ్యయంతో రెండు పైపులైన్ల ద్వారా 20 టీఎంసీల ద్వారా తరలించేలా వ్యాప్కోస్ సంస్థ డీపీఆర్ సిద్ధం చేసి ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. పాలక మండలిలో గ్రీన్ సిగ్నల్ లభిస్తే రెండేళ్లలో పూర్తి చేసే అవకాశాలు ఉన్నాయి.

ఖాదీ, గ్రామీణ పరిశ్రమల విస్తరణతో ఆర్థిక స్వావలంబన


వెంగళరావునగర్: ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో న్యూ ఖాదీ ఆఫ్ న్యూ ఇండియా కొత్త నమూనాను ఏర్పాటు చేస్తున్నట్టు ఖాదీ, గ్రామీణ పరిశ్రమల శాఖ చైర్మన్ మనోజ్ కుమార్ తెలిపారు. యూసుఫ్‌గూడలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ (నిమ్స్‌మే) కేంద్ర శిక్షణ సంస్థ ప్రాంగణంలో గురువారం కేవీఐఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఖాదీ మహోత్సవంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖ మార్గదర్శకంలో కొత్త నమూనాతో పాటు వోకల్ ఫర్ లోకల్, ఆత్మనిర్భర్ భారత్ ప్రచారాన్ని ప్రోత్సహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఖాదీ, గ్రామీణ పరిశ్రమలు దేశ వ్యాప్తంగా విస్తరిస్తున్నాయని, మహిళల ఆర్థిక స్వావలంబన కోసం, నిరుపేదల గృహాల్లో వెలుగులు నింపేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నిరంతరం శ్రమిస్తున్నారని చెప్పారు. ఇందులో భాగంగానే గ్రామోద్యోగ్ వికాస్ యోజన పథకం కింద నిరుద్యోగులకు వీల్ పాటరీ, సెల్‌ఫోన్ రిపేర్ తదితరాలపై ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. గత నాలుగేళ్లలో తెలంగాణలో 2,370 మందికి శిక్షణ ఇచ్చామన్నారు. శిక్షణ పొందిన వారు ఆయా సర్టిఫికెట్ల ద్వారా బ్యాంకు రుణాలతో వ్యాపారాలు చేసి ఉన్నతస్థితికి ఎదగాలని ఆయన సూచించారు. తొలుత శిక్షణ పూర్తి చేసుకున్న వారు తయారు చేసిన వస్తువులను ఆయన పరిశీలించి అనంతరం వారికి సర్టిఫికెట్లు, కిట్స్ పంపిణీ చేశారు. నిమ్స్‌మే డైరెక్టర్ జనరల్ గ్లోరీ స్వరూప పాల్గొన్నారు.



శిక్షణ సర్టిఫికెట్లు అందజేస్తున్న మనోజ్ కుమార్

మేం ఆర్మీ వాళ్లం.. బెండ విత్తులు కావాలి!

- నగర వ్యాపారికి ఎర వేసిన సైబర్ నేరగాళ్లు
- రీఫండ్ చేస్తామంటూ రూ.2.64 లక్షలు స్వాహా
- మరో కేసులో డాక్టర్ పేరుతో రూ.4.97 లక్షలు



సాక్షి, సిటీబ్యూరో: నగరం కేంద్రంగా విత్తనాలు, పురుగు మందుల వ్యాపారం చేసే వ్యక్తిని టార్గెట్ చేసిన సైబర్ నేరగాళ్లు రూ.2.64 లక్షలు కాజేశారు. దీనికోసం ఆ కేటుగాళ్లు తాము ఆర్మీ అధికారులమని, తమకు బెండ విత్తనాలు కావాలని మాయమాటలు చెప్పారు. బాధితుడి ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఆన్‌లైన్ ద్వారా వ్యాపారి ఫోన్ నెంబర్ సంగ్రహించిన సైబర్ నేరగాడు వాట్సాప్ ద్వారా ఫోన్ చేశాడు. తాను నగరంలో పని చేస్తున్న ఆర్మీ జవాన్ అని, తన అధికారి ఆదేశాల మేరకు మాట్లాడుతున్నానని చెప్పాడు. ఆర్మీలో పని చేస్తున్న వారితో పాటు వారి కుటుంబీకులకు సరఫరా చేయడానికి తమ కార్యాలయానికి సంబంధించిన స్థలంలో పెద్ద ఎత్తున బెండ మొక్కలు నాటాలని నిర్ణయించినట్లు చెప్పాడు. తమపై పూర్తి నమ్మకం కలగడానికి వాట్సాప్ ద్వారా నకిలీ గుర్తింపు కార్డుల్నీ షేర్ చేశాడు. మార్కెట్‌లో బెండ విత్తనాలు కేజీ కనిష్ఠంగా రూ.420 నుంచి గరిష్ఠంగా రూ.3400 వరకు రేటు ఉన్నాయి. అయితే తాము మాత్రం ఏకంగా కేజీకి రూ.4400 చొప్పున 20 కేజీల ఖరీదు చేస్తామని చెప్పారు. ఎదుటి వాళ్లు ఆర్మీ అధికారులని నమ్మడంతో పాటు రేటు సైతం ఎక్కువ చెల్లిస్తామని అంటుండటంతో వ్యాపారి ఆసక్తి చూపారు. ఆన్‌లైన్‌లో నగదు పంపిస్తామని, విత్తనాలకు తాము చెప్పిన చోట డెలివరీ చేయాలని కేటుగాళ్లు అనడంతో వ్యాపారి అంగీకరించారు. బ్యాంకు ఖాతా వివరాలు ఖరారు చేసుకోవడానికి తొలుత రూ.5 పంపాల్సిందిగా నేరగాళ్లు వ్యాపారిని కోరారు. అతడు అలా చేయడంతో ఖాతా ఖరారైందని చెప్పిన కేటుగాళ్లు... నకిలీ పర్చేజ్ ఆర్డర్ కూడా పంపారు. ఆపై అసలు కథ మొదలెట్టిన సైబర్ నేరగాళ్లు తమ నిబంధనల ప్రకారం 20 కేజీల విత్తనాల విలువ రూ.88 వేలు తమకు బదిలీ చేయాలని, ఆపై తాము అంతే మొత్తం కలిపి రూ.1.76 లక్షలు పంపించాల్సి ఉంటుందని నమ్మబలికారు. దీంతో వ్యాపారి నేరగాళ్లు చెప్పిన ఖాతాకు రూ.88 వేలు ఆర్టీజీఎస్ చేశారు. ఈ మొత్తం అందుకున్న సైబర్ క్రిమినల్స్ మరింత మొత్తం కాజేయడానికి కొత్త కథ చెప్పారు. బ్యాంకు ఖాతా ఖరారు కోసం పంపిన రూ.5 మినహాయించకుండా మొత్తం రూ.88 వేలు చెల్లించడాన్ని కేటుగాళ్లు తప్పుపట్టారు. అలా చేయడం వల్ల పర్చేజ్ ఆర్డర్‌లో పేర్కొన్న మొత్తం కంటే ఎక్కువ తమ ఖాతాకు వచ్చినట్లు ఉందని, ఆడిటింగ్‌లో ఇది ఇబ్బందికరంగా మారుతుందని నమ్మబలికారు. ఈ నేపథ్యంలోనే ఆర్డర్ రద్దు కాకుండా ఉండాలంటే ఈసారి రూ.5 తక్కువతో రూ.1.76 లక్షలు బదిలీ చేయాలని, అది అందిన వెంటనే రూ.2.64 లక్షల్ని రీఫండ్ చేస్తామని అన్నారు. ఆపై విత్తనాల నిమిత్తం చెల్లించాల్సిన రూ.88 వేలు బదిలీ అవుతాయని నమ్మించారు. ఈ మాటల వల్లోపడిన వ్యాపారి రూ.1.76 లక్షలు పంపాడు. చివరకు తాను మోసపోయానని గుర్తించి సైబర్ క్రైమ్ ఠాణాను ఆశ్రయించాడు. మరోపక్క నగరానికి చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగికి ఒక డివోర్స్ మాట్రిమోనీ యాప్ ద్వారా సైబర్ నేరగాడు పరిచయం అయ్యాడు. భర్త నుంచి వేరుపడిన మహిళగా చాట్ చేసిన సైబర్ నేరగాడు తాను కార్డియాలజిస్ట్ అంటూ పరిచయం చేసుకున్నాడు. కొన్నాళ్ల చాటింగ్ తర్వాత పెళ్లి ప్రస్తావన తెచ్చి నమ్మించాడు. ఓ రోగికి చికిత్స నిమిత్తం అప్పుగా, తన తల్లికి అనారోగ్యం అంటూ దఫదఫాలుగా బాధితుడి నుంచి రూ.4.97 లక్షలు కాజేసి మోసం చేశారు. ఈ మేరకు మరో కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

గేమ్ ఛేంజర్ ట్రైలర్ రిలీజ్‌కు పటిష్ట బందోబస్తు



లాంజ్‌లో లిఫ్ట్ ద్వారా పార్కింగ్‌కు వెళుతున్న రాంచరణ్

గచ్చిబౌలి: హీరో రాంచరణ్ నటిస్తున్న గేమ్ ఛేంజర్ సినిమా ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌కు గచ్చిబౌలి పటిష్ట చర్యలు చేపట్టారు. సినీహీరో రాంచరణ్‌ను అభిమానుల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కొత్తగూడలోని శరత్‌సిటీ క్యాపిటల్ మాల్‌లో ఏఎంబీ (ఏషియన్ మహేష్ బాబు) సినిమాస్‌లో దాదాపు 2 గంటల పాటు బందోబస్తు నిర్వహించారు. గురువారం సాయంత్రం ఏఎంబీ మాల్‌లోని స్క్రీన్ నెంబర్ 1లో గేమ్ చేంజర్ ట్రైలర్ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. బి–1 నుంచి నేరుగా లిఫ్ట్‌లో 5వ ఫ్లోర్‌కు టికెట్ ఉన్న వారిని పంపించారు. అనంతరం రాంచరణ్‌తో పాటు నటుడు శ్రీకాంత్, దర్శకులు శంకర్, రాజమౌళి, ప్రొడ్యూసర్లు దిల్ రాజు, శిరీష్ తదితరులను లిఫ్ట్‌లో స్క్రీన్1లోకి పంపించారు.

సాయంత్రం రాంచరణ్, దర్శకులు, ప్రొడ్యూసర్లు 4వ ఫ్లోర్ నుంచి లిఫ్ట్ ద్వారా బి–1 పార్కింగ్‌లోకి పంపించారు. అక్కడి నుంచి కారులో బయటకు పంపారు. లాంజ్‌లో లిఫ్ట్ వద్ద ఫ్లోర్‌లో అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. అభిమానులు రాం అని పిలువగానే లిఫ్ట్ ఎక్కేందుకు వెళ్లిన రాంచరణ్ వెనక్కి వచ్చే ప్రయత్నం చేయగా పోలీసులు వారించి నేరుగా లిఫ్ట్ నుంచి పార్కింగ్ పార్కింగ్‌కు వెళ్లాలని సూచించగా వెళ్లిపోయారు. పార్కింగ్‌లోను అభిమానులు రాంచరణ్‌ను చూసేందుకు వేచి ఉన్నారు. వారిని కలువకుండా పోలీసులు చర్యలు తీసుకోవడంతో ట్రైలర్ రిలీజ్ ప్రశాంతంగా ముగిసినట్లయ్యింది. ఇన్‌స్పెక్టర్ హబీబుల్లాఖాన్, ఎస్ఐలు రాజశేఖర్‌రెడ్డి, శివపాల్‌రెడ్డి, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

డ్రగ్స్ రవాణాలో కొత్త పంథా

- రెండుసార్లు ముంబైలో నైజీరియన్ల చేతిలో మోసం
- ఆ అనుభవాలతో రాటుదేలిన డ్రగ్ పెడ్లర్ గోపాల్
- ప్రయాణికులకు నగదు చెల్లించి బస్సులో సిటీకి
- పరారీలో ఉన్న వారి కోసం టాస్క్‌ఫోర్స్ గాలింపు



నిందితుడు గోపాల్

సాక్షి, సిటీబ్యూరో: న్యూ ఇయర్ పార్టీలను టార్గెట్‌గా చేసుకుని... బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని తన అడ్డా కేంద్రంగా మాదకద్రవ్యాలైన కొకైన్, ఎండీఎంఏ విక్రయిస్తూ పశ్చిమ మండల టాస్క్‌ఫోర్స్ బృందానికి చిక్కిన జవార్ కిషన్ గోపాల్ ముంబైలో 'పెద్ద యుద్ధమే' చేశాడు. రెండుసార్లు నైజీరియన్ల చేతిలో మోసపోయిన ఇతగాడు మూడోసారి నుంచి డ్రగ్స్ చేజిక్కించుకోగలిగాడు. వీటిని నగరానికి రవాణా చేయడంలోనూ కొత్త పంథా అనుసరించినట్లు వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ గుర్తించింది.

బెట్టింగ్స్‌తో అప్పుల్లో మునిగి...

రాజేంద్రనగర్‌లోని సాయినగర్‌కు చెందిన గోపాల్ ప్లాస్టిక్ వ్యాపారి. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బెట్టింగ్స్‌కు బానిసగా మారి ఆర్థికంగా నష్టపోయాడు. అప్పుల నుంచి బయటపడటంతో పాటు జల్సాగా బతకడం కోసం డ్రగ్ పెడ్లర్‌గా మారాలని స్నేహితులు అనిల్, వరుణ్, ప్రమోద్ ఇచ్చిన సలహాలతో ఆ బాటపట్టాడు. ఇతడికి సోషల్‌మీడియా ద్వారా ముంబైలో నివసిస్తూ, డ్రగ్ సప్లయర్‌గా మారిన నైజీరియన్‌తో పరిచయమైంది. హైదరాబాద్‌లో విక్రయించడానికి తనకు మాదకద్రవ్యాలు కావాలని ఆ నైజీరియన్‌ను అడిగాడు. అతడు అంగీకరించడంతో కొన్ని నెలల క్రితం ముంబైకు వెళ్లాడు.

అక్కడ రెండుసార్లు దెబ్బతిని

తెలంగాణ పోలీసులు సైతం ఇలా డ్రగ్స్ కావాలంటూ డెకాయ్ ఆపరేషన్లు చేసి గోవా, ముంబైల్లో సప్లయర్స్‌ను పట్టుకుంటున్నారు. దీంతో తెలివిమీరిన నైజీరియన్లు నేరుగా పెడ్లర్స్‌ను కలవట్లేదు. నగదును నిర్ణీత ప్రదేశంలో పెట్టాలనో, కవర్‌లో ఉంచి చేత్తో పట్టుకుని ఫలానా చోట నిల్చోవాలనో చెప్తున్నారు. ఆపై తమ మనిషిని పంపి, తీసుకోవడం.. స్నాచ్ చేయడం ద్వారా నగదు చేజిక్కించుకుంటున్నారు. ఇది జరిగిన కొన్ని నిమిషాలను మరో నైజీరియన్ వచ్చి ఇదే పంథాలో డ్రగ్ ప్యాకెట్ అందిస్తున్నాడు. గోపాల్‌కు మాత్రం రెండు సందర్భాల్లో చేదు అనుభవం ఎదురైంది. డబ్బును స్నాచ్ చేసుకువెళ్లిన నైజీరియన్లు మాల్ మాత్రం ఇవ్వలేదు.

ఆపై 'అప్రమత్తంగా' వ్యవహరించి...

ఆ తర్వాత నుంచి సప్లయర్ల ఎంపిక విషయంలో 'అప్రమత్తంగా' ఉన్న గోపాల్ 'సరైన నైజీరియన్'ను పట్టాడు. అతడి నుంచి డ్రగ్స్ ఖరీదు చేయడం మొదలెట్టాడు. విమానంలో ముంబై వెళ్లివచ్చే ఇతగాడు సరుకు మాత్రం తనతో తీసుకురాడు. సప్లయర్ ద్వారానే మహారాష్ట్రకు చెందిన వ్యక్తిని మాట్లాడుకుని అతడితో కలిసి హైదరాబాద్ వచ్చే ప్రైవేట్ బస్సులు ఆగే ప్రాంతానికి వస్తాడు. తాను చాటుగా ఉండి... ముంబై వ్యక్తిని అక్కడి ప్రయాణికుడి వద్దకు పంపిస్తాడు. ఆ డ్రగ్ పార్శిల్‌ని వారికి ఇస్తూ అందులో ఖరీదైన వస్తువులు ఉన్నాయని, జాగ్రత్తగా హైదరాబాద్ వరకు తీసుకువెళ్లాలని చెప్తాడు. అక్కడి బస్టాప్‌కు వచ్చి తీసుకునే మా మనిషి రూ.పది వేలు చెల్లిస్తాడని చెప్పి అప్పగిస్తాడు.

'పేట'లో తీసుకుని 'హిల్స్'లో విక్రయం

అలా డ్రగ్ పార్శిల్‌ను ప్రయాణికుడికి ఇప్పించే గోపాల్ తాను మాత్రం విమానంలో తిరిగి వచ్చేవాడు. ఆ బస్సు అమీర్‌పేటకు చేరుకునే సమయానికి అక్కడకు వెళ్లే గోపాల్... ముంబై వ్యక్తి ఇచ్చిన ఫోన్ నెంబర్ ద్వారా ప్రయాణికుడిని సంప్రదిస్తాడు. అతడికి నగదు చెల్లించి పార్శిల్ తీసుకుని బంజారాహిల్స్‌లో ఉన్న తన అడ్డాలో దాచి విక్రయిస్తాడు. న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో ఇటీవల భారీగా మాల్ తీసుకువచ్చాడని వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఇ.జంగయ్యకు సమాచారం అందింది. ఆయన నేతృత్వంలో ఎస్సై జి.నవీన్‌తో కూడిన బృందం దాడి చేసి పట్టుకుని మాసబ్‌ట్యాంక్ పోలీసులకు అప్పగించింది. పరారీలో ఉన్న ఇతర నిందితులతో పాటు నైజీరియన్ల కోసం టాస్క్‌ఫోర్స్ గాలిస్తోంది.

కేలండర్ ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా నూతన సంవత్సరం కేలండర్‌ను హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీజీజీఓస్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు కేబీ కృష్ణ యాదవ్, ఉపాధ్యక్షులు డాక్టర్ సురేందర్, రాజేందర్, ఆర్. కోటజి, శ్రీరామ్, సునీత జోషి, నర్సింగ రావు, బి. కుమార్, శ్రవణ్ కుమార్ రెడ్డి, ఎం.డి గౌస్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ హైదరాబాద్ జిల్లా విభాగం రూపొందించిన టేబుల్, వాల్ కేలండర్ – 2025 గురువారం పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగిలి శ్రీపాల్ రెడ్డి ఆవిష్కరించారు. పీఆర్‌టీయూ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్ రెడ్డి, మాజీ శాసనమండలి సభ్యులు మోహన్ రెడ్డి, కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మహేందర్ రెడ్డి పాల్గొన్నారు.



డిజిటల్ అరెస్టు పేరుతో రూ.1.58 కోట్లు స్వాహా

- సత్వరమే స్పందించిన రాచకొండ పోలీసులు
- దీంతో బాధితురాలికి రూ.70 లక్షలు రీఫండ్

సాక్షి, సిటీబ్యూరో: డిజిటల్ అరెస్టు పేరుతో సైబర్ నేరస్తులు బాధితురాలిని భయభ్రాంతులకు గురి చేసి రూ.1.58 కోట్లు మోసం చేశారు. దీంతో ఆమె రాచకొండ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సత్వర స్పందించిన పోలీసులు నిందితులను పట్టుకోవడమే కాకుండా రూ.70 లక్షలు సొమ్మును బాధితురాలికి రీఫండ్ చేయగలిగారు. కేసు దర్యాప్తులో చాకచక్యంగా, వేగంగా స్పందించి, బాధితురాలికి న్యాయం చేసిన ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జానీ, అతని బృందాన్ని, డీసీపీ నాగలక్ష్మిలను రాచకొండ కమిషనర్ సుధీర్ బాబు అభినందించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డిసెంబర్ 8న ఉప్పల్ ప్రాంతానికి చెందిన గీతా ఉపాధ్యాయ (65)కు గుర్తు తెలియని నంబరు నుంచి వాట్సాప్ కాల్ వచ్చింది. తాను ముంబై సైబర్ క్రైమ్ అధికారి మోహిత్ శర్మగా పరిచయం చేసుకున్నాడు. బాధితురాలి గుర్తింపు కార్డుతో సిమ్ కార్డు జారీ అయిందని, దీన్ని ప్రజలను వేధించడానికి, అసభ్యకరమైన కథనాలను ప్రచారం చేయడానికి ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. అంతేకాకుండా ఎంహెచ్ 1045/2024 ఎఫ్ఐఆర్‌లో నమోదైన 24 ఫిర్యాదులలో కూడా ఈ సిమ్ కార్డునే చట్టవిరుద్ధ కార్యకలాపాలలో ఉపయోగించారని భయభ్రాంతులకు గురి చేశాడు. విచారణ పేరుతో బాధితురాలి వ్యక్తిగత, బ్యాంకు వివరాలను తీసుకున్నాడు. కేసు నుంచి బయట పడాలంటే తాము సూచించిన విధంగా చేయాలని బాధితురాలికి సలహా ఇచ్చారు. దీంతో ఆమె పలు దఫాలుగా ఫిక్స్‌డ్ డిపాజిట్లు, పీఎఫ్ సొమ్మును డ్రా చేసి రూ.1.58 కోట్ల సొమ్మును నిందితులు సూచించిన బ్యాంకు ఖాతాలకు బదిలీ చేసింది. పైగా డిజిటల్ అరెస్టు, విచారణ తదితర వివరాలను ఎవరితోనూ పంచుకోకూడదని, ఎక్కడా ఫిర్యాదు చేయకూడదని ఆమెను హెచ్చరించారు. దీంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు వెంటనే ఎల్బీనగర్‌లోని రాచకొండ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తక్షణమే స్పందించిన ఏసీపీ ఎస్ శివశంకర్ కేసు నమోదు చేసి, సత్వరమే బాధితురాలు బదిలీ చేసిన బ్యాంకు ఖాతాలను స్తంభింపజేశారు. ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి సాంకేతిక ఆధారాలతో నిందితులను పట్టుకున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని మురాదాబాద్‌లోని ఐసీఐసీఐ బ్రాంచ్‌లోని ఖాతాలో ఫ్రీజ్ అయిన రూ.70 లక్షల సొమ్మును తిరిగి బాధితురాలికి ఇప్పించారు. ప్రజలు మోసపూరిత కాల్స్, లింకుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానం కలిగించే వ్యక్తులకు స్పందించకూడదని, ఎటువంటి సందర్భంలో అయినా సైబర్ నేరగాళ్ల వలలో చిక్కుకుని మోసపోతే తక్షణమే నేషనల్ సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్ 1930 కు సమాచారం అందించి ఫిర్యాదు చేయాలని ఈ సందర్భంగా కమిషనర్ సుధీర్ బాబు సూచించారు.

మద్యం మత్తులో వ్యక్తి ఆత్మహత్య



ధర్మా (ఫైల్)

బంజారాహిల్స్: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి మత్తులో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..బంజారాహిల్స్ రోడ్ నెంబర్–2లోని ఇందిరానగర్‌లో నివసించే ధర్మా (35) సినిమా షూటింగ్‌లలో ఆర్ట్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఏడేళ్ల క్రితం భార్యతో గొడవ పడి ఇందిరానగర్‌కు వచ్చి అద్దెకు ఉంటున్నాడు. సినిమా షూటింగ్‌లలో పనిచేస్తున్న ఓ మహిళ (37)తో ఏర్పడిన పరిచయం సహజీవనానికి దారితీసింది. గత కొన్నేళ్లుగా వీరిద్దరు ఇందిరానగర్ అమృతాబార్ గల్లీలో అద్దెకు ఉంటున్నారు. కొంతకాలంగా ధర్మా మద్యానికి బానిసయ్యాడు. నూతన సంవత్సరం సందర్భంగా ఈ నెల ఒకటో తేదీన ఉదయం నుంచి తాగుతూనే ఉన్నాడు. రాత్రి 10 గంటలకు ఆయనతో సహజీవనం చేస్తున్న మహిళ తాగడం ఆపండి..తినండి..అంటూ హితవు పలికింది. అంతకుముందు నుంచే బావమరిది దుర్గతో మద్యం తాగుతుండగా ఇద్దరి మధ్యా తీవ్ర ఘర్షణ జరిగింది. దుర్గను తీవ్రంగా కొట్టాడు. దీంతో దుర్గ అలిగి వెళ్లిపోయాడు. అప్పటి నుంచి మళ్లీ మద్యం తాగుతుండగా ఆమె వారించింది. దీంతో ఆమెను కూడా తీవ్రంగా కొట్టాడు. ఇంట్లో నుంచి బయటకు గెంటివేసి లోపలి నుంచి గడియ పెట్టుకున్నాడు. అర్ధరాత్రి దాటినా తలుపు తీయకపోవడంతో ఆమె కిటికీలో నుంచి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. పోలీసులకు ఫిర్యాదు చేయగా ఘటనా స్థలానికి క్లూస్ టీమ్ చేరుకుని ఆధారాలు సేకరించారు. ఈ ఘటనపై ఇంటి యజమాని ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. బంజారాహిల్స్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వెంటనే పోస్టింగ్‌లు ఇవ్వాలి



విద్యుత్ సౌధ ఎదుట నిరసనవ్యక్తం చేస్తున్న జెన్కో ఉద్యోగాలకు అర్హత సాధించిన అభ్యర్థులు

పంజగుట్ట: తెలంగాణ జెన్‌కోలో ఏఈ, కెమిస్ట్ పోస్టులకు అర్హత సాధించి పోస్టింగ్ కోసం 100 రోజులుగా ఎదురుచూస్తున్నామని.. వెంటనే తమను ఉద్యోగంలో చేర్చుకోవాలంటూ అభ్యర్థులు గురువారం విద్యుత్ ప్రధానకార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని వారు ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా అభ్యర్థులు ప్రశాంత్, శేఖర్, రాంనాయక్, రవితేజలు మాట్లాడుతూ .. సర్టిఫికెట్ల పరిశీలన పేరుతో తమ సర్టిఫికెట్లు అన్ని చూసి ఒరిజినల్ సర్టిఫికెట్లు వారివద్దే ఉంచుకున్నారన్నారు. 7 రోజుల్లో పోస్టింగ్ ఇస్తామని చెప్పి గతంలో తాము పనిచేస్తున్న కంపెనీలో కూడా రిజైన్ చేయించుకున్నారన్నారు. అయితే 100 రోజులవుతున్నా ఇప్పటివరకు పోస్టింగ్ లేదని ఆవేదనవ్యక్తం చేశారు.

'ఇస్తేమా'కు సర్వం సిద్ధం

- శంకర్‌పల్లిలో నేటి నుంచి మూడురోజుల పాటు కార్యక్రమం
- ధార్మిక ఉపదేశాలు ఇవ్వనున్న మత గురువులు



ఇస్తేమా జరిగే ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ వెంకటేశ్వరావు

సాక్షి,సిటీబ్యూరో: నగర శివారు శంకర్‌పల్లిలో శుక్రవారం నుంచి మూడు రోజులపాటు తబ్లీక్ జమాత్ ఇస్తేమా జరగనుంది. ఈ సమ్మేళనానికి లక్షల సంఖ్యలో ముస్లింలు హాజరుకానున్నారు. ఈ మేరకు 200 ఎకరాల విస్తీర్ణంలో సదస్సు నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి భారీ సంఖ్యలో హాజరుకానుండడంతో ప్రభుత్వ యంత్రాంగం ఏర్పాట్లు పూర్తి చేసింది. విద్యుత్, తాగునీరు, మరుగుదొడ్లు, రవాణా సౌకర్యాలు కల్పిస్తోంది. ఇస్తేమాలో మతగురువులు ఇస్లాం ధర్మం ముఖ్య అంశాల గురించి ఉపదేశాలు చేయనున్నారు. మౌలానా అస్లం నాగ్‌పూరీ, మౌలానా ఖాసీం ఖురేషీ, మౌలానా షౌకత్ షితాపూరీ, మౌలానా మహ్మద్ ముస్తాఖ్ ఖాస్మీతోపాటు పలువురు మత ప్రముఖులు వివిధ అంశాలపై ధార్మిక ఉపదేశాలు ఇవ్వనున్నారు. ఆయా జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చే వారికోసం ఎక్కడివారు అక్కడే వంట చేసుకోవడానికి, విశ్రమించడానికి ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. సమ్మేళనానికి లక్షల సంఖ్యలో ముస్లింలు వస్తున్నందున పోలీసుశాఖ భారీ భద్రతా ఏర్పాట్లు చేపట్టింది.

క్లుప్తంగా...

వేరీడ్ బోర్డు పదవీకాలం పొడిగింపు

– ఏడాది పాటు పొడిగించిన కేంద్రం

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ వేరీడ్ బోర్డును మరో ఏడాది పాటు పొడిగించారు. వచ్చే ఫిబ్రవరి 10న ప్రస్తుత బోర్డు పదవీకాలం ముగినుండగా, తాజాగా మరోసారి ఏడాదిపాటు పొడగిస్తూ రక్షణ శాఖ అధికారిక గెజిట్ విడుదల చేసింది. 2021 నుంచి కంటోన్మెంట్‌లో వేరీడ్ బోర్డు ఆధ్వర్యంలో పాలన సాగుతోంది. తొలుత ఆరు నెలల చొప్పున, తర్వాత ఏడాది చొప్పున రెండేసి సార్లు పొడగిస్తూ వచ్చారు. తాజాగా మరోసారి ఏడాది పాటు లేదా కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు జరిగేంత వరకు వేరీడ్ బోర్డు కొనసాగుతుందని గెజిట్‌లో పేర్కొన్నారు. సికింద్రాబాద్‌తో పాటు దేశవ్యాప్తంగా 56 కంటోన్మెంట్‌లకు ఈ పొడిగింపు వర్తిస్తుంది. ముగ్గురు సభ్యులు ఉండే సికింద్రాబాద్ కంటోన్మెంట్ వేరీడ్ బోర్డులో ప్రస్తుతం అధ్యక్షుడు బ్రిగేడియర్ నంజుండేశ్వర, సీఈఓ మధుకర్ నాయక్‌తో పాటు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడుగా రామకృష్ణ కొనసాగుతున్నారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త కాల్చొద్దు

– హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సాక్షి, సిటీబ్యూరో : బహిరంగ ప్రదేశాలలో చెత్తను, వ్యర్థాలను కాల్చవద్దని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి నగరవాసులకు విజ్ఞప్తి చేశారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ లో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి వాల్ పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెత్తను బహిరంగ ప్రదేశాలలో కాల్చడం వాయు కాలుష్యానికి హాని కారకమని, దీంతో నాణ్యతను దిగజార్చడమే కాకుండా గుండె జబ్బులు, ఆరోగ్యానికి ప్రమాదకరమని అన్నారు. కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పి.సురేష్, అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ కె.సాయి దివ్య, మీడియా కోఆర్డినేటర్ ఎ. సోమేష్ కుమార్, పి.నాగరాణి, జి.వెంకటేష్ పాల్గొన్నారు.

మార్పు రమేష్‌కు డాక్టరేట్



అబిడ్స్: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో స్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాలలో ఆచార్యుడిగా పనిచేస్తున్న మార్పు రమేష్‌కు పీహెచ్‌డీ పట్టా లభించింది. కాకతీయ యూనివర్శిటీ వరంగల్‌లో పని చేస్తున్న డాక్టర్ బి.మంజుల ఆధ్వర్యంలో ఏ రోబస్ట్ మెషిన్ లర్నింగ్ ఆలగరిథం ఫర్ స్ట్రీమింగ్ డేటా అనే అంశంపై పరిశోధన చేసినందుకు ఆచార్య మార్పు రమేష్‌కు మణిపూర్‌లోని బిర్ టికేంద్రజిత్ యూనివర్శిటీ వారు డాక్టరేట్ పట్టా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మార్పు రమేష్ మాట్లాడుతూ..పలు జాతీయ జర్నల్స్‌లలో పరిశోధన పత్రాలను సమర్పించానని వివరించారు. కంప్యూటర్ అండ్ సైన్స్ ఇంజినీరింగ్‌లో డాక్టరేట్ పట్టా సాధించేందుకు సహకరించిన ప్రొఫెసర్ డాక్టర్ మంజులకు, డాక్టర్ గిరిధర్ ఆకుల, కళాశాల యాజమాన్యానికి, ప్రిన్సిపల్‌కు, ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నడిరోడ్డుపై కారు బీభత్సం



షాపులోకి దూసుకెళ్లిన కారు..

కుత్బుల్లాపూర్: నడిరోడ్డుపై ఓ కారు బీభత్సం సృష్టించింది. మద్యం మత్తులో ఉన్న యువకులు కారును వేగంగా నడపడంతో ఓ షాపులోకి దూసుకెళ్లింది. అదృష్టవశాత్తు ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. వివరాల్లోకి వెళితే.. గురువారం మధ్యాహ్నం కొంపల్లి శివాలయం వెనుక నుంచి వచ్చిన స్విఫ్ట్ కారు వేగంగా వచ్చి విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టింది. దీంతో పోల్ పూర్తిగా విరిగిపోయింది. అంతటితో ఆగకుండా పక్కనే ఉన్న కొబ్బరి బోండాల దుకాణంలోకి దూసుకెళ్లింది. షాపు నిర్వాహకుడు గుబ్బల గోపిబాబు వెంటనే పక్కకు దూకడంతో ప్రాణాలను కాపాడుకున్నాడు. ఈ ఘటనలో గోపిబాబు కాళ్లకు గాయాలయ్యాయి. కారులో ఉన్న నలుగురు వ్యక్తులు మద్యం తాగి ఉన్నట్లు స్థానికులు తెలిపారు. కొంపల్లి విద్యుత్ ఏఈ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పేట్‌బషీరాబాద్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రెట్టింపు ఉత్సాహంతో పని చేయండి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: సరికొత్త ఆలోచనలు, ఆశయాలతో 2025 సంవత్సరంలో మరింత పట్టుదలతో పని చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఉద్యోగులకు సూచించారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలులో రెట్టింపు ఉత్సాహంతో పనిచేసి జిల్లాను మరింత ప్రగతి పథంలోకి తీసుకురావాలని కోరారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా అధికారులతో మాట్లాడారు. ప్రతిశాఖ తన పని తీరును మెరుగుపరుస్తూ నాణ్యతను పెంచుతూ కార్యాచరణ సిద్ధం చేసుకొని ముందుకెళ్లాలని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను మరింత పకడ్బందీగా ప్రజల్లోకి తీసుకెళ్లడమే మనందరి బాధ్యత అన్నారు. ప్రతి పనిని పాజిటివ్ ఆలోచనతో చేయాలని అప్పుడే అనుకున్న లక్ష్యాన్ని అధిగమించగలమన్నారు. అనంతరం జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రెటరీ అసోసియేషన్, మండల పంచాయతీ అధికారుల అసోసియేషన్ సహకారంతో సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు బ్లాంకెట్స్, నోట్ బుక్స్‌ను కలెక్టర్‌కు అందజేశారు.

కేలండర్ ఆవిష్కరణ



రహమత్‌నగర్: బ్రహ్మశంకర్‌నగర్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ఆలయ కమిటీ రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను ఆలయ ధర్మకర్త ఓర్సు ఆడవయ్య ఆవిష్కరించారు. ఎస్పీఆర్‌హిల్స్ బీజేఆర్‌నగర్‌లోని పెనుయేలు ప్రార్ధన మందిరంలో రెవరెండ్ ప్రేమ్‌సాగర్, రత్నమ్మల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధనల అనంతరం కేలండర్‌ను ఆవిష్కరించారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా భరత్‌గౌడ్



నియామకపత్రాన్ని అందుకుంటున్న భరత్‌గౌడ్

రహమత్‌నగర్: రహమత్‌నగర్‌కు చెందిన నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ (ఎన్‌వైకేఎస్) హైదరాబాద్ జిల్లా అడ్వైజరీ మెంబర్ వాల్దాస్ భరత్ గౌడ్ జాతీయ బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు లా సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య చేతుల మీదుగా గురువారం నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా భరత్‌గౌడ్ మాట్లాడుతూ... తాను అందిస్తున్న సేవలను గుర్తించి రాష్ట్ర కార్యదర్శి నియమించిన ఆర్.కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

వ్యాపారి హత్య కేసు విచారణ ముమ్మరం

పంజగుట్ట: పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో అదృశ్యమై ఎస్ఆర్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శవమై తేలిన వ్యాపారి విష్ణు రూపాని హత్యకేసు విచారణను పోలీసులు ముమ్మరం చేశారు. హత్యకు గురైన ఇంట్లో ఉండే రమేష్ కోసం పోలీసులు ఐదు బృందాలుగా ఏర్పడి గాలిస్తున్నారు. రమేష్ స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు అని అక్కడకు ప్రత్యేక బృందాలు పంపినట్లు సమాచారం. రమేష్ దొరికితేనే అస్సలు నిజాలు బయటపడతాయని పోలీసులు భావిస్తున్నారు. విష్ణు మృతదేహానికి గాంధీ ఆస్పత్రిలో పోస్టుమార్టం పూర్తి చేసి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

నేడు సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు

బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం

కాచిగూడ: మహిళా విద్యాభివృద్ధికి కృషి చేసిన మహాత్మా జ్యోతిరావు పూలే సతీమణి సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఈనెల 3వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు గురువారం బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం తెలిపారు. విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఉదయం 10గంటలకు నిర్వహించే జయంతి వేడుకల్లో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొంటారని పేర్కొన్నారు. సావిత్రిబాయి పూలే విగ్రహాలను జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రతి మండల, నియోజకవర్గ కేంద్రాలలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నీల వెంకటేష్, టౌటుపల్లి సురేష్, బిళ్ళ పండరినాథ్, జెల్ల నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

సనత్‌నగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దడమే ధ్యేయం



అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: అభివృద్ధిలో సనత్‌నగర్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన ధ్యేయమని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. సనత్‌నగర్‌లోని శ్రీనివాస భవన్ నుంచి సెవన్ టెంపుల్స్ వరకు రూ.65 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో రహదారులు ఎంతో అధ్వానంగా ఉండేవని తాము అధికారంలోకి వచ్చాక రహదారులను అభివృద్ధి చేశామన్నారు. రోడ్ల విస్తరణ చేపట్టి ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించామని అన్నారు. అంతే కాకుండా డ్రైనేజీ, వాటర్‌లైన్, సీవరేజ్ కొత్త లైన్లను సైతం వేశామన్నారు. నాణ్యత లోపించకుండా రోడ్డు నిర్మాణ పనులు సకాలంలో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కొలను లక్ష్మీ, ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ వాసుదేవరెడ్డి, వాటర్‌వర్క్స్ జీఎం హరిశంకర్, ఏఎంఓహెచ్ చంద్రశేఖర్‌రెడ్డి, ఏఈ భాస్కర్, స్ట్రీట్‌లైట్ ఏఈ సుష్మ, బీఆర్‌ఎస్ నాయకులు కొలను బాల్‌రెడ్డి, ఖలీల్‌బేగ్, సురేష్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, కరీంలాలా తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం పెంపుపై నిర్లక్ష్యం?

ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా ఆదాయం అంతంతే

- చాలాకాలంగా డొమెస్టిక్ ఫీజులే వసూలు
- సిబ్బంది చేతివాటంతో బల్దియా ఆదాయానికి గండి



పంజగుట్టలోని ద్వారకాపురికాలనీ రోడ్డులో వాణిజ్య సముదాయాలు



బంజారాహిల్స్: ఆదాయాన్ని పెంచుకునేందుకు జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు ఒకవైపు ప్రయత్నాలు చేస్తుండగా ఇంకోవైపు సిబ్బంది కొరత, వసూళ్లపై అంతగా దృష్టిపెట్టని కిందిస్థాయి ఉద్యోగులతో సర్కిల్ కార్యాలయాలు వసూళ్ల లక్ష్యాన్ని చేరుకోలేకపోతున్నాయి. ముఖ్యంగా ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా సమకూరాల్సిన ఆదాయం అంతగా రావడం లేదు. దీంతో ఈ ఏడాది ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా భారీగా ఆదాయాన్ని సమకూర్చుకోవాలని లక్ష్యాన్ని నిర్దేశించారు.

- ఖైరతాబాద్ సర్కిల్–17 పరిధి కిందికి వచ్చే సోమాజిగూడ, ఖైరతాబాద్, సనత్‌నగర్, అమీర్‌పేట డివిజన్ల పరిధిలో 14,000 పైచిలుకు ట్రేడ్ లైసెన్స్ ఉండగా ఇప్పటివరకు 10,000 మంది నుంచి మాత్రమే లైసెన్స్ ఫీజులు వసూలు చేశారు. ట్రేడ్ లైసెన్స్‌ల వసూళ్లను ఏఎంఓహెచ్‌లకు అప్పగించారు. వారి కింద పని చేసే ఉద్యోగులు వసూళ్లు చేయాల్సిన బాధ్యతను అప్పగించారు.
- జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలో మొత్తం 10,725 ట్రేడ్ లైసెన్స్‌లు ఉండగా డిసెంబర్ ఆఖరు నాటికి 4,661 మంది నుంచి ఫీజులు వసూలు చేశారు. వీరి ద్వారా రూ. 9 కోట్లు వసూలైంది. ఈ ఏడాది ట్రేడ్ లైసెన్స్ ద్వారా ఈ ఒక్క సర్కిల్ నుంచే రూ. 60 కోట్లు వసూలు చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. ఈ నెలాఖరుకల్లా మొత్తం లక్ష్యాన్ని చేరుకునే విధంగా ప్రణాళికలు రూపొందించారు. ఆ మేరకు ఉద్యోగులకు దిశానిర్దేశం చేసి బకాయిదారుల జాబితాను అప్పగించారు.
- సర్కిల్–17, 18 పరిధిలోనే వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, దుకాణాలు ఎక్కువగా ఉన్నాయి. వీటి నుంచే ట్రేడ్ లైసెన్స్ ఫీజులు వసూలు చేయాల్సి ఉంది.
- ఈ రెండు సర్కిళ్ల పరిధిలో రూ. 100 కోట్ల దాకా ఆదాయం ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారానే రావాల్సి ఉంది. అయితే ఇన్నాళ్లు సంబంధిత సిబ్బంది పెద్దగా పట్టించుకున్న పాపాన పోలేదు. ఫలితంగా ట్రేడ్ లైసెన్స్ రెన్యువల్ కూడా జరగలేదు.

ఎన్నో ఏళ్లుగా డొమెస్టిక్ ఫీజులే...

చాలా అపార్ట్‌మెంట్లు, నివాసాల్లో వాణిజ్య కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. క్లినిక్‌లు, దుకాణాలు, షోరూంలు, హోటళ్లు, చిన్న చిన్న కార్యాలయాలు, రియల్ ఎస్టేట్ సంస్థలు, సినిమా కార్యాలయాలు నడిపిస్తున్నారు. అయితే వీరందరికీ డొమెస్టిక్ ఫీజులనే ఇప్పటిదాకా వసూలు చేస్తూ వచ్చారు. వీరందరినీ వాణిజ్య విభాగాల కింద చేర్చకపోవడంతో వీరి నుంచి రావాల్సిన ట్రేడ్ లైసెన్స్‌ల ఆదాయం బల్దియాకు రావడం లేదు. కిందిస్థాయి సిబ్బంది వీటిని నొక్కేస్తున్నట్లుగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీని మీద ఎవరి నిఘా లేకపోవడంతో గత కొన్నేళ్లుగా పాత పద్ధతిలోనే ఫీజుల వసూళ్లు జరుగుతున్నాయి.

లైసెన్స్ ఆఫీసర్లు ఏరీ..?

ట్రేడ్ లైసెన్స్‌లపై పటిష్టమైన వ్యవస్థ కోసం ప్రతి జోనల్ కార్యాలయానికి ఒక లైసెన్స్ ఆఫీసర్, సర్కిల్ కార్యాలయానికి ఒక అసిస్టెంట్ లైసెన్స్ ఆఫీసర్ ఉండాలి. ఎన్నో ఏళ్లుగా ఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సర్కిల్ కార్యాలయాలకు లైసెన్స్ ఆఫీసర్లు లేకపోవడంతో వసూళ్ల బాధ్యతలను ఏఎంఓహెచ్‌లకు అప్పగించారు. జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలో అవినీతి తారాస్థాయికి చేరుకుంది. ట్రేడ్ లైసెన్స్‌ల వసూళ్ల పేరుతో పారిశుద్ధ్య విభాగం సిబ్బంది అందినకాడికి దండుకుంటున్నారు. ఇటీవల ఎస్ఎఫ్ఏలు ఏసీబీకి కూడా పట్టుబడ్డారు. ట్రేడ్ లైసెన్స్‌ల ముసుగులో ఎస్ఎఫ్ఏలు సాగిస్తున్న వసూళ్ల దందా బల్దియా ఆదాయానికి గండి కొడుతోంది. ఎక్కడికక్కడ సిబ్బంది ట్రేడ్ లైసెన్స్‌ల డబ్బులను అక్రమ మార్గాల్లో జేబుల్లో వేసుకుంటున్నారు. నిఘా వ్యవస్థ నిద్రపోతుండటంతో అన్ని సర్కిల్ కార్యాలయాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. రావాల్సినంత ఆదాయం ట్రేడ్ లైసెన్స్‌ల ఫీజులపై వసూళ్లు కావడం లేదు. పలువురు కార్పొరేటర్లు కూడా ఇటీవల తమ పరిధిలో ట్రేడ్ లైసెన్స్‌లు పునరుద్ధరించడం లేదని, పాత పద్ధతిలోనే వసూలు చేస్తున్నారని, అపార్ట్‌మెంట్లు, ఇళ్లల్లో వాణిజ్య కార్యకలాపాలు కొనసాగుతున్నాయని, వాటి నుంచి ఫీజులను ముక్కుపిండి వసూలు చేయాలని అధికారులకు విన్నవించినా ఫలితం లేదు.

భారీ ఆదాయం సమకూరే ప్రాంతాలివే...

ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా బల్దియాకు భారీ ఆదాయం బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఖైరతాబాద్, లక్డీకాపూల్, పంజగుట్ట, సోమాజిగూడ, అమీర్‌పేట, శ్రీనగర్‌కాలనీ, యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్, ఫిలింనగర్, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాల నుంచి సమకూరుతుంది. ఇక్కడి సిబ్బంది చేతివాటంతో చాలావరకు ఆదాయం బల్దియాకు రావడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు చిత్తశుద్ధితో వ్యవహరించి ట్రేడ్ లైసెన్స్‌ల ఫీజులపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

వెంగళరావునగర్: విద్యుత్ సంబంధ మరమ్మతు పనుల కారణంగా కార్మిక నగర్, మయూరిమార్గ్ 11కేవీ ఫీడర్లు, ఎస్పీఆర్ హిల్స్, హెచ్‌పీఎస్ సబ్‌స్టేషన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్మికనగర్, బ్రహ్మశంకర్‌నగర్, మయూరి మార్గ్, అల్లంతోట బావి, గీతాంజలి స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని గ్రీన్‌లాండ్స్ సీబీడీ ఏడీఈ చరణ్‌సింగ్ తెలిపారు.

◆ సర్వోదయ కాంప్లెక్స్, సెలబ్రిటీ క్లబ్, శ్రీముఖి 11కేవీ ఫీడర్లు హెచ్‌పీఎస్, ప్రకాశ్‌నగర్, జనప్రియ సబ్‌స్టేషన్ల పరిధిలో సూర్యోదయ కాంప్లెక్స్, నెల్లిసిల్క్ ఏరియా, చికోటి గార్డెన్, శ్రీముఖి అపార్ట్‌మెంట్స్ ఏరియాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదని ఏడీఈ వివరించారు.

సైఫాబాద్ డివిజన్ పరిధిలో...

ఖైరతాబాద్: సైఫాబాద్ డివిజన్ పరిధిలోని జవహర్‌నగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు అశోక్‌నగర్ వెల్ఫేర్ సెంటర్, స్ట్రీట్ నెం 1 నుంచి 7 వరకు, అశోక్‌నగర్ లిబర్టీ ఏరియా, అశోక్‌నగర్ చమన్ ఏరియా, ఓల్డ్ మహవీర్ కలర్ ల్యాబ్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు. నారాయణగూడ సబ్‌స్టేషన్ పరిధిలో సిటీ సెంట్రల్ లైబ్రరీ, సుధా హోటల్ ఏరియా, బాపూజీ ఏరియా, చిక్కడపల్లిలో కొంత భాగం, వివేక్‌నగర్, మోర్ సూపర్ మార్కెట్, ఆర్టీసీ క్రాస్ రోడ్స్, ఎంసీహెచ్ మార్కెట్ ఏరియా, త్యాగరాజ గానసభ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని వివరించారు.

ఆలయ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం

శ్రీనగర్‌కాలనీ: ఎల్లారెడ్డిగూడ హనుమాన్, షిరిడీ సాయిబాబా ఆలయ కమిటీ చైర్మన్‌గా వి.ఉమామహేశ్వర్ నియమితులయ్యారు. గురువారం సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీతయాదవ్, బస్తీ పెద్దల సమక్షంలో పాలకమండలి చైర్మన్, సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. సభ్యులుగా ఆర్.మంజుల, ఎం.యాదయ్య, రమేష్‌కుమార్, కల్పన, యాదయ్యయాదవ్, శ్రీనివాసరాజ్ నియమితులయ్యారు. ఆలయ అభివృద్ధికి కృషిచేస్తామని నూతన కమిటీ సభ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో అర్చకులు వెంకటేశ్వరశర్మ, గొంటి శ్రీనివాసయాదవ్, సంతోష్‌కుమార్‌గౌడ్, వనం శ్రీనివాసయాదవ్, మనోజ్‌యాదవ్, కిరణ్‌యాదవ్ పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న దేవాలయ కమిటీ సభ్యులు

నేడు బీసీ విద్యార్థుల కలెక్టరేట్ల ముట్టడి



సమావేశంలో ఆర్.కృష్ణయ్యతో కలిసి మాట్లాడుతున్న వేముల రామకృష్ణ

కాచిగూడ: విద్యార్థుల ఫీజు బకాయిలు, స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలని ఈనెల 3వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కలెక్టరేట్లు, ఆర్‌డీఓ, మండల తహసీల్దార్ కార్యాలయాల ముట్టడిని నిర్వహిస్తున్నట్లు బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ తెలిపారు. గురువారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, గుజ్జ సత్యంతో కలిసి ఆయన మాట్లాడారు. విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని జిల్లా కలెక్టరేట్ల ముట్టడిని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా ఇంజినీరింగ్, పీజీ , డిగ్రీ, ఇంటర్ తదితర కాలేజీ కోర్సులు చదివే బీసీ, విద్యార్థుల పూర్తి ఫీజులు మంజూరు చేయలన్నారు. కాలేజీ విద్యార్థులకు సంవత్సరంకు రూ.20వేల స్కాలర్‌షిప్ ప్రతి విద్యార్థికి మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్ కోర్సులు చదివే విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ రూ.1800 నుంచి రూ.15వేలకు పెంచాలన్నారు. బీసీ కాలేజీ హాస్టళ్లకు, గురుకుల పాఠశాలలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

సెంట్రల్ వర్సిటీ 'పెర్'ప్రాజెక్టులో ఓయూ

తొలిసారి సైన్స్ అండ్ సోషల్ సైన్స్ కలయికలతో పరిశోధనలు

ఉస్మానియా యూనివర్సిటీ: సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ (హెచ్‌సీయూ) చేపట్టిన ప్రివెంటింగ్ అండ్ అసిలేటరింగ్ రిసెర్చ్ ప్రోగ్రామ్ (పెర్) ప్రాజెక్టు ఓయూ ఎంపికైనట్లు యూజీసీ డీన్ ప్రొ.లావణ్య గురువారం తెలిపారు. ప్రాజెక్టు ఎంపిక కోసం గత డిసెంబరు 23న జరిగిన పవర్ పాయింట్ ప్రజెంటషన్‌లో ఓయూ ప్రొఫెసర్లు సత్తా చాటినట్లు చెప్పారు. వీసీ ప్రొ.కుమార్, రిజిస్ట్రార్ ప్రొ.నరేష్‌రెడ్డి, వోఎస్‌డీ ప్రొ.జితేందర్ నాయక్ చొరవతో ప్రతిష్ఠాత్మక పెర్ ప్రాజెక్టు దక్కిందన్నారు. వీసీగా పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత యూనివర్సిటీకి లభించిన తొలి ప్రాజెక్టు అని పేర్కొన్నారు. ఓయూలో సైన్స్, సోషల్‌సైన్స్ కలయితో పరిశోధనలకు జరగాలనే వీసీ ప్రొ.కుమార్ సంకల్పం ఫలించిందన్నారు.

◆ హెచ్‌సీయూ పర్యవేక్షణలో ఐదు సంవత్సరాలు కొనసాగే ఈ ప్రాజెక్టులో దేశ వ్యాప్తంగా 10 స్పోక్‌లను (వర్సిటీలు, పరిశోధన సంస్థలు) ఎంపిక చేయగా అందులో ఓయూ ఎంపిక కావడం విశేషమన్నారు. కేంద్రం నుంచి పెరు ప్రాజెక్టుకు లభించు రూ.100 కోట్ల నిధుల నుంచి ఓయూకు లభించు వాటతో యూనివర్సిటీ క్యాంపస్‌లోని కెమిస్ట్రీ విభాగంలో త్వరలో పరిశోధనలు ప్రారంభించనున్నట్లు చెప్పారు. పెర్ ప్రాజెక్టు కోసం ఓయూ కెమిస్ట్రీ విభాగం నుంచి సీనియర్ అధ్యాపకులు, మహిళ వర్సిటీ మాజీ ప్రొ.విజ్ఞులత, డా. మురళీధర్‌రెడ్డి, ప్రొ.విజయ్‌కుమార్, డా.కవిత, ప్రొ. హరిపద్మశ్రీతో పాటు ఆర్ట్స్ కాలేజీ సోషియాలజీ విభాగం అధ్యాపకులు డాక్టర్ రామ్‌బీమనేని షఫర్డ్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ (ఏఐ) అండ్ మిషన్ లర్నింగ్ ఇన్ హ్యూమన్ హెల్త్, ఎనిమల్ హెల్త్, ఎన్విరాన్‌మెంట్, మెడికల్ టెక్నాలజీలపై పరిశోధనలు చేయనున్నట్లు చెప్పారు.



ఓయూ ఆర్ట్స్ కాలేజీ

స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి

కాచిగూడ: బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సామాజిక న్యాయవేదిక జాతీయ సమన్వయకర్త, రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు డిమాండ్ చేశారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌లో ప్రకటించిన హామీలను కనీసం కొత్త సంవత్సరంలోనైనా దశలవారీగా నెరవేర్చుతూ ప్రభుత్వం తన చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. గురువారం కాచిగూడలో జరిగిన సామాజిక న్యాయవేదిక ప్రతినిధుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. విద్యా, ఉద్యోగ రంగాలలో అందివచ్చే అవకాశాలకు అడ్డంకిగా ఉన్న క్రిమిలేయర్ విధానాన్ని వెంటనే ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తోందని విమర్శించారు. డిమాండ్లను సాధించుకునే దిశగా దశల వారిగా వివిధ రూపాల్లో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలను చేపట్టాలని పిలుపునిచ్చారు. నేతలు చంద్రపాల్, డి.కుమారస్వామి, మోక్షజ్ఞ రవి, ప్రేమ్‌లాల్, జి.సమ్మయ్య, నవీన్ కౌశల్, జితేందర్ నేత, శ్రీరాం చక్రధర్, రవికాంత్, కె.రఘురాంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాన్ షాపులపై పోలీసుల దాడులు

రహమత్‌నగర్: నిషేధిత ఈ–సిగరెట్లు విక్రయిస్తున్న పాన్ షాపుల నిర్వాహకులపై బోరబండ పోలీసులు ఉక్కు పాదం మోపుతున్నారు. ఈ క్రమంలో పదిహేను రోజులుగా పాన్‌షాపులపై వరుస దాడులు నిర్వహిస్తున్నారు. ఆయా షాపుల నుంచి నిషేధిత ఈ–సిగరెట్లను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేస్తున్నారు. ఈ సందర్భంగా అడ్మిన్ ఎస్ఐ నాగుల్ మీరా మాట్లాడుతూ... పాన్ షాపుల వద్ద సిగరెట్‌లు తాగుతూ ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

రహమత్‌నగర్: క్రీడలకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నదని, ఇందులో భాగంగానే రాష్ట్రంలోనే తొలిసారిగా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టిందని కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ అన్నారు. నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో డివిజన్‌లోని పీజేఆర్ మైదానంలో గురువారం ఏర్పాటు చేసిన ఆటల పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బాబా మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ఆశక్తి పెంచుకోవాలని సూచించారు. అంతకుముందు విద్యార్థులకు ఆట వస్తువులకు అందజేశారు. బస్తీ అధ్యక్షుడు అజీజ్‌బేగ్, ఆనంద్‌కుమార్, వెంకటేష్, సుభాని, డివిజన్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఆట వస్తువులను అందజేస్తున్న కార్పొరేటర్ ఫసియుద్దీన్

ల్యాప్‌టాప్ చోరీ

బంజారాహిల్స్: స్నాక్స్ తీసుకునేందుకు షాపులోకి వెళ్లి తిరిగి వచ్చేసరికి ద్విచక్ర వాహనానికి ఉంచిన ల్యాప్‌ట్యాప్ బ్యాగ్ చోరీకి గురైన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల సమాచారం మేరకు... అమీర్‌పేట ధరంకరం రోడ్డులోని మిలీనియం రోవలే అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉండే ప్రతీక్ భార్గవ (32) ఐడీఎఫ్‌సీ బ్యాంక్‌లో పనిచేస్తున్నాడు. ఈ నెల 31న సాయంత్రం రాయదుర్గ అరబిందో గెలాక్సీ టవర్స్‌లోని ఐడీఎఫ్‌సీ బ్యాంక్‌లో విధులు ముగించుకుని ఇంటికి బయలుదేరాడు. రాత్రి 8.30 గంటల సమయంలో ఆకలిగా ఉండటంతో మార్గమధ్యంలో కృష్ణానగర్ సాయి వైన్స్ వద్ద స్నాక్స్ తినేందుకు ఆగాడు. తన ద్విచక్ర వాహనానికి (టీఎస్09జీఎఫ్ 4148) హెచ్‌పీ కంపెనీకి చెందిన ల్యాప్‌ట్యాప్, చార్జర్, మౌస్, లంచ్ బాక్స్, వాటర్ బాటిల్, రెయిన్‌కోట్ కలిగిన బ్యాగ్‌ను తగిలించి స్నాక్స్ కోసం వెళ్లాడు. స్నాక్స్ తిని వాహనం వద్దకు వచ్చేసరికి వాహనానికి తగిలించిన బ్యాగ్ కనిపించలేదు. ల్యాప్‌ట్యాప్‌లో బ్యాంక్‌కు సంబంధించిన సమాచారం ఉందని, ల్యాప్‌ట్యాప్‌ను దొంగిలించిన వ్యక్తిని పట్టుకోవాల్సిందిగా బాధితుడు జూబ్లీహిల్స్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం



గాయత్రి

రహమత్‌నగర్: వివాహిత అదృశ్యమైన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది. అడ్మిన్ ఎస్ఐ నాగుల్‌మీరా సమాచారం మేరకు... మెహిదీపట్నానికి చెందిన శ్రీనివాస్, గాయత్రి దంపతులు. వారి మధ్య కొన్ని రోజులుగా మనస్పర్థలున్నాయి. ఈ క్రమంలో శ్రీనివాస్ అతని భార్య గాయత్రిలు బోరబండ సైట్–3లోని గాయత్రి తల్లిదండ్రుల ఇంటికి జనవరి 1న వచ్చారు. అదే రోజు రాత్రి గాయత్రి(23) ఇంటి నుంచి వెళ్లి పోయింది. పలు ప్రాంతాల్లో వెతికినా కనిపించక పోవడంతో గాయత్రి తండ్రి వెంకటస్వామి బోరబండ పోలీసులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

'సైబర్ మోసాలపై ఫిర్యాదు చేయవచ్చు'

మూసాపేట: సైబర్ మోసాల ద్వారా రూ. 1.50 లక్షలు పోగొట్టుకుంటే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని కూకట్‌పల్లి పీఎస్ సీఐ ముత్తు తెలిపారు. నూతన సంవత్సరం సందర్భంగా బాలానగర్ జోన్ డీసీపీ ఆదేశాల మేరకు ఫిర్యాదును స్వీకరిస్తామన్నారు. గతంలో రూ.50 వేల వరకు పోగొట్టుకున్న బాధితుల నుంచి మాత్రమే ఫిర్యాదులు స్వీకరించేవారని, ఆపై ఎక్కువ డబ్బులు పోగొట్టుకున్న బాధితులను సైబర్ క్రైమ్‌కు కేసును బదిలీ చేసే వాళ్లమని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, నూతన టెక్నాలజీతో సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ప్రజలు గమనించి జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పు



మూసాపేట: ప్లాస్టిక్‌తో తయారు చేసిన వస్తువులను వినియోగించడం వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని కూకట్‌పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటయ్య అన్నారు. ప్లాస్టిక్ వాడకం తగ్గిస్తామని గురువారం విద్యార్థులు, అధ్యాపకులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన ఇంట్లో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని, సెలవు దినాల్లో ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలను ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ వస్తువులకు బదులు క్లాత్ బ్యాగులు, జ్యూట్ బ్యాగులు వినియోగించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సెంట్రల్ ఫిలిం సెన్సార్‌బోర్డు సభ్యురాలిగా పద్మ



పద్మకు నియామక పత్రం అందజేస్తున్న ఎంపీ డాక్టర్ లక్ష్మణ్

కవాడిగూడ: సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యురాలిగా కవాడిగూడకు చెందిన బీజేపీ సీనియర్ నాయకురాలు ఆర్. పద్మ నియమితులయ్యారు. ఆమె నియామకాన్ని సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు హైదరాబాద్ రీజనల్ ఆఫీసర్ నయీఫ్ అలీ కుమార్ ప్రకటించగా బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ గురువారం ఆమెకు నియామక పత్రం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... బీజేపీ పార్టీలో కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందన్నారు.

◆ ఆర్ పద్మ మాట్లాడుతూ.. మహిళా మోర్చా కమిటీలో అనేక పదవులను బాధ్యతగా నిర్వర్తించానని అన్నారు. పార్టీకి చేసిన సేవలను గుర్తించి ఇప్పుడు ఈ బాధ్యతలు అప్పగించారని తెలిపారు. పనిచేసేందుకు తనకు అవకాశం కల్పించిన కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు జి. వెంకటేష్, పరిమళ్‌కుమార్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు ఎంసి మహేందర్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఎ ప్రభాకర్ గంగపుత్ర, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి. శ్రీనివాస్ ముదిరాజ్, ఓబీసీ మోర్చా డివిజన్ ప్రధాన కార్యదర్శి బొల్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

5న భగవద్గీత అభ్యాస తరగతులు

మోతీనగర్: మోతీనగర్‌లోని శ్రీ శృంగేరి శారదా శంకర మఠంలో ఆదివారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు భగవద్గీత అభ్యాస తరగతులు నిర్వహించనున్నట్లు మఠం మోతీనగర్ శాఖ పరిపాలనాధికారి సీఎస్ఆర్.మూర్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. భగవద్గీత అభ్యాస కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నగరంలో నేడు

- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు నేషనల్ సిల్క్ ఎక్స్‌పో జరుగుతుంది.
- మాదాపూర్ శిల్పారామంలో ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు స్కల్ప్చర్ పార్క్ అందుబాటులో ఉంటుంది.
- నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజా వేదికగా వింటర్ ఉత్సవ్ మేళా సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు ఉంటుంది.
- సికింద్రాబాద్ ఆర్పీ రోడ్డులోని ప్యారడైజ్ ఫుడ్ కోర్టు ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 10 గంటల వరకు రాయల్ ఫుడ్ ఫెస్టివల్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని పల్లెటూరి వాతావరణంతో కూడిన శిల్పారామం సందర్శనకు ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటలకు ఇండియన్ ఫొటో ఫెస్టివల్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో అంతర్జాతీయ హస్తకళా మేళా ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో 84వ ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ నాంపల్లి గ్రౌండ్స్‌లో ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

'ఆమె'కు డొక్కు వాహనాలే దిక్కు!

- పాతబడ్డ పెట్రోలింగ్ వెహికిల్స్‌తోనే విధులు
- రాచకొండ షీ టీమ్ పోలీసుల దుస్థితి ఇదీ..
- ఫ్లై ఓవర్ కూడా ఎక్కలేక మొరాయిస్తున్న వాహనాలు
- అర్ధంతరంగా రహదారుల మీదే ఆగిపోతున్న వైనం


కామినేని ఫ్లై ఓవర్ మీద ఆగిపోయిన రాచకొండ షీ టీమ్ వాహనం (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: పోలీసు విధులంటేనే అత్యవసర సేవలు. 'డయల్ 100'కు ఫోన్ వస్తే క్షణాల్లో బాధితుల వద్దకు చేరుకొని రక్షించాల్సిన పరిస్థితి. కానీ, రాచకొండ షీ టీమ్ పోలీసుల పరిస్థితి విచిత్రం. డొక్కు వాహనాలే వారికి దిక్కయ్యాయి. పాతబడిపోయిన వాహనాలతో విధులు నిర్వర్తించలేక ఆపసోపాలు పడుతున్నారు. జాతీయ రహదారులు, ఫ్లై ఓవర్ ఎక్కాయంటే చాలు మొరాయించి, అర్ధంతరంగా రోడ్ల మీదనే వాహనాలు ఆగిపోతున్నాయి.

- సాధారణంగా పెట్రోలింగ్ వాహనాల వినియోగం ఎక్కువగా ఉంటుంది. నిరంతరం నిర్వహణ, డ్రైవర్ నైపుణ్యంగా ఉంటేనే ఎక్కువకాలం మన్నికగా ఉంటాయి. అయితే పెట్రోలింగ్ వాహనాలకు ఇవీ కరువయ్యాయి. 2016 జూన్‌లో సైబరాబాద్ పోలీసు కమిషనరేట్‌లోని ఈస్ట్ విభాగాన్ని విడదీసి ప్రత్యేకంగా రాచకొండ పోలీసు కమిషనరేట్‌ను ఏర్పాటు చేశారు. అయితే రాచకొండ మహిళా భద్రతా విభాగానికి కొత్త పెట్రోలింగ్ వాహనాలను మంజూరు చేయలేదు. అప్పటికే ఇతర ఠాణాల పరిధిలోని వినియోగించిన టాటా సుమో, బొలెరో మొత్తం ఏడు వాహనాలు షీ టీమ్స్ విభాగానికి అప్పగించారు. ఇప్పటికీ వాటినే షీ టీమ్స్ సిబ్బంది వినియోగిస్తున్నారు. సీడబ్ల్యూసీ విభాగానికి ఓ కార్పొరేట్ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీ (సీఎస్ఆర్) కింద కొత్త వాహనాన్ని విరాళంగా అందించింది. గత ప్రభుత్వ హయంలో అన్ని పోలీసు విభాగాలకు, స్టేషన్లకు సుమో, బొలెరో స్థానంలో కొత్త ఇన్నోవా వాహనాలను కేటాయించారు. కానీ, రాచకొండ షీ టీమ్స్‌కు ఆ భాగ్యం దక్కలేదు.

హైవే ఎక్కితే ఆగుడే..

పెట్రోలింగ్ కోసం వాడుతున్న వాహనాలు పాతబడిపోయి హైవేలు, ఫ్లై ఓవర్లు ఎక్కలేక మొరాయిస్తున్నాయి. ఇబ్రహీంపట్నం, చౌటుప్పల్, భువనగిరి వంటి పలు ప్రాంతాల్లో చాలాసార్లు ఈ పెట్రోలింగ్ వాహనాలు ఆగిపోయిన సందర్భాలు ఉన్నాయని ఓ అధికారి గుర్తు చేసుకున్నారు. ఆ సమయంలో వాహనాలకు అక్కడే నిలిపివేసి, సొంత వాహనాలతో తిరిగి వచ్చిన సందర్భాలనేకం ఉన్నాయని చెప్పారు. గతంలో ముఖ్యమంత్రి సమావేశానికి బందోబస్తు విధులకు వెళుతున్న క్రమంలోనూ ఇలాంటి ఘటనే ఎదురైందని పేర్కొన్నారు. తాజాగా నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో డిసెంబర్ 31న అర్ధరాత్రి బందోబస్తు డ్యూటీ నిమిత్తం రాచకొండ షీ టీమ్స్ పోలీసులు పెట్రోలింగ్ వాహనంలో రోడ్ల మీద చక్కర్లు కొడుతున్నారు. ఈ క్రమంలో నాగోల్‌లోని కామినేని ఫ్లైఓవర్ ఎక్కుతుండగా టీఎస్ 09 పీఏ 0967 పోలీసు పెట్రోలింగ్ వాహనం మొరాయించింది. ఎంత ప్రయత్నించినా తిరిగి స్టార్ట్ కాకపోవడంతో వాహనాన్ని ఫ్లై ఓవర్ మీదనే వదిలేసి.. పోలీసు సిబ్బంది నడుచుకుంటూ వెళ్లిపోయారు.

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై శ్రద్ధ

హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి


ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థినితో పాఠం చదివిస్తున్న కలెక్టర్

సాక్షి,సిటీబ్యూరో: ప్రాథమిక విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం అమీర్ పేట్ డికె రోడ్‌లో గల ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల ఆవరణను పరిశీలించి తాగునీటి వనరులపై ఆరా తీశారు. మూడో తరగతి, 5వ తరగతి విద్యార్థులతో మాట్లాడి వారి అభ్యాసన సామర్థ్యాలు, పఠన నైపుణ్యాలను, ఎఫ్ఆర్ఎస్ హాజరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిస్తుందని ఆ దిశగా ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయాలని అన్నారు. బడిబాట కార్యక్రమం ద్వారా పిల్లల హాజరు శాతం పెంచాలని, నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. ఇంగ్లిష్, మేథమెటిక్స్‌పై పట్టు ఉండేలా ప్రత్యేక కృషి చేయాలన్నారు. ఓ తరగతి గదిలో దీపక్, వైష్ణవి, మహేందర్ అనే విద్యార్థులతో ఇంగ్లిష్, తెలుగు పాఠాలు చదివించారు. చదువుతోనే మంచి భవిష్యత్ ఉంటుందని విద్యార్థులు ఇష్టంగా చదవాలని తద్వారా భయం, ఆందోళన పోతుందని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ మధ్యాహ్నం భోజనాలను పరిశీలించి సమయానికి అందించాలని సూచించారు. పరీక్షల సమయం దగ్గర పడుతున్న సమయంలో విద్యాశాఖ అధికారులు పాఠశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో డీఈవో ఆర్.రోహిణి, తహసీల్దార్ పద్మ సుందరి, డిప్యూటీ ఈవో యాదయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అండర్-23 పోటీలకు ఎల్‌బీనగర్ కుర్రాడు ఎంపిక


రాపోలు సంతోష్

మన్సూరాబాద్: బీసీసీఐ నిర్వహిస్తున్న అండర్-23 క్రికెట్ ట్రోఫీకి తెలుగు కుర్రాడు రాపోలు సంతోష్ (21)కు అరుణాచల్‌ప్రదేశ్ అండర్-23 టీమ్‌లో చోటు దక్కింది. ఎల్‌బీనగర్‌కు చెందిన రాపోలు సంతోష్ గతేడాది అరుణాచల్‌ప్రదేశ్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో కూడా ప్రతిభ చాటాడు. అయితే హైదరాబాద్ జట్టు తరపున ఆడేందుకు అవకాశాలు దక్కకపోవడంతో అరుణాచల్‌కు వలస వెళ్లాడు. దేశవాళీ 2024-25 సీజన్‌కు అరుణాచల్‌ప్రదేశ్ జట్టు నుంచి ఆడటానికి పిలుపురావటంతో సంతోష్ హర్షం వ్యక్తం చేశాడు. ఇదివరకు జాతీయ స్థాయి అండర్-16, అండర్-17, స్కూల్ గేమ్స్‌లలో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించానని తెలిపాడు. అండర్-16 విజమ్‌మార్చంట్ ట్రోఫీలోను పాల్గొని మంచి ప్రతిభ కనబర్చానని, నగరానికి చెందిన వినోద్‌కుమార్ బీఏజీ వాల్దర్ వద్ద శిక్షణ పొంది క్రికెట్‌లో మెలకువలు నేర్చుకున్నట్లు వివరించాడు. ఫాస్ట్ బౌలింగ్ ఆల్‌రౌండరగా బౌలింగ్, బ్యాటింగ్‌ల్లో ప్రతిభ కనబర్చడంతో ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఐపీఎల్ ఆడటం తన చిరకాల వాంఛ అని తెలిపాడు.

కుంభకోణాలపై విచారణ అవసరం


అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న యాదగిరి తదితరులు

కాచిగూడ: కేసీఆర్ హయాంలో జరిగిన అవినీతి, కుంభకోణాలపై విచారణ జరిపి బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ చైర్మన్ ఎస్.యాదగిరి, ప్రధానకార్యదర్శి ప్రఫుల్ రాంరెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జేఏసీ ప్రతినిధులు డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి ఫిర్యాదు లేఖలను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ పదేళ్లపాటు కేసీఆర్ ప్రభుత్వం తెలంగాణను నిలువునా దోచుకొని లక్షల కోట్ల రూపాయల కుంభకోణాల్లో కూరుకుపోయిందని ఆరోపించారు. భూమి, ఇసుక, విద్యుత్, బియ్యం, ఫోన్ ట్యాపింగ్, కార్ రేస్, కాళేశ్వరం తదితర కుంభకోణాలపై అప్పటి మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌లు అబద్ధాలు మాట్లాడుతున్నారని, వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డోలక్ యాదగిరి, పి.గందయ్య, వి.అరుణ, సుజి, అంజలి, ఎస్.రేణుక, శంకర్‌రావు, వెంకటస్వామి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో ఎంబీఏకు దరఖాస్తుల ఆహ్వానం

- దరఖాస్తు గడువు ఈ నెల 15

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 2025-27 విద్యా సంవత్సరానికి ఎంబీఏ కోర్సులో అడ్మిషన్ల ప్రక్రియ ప్రకటనను గురువారం విడుదల చేశారు. దరఖాస్తు చేయడానికి జనవరి 15 చివరి తేదీగా ప్రకటించారు. గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూ కోసం షార్ట్ లిస్ట్-విడిగా తెలియజేస్తామని హెచ్‌సీయూ అధికారులు స్పష్టం చేశారు. ప్రాస్పెక్టస్-2024-25 నుంచి అందించిన కోర్సులు, అర్హత ప్రమాణాలు, నిర్దేశిత రుసుము, రిజర్వేషన్ పాలసీసహా వివరాల కోసం విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. ముఖ్యంగా ఐఐఎం కలకత్తా నిర్వహించే సీఏటీ-2024కు హాజరైన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులని స్పష్టం చేశారు. ఎంబీఏ కోర్సులో జనరల్ 30 సీట్లు, ఎస్సీ 11, ఎస్టీ 6, ఓబీసీ 20, ఈడబ్ల్యూఎస్ 8, మొత్తం 75 సీట్లు ఉండగా నాలుగు దివ్యాంగులకు, నాలుగు సీట్లు డీపీలకు కేటాయించారు. అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

వడ్డెరులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

వడ్డెర సంక్షేమ సంఘం సదస్సులో వక్తల డిమాండ్


వడ్డెర సంఘం సదస్సులో అభివాదం చేస్తున్న నేతలు జెరిపాటి జైపాల్, గుంజ శ్రీనివాస్

కాచిగూడ: సంచార శ్రమజీవులైన వడ్డెరులు దేశంలోని ఆయా రాష్ట్రాల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలుగా కొనసాగుతున్నారని, తెలంగాణలో ఎస్టీ జాబితాలో చేర్చాలని వక్తలు అన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో గురువారం జరిగిన అఖిల బారత వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర సదస్సులో రాష్ట్ర ఎంబీసీ చైర్మన్ జెరిపాటి జైపాల్, అఖిల భారత వడ్డెర సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వేముల లక్ష్మణ్, ప్రధానకార్యదర్శి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గుంజ శ్రీనివాస్ మాట్లాడుతూ గత ప్రభుత్వాల హయాంలో వడ్డెర్లకు తీవ్ర అన్యాయం జరిగిందని, ఇప్పుడు వడ్డెరలంతా ఐకమత్యంతో పోరాడి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. వడ్డెరలకు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. బీమా, రాయితీలు వంటి సదుపాయాలు వడ్డెరలకు కల్పించే విధంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులపై ఒత్తిడి తీసుకురావాలని పేర్కొన్నారు. 50 ఏళ్ళు నిండిన వడ్డెరలకు నెలకు రూ.4 వేలు పింఛన్ ఇవ్వాలని, మైనింగ్‌లో వడ్డెర కో- ఆపరేటివ్ సొసైటీలకు 30 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వేముల తిరుమలదేవి, గుంజ రేణుక, మంజల రమేష్, మంచపు రమా, మంజల హన్మయ్య, సాతల గోపాల్, ఇడగోటి నగేష్, ఇడగోటి పార్వతి, బొంత చిరంజీవి, బోదాసు శ్రీనివాస్, రేషన్ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

సుబ్బు.. సూపర్!



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 అథ్లెటిక్స్ మీట్‌లో హయత్‌నగర్‌లోని 'ద సుధీర్ ఫౌండేషన్'అనాథ శరణాలయం విద్యార్థి పి.సుబ్బు రజత పతకం సాధించాడు. సికింద్రాబాద్ జింఖానా మైదానంలో జరిగిన ఈ మీట్‌లో సుబ్బు లాంగ్‌జంప్ ఈవెంట్‌లో ఆరు మీటర్ల దూరం దూకి రెండో స్థానంలో నిలిచాడు. ఈ ప్రదర్శనతో సుబ్బు ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు రాంచీలో జరిగే జాతీయ స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్స్ మీట్‌లో పాల్గొనే తెలంగాణ జట్టులోకి ఎంపికయ్యాడు.

బీసీ విద్యుత్ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలి

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: విద్యుత్ శాఖలో 2 జూన్ 2014 తర్వాత ఇచ్చిన పదోన్నతులను సమీక్షించి నష్టపోయిన బీసీ ఉద్యోగులకు పదోన్నతులు కల్పించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ విద్యుత్ బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముత్యం వెంకటన్నగౌడ్ అధ్యక్షతన గురువారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఈ నెల 8వ తేదీన ఖైరతాబాద్‌లోని విశ్వేశ్వరయ్య భవన్‌లో జరుగనున్న విద్యుత్ బీసీ ఉద్యోగుల 19వ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, మెరిట్ ప్రాతిపదికన సీనియారిటీలను ప్రకటించి ఇప్పటికే ఇచ్చిన జేఎల్ఎం, ఏఈ, సబ్ ఇంజనీర్, జేఏఓ, కెమిస్ట్, జూనియర్ అసిస్టెంట్ తదితర ఫీడర్ పోస్టుల అడహక్ పదోన్నతులు సమీక్షించి రెగ్యులర్ పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సంస్థల్లో సుమారుగా 24వేల మంది ఉద్యోగులను ఆర్టిజన్లుగా కొనసాగిస్తున్నారని, వీరికి అర్హతలను బట్టి పదోన్నతులు కల్పించాలన్నారు. విద్యుత్ సంస్థల్లో డైరెక్టర్ల నియామకాల్లో 50 శాతం పోస్టులను బీసీ అధికారులతో భర్తీ చేయాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, కోడెపాక కుమారస్వామి, ముత్యం వెంకటన్న గౌడ్, ప్రేమ్‌కుమార్, ఎం.అశోక్ కుమార్, డాక్టర్ చంద్రుడు, పి.యాదగిరి, మారం శ్రీనివాస్, నీలారపు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

టీజీసెట్-2024 సర్టిఫికెట్ల జారీ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ నిర్వహించిన టీజీసెట్-2024లో అర్హత సాధించిన అభ్యర్థులకు సర్టిఫికెట్ల జారీని వైస్ చాన్సలర్ ప్రొ.కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అర్హత సాధించిన అభ్యర్థులు క్యాంపస్ దూరవిద్య కేంద్రంలో గల టీజీసెట్ కార్యాలయంలో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్టిఫికెట్లు పొందవచ్చని పేర్కొన్నారు. టీజీసెట్-2024 పరీక్షకు 26,294 మంది హాజరుకాగా 1,884 మంది అభ్యర్థులు అర్హత సాధించినట్లు తెలిపారు.

ట్రైబల్ విద్యార్థులకు ఇంగ్లిష్ భాషలో శిక్షణ

నేడు రాష్ట్ర గవర్నర్ ఆర్ట్స్ కాలేజీకి రాక

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో శుక్రవారం (నేడు) ట్రైబల్ విద్యార్థులకు ఇంగ్లిష్ భాషలో ఉచిత శిక్షణ కార్యక్రమం ప్రారంభంకానుంది. ఇంగ్లిష్ విభాగంలోని ఈఎల్‌టీసీ ద్వారా నెల రోజులపాటు శిక్షణ ఇవ్వనున్నారు. ఆర్ట్స్ కాలేజీ ఈ-క్లాస్ రూంలో ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరై తరగతులను ప్రారంభించనున్నారు. తెలంగాణలో డిగ్రీ చదివే ట్రైబల్ విద్యార్థుల కోసం ప్రత్యేక శిక్షణకు రాష్ట్ర గవర్నర్ ఆర్థిక సహాయం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

అభివృద్ధిపథంలో జీహెచ్ఎంసీ: ఇలంబర్తి

సాక్షి,సిటీబ్యూరో: గతేడాది నగరాభివృద్ధితో పాటు ప్రజలకు సేవలందించడంలో జీహెచ్ఎంసీ విజయవంతమైందని జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి అన్నారు. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకొని జోనల్ కమిషనర్లు, పలు విభాగాల అధిపతులు గురువారం ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇలంబర్తి మాట్లాడుతూ 2025లో అభివృద్ధి పథంలో మరింత ముందుకు సాగాలనే సంకల్పంతో పనిచేయాలన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కార్పొరేటర్లు అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని కమిషనర్ కోరారు. కొందరు కార్పొరేటర్లు, ఇతర అధికారులు కూడా కమిషనర్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

5న తెలంగాణ ర్యాంకింగ్ చెస్ టోర్నీ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం(టీజీసీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 5న తెలంగాణ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్ జరగనుంది. ఎల్బీ స్టేడియంలోని యోగా, వృష హాల్‌లో ఈ టోర్నీని ఏర్పాటు చేశారు. బాలబాలికల అండర్-7, 9, 11, 13, 15 విభాగాల్లో ఆటలు నిర్వహిస్తారు. స్విస్ ఫార్మాట్‌లో ఐదు రౌండ్లపాటు టోర్నీ జరుగుతుందని టీజీసీఏ అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ తెలిపారు. ఆసక్తిగల వారు తమ పేర్లను 73375 78899లోగానీ, 73373 99299 ఫోన్ నంబర్లలో నిర్వాహకులను సంప్రదించవచ్చు.

న్యాయవాదుల సహకార సంఘం బ్రాంచి ప్రారంభం


న్యాయవాదుల సహకార సంఘం బ్రాంచిని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి శశిధర్‌రెడ్డి

సిటీ కోర్టులు: రాజేంద్రనగర్ కోర్టు ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన భవనంలో న్యాయవాదుల సహకార సంఘం బ్రాంచీని గురువారం జిల్లా జడ్జి శశిధర్‌రెడ్డి, న్యాయవాదుల పరస్పర సహకార సంఘం ప్రెసిడెంట్ పిల్లరిశెట్టి శ్రీనాథ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ న్యాయవాదుల సౌకర్యార్థం ఈ బ్రాంచిని ఏర్పాటు చెసినట్లు తెలిపారు. కార్యాలయంలో స్టాంపులు, ఇతర స్టేషనరీ సంబంధించినవి లభిస్తాయన్నారు. కార్యక్రమంలో న్యాయవాదుల సహకార సంఘం వైస్ ప్రెసిడెంట్ మనికొండ ప్రవీణ్ కుమార్, సెక్రెటరీ శ్రీధర్, జాయింట్ సెక్రెటరీ మహేష్, ట్రెజరర్ తోర్నం గిరి, డైరెక్టర్లు పొలిసెట్టి రవి, షాయిరెడ్డి, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వెంకట్ రెడ్డి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

బీడీ పరిశ్రమకు ప్రత్యేక చట్టం కావాలి


సమావేశంలో మాట్లాడుతున్న సురేంద్రన్

పంజగుట్ట: రాష్ట్రంలో కేవలం బీడీలు చుట్టే మహిళలే 10 లక్షల మంది ఉన్నారని, అత్యధికంగా ఉపాధి కల్పిస్తున్న కుటీర పరిశ్రమ అయిన బీడీ పరిశ్రమను సిగిరెట్, పాన్‌మసాలా, గుట్కా ఇండస్ట్రీల నుంచివిభజించి ప్రత్యేక చట్టం తీసుకురావాలని భారతీయ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఎంఎస్ అఖిల భారత సంఘటన కార్యదర్శి బి.సురేంద్రన్, అఖిల భారత ఉపాధ్యక్షుడు సుంకరి మల్లేశం, రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి టి.రాంరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వాలు తీసుకుంటున్న నిర్ణయాలవల్ల విచిత్రంగా యాజమాన్యాలు కూడా వలస వెళ్లే పరిస్థితి బీడీ పరిశ్రమకు దాపురించిందన్నారు. మొబైల్ డిస్పెన్సరీలు ఏర్పాటు చేసి కార్మికులు ఉన్నచోటనే వైద్యం అందించాలని కోరారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బీడీ కార్మికుల ఆసరా పింఛన్ 2 వేల నుంచి 4 వేలకు పెంచుతామని హామీ ఇచ్చి, ఇప్పుడు విస్మరించిందని ఆరోపించారు. సమావేశంలో రామ్మోహన్, సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగులకు 'పాత పెన్షన్' ఇవ్వాలి

కేంద్రాన్ని కోరిన ఆర్ఈఎంఓపీఎస్

అడ్డగుట్ట: కేంద్ర ప్రభుత్వం రైల్వే ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్నే అమలు చేయాలని రైల్వే ఎంప్లాయీస్ మూమెంట్ ఫర్ ఓల్డ్ స్కీం(ఆర్ఈఎంఓపీఎస్) జోనల్ అధ్యక్షుడు సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్ఈఎంఓపీఎస్ ఆధ్వర్యంలో లాలాగూడ వర్క్‌షాప్ నుంచి మెట్టుగూడ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వరకు రైల్వే ఉద్యోగులు వారి కుటుంబసభ్యులతో కలిసి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జోనల్ అధ్యక్షుడు సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శి డానియల్ మాట్లాడుతూ 2004 జనవరి 1వ తేదీ తరువాత నియమితులైన రైల్వే ఉద్యోగులకు ఓపీఎస్ స్థానంలో ఎన్‌పీఎస్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకాన్ని అమలు చేయడాన్ని నిరసిస్తూ ప్రతీ సంవత్సరం జనవరి 1న బ్లాక్ డే గా పాటిస్తామని చెప్పారు. తమ పోరాటి ఫలితంగా యూపీఎస్(యూనిఫైడ్ పెన్షన్ స్కీం) తీసుకొచ్చారని, దానివల్ల కూడా ఉద్యోగులకు ఒరిగేదేమి లేదన్నారు. ఎన్‌పీఎస్, యూపీఎస్ వల్ల పదవీ విరమణ చేసిన తరువాత తమ కుటుంబాలు రోడ్డు మీద పడాల్సి వస్తుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం తమ సేవలను గుర్తించి ఓల్డ్ పెన్షన్ స్కీంను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీలో నాయకులు వి.శ్రీధర్, శశిధర్, జరద్, రాజ్‌కుమార్, పి. శ్రీధర్, శంకర్, మల్లికార్జున్, నర్సింగ్‌రావు, ముఖేష్ మీనా, శ్యామ్ లాల్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



లాలాగూడ వర్క్‌షాప్ నుంచి మెట్టుగూడ చౌరస్తా వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ఈఎంఓపీఎస్

'నిలోఫర్'కు ఆధునిక పరికరాలు


ల్యాబోరేటరీలోని పరికరాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ ఎస్.రవికుమార్

నాంపల్లి: నిలోఫర్ ఆసుపత్రి పాథాలజీ విభాగానికి సరికొత్తగా ఆధునికమైన పరికరాలు సమకూర్చారు. ప్రభుత్వం నుంచి వచ్చిన అడ్వాన్స్‌డ్ లేటెస్ట్ ఎక్విప్‌మెంట్స్‌ను పాథాలజీ విభాగంలో అమర్చారు. ఈ నూతన పరికరాల లెబోరేటరీని గురువారం నిలోఫర్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.రవికుమార్ ప్రారంభించారు. రక్త నమూనాల సేకరణ వేగవంతం కావడానికి ఈ పరికరాలు ఎంతగానో దోహదపడుతాయని అన్నారు. అత్యాధునిక టెక్నాలజీలతో కూడిన సేవలు రోగులందరూ సద్వినియోగం చేసుకునే వెసులుబాటు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో-1 నాగజ్యోతి, పాథాలజీ విభాగం హెచ్‌వోడీ ప్రొఫెసర్ డాక్టర్ నిత్యానంద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జువాఫ్సన్ సుల్తానా, డాక్టర్ ఉమాదేవి, పలువురు వైద్యులు, ల్యాబ్ టెక్నీషియన్లు పాల్గొన్నారు.

ప్రాణాపాయ స్థితిలోని రోగికి పునర్జన్మ

- కేర్ ఆస్పత్రి వైద్యుల ఘనత..
- బలహీనమైన గుండె పనితీరు సరిజేశారు..

బంజారాహిల్స్: పలుమార్లు గుండెపోటుకు గురై ప్రాణాపాయ స్థితిలో ఆస్పత్రిలో చేరిన 68 ఏళ్ల వృద్ధురాలికి కేర్ ఆస్పత్రి వైద్యులు పునర్జన్మ అందించారు. అతి బలహీనంగా ఉన్న గుండె పనితీరును సరిజేయడంతో పాటు అవసరమైన అధునాతన వైద్య చికిత్స అందించడం ద్వారా రోగి ప్రాణాలను నిలబెట్టారు. బహుళ అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నగరానికి చెందిన ఓ మహిళా రోగి తీవ్రమైన హృద్రోగానికి గురయ్యారు. కుటుంబసభ్యులు వెంటనే ఆమెను బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రికి తీసుకువచ్చారు. వైద్యులు సూర్యప్రకాశరావు నేతృత్వంలోని వైద్యబృందం రోగి గుండె పనితీరును పరీక్షించారు. రోగి గుండె కేవలం 25 శాతం రక్తాన్ని మాత్రమే సరఫరా చేస్తుందని గుర్తించారు. ప్రాణాంతక అరిథ్మియా వల్ల వెంట్రిక్యులర్ టాకీ కార్డియా (వీటీ), వెంట్రిక్యులర్ ఫైబ్రిలేషన్ (బీఎఫ్) ఇబ్బందులతో రోగి ప్రాణాపాయస్థితిలో ఉన్నట్లు గుర్తించారు. బహుళ అనారోగ్య సమస్యలు, గుండెపోటు, మధుమేహానికి సంబంధించిన కార్డియోమయోపతి వంటి కారణాలతో ఈ దుస్థితి నెలకొని ఉండవచ్చని అంచనా వేసి రోగికి వెద్య చికిత్స ప్రారంభించారు.

అధునాతన పరికరంతో హృదయ స్పందన నియంత్రణ


పేషెంట్‌తో కేర్ ఆస్పత్రి వైద్యులు

రోగి ఆరోగ్య పరిస్థితిని స్థిరీకరించడానికి మొదట రోగిని ఇంట్రా-అయోర్టిక్ బెలూన్ పంప్(ఐఏబీపీ) పరికరంలో వెంటిలేటర్ సాయంతో ఉంచారు. అయిన్పటికీ ఆమె హృదయ స్పందనలు అసాధారణంగానే కొనసాగాయి. దీంతో 'స్టెలేట్ గ్యాంగ్లియన్ బ్లాక్'వైద్య చికిత్స, కార్డియో వెర్షన్, అధునాతన ఫార్మాకోథెరపి అందించడం ద్వారా రోగి ఆరోగ్యస్థితిని సాధారణ స్థాయికి తెచ్చారు. ఆరోగ్యం మెరుగు పడిన తర్వాత రోగికి 'స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ కార్డియాక్ రీ సంక్రోనైజేషన్ థెరపీ డిఫిబ్రిలేటర్'(సీఆర్‌టీడీ) అమర్చారు. ఈ అధునాతన పరికరం ఆమె హృదయ స్పందనను నియంత్రించడంలో సహాయ పడటమే కాకుండా గుండె నుంచి రక్త సరఫరా పనితీరును మెరుగుపరచడానికి సాయపడుతుందని కేర్ ఆస్పత్రి క్లినికల్ డైరెక్టర్, కార్డియాలజీ విభాగాధిపతి డాక్టర్ వి.సూర్యప్రకాశరావు తెలిపారు. వైద్య బృందంలో ఎస్.రాహల్ అగర్వాల్, టీవీఎస్ గోపాల్, ఎస్వీకే రామకృష్ణ, సిబ్బంది ఉన్నారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, శుక్రవారం, 3, జనవరి, 2025



కొంగొత్త ఆశల వేదిక కొత్త ఏడాది.. విభిన్న న్యూ రిజల్యూషన్స్‌తో మొదలయ్యేది న్యూ ఇయర్. ఇప్పుడైతే గత సంవత్సరం ఏం చేశామని వెనక్కు తిరిగి చూసుకోవాలనుకుంటే.. కనిపించే మాధ్యమం సోషల్‌మీడియా. ఏడాదంతా ఏం చేశాం..? ఎక్కడెక్కడ తిరిగాం? మన జీవితంలో వచ్చిన మార్పులేంటనే విశేషాలన్నీ తేదీతో సహా మన ఓల్డ్ పోస్టులలో చూసుకోవచ్చు. వీటి కోసం ఫేస్‌బుక్, ఇన్‌స్టా, ఎక్స్, స్నాప్‌చాట్, గూగుల్ ఫొటోస్ వంటి ఎన్నో ఆన్‌లైన్ మాధ్యమాలున్నాయి. కానీ గతంలో వీటన్నింటినీ బర్తీ చేసింది 'డైరీ' మాత్రమే. నూతన సంవత్సరం నేపథ్యంలో ఆనాటి మధుర జ్ఞాపకమైన 'డైరీ' గురించి ఓ సారి మననం చేసుకుందాం.

– సాక్షి, సిటీబ్యూరో

అక్షర జ్ఞాపకం

పది కాలాల పాటు పదిలంగా..

- పాత తరం వారికి ఇది రోజువారీ అలవాటు
- నేటికీ ఆదరణ కోల్పోని డైరీ రైటింగ్
- అత్యాధునిక సాంకేతికతతో కొత్త హంగులు
- వీడియోలు, ఆడియోలు, టెక్ట్స్ రూపంలో
- ఇప్పటికీ రాసే పద్ధతినే అనుసరిస్తున్న ఔత్సాహికులు
- డైరీ రైటింగ్ ఫేవరెట్‌గా మార్చుకునే రచయితలు
- ఓల్డ్ డైరీల కలెక్షన్ కూడా ఓ హాబీగా..



ప్రస్తుతం ఇన్‌స్టా స్టేటస్, ఫేస్‌బుక్ పోస్ట్ పెట్టడంలో బీజీ అయిపోయిన ఈ తరానికి.. రోజూ పడుకునే ముందు ఆ రోజు జరిగిన విశేషాలన్నీ రాసుకునే డైరీ గురించి అంతగా ఆసక్తి లేదు. దశాబ్దకాలం క్రితం వరకూ డైరీకి ఆదరణ ఉన్నప్పటికీ.. సోషల్ మీడియా ప్రభావంతో తన ప్రశస్తి కోల్పోయిన వాటిలో డైరీ కూడా ప్రధానమైనదే. కానీ ఈ రోజుల్లోనూ డైరీ రాసేవారు లేకపోలేదు. దీంతోపాటు ఆ జ్ఞాపకాలను ఏళ్ల తరబడి పదిలంగా దాచుకునే వారూ ఉన్నారు. చరిత్రలో అనేక మంది ప్రముఖులు జీవిత విశేషాలను బహిర్గతం చేసినా, వారి జ్ఞాపకాలను, అనుభవాలను గుర్తించిన వాటిల్లో ఒక ప్రధానమైన సాధనం డైరీనే అనడంలో అతిశయోక్తి లేదేమో..

రూపం మార్చుకుని..

ఇటీవలి కాలంలో అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. కష్టపడి గంటల తరబడి రాసే పనిలేకుండా అంతా డిజిటలైజేషన్ అయిపోయింది. జ్ఞాపకాలను ప్రస్తుతం వీడియోలు, ఆడియోలు, డిజిటల్ యాప్‌లలో టెక్ట్ రూపంలో పదిలపరుచుకుంటున్నారు. ఏదేమైనా రూపాన్ని మార్చుకుని సోషల్ మీడియా యాప్‌ల రాకతో తమకు తెలియకుండా ఎప్పటికప్పుడు జ్ఞాపకాలను డిజిటల్ మాధ్యమం మన కళ్లముందుకు తెస్తోందని చెప్పవచ్చు. దీంతోపాటు డైరీలు అలవాటు ఉన్నవారిలో కొందరు మొబైల్ ఫోన్‌లో నోట్స్ రూపంలో మినీ డైరీని రాసేస్తున్నారు. కానీ డైరీ ఇచ్చిన సంతృప్తిని మాత్రం ఇవ్వలేదని ఇప్పటికీ కొందరు రాసేపద్ధతినే అనుసరించే డైరీ ప్రియులు అభిప్రాయపడుతున్నారు.





యాంటిక్ కలెక్షన్..

ఆధునిక జీవనాన్ని కొనసాగిస్తూనే వినూత్నంగా ఉండటం కొందరి లక్షణం. ప్రస్తుత తరుణంలో డైరీ రాసే వారు కూడా ఈ కోవలోకే వస్తారు. ఇప్పటికీ కొత్త ఏడాది వచ్చిందంటే చాలు.. బుక్ స్టోరుకో, స్టేషనరీకో వెళ్లి డైరీ కొనుక్కునే యువతరం లేకపోలేదు. గతంలో మాదిరి దినచర్యగా కాకపోయినా.. కాసింత పొయెటిక్‌గా సాహిత వెల్లువలతో డైరీ రాసుకునే కళాత్మక హృదయం ఉన్నవారూ ఉన్నారు. వినూత్నత్వాన్ని కోరుకునే ఎంతో మంది ఇప్పటికీ రాత్రి డైరీ రాసే పడుకుంటున్నారు. ఈ సంస్కృతిని ఇంకొంత కాలం పొడిగించే ఇలాంటి వారి కోసం మార్కెట్‌లో విభిన్న రకాల డైరీలూ అందుబాటులో ఉన్నాయి. ముఖ్యంగా ఈ మధ్య యాంటిక్ కలెక్షన్ డైరీలకు మంచి క్రేజ్ పెరిగింది. వీరికి డైరీ కలెక్షన్ కూడా ఒక ఆర్ట్‌గా మారింది.



జీవనశైలిలో మార్పుతో..

కొన్ని సంవత్సరాలు వెనక్కి వెళితే.. అనుకోకుండా ఒక మధుర జ్ఞాపకం గుర్తుకొస్తే వెంటనే డైరీ తెరిచి ఆ విశేషాలన్నీ చదువుకునే వారు. ముఖ్యమైన రోజులు, తీపి గుర్తులతో పాటు బాధలు, ఎదుర్కొన్న విపత్కర పరిస్థితులు.. ఇలా సమ్మిళిత ప్రయాణం గురించి క్షుణ్ణంగా రాసి భద్రపరుచుకునే వారు. వీటితో పాటు ఆర్థిక పరమైన విషయాలు, లావాదేవీలు, అప్పులు అన్నింటికీ ఎకైక వేదిక డైరీ. చాలా మంది ఇళ్లలో తమ ముందు తరం వారు రాసిన డైరీలు ఇప్పటికీ అక్కడక్కడా కనిపిస్తుంటాయి. ఇంతటి విశిష్టమైన డైరీ అధునాతన జీవనశైలి, జీవన మార్పుల్లో భాగంగా అంతరించిపోతోంది.

అత్యంత విలువైన డైరీలివే..

వృత్తిలో సామాజిక బాధ్యతను భాగం చేసుకున్న కొందరు ప్రొఫెషనల్ ఉద్యోగులకు ఈ డైరీ ప్రామాణికంగా కొనసాగుతోంది. ముఖ్యంగా పోలీసులు, జర్నలిస్టులు, సైంటిస్టులకు ఈ డైరీ ఇప్పటికీ ఎంతో ఉపయుక్తంగా ఉందని కొన్ని సర్వేలు వెల్లడిస్తున్నాయి. ఎన్నో ముఖ్య కేసులను చేధించే పోలీసు వారు తమ పాత ఇన్వెస్టిగేషన్ల వివరాలను డైరీలో పొందుపరుచుకుంటారు. పోలీస్ స్టేషన్ రికార్డులు ఎలా ఉన్నా వీరి డైరీలు మాత్రం ఎన్నో నిజాలను దాచిపెట్టుకుంటాయి. ప్రతి రోజూ ఏదో ఒక కొత్త విషయంపై ఆరా తీసే జర్నలిస్టుల డైరీలు కూడా పరిశోధనా పత్రాలను తలపిస్తాయని ఓ సీనియర్ జర్నలిస్టు వాఖ్య. ఇలా శాస్త్ర సాంకేతిక పరిశోధకులు, బ్యూరోక్రాట్ల డైరీలు విశిష్టమైనవని పలువురు ప్రముఖులు చెబుతున్న మాట.





బిజ్లీకి ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్ అవార్డు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–3లోని ఎం స్టూడియోకు చెందిన బిజ్లీ సుధాబాయి ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్‌గా అవార్డు అందుకున్నారు. రాజస్థాన్ జైపూర్‌లోని జీ స్టూడియోస్‌లో జరిగిన ప్రతిష్టాత్మక ఫరెవర్ బిజినెస్ అవార్డు 2024 ప్రదానోత్సవంలో ఆమెను ఘనంగా సత్కరించారు. ఇదే వేదికపై వివిధ రంగాల్లోని విశిష్ట ప్రతిభ కలిగిన వ్యక్తులను సన్మానించారు. గత 15 ఏళ్లుగా ఆమె లాక్మే, నేచురల్స్, జావేద్ హబీబ్ వంటి సంస్థలతో పనిచేశారు. పలు ఫ్యాషన్ షోలలో తన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ ప్రయాణంలో లాక్మే వంటి ప్రధాన ఫ్యాషన్ ఈవెంట్‌కు బ్యాక్ స్టేజ్‌లో పనిచేసే అవకాశం పొందారు. ఎం స్టూడియో హెయిర్ బ్యూటీ మేకప్‌లో అడ్వాన్స్‌డ్ టెక్నిక్స్‌తో వ్యక్తిగత అవసరాలకు అనుగుణంగా అద్భుత సేవలు అందిస్తున్నారు. ఈ రంగంపై ఉన్న ఆసక్తితో తన అనుభవాలు, తాజా ట్రెండ్స్, జ్ఞానాన్ని విస్తృతంగా ప్రజలతో పంచుకోనున్నట్లు అవార్డు అందుకున్న బిజ్లీ సుధాబాయి ఈ సందర్భంగా పేర్కొన్నారు.

యాప్ యాప్.. హుర్రే..

న్యూ ఇయర్ వేడుక ఆన్‌లైన్ యాప్స్‌కి ఈ సారి అతిపెద్ద పండుగ తెచ్చింది. బిర్యానీ మొదలుకుని కేకులు, పిజ్జాల వరకూ టాప్ క్విక్ కామర్స్ ప్లాట్‌ఫారమ్‌లకు రికార్డ్ బ్రేకింగ్ ఆర్డర్‌లను అందించింది. నగరంతో సహా దేశంలోని అన్ని రకాల ఆహారోత్పత్తులను అందించే ఫుడ్ డెలివరీ యాప్స్ నుంచి బస, వసతి సౌకర్యాలను అందించే యాప్స్ వరకూ భారీ లాభాలను ఆర్జించాయి.

– సాక్షి, సిటీబ్యూరో

న్యూ ఇయర్ వేడుకల నేపథ్యంలో నగరాల్లో ఫుడ్ డెలివరీ ఆర్డర్‌లు ఒక్కసారిగా పెరిగాయి. నెల్లూరులో 164 సెకన్లకో చికెన్ బిర్యానీ చొప్పున డెలివరీ చేయడం లాంటి రికార్డ్స్ ఎన్నో నమోదయ్యాయి. మొత్తంగా చూస్తే అత్యధిక ఆర్డర్లతో చికెన్ బిర్యానీ దేశవ్యాప్తంగా ఇష్టమైనదిగా నిలిచిందని పలు యాప్స్ నిర్వాహకులు చెబుతున్నారు.

కేక్స్ నుంచి డ్రింక్స్ దాకా..

కేవలం స్విగ్గీ ద్వారానే 2,96,711 ఆర్డర్‌లతో కేక్‌లు కూడా న్యూ ఇయర్‌లో హాట్ కేక్స్‌గా మారాయి. మొత్తం రూ.1,79,735 టిప్స్‌ను అందించి అత్యధిక టిప్స్ ఇచ్చిన సిటీగా బెంగళూరు అగ్రస్థానంలో నిలిచిందని బ్లింక్ ఇట్ వెల్లడించింది. కోల్‌కతా నుంచి అతిపెద్ద పార్టీ ఆర్డర్ అందుకున్నామని, దాని విలువ రూ.64,988 అని బ్లింక్ ఇట్ సీఈవో అల్బిందర్ ధిండా తెలిపారు. స్విగ్గీ అందుకున్న ప్రతి 8 ఆర్డర్‌లలో ఒకటి కూల్ డ్రింక్ కావడం చిల్ వింటర్‌లోనూ శీతల పానీయాలపై ఉన్న క్రేజ్ తెలుపుతోంది. కోలా పానీయాల అమ్మకాలు 394% ఇతర సాఫ్ట్ డ్రింక్స్ విక్రయాలు 941శాతం పెరిగాయి. బిగ్‌బాస్కెట్ సీఈఓ హరి మీనన్ మాట్లాడుతూ వెజ్ స్నాక్స్ (240%) ఐస్ క్యూబ్‌లు (1,290%) కాకుండా హోమ్ బేకింగ్, కార్డ్‌లు పార్టీ గేమ్‌ల కోసం ఆర్డర్స్ వెల్లువెత్తాయని చెప్పారు.



రెట్టింపు విక్రయాలు..

మునుపటి సంవత్సర వేడుకల విక్రయాల కంటే రెట్టింపు విక్రయాలు అందుకున్నామని నిర్వాహకులు అంటున్నారు. స్విగ్గీ ఫుడ్ మార్కెట్ ప్లేస్ సీఈఓ రోహిత్ కపూర్ మాట్లాడుతూ, మునుపెన్నడూ లేని వేడుకలను ఈ సారి చవిచూశామని చెప్పారు. తమ డెలివరీ భాగస్వాములు మొత్తం 65,19,841 కిలోమీటర్లు ప్రయాణించారని చెప్పారు.

హిల్స్.. థ్రిల్స్..

ఆన్‌లైన్ ద్వారా రూమ్స్ బుకింగ్‌కు పేరొందిన ఓయో సంస్థ సీఈఓ రితేష్ అగర్వాల్ ప్రకారం న్యూ ఇయర్ వేడుకల కోసం డెహ్రాడూన్ – శ్రీనగర్ అత్యధికంగా బుక్ చేసిన హిల్ స్టేషన్‌గా నిలిచింది. కర్ణాటక కూర్గ్ బుకింగ్స్‌లో 28 రెట్లు పెరుగుదలను చూసింది. ముస్సోరీ, బుకింగ్‌లో 10 శాతంపెరుగుదలను అనుసరించింది.

ఆధ్యాత్మికానికీ జై..

హిల్ స్టేషన్‌లతో సమానంగా ఆధ్యాత్మిక ప్రదేశాలూ పర్యాటక ఆదరణ పొందాయి. బనారస్ (వారణాసి) అత్యంత ప్రజాదరణ పొందిన ఆ ధ్యాత్మిక గమ్యస్థానంగా నిలిచింది. తొలిసారి 12,841 బుకింగ్‌లతో అయోధ్య టాప్ చార్ట్ లోకి ప్రవేశించింది. ప్రముఖ ఆధ్యాత్మిక నగరం షిరిడీ 940 శాతం పెరుగుదల కనిపించగా, అజ్మీర్ 761 శాతం పెరిగాయి.

రూమ్ రికార్డ్..

ప్రపంచవ్యాప్తంగా 10 లక్షల మందికి పైగా ఓయో రూమ్‌లను బుక్ చేశారు. గతేడాదితో పోలిస్తే ఇది 58 శాతం పెరిగింది. తెల్లవారుజామున 2 గంటలకు వెబ్‌సైట్ ట్రాఫిక్ పెరిగింది. ఇందులో 41% పెరుగుదల నమోదైంది.

తారా సోయగం..

లక్ష్మీకా జ్యువెలర్స్ ప్రారంభోత్సవంలో సినీతారలు డింపుల్ హయాతి, దివి..





సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని బంజారాహిల్స్ వేదికగా మొదటిసారిగా ఏర్పాటు చేసిన లక్ష్మీకా జ్యువెలర్స్ స్టోర్స్ ప్రారంభోత్సవంలో ప్రముఖ సినీతారలు డింపుల్ హయాతి, దివి సందడి చేశారు. ఈ అందాల ముద్దుగుమ్మలు ముఖ్య అతిథులుగా హాజరై లక్ష్మీకా జ్యువెలర్స్ స్టోర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నటి దివి.. ఆభరణాల పట్ల తనకున్న అభిమానాన్ని, అమితమైన ప్రేమను వ్యక్తం చేసింది. సమకాలీన కళాత్మకతతో పాటు భారతీయ సంప్రదాయాల గొప్పతనాన్ని ప్రతిబింబిస్తున్న లక్ష్మీకా ఆధ్వర్యంలోని అద్వితీయమైన కలెక్షన్ మగువల అందాన్ని మరింత పెంచుతాయని అన్నారు. సూక్ష్మ కళా నైపుణ్యంతో రూపొందించిన ఈ వేదికలోని బంగారం, వజ్రాలు, పోల్కి వంటి ఆభరణాలు 2 లక్షల నుంచి 50 లక్షలకు పైగా ధరల్లో అందుబాటులో ఉన్నాయని వ్యవస్థాపకులు లక్ష్మి తెలిపారు. ఇది కేవలం నగల దుకాణం మాత్రమే కాదని..., మన వారసత్వం, హస్తకళకు సంబంధించిన వేడుకని సహవ్యవస్థాపకురాలు కావ్య వెల్లడించారు.

పీసీ సర్కార్ మ్యాజిక్ షో

హరిహర కళాభవన్‌లో రేపటి నుంచి ప్రారంభం



రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో ఈ నెల 4వ తేదీ నుంచి మ్యాజిక్ షో నిర్వహిస్తున్నట్లు పీసీ సర్కార్ జూనియర్ (పౌరుష్) తెలిపారు. గురువారం హరిహర కళాభవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడేళ్ల క్రితం నగరంలోని ఇదే వేదికపై తాము నిర్వహించిన మ్యాజిక్ షోకు ప్రజల ఆదరణ లభించిందని తెలిపారు. కాగా 4వ తేదీ నుంచి ప్రతి శని ఆదివారాల్లో ఈ షో నిర్వహించనున్నామని, సాయంత్రం 4 గంటలకు, 7 గంటలకు రెండు షోలు ఉంటాయని, 19వ తేదీ వరకూ ఉంటుందని తెలిపారు. సంక్రాంతి సందర్భంగా 13, 14 తేదీల్లో షో కొనసాగుతుందని, ఈ సారి మ్యాజిక్ హాస్యంతో మరింత మంత్ర ముగ్దుల్ని చేస్తుందన్నారు. అలాగే తన తాత ప్రతుల్ చంద్రప్రకాష్ సర్కార్ మొట్ట మొదటి సారి జపాన్‌లో ప్రదర్శించిన వస్తువులు, లైటింగ్ ప్రత్యేక ఆకర్షణ అన్నారు. ఈ షోలో ఆరో తరగతి చదివే తన కుమారుడు పౌరిష్ చంద్ర సర్కార్ మొదటి ప్రదర్శన ఇవ్వనున్నాడు. ఈ షో కోసం నేరుగా హరిహర కళాభవన్‌లోనూ, డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఇన్‌సైడర్.ఇన్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ, 8523038257లోనూ బుక్ చేసుకోవచ్చని తెలిపారు.

70 ఏళ్ల అధిరోహకుడు..

ఆయన వయసు 70 ఏళ్లు.. సాధారణంగా ఈ వయసు వాళ్లు మహా అయితే తీర్థ యాత్రలు చేస్తుంటారు. లేదంటే ఇంటికే పరిమితమై మనుమలు, మనుమరాళ్లతో కాలక్షేపం చేస్తుంటారు. కానీ డాక్టర్ ఏజీఆర్‌పీ రెడ్డి మాత్రం తీవ్ర చలికి తట్టుకుని హిమాలయాల్లో సాహసోపేతమైన ట్రెక్కింగ్ చేయాలని నిర్ణయించుకున్నారు.. అనుకోవడమే కాదు.. ఆ యాత్రను పూర్తిచేసి వయసుతో పనిలేకుండా ఎలాంటి సాహసాన్ని అయినా చేయవచ్చని నిరూపించాడు.

– బంజారాహిల్స్



- బుగ్గల్ శిఖరంపైకి సాహస యాత్ర
- 60 ఏళ్ల వయసులో మారథాన్ ట్రైనింగ్
- ఔరా అనిపిస్తున్న డాక్టర్ ఏజీఆర్‌పీ రెడ్డి

ఐటీ, యానిమేషన్ రంగంలో సీఈఓగా 25 ఏళ్ల పనిచేసిన అనుభవం ఉంది. 60 ఏళ్ల వయసులో ట్రైనింగ్ ప్రారంభించి మారథాన్ రన్నర్‌గా ఎదిగారు. హైదరాబాద్ వంటి వెచ్చని ప్రాంతంలో నివసిస్తున్నప్పటికీ చల్లని వాతావరణం ఏబీఆర్‌పీ రెడ్డికి కొత్తేమీ కాదు. గతంలో ఢిల్లీ, ఇంగ్లండ్‌లో కూడా నివసించారు. ఇప్పటికే ఐదుసార్లు హిమాలయాల్లో ట్రెక్కింగ్ చేసిన ఆయన కుమార్తె సింధు కూడా వెంట ఉంది. ట్రెక్కింగ్ చేయడానికి కూతురే తనకు ప్రేరణ అని ఏబీఆర్‌పీ రెడ్డి పేర్కొన్నారు. ఏటా 20 వేల మందికి పైగా ట్రెక్కింగ్ చేసేవారికి మార్గనిర్దేశం చేసే ఇండియా హైక్స్ బైక్ గ్రూప్‌లో ఆయన చేరారు. వారు గరిష్ట వయో పరిమితి 62 ఏళ్లుగా నిర్దేశించినప్పటికీ, ఏబీఆర్‌పీ రెడ్డి గుండె సంబంధిత అంశాలతో సహా ఇతర ఫిట్‌నెస్ ప్రమాణాలకు అనుగుణంగా ఉండడంతో ట్రెక్కింగ్ పూర్తి చేశారు.

నెల రోజుల పాటు శిక్షణ..

ట్రెక్కింగ్ కోసం నెల రోజుల పాటు జిమ్‌లో శిక్షణ పొందాను. ఇందు కోసం రోజుకు 60 అంతస్తులు వేగంగా ఎక్కేవాడిని. ట్రెక్కింగ్ సమయంలో రాత్రి పూట ఉష్ణోగ్రతలు 10 డిగ్రీ సెంటీగ్రేడ్‌కు చేరుకుంటాయి. దీంతో తీవ్రమైన చలిని ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇదే అత్యంత క్లిష్టమైన భాగం. తీవ్ర చలిని తట్టుకునేందుకు గుడారాల లోపల ఉండాలి. స్లీపింగ్ బ్యాగులను ఉపయోగించాలి. ఎత్తుకు చేరుకున్నప్పుడు వాతావరణ పీడనాన్ని ఎదుర్కోవాలి. తక్కువ ఆక్సిజన్ కారణంగా ఆల్టిట్యూడ్ సిక్‌నెస్ రావచ్చు.

ఈ స్ఫూర్తితో మరిన్ని సాహసాలు..

నా కుమార్తె సింధు టెక్కింగ్ గ్రూపులో ఉండడం వల్ల అధిరోహణ, దిగే సమయంలో ఎన్నో సూచనలు చేసింది. మూడు రోజుల్లో మా బృందంలోని మొత్తం 24 మంది ట్రెక్కర్లు దయారా బుగ్గల్ అనే 12,000 అడుగుల ఎత్తు శిఖరాన్ని చేరుకున్నాం. శిఖరాన్ని చేరుకున్నప్పుడు ట్రెక్కింగ్‌లో ఎదుర్కొన్న కష్టాలను పూర్తిగా మరిచిపోయి సంబరాలు చేసుకున్నాం. అక్కడి నుంచి కిందికి దిగడం మొదలై నాల్గో రోజు సాయంత్రం బేస్ క్యాంప్‌కు చేరుకున్నాం. బేస్ క్యాంప్ డెహ్రాడూన్ నుంచి 180 కిలోమీటర్ల దూరంలో ఉంది. మొత్తం 12,000 అడుగుల ట్రెక్కింగ్ ఇచ్చిన స్ఫూర్తితో 2025లో 18,000 అడుగుల ఎత్తు ట్రెక్కింగ్‌కు సిద్ధం అవుతున్నాను.

– డాక్టర్ ఏబీఆర్‌పీ రెడ్డి

క్లుప్తంగా...

బకాయిలు చెల్లించండి



సాక్షి, హైదరాబాద్: ప్రైవేటు కళాశాలల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే చెల్లించాలని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాల సంఘం అధ్యక్షుడు గౌరీ సతీశ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు. ఆయన గురువారం సీఎంను కలిసి బకాయిలపై వినతి పత్రం అందజేశారు. ప్రైవేటు కాలేజీలకు ప్రభుత్వం రూ.5 వేల కోట్లకు పైగా బకాయిలు చెల్లించాల్సి ఉందని వివరించారు. లక్షలాది మంది పేద విద్యార్థులు ప్రైవేటు కాలేజీల్లో చదువుతున్నారని, వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బకాయిలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



భట్టి విక్రమార్కను కలిసిన రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నేతలు

సాక్షి, హైదరాబాద్: ఉద్యోగ విరమణ చేసిన ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కోరింది. సంఘం అధ్యక్షుడు జి.దామోదర్ రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధుల బృందం గురువారం ఉప ముఖ్యమంత్రిని కలిసింది. రిటైర్డ్ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ పథకం ద్వారా కార్పొరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్య సేవలు అందించాలని కోరారు. సేవలు అందకపోవడంతో వృద్ధాప్యంలో అనేక ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి జిల్లాలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు.



ధర లేక.. టమాటా పంట కాల్చివేత

రెండెకరాల్లో 7500 కిలోల టమాటా పంట ధ్వంసం

శివ్వంపేట(నర్సాపూర్): టమాటాకు మార్కెట్‌లో ధర లేకపోవడంతో ఒక రైతు పంటను తగులబెట్టాడు. మండల పరిధి నవాబుపేట గ్రామానికి చెందిన రవిగౌడ్ నాలుగు ఎకరాల్లో టమాటా పంటను సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం పొలం నుంచి పంటను సేకరించి మార్కెట్‌కు తరలిస్తే.. ఒక్కొక్క బాక్స్‌కు రూ.50 మించి ధర రావడం లేదు. రవాణాకు ఒక్కో బాక్స్‌కు రూ.30 పోగా రూ.20 వస్తున్నాయని, కూలీల డబ్బులు సైతం చేతికి అందడం లేదని రైతు వాపోయాడు. దీంతో గురువారం రెండు ఎకరాల్లోని 7500 కిలోల టమాటా పంటను తొలగించి తగులబెట్టాడు. ఇదే గ్రామంలో 25 మంది రైతులు సుమారు 60 నుంచి 70 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నారు. గిట్టుబాటు ధర లేకపోవడంతో వీరంతా తీవ్రంగా నష్టపోవలసిన పరిస్థితి నెలకొంది.

రహదారి దెబ్బ తినకుండా..



నేలకొండపల్లి: పొలాలు దున్నే ట్రాక్టర్ల రాకపోకలతో రోడ్లు దెబ్బ తింటుంటాయి. వాహనచోదకులు కూడా ఇబ్బంది పడుతుంటారు.. దీన్ని నివారించేందుకు ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం బోదులబండ రైతు, ట్రాక్టర్ యజమాని మరికంటి కిశోర్ వినూత్న ఆలోచన చేశారు. పొలాలకు వెళ్లేటప్పుడు కేజీవీల్స్ రోడ్డును తాకకుండా మరో ట్రాక్టర్‌కు జతచేసి నడిపిస్తున్నారు. ట్రాక్టర్ ముందు నడుస్తుంటే.. కేజీవీల్స్ ఉన్న ట్రాక్టర్ రివర్స్‌లో వెళ్తుంటుంది. కాగా, ఇది చూసిన వారు రైతు కిశోర్‌ను అభినందిస్తున్నారు.

దాటవేత.. ఎగవేత!

సూపర్ సిక్స్ సహా హామీలకు బాబు మంగళం • 'తల్లికి వందనం' ఎగనామం..

సాక్షి, అమరావతి: అన్ని పథకాలపై దాటవేత ధోరణి.. చర్చల పేరుతో కాలక్షేపం.. ఎగవేతకు దారుల అన్వేషణ..! కొత్త సంవత్సరంలోనూ క్యాబినెట్ సాక్షిగా సూపర్ సిక్స్ హామీలకు కూటమి సర్కారు ఎగనామం పెట్టింది. తల్లికి వందనం నుంచి అన్నదాతా సుఖీభవ దాకా.. ఆడబిడ్డ నిధి నుంచి ఉద్యోగులకు పీఆర్సీ, ఐఆర్.. నిరుద్యోగులకు భృతి వరకు ఇదే తీరు!! కొత్త ఏడాది కోటి కళ్లతో ఆశగా ఎదురు చూస్తున్న తల్లులు, రైతన్నలు, ఉద్యోగులు, నిరుద్యోగులకు మళ్లీ నిరాశ మిగిలింది. ఎన్నికల ముందు సూపర్ సిక్స్.. సెవన్ అంటూ ఎడాపెడా హామీలిచ్చిన సీఎం చంద్రబాబు పీఠం ఎక్కిన తరువాత వాటిని ఎగ్గొట్టేందుకు ఆర్థిక పరిస్థితి, చర్చల పేరుతో కాలక్షేపం చేస్తున్నారు. సూపర్ సిక్స్ సహా ఇతర హామీలను అటకెక్కించి తొలి ఏడాది గడిపేశారు. కొత్త సంవత్సరంలోనూ నిర్దిష్టంగా ఫలానా తేదీ నుంచి అమలు చేస్తామని చెప్పకుండా కాలయాపన చేస్తున్నారు. గురువారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో హామీల అమలుపై కచ్చితమైన నిర్ణయాలు తీసుకోకుండా చర్చల పేరుతో ఎగనామం పెట్టేందుకు ఎత్తుగడ వేయడం గమనార్హం. సీఎం చంద్రబాబు ఈ విద్యా సంవత్సరం తల్లికి వందనం పథకాన్ని అమలు చేయకపోవడంతో 87.42 లక్షల మంది విద్యార్థులు ఒక్క ఏడాదే రూ.13,112 కోట్ల మేర నష్టపోయారు. 54 లక్షల మంది రైతన్నలు ఏటా రూ.20 వేల చొప్పున పెట్టుబడి సాయం అందకపోవడంతో రూ.7,500 కోట్ల మేర నష్టపోయారు. కోటి మందికిపైగా యువత నిరుద్యోగ భృతి కోసం.. 'ఆడబిడ్డ నిధి' కోసం 1.80 కోట్ల మంది మహిళలు పడిగాపులు కాస్తుంటే నూతన ఏడాది నిర్వహించిన తొలి మంత్రివర్గ భేటీలో ఒక్క సానుకూల ప్రకటన కూడా చేయలేదు. వాటిని అమలు చేసే ఉద్దేశం లేకపోవడం వల్లే చర్చల పేరుతో ప్రభుత్వం సాగదీస్తోందని, ఎన్నికల హామీలను నమ్మి మోసపోయామని ప్రజలు గ్రహిస్తున్నారు. ఇవాళ రాష్ట్రంలో ఏ గ్రామంలో చూసినా మహిళలు, రైతులు, విద్యార్థులు, యువత అదే జగన్ అధికారంలో ఉండి ఉంటే ఈ సమయానికి ఏ పథకాల కింద, ఎంత లబ్ధి చేకూరేదో బేరీజు వేసుకుంటున్నారు.



అమ్మ ఒడి ఆగిపోయి.. తల్లికి వందనం లేక!

పేదరికం చదువులకు అడ్డు కాకూడదని, పేదింటి తలరాతలను మార్చే శక్తి విద్యకే ఉందని దృఢంగా నమ్మిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'అమ్మ ఒడి'పథకాన్ని ప్రవేశపెట్టారు. ఒకటో తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు పిల్లలను పాఠశాలలు, కాలేజీలకు పంపిన తల్లుల ఖాతాల్లో ఏడాదికి రూ.15 వేల చొప్పున క్రమం తప్పకుండా జమ చేశారు. ఒక్క అమ్మ ఒడి ద్వారానే రూ.26 వేల కోట్లకుపైగా తల్లులకు అందించి పిల్లల చదువులకు భరోసా కల్పించారు. తల్లికి వందనం పథకం ద్వారా రాష్ట్రంలో స్కూల్‌కు వెళ్లే ప్రతి విద్యార్థికీ ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఓ కుటుంబంలో ఎంత మంది పిల్లలుంటే అంతమందికీ ఇస్తామన్న హామీని చంద్రబాబు అటకెక్కించేశారు. తొలి ఏడాది దీన్ని అమలు చేయకుండా పిల్లల చదువులను నీరుగార్చిన కూటమి సర్కారు అసలు పూర్తిగా పథకాన్నే ఎత్తివేసే దిశగా వ్యూహం రచిస్తోంది.

అన్నదాతలకూ ఎగనామమే

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రతి రైతుకు రూ.20 వేల చొప్పున ఇస్తామన్న పెట్టుబడి సాయాన్ని రెండు వ్యవసాయ సీజన్లు గడుస్తున్నా అందించలేదు. రైతు భరోసా పేరును అన్నదాతా సుఖీభవగా మార్చడం మినహా అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది అమలు చేయలేదు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ కింద ఇప్పటికే రైతులకు రెండు విడతలు ఆర్థిక సాయం అందించడం గమనార్హం. చంద్రబాబు సర్కారు ఆ రెండు విడతలూ అన్నదాతలకు సాయం అందించకుండా ఎగనామం పెట్టింది. కేంద్రం తదుపరి ఇచ్చే వాటా ఆధారంగా రాష్ట్రం ఇవ్వాల్సిన వాటాపై ఆలోచన చేస్తున్నట్లు వెల్లడించింది. దీంతో గత రెండు విడతలూ కూటమి సర్కారు రైతు భరోసా సాయాన్ని అందించకపోవడంతో 53.58 లక్షల మంది రైతులు రూ.7,500 కోట్ల మేర నష్ట పోయారు.

ఉద్యోగులకు మొండిచెయ్యి

చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలైనా ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలుపై దృష్టి సారించలేదు. ఉద్యోగులకు మెరుగైన పీఆర్సీ, కూటమి ప్రభుత్వం రాగానే వెంటనే ఐఆర్ ప్రకటిస్తామని ఎన్నికల ముందు హామీలిచ్చింది. సీపీఎస్/జీపీఎస్ విధానాన్ని పునఃసమీక్షించి ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపుతామని వాగ్దానం చేసింది. ఇంతవరకూ ఒక్క డీఏ కూడా ఇవ్వలేదు. వైఎస్ జగన్ ప్రభుత్వం కొత్త పీఆర్సీ ఏర్పాటుతో పాటు కమిషనర్‌ను నియమించింది. అయితే చంద్రబాబు సర్కారు కమిషనర్‌తో రాజీనామా చేయించింది. ఇక పీఆర్సీ కమిషన్ గురించి అసలు పట్టించుకోవడమే లేదు. ఉద్యోగుల సమస్యల్లో ఒక్కటి కూడా పరిష్కరించలేదు. ఇందుకు భిన్నంగా వైఎస్ జగన్ తొలి కేబినెట్ సమావేశంలోనే ఉద్యోగులకు 2019 జూలై 1 నుంచి 27 శాతం ఐఆర్ ఇచ్చారు. ఇప్పుడు ఏడు నెలలైనా ఐఆర్ గురించి చంద్రబాబు సర్కారు అసలు పట్టించుకోవడమే లేదు.

సిలికా.. దున్నేద్దామిక!

ఏపీలో రూ.వందల కోట్ల విలువైన సిలికా శాండ్‌పై ముఖ్య నేత దృష్టి

- భారీగా కొల్లగొట్టేందుకు కూటమి నేతలతో కలిసి స్కెచ్
- స్థానిక నాయకులను రంగంలోకి దింపి భూముల పరిశీలన
- పరిశ్రమలకు కేటాయించిన బీడు భూముల్లో తవ్వకాలకు వ్యూహం



సిలికా లభ్యమయ్యే భూముల్లో పర్యటిస్తున్న వివిధ పరిశ్రమల సిబ్బంది, స్థానికులు

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

జగనే మేలు కదరా..

- నా బస్సులు కేవలం నిలిపాడు
- మీలాగ కాల్చలేదురా.. ఇంతకన్నా ఏం చేస్తార్రా చేతగాని నా కొ..ల్లారా..
- బీజేపీ నేతలపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వివాదాస్పద వ్యాఖ్యలు



తాడిపత్రి టౌన్/అనంతపురం: 'జగన్‌రెడ్డే మేలు కదరా.. మంచోడు. నా బస్సులను నిలిపాడు. మీ బీజేపీ గవర్నమెంట్‌లో బస్సులు కాల్చారు..'అంటూ ఆ పార్టీ నేతలపై తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు. పట్టణంలోని తన నివాసంలో గురువారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. అనంతపురంలో అగ్నిప్రమాదానికి గురైన జేసీ ట్రావెల్స్ బస్సు దగ్ధం ఘటనపై ఆయన స్పందించారు. బీజేపీ నాయకులు బస్సులను కాల్చివేసి ఉంటారన్న అనుమానాన్ని బలపరుస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'జగన్‌రెడ్డే మేలు కదరా మంచోడు. నా ట్రావెల్స్ బస్సులను ఆపాడు.. అంతేగానీ మీ లాగా కాల్చలేదురా.. ఇంతకాన్నా ఏం చేస్తారా చేతకాని నా కొడకల్లారా.. అరేయ్ కొజ్జా అని అనకూడదు.. వాళ్లను కించపరిచినట్లు అవుతుంది. అంతకంటే తక్కువ మాట ఏదైనా ఉంటే ఆ పదం వాడొచ్చు'అంటూ బీజేపీ నాయకులపై ప్రభాకర్‌రెడ్డి వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. అంతకుముందు.. ఉదయం అనంతపురం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఆగివున్న జేసీ దివాకర్‌రెడ్డి ట్రావెల్స్‌కు చెందిన ఓ బస్సు దగ్ధమైంది. బస్సును తగులబెట్టారా? లేక ప్రమాదానికి గురైందా అనే అంశంపై దర్యాప్తు జరుగుతోంది.

ఫ్లైయాష్ వివాదమే కారణమా?

నిజానికి.. జమ్మలమడుగు నియోజకవర్గంలోని ఆర్టీపీపీలో ఫ్లైయాష్ రవాణా విషయంలో బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డికి జేసీ ప్రభాకర్‌రెడ్డికి మధ్య ఇటీవల తీవ్ర వివాదం చోటుచేసుకున్న విషయం తెలిసిందే. అప్పట్లో వీళ్లిద్దరి పంచాయతీ సీఎం వరకు వెళ్లింది. ఈ నేపథ్యంలోనే బీజేపీ నేతలను ఉద్దేశించి ప్రభాకర్‌రెడ్డి విమర్శించి ఉండవచ్చునని తెలుస్తోంది.

నేడు ఇందిరా పార్క్ వద్ద 'బీసీ మహాసభ'

కామారెడ్డి డిక్లరేషన్, స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లే ఎజెండా

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన కామారెడ్డి డిక్లరేషన్ హామీతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలనే డిమాండ్‌తో పలు బీసీ సంఘాలు, తెలంగాణ జాగృతి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం బీసీ మహాసభ జరగనుంది. సావిత్రీ బాయి పూలే జయంతి సందర్భంగా ఇందిరా పార్క్ వద్ద ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఎన్నికల సమయంలో బీసీలకు పలు హామీలిచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ వర్గాలకు కాంగ్రెస్ ప్రభుత్వం వెన్నుపోటు పొడిచిందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇప్పుడు అటకెక్కాయని విమర్శించారు. సావిత్రీ బాయి పూలే జయంతి సందర్భంగా సామాజిక న్యాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వానికి గుర్తు చేసేందుకు శుక్రవారం ఉదయం 11 గంటలకు ఇందిరా పార్కు వద్ద బీసీ మహాసభ నిర్వహిస్తున్నట్లు కవిత తెలిపారు.

గ్రామాల్లో పెరుగుతున్న రక్తపోటు, మధుమేహం

- 1.66 కోట్ల మందికి పరీక్షలు
- 22.94 లక్షల మందికి బీపీ ... 11.9 లక్షల మందికి షుగర్
- ఎన్‌సీడీపై ప్రభుత్వ సర్వే ఫలితాలపై ఆరోగ్యశాఖ మంత్రి సమీక్ష

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామాలు, చిన్న చిన్న పట్టణాల్లో కూడా రక్తపోటు, మధుమేహం లాంటి దీర్ఘకాలిక వ్యాధులు పెరుగుతున్నాయి. జీవన విధానంతో పాటు ఆహారపు అలవాట్లలో వచ్చిన మార్పులు, ఒత్తిళ్ల నేపథ్యంలో గ్రామాల్లో కూడా నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్ (ఎన్‌సీడీ) బారినపడుతున్న వారి సంఖ్య పెరుగుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. రాష్ట్రంలో ఎన్‌సీడీ వ్యాధులపై ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సర్వే వివరాలను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, ఇతర అధికారులు ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు వివరించారు. 30 సంవత్సరాల వయస్సు దాటిన 1.66 కోట్ల మందికి పరీక్షలు జరపగా, 22.94 లక్షల మందికి రక్తపోటు, 11.9 లక్షల మందికి మధుమేహం ఉన్నట్టు గుర్తించినట్లు తెలిపారు. కోఠిలోని టీజీఎంఎస్ఐడీసీ కార్యాలయంలో గురువారం మంత్రి రాజనర్సింహతో జరిగిన ఈ సమావేశంలో సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్, డీఎంఈ వాణి, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, డీహెచ్ రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ దవాఖానాలలో ఏర్పాటు చేసిన ఎన్‌సీడీ క్లినిక్‌లకు బీపీ, షుగర్ వంటి నాన్ కమ్యూనికేబుల్ వ్యాధులతో బాధపడుతున్న రోగులను అనుసంధానం చేయాలని అధికారులకు సూచించారు. ఎన్‌సీడీ క్లినిక్‌లలో అందుతున్న వైద్య సేవలపై రోగులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామాలు, మండలాలు, జిల్లాల వారీగా పేషెంట్ల జాబితాను తయారు చేయాలని మంత్రి ఆదేశించారు. రోగులు క్రమం తప్పకుండా మందులు వాడేలా చూడాలని సూచించారు. బీపీ, షుగర్ పేషెంట్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎన్‌సీడీ సర్వేను కొనసాగించాలని ఆయన సూచించారు.



13 నుంచి సీఎం రేవంత్ విదేశీ పర్యటన

▶ మొదటి పేజీ తరువాయి

ఈ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. 15న సీఎం రాష్ట్రానికి తిరిగి రానున్నారు. మళ్లీ ఈ నెల 19 నుంచి 21 వరకు సింగపూర్‌లో పర్యటించనున్నారు. తెలంగాణలో పర్యాటక రంగాన్ని ప్రోత్సహించడానికి ప్రభుత్వం కొత్త పర్యాటక పాలసీని ప్రకటించిన నేపథ్యంలో... సింగపూర్‌లో పర్యాటకాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను పరిశీలిస్తారు. ప్రపంచ పర్యాటకులను ఆకట్టుకోవడానికి సింగపూర్ ఎలాంటి సౌకర్యాలను కల్పిస్తోందన్న అంశాన్ని అధ్యయనం చేస్తారు. అనంతరం ఈ నెల 21 నుంచి 23 వరకు స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో పర్యటించి వరల్డ్ ఎకనమిక్ ఫోరం సదస్సులో పాల్గొంటారు. రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు పెట్టుబడులను ఆకర్షించడంతోపాటు ప్రముఖ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంటారు. దావోస్ పర్యటనకు సీఎంతో పాటు పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తదితరులు వెళ్లనున్నారు.

యాదగిరీశుడికి మదర్ డెయిరీ నుంచే నెయ్యి

- విజయ నెయ్యి ఇప్పుడే వద్దని దేవాదాయ శాఖ ఆదేశం
- మదర్ డెయిరీతో మార్చి 31వరకు ఉన్న ఒప్పందం

యాదగిరిగుట్ట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో లడ్డూ, ఇతర ప్రసాదాల తయారీకి మరికొంత కాలం మదర్ డెయిరీ నుంచే నెయ్యిని కొనుగోలు చేయనున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి విజయ డెయిరీ నెయ్యిని వినియోగించాలని దేవాదాయ శాఖ ఉత్తర్వులు జారీచేసినప్పటికీ ఆ నిర్ణయాన్ని తాత్కాలికంగా ఉపసంహరించుకుంది. ఈ నేపథ్యంలో తదుపరి ఆదేశాలు వచ్చే వరకు మదర్ డెయిరీ నెయ్యినే వాడనున్నారు. మదర్ డెయిరీ టెండర్ ఒప్పందం మార్చి 31వ తేదీ వరకు ఉన్న నేపథ్యంలో ఆలయానికి ఆ సంస్థ నెయ్యినే కొనుగోలు చేసేందుకు దేవాదాయ శాఖ నిర్ణయించినట్లు తెలిసింది. ఇప్పుడే విజయ డెయిరీ నెయ్యిని సరఫరా చేస్తే న్యాయపరమైన చిక్కులు వస్తాయని దేవాదాయశాఖ అధికారులు భావిస్తునట్లు సమాచారం.



యాదగిరి క్షేత్రంలో లడ్డూ ప్రసాదం తయారీ

ఏడాదికి రూ.18 కోట్ల విలువైన నెయ్యి..

యాదగిరీశుడి క్షేత్రంలో లడ్డూతో పాటు ఇతర ప్రసాదాల్లో వాడే మదర్ డెయిరీ నెయ్యి కోసం దేవస్థానం ఏటా సుమారు రూ.18 కోట్లు ఖర్చు చేస్తోంది. ప్రతి నెలా 25 వేల నుంచి 30 వేల కిలోల వరకు ఆలయానికి మదర్ డెయిరీ సంస్థ నెయ్యిని సరఫరా చేస్తోంది. కాగా గతేడాది నిర్వహించిన నెయ్యి సరఫరా టెండర్లలో మదర్ డెయిరీతో పాటు విజయ డెయిరీ సంస్థ కూడా పాల్గొంది. ఇందులో ఎల్–1గా నిలిచిన మదర్ డెయిరీతో నెయ్యి కొనుగోలుకు ఆలయం ఒప్పందం చేసుకుంది.

పనులు చక్కబెట్టేది పొరుగువాళ్లే..

- వరినాట్లు వేయడం, ధాన్యం బస్తాలు మోయడంలో బిహారీలు
- ఇళ్ల నిర్మాణ పనుల్లో రాజస్తాన్, యూపీ, మహారాష్ట్ర వాళ్లే ఎక్కువ
- హోటళ్లు, రెస్టారెంట్లలో ఒడిశా, బెంగాల్ కార్మికులు

తెగ కొనేశారు!

- డిసెంబర్ 31న ఆన్‌లైన్‌లో దుమ్మురేపిన అమ్మకాలు
- క్విక్ కామర్స్, ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్స్‌కు రికార్డు ఆర్డర్లు
- నెల్లూరులో ఆర్డర్ చేసిన 164 సెకండ్లలోనే బిర్యానీ డెలివరీ

సాక్షిప్లస్ (ఈ–పేపర్‌లో)

సీఎంఆర్ కాలేజీపై మహిళా కమిషన్ సీరియస్

- విద్యార్థినుల హాస్టల్ బాత్‌రూంలో వీడియోల చిత్రీకరణపై విచారణ
- సమగ్ర దర్యాప్తు జరిపి నివేదిక ఇవ్వాలని పోలీసులకు ఆదేశం
- గురువారం కూడా కొనసాగిన విద్యార్థుల ఆందోళన
- పోలీసుల అదుపులో హాస్టల్ వార్డెన్ సహా ఏడుగురు



సీఎంఆర్ హాస్టల్ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులు

మేడ్చల్ రూరల్: మేడ్చల్ జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని సీఎంఆర్ కళాశాలలో విద్యార్థినులు గురువారం కూడా ఆందోళన కొనసాగించారు. కళాశాల క్యాంటీన్‌లో పనిచేసే యువకులు బుధవారం గర్ల్స్ హాస్టల్ బాత్‌రూంలో మొబైల్ ఫోన్లు ఉంచి విద్యార్థినుల వీడియోలను చిత్రీకరించే ప్రయత్నం చేసిన విషయం తెలిసింది. ఈ విషయాన్ని గుర్తించిన విద్యార్థినులు బుధవారం మధ్యాహ్నం నుంచి ఆందోళన చేపట్టారు. విద్యార్థులకు మద్దతుగా విద్యార్థి సంఘాలు హాస్టల్ వద్దకు చేరుకుని పెద్ద ఎత్తున నిరసన తెలపటంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనను సుమోటోగా స్వీకరించిన రాష్ట్ర మహిళా కమిషన్.. కళాశాలకు నోటీసులు జారీ చేసింది. కమిషన్ కార్యదర్శి పద్మజ రమణ కళాశాలలో గురువారం విచారణ జరిపారు. సమగ్ర దర్యాప్తు జరిపి నివేదిక ఇవ్వాలని పోలీసులను కూడా కమిషన్ ఆదేశించింది.

యాజమాన్యం నిర్లక్ష్యం

హాస్టల్ బాత్‌రూంలో గుర్తు తెలియని వ్యక్తులు తమ వీడియోలు చిత్రీకరిస్తున్నారని విద్యార్థినులు హాస్టల్ వార్డెన్ ప్రీతిరెడ్డికి తెలిపారు. అయితే, సమస్యను పరిష్కరించాల్సిన వార్డెన్.. తమనే తప్పుపడుతూ దురుసుగా, నిర్లక్ష్యంగా ప్రవర్తించారని విద్యార్థులు ఆరోపించారు. వీడియోలు తీయటానికి ప్రయత్నించింది హాస్టల్ మెస్‌లో పనిచేసే ఇతర రాష్ట్రాల కార్మికులే అని తెలుపగా.. మీరే మగవారిని చూసి అలా ప్రవర్తిస్తున్నారని వార్డెన్ దారుణంగా మాట్లాడారని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ విషయం బయటకు చెప్తే మీ వీడియోలు కూడా బయటకు వెళ్తాయని వార్డెన్ అనటంతో ఆగ్రహించిన విద్యార్థినులు ఆందోళనను మరింత తీవ్రం చేశారు. పరిస్థితి విషమించటంతో వార్డెన్ బుధవారం అర్ధరాత్రే అక్కడి నుండి దొడ్డిదారిన వెళ్లిపోయింది.

పోలీసుల అదుపులో వార్డెన్

ఈ ఘటనపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు మెస్‌లో పనిచేసే ఐదుగురితోపాటు హాస్టల్ వార్డెన్ ప్రీతిరెడ్డి, మెస్ ఇన్‌చార్జి సెల్వంను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన విషయంలో కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం కనిపించిందని మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. హాస్టల్ బాత్‌రూంల సమీపంలోనే మెస్‌లో పనిచేసే 12 మంది కార్మికులకు గదులు కేటాయించడమే ఈ ఘటనకు కారణమని చెప్పారు. అనుమానితుల నుంచి స్వాధీనం చేసుకున్న 12 మొబైల్ ఫోన్లలో అభ్యంతరకరమైన ఎలాంటి వీడియోలు లభ్యం కాలేదని పేర్కొన్నారు. డిలీట్ చేసిన వీడియోలు ఏమైనా ఉన్నాయేమో తెలుసుకునేందుకు ఫోన్లను ల్యాబ్‌కు పంపినట్లు వివరించారు. కాగా ఈ ఘటనపై వివరణ ఇవ్వాలని కళాశాల యాజమాన్యాన్ని జేఎన్‌టీయూ ఆదేశించింది. ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థులతో సీఎంఆర్ గ్రూప్స్ కార్యదర్శి గోపాల్ రెడ్డి చర్చలు జరిపారు. హాస్టల్ పరిసరాల్లో మరిన్ని సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

..10 లక్షల కొలువులు!

▶ మొదటి పేజీ తరువాయి

వివిధ నివేదికలు వెల్లడిస్తుండటం గమనార్హం.

పెరుగుతున్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు

2024 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు ఆరు నెలల వ్యవధిలోనే రాష్ట్రానికి రూ.12,864 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డీఐ) వచ్చినట్లు కేంద్ర పరిశ్రమలు, అంతర్గత వాణిజ్య విభాగం ప్రకటించింది. 2023తో పోలిస్తే ఎఫ్‌డీఐల్లో 33 శాతం వృద్ధి నమోదు కాగా, రూ.3,185 కోట్లు అదనంగా వచ్చాయి. 2024లో వచ్చిన ఎఫ్‌డీఐల్లో 93 శాతం అంటే రూ.11,970 కోట్లు హైదరాబాద్‌కు రాగా, రంగారెడ్డి జిల్లాకు రూ.680 కోట్లు, మహబూబ్‌నగర్‌కు రూ.116 కోట్లు, మెదక్‌కు 96.99 కోట్లు వచ్చాయి. ఇదేవిధంగా ఎఫ్‌డీఐల రాక కొత్త ఏడాది కూడా కొనసాగుతుందని, ఉద్యోగాల కల్పనకు ఇవి కీలకంగా మారతాయని అధికార వర్గాలంటున్నాయి. ఐటీ రంగంలో గడిచిన రెండేళ్లుగా నెలకొన్న మాంద్యం, భారత్‌లో ఎన్నికల వాతావరణం తదితర కారణాలతో ఉద్యోగ నియామకాలకు దూరంగా ఉన్న అమెరికా, ఐరోపా కంపెనీలు ఈ ఏడాది జరిపే నియామకాల్లో తెలంగాణకు లబ్ధి చేకూరుతుందని భావిస్తున్నారు.

జీసీసీలకు కేంద్రంగా తెలంగాణ

అంతర్జాతీయ సామర్థ్య కేంద్రాల (జీసీసీ) ఏర్పాటు ద్వారా ఉద్యోగాల కల్పన భారీగా సాధ్యమవుతుందనే అంచనాలు ఇప్పటికే ఉన్నాయి. ఈ నేపథ్యంలో జీసీసీలను ఆకర్షించేందుకు బెంగళూరు, ఢిల్లీ, పుణే, ముంబయి, చెన్నై వంటి దేశంలోని ప్రధాన నగరాలతో హైదరాబాద్ పోటీ పడుతోంది. భారత సాంకేతిక వాతావరణం, ఉద్యోగాల కల్పన, మార్కెట్ వృద్ధి, సామర్థ్యాల పెంపుదల తదితరాల్లో 2030 నాటికి ఈ సెంటర్లు కీలక పాత్ర పోషిస్తాయని అంచనా వేస్తున్నారు. గత ఐదేళ్లలో భారత్‌లో ఏర్పాటైన జీసీసీల్లో 30 శాతం హైదరాబాద్‌లోనే ఏర్పాటు కావడం గమనార్హం. ప్రస్తుతం రాష్ట్రంలో 355 జీసీసీలు ఉండగా, సాఫ్ట్‌వేర్/ఇంటర్‌నెట్, ఎలక్ట్రికల్/ఎలక్ట్రానిక్స్, ఎఫ్ఎంసీజీ, సెమికండక్టర్, ఫార్మాస్యూటికల్స్, రిటైల్, మెడికల్ డివైసెస్, టెలీ కమ్యూనికేషన్స్, బీఎఫ్ఎస్ఐ, ఆటోమేటివ్, వృత్తిపరమైన సేవల రంగాల్లో కొత్త జీసీసీల ఏర్పాటుకు అంతర్జాతీయ సంస్థలు మొగ్గు చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్తగా ఏర్పాటయ్యే జీసీసీలను కేవలం హైదరాబాద్‌కే పరిమితం చేయకుండా వరంగల్, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, సిద్దిపేట, మహబూబ్‌నగర్‌లోనూ ఏర్పాటు చేయాలని నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్ (నాస్కామ్) ఇటీవల రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. దేశంలోని జీసీసీల్లో పనిచేస్తున్న 19 లక్షల మంది ఉద్యోగుల్లో 12 శాతం మంది తెలంగాణకు చెందిన నిపుణులే ఉండటం గమనార్హం. ఇది వచ్చే రెండేళ్లలో 15 శాతానికి పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
శుక్రవారం ॥ 3-1-2025





చందన

ఈ మాణిక్యం మట్టిలో పుట్టింది

'డ్రీమ్ బిగ్... అచీవ్ బిగ్' అన్నారు మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం.
గొప్ప కల కనాలి... ఆ కలను సాకారం చేసుకోవడానికి శ్రమించాలి.
ఈ రెండు మాటలనూ ఒంట పట్టించుకుందా అమ్మాయి.
తనకిష్టమైన టెన్నిస్ రాకెట్‌ని చేతిలోకి తీసుకుంది.
టెన్నిస్‌ని ప్రేమిస్తోంది... టెన్నిసే ప్రాణం అంటోంది... కానీ...
'టాలెంట్ ఉంటేనే సరిపోతుందా' అని పరిహసిస్తోంది రూపాయి.
ప్రత్యర్థి మీద గెలవడం ఆమెకు ఏ మాత్రం చాలెంజ్ కాదు.
ఆర్థిక పరిస్థితితో నిత్యపోరాటమే ఆమెను కుంగదీస్తోంది.

తిరుపతికి చెందిన చందన పోతుగారి టెన్నిస్ ప్లేయర్. నేషనల్ ర్యాంకింగ్‌లో టాప్ 30లో ఉంది. మనదేశంలో జరుగుతున్న ఇంటర్నేషనల్ టోర్నమెంట్‌లు మాత్రమే ఆడుతోంది. దేశం దాటి వెళ్లడానికి చేతిలో డబ్బు లేదు. 'దేశంలో ఎక్కడికైనా సరే ట్రైన్‌లో జనరల్ కంపార్ట్‌మెంట్‌లో వెళ్లిపోతాను, విదేశాల్లో ఆడాలంటే విమానం టికెట్ కొనుక్కోలేను' అంటున్నప్పుడు చందన కళ్లలో టెన్నిస్ ఆట పట్ల ప్రేమతోపాటు తన ఆర్థిక పరిస్థితి పట్ల నిస్సహాయత వ్యక్తమైంది. ఈ మాణిక్యం మట్టిలో పుట్టింది.

వెలుగు-చీకటి

సామాన్య కుటుంబంలో పుట్టిన చందన ఎనిమిదేళ్ల వయసులో టెన్నిస్ రాకెట్ పట్టుకుంది. లెక్కకు మించిన విజయాలతో సాగిపోతోంది. ఆటలో రాణించాలంటే మెరుగైన శిక్షణ అవసరమని నాలుగేళ్ల కిందట కుటుంబం హైదరాబాద్‌కి వచ్చింది. గణేశ్ రామన్ టెన్నిస్ అకాడమీలో చేరింది. చందనలో ఆట పట్ల ఉన్న అంకితభావం, వారి ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకున్న కోచ్ ఫీజు గురించి పట్టుపట్టకుండా దేశం మెచ్చే క్రీడాకారిణిని తయారు చేయడానికి సిద్ధమయ్యారు. సరిగ్గా ఇక్కడే చందనకు కాలం కొత్త పరీక్షలు పెట్టింది. జీవితంలోకి వెలుగు-చీకటి ఒక్కసారిగా వచ్చినట్లయింది. 'శిక్షణ కోసం నగరానికి వెళ్లడమేంటి, వయసు వచ్చిన ఆడపిల్ల తెలియని మనుషుల మధ్య మెలగడమేంటి'... అని బంధువులు ఆడిపోసుకోవడం మొదలుపెట్టారు. వారి మాటలను పట్టించుకోలేదు, కానీ తండ్రి కూడా 'ఇక ఆట చాలు, పెళ్లి చేస్తాను' అనడంతో హతాశురాలైంది. ఆమె కన్నీళ్లు తల్లికి అర్థమయ్యాయి. కానీ తండ్రిని కరిగించలేకపోయాయి. కుటుంబం రెండయింది.

రాయలసీమ టోర్నీ నుంచి ఇంటర్నేషనల్ టోర్నీల వరకు

నొవాక్ జొకోవిచ్, సెరీనా విలియమ్స్ తన రోల్ మోడల్స్ అంటున్న చందన అండర్ 12, అండర్ 14, అండర్ 16 కేటగిరీల్లో ఆరు సార్లు స్టేట్ చాంపియన్. అండర్ 12 ఏజ్ గ్రూప్‌లో రాయలసీమ టోర్నమెంట్ గెలిచింది. అండర్ 14లో చిత్తూరు, చెన్నై, పులివెందుల టైటిల్స్ సొంతం చేసుకుంది. చందన తొలి డబుల్స్ టైటిల్ కూడా పులివెందుల నుంచే. ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ నేషనల్స్‌లో నాలుగు సార్లు పాల్గొన్నది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి మూడు సార్లు కెప్టెన్‌గా వ్యవహరించింది. ఇంటర్నేషనల్ టోర్నీలు 15 ఆడింది. ఈ రైట్ హ్యాండెడ్ ప్లేయర్ ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ ఉమెన్స్ డబుల్స్ (21), సింగిల్స్ (35), ఆల్ ఇండియా టెన్నిస్ అసోసియేషన్ ఒన్ లాక్ రుపీస్ ఉమెన్స్ టోర్నమెంట్ సింగిల్స్‌లో 5 సార్లు విజేతగా, మరో 12 సార్లు ఫైనలిస్ట్‌గా నిలిచింది. ఆరుదఫాలు డబుల్స్ ఫైనలిస్ట్. ఎన్ని ఆర్థిక సవాళ్లు ఎదురైనా రాకెట్‌ని వదల్లేదు చందన. సరైన ఆహారం లేక కళ్లు తిరుగుతున్నా అలాగే టోర్నమెంట్ ఆడి, మజిల్ క్రాంప్‌తో కడుపు నొప్పితో బాధపడినప్పుడు కూడా 'టెన్నిస్ అంటే నాకు ప్రాణం' ఆట కోసం ప్రాణమైనా ఇస్తానన్నది చందన.

తల్లి మునిలక్ష్మి ఒంటరిగా కూతురి బాధ్యత మోస్తోంది.

దేశం తరఫున ఆడాలి!



'ఇంటర్నేషనల్ టెన్నిస్ గ్రాండ్ స్లామ్‌లో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించి గెలవాలనేది నా లక్ష్యం' అంటున్న చందన టోర్నమెంట్‌లో గెలిచినప్పుడు వచ్చిన డబ్బును బస చేసిన గదికి అద్దె చెల్లించేసి తిరుగు ప్రయాణానికి డబ్బులు లెక్క చూసుకుంటూ జనరల్ టికెట్ కొనుక్కుని ఇంటికి వస్తోంది. చందనకు కొత్త రాకెట్ కూడా లేదని, తోటి క్రీడాకారులిచ్చిన రాకెట్, దుస్తులు, షూస్‌తో టోర్నమెంట్‌కు వెళ్తున్నదని, టెన్నిస్ కోసం చందన పడుతున్న కష్టాలను తలుచుకుని కన్నీళ్లు పెట్టుకుంది మునిలక్ష్మి. భగవంతుడి దయ వల్ల స్పాన్సర్స్ ముందుకు వస్తే రాకెట్‌లా దూసుకుపోతానని, దేశానికి మెడల్స్ సాధిస్తానని ఆత్మవిశ్వాసంతో చెప్పింది చందన.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

రికార్డ్



365... ప్రతిరోజూ మారథాన్!

'మారథాన్' అంటే 'అప్పుడో' 'ఇప్పుడో' అన్నట్లుగా ఉంటాయి.

రోజూ మారథాన్ ఎవరూ చేయరు.

హిల్దే డోసోగ్నే అలా కాదు.

ఒక సంవత్సరం పాటు ప్రతిరోజూ మారథాన్ చేసి తన లక్ష్యాన్ని నెరవేర్చుకుంది బెల్జియం అల్ట్రా రన్నర్ హిల్దే డోసోగ్నే. 2024 చివరి రోజున తన పరుగును ఆపేసింది. 'అనుకున్నది సాధించినందుకు చాలా సంతోషంగా ఉంది' అంటూ చివరి పరుగు సమయంలో తన ఆనందాన్ని పంచుకుంది. తన రికార్డ్‌తో మహిళల విభాగంలో ఎర్చానా ముర్రే నెలకొల్పిన 150 రోజుల రికార్డ్‌ను 55 ఏళ్ళ డోసోగ్నే బ్రేక్ చేయనుంది.

జ్వరం వచ్చినా, కోవిడ్ బారిన పడినా, రకరకాల ప్రమాదాలు ఎదురైనా వెనక్కి తగ్గలేదు.

27 కిలోమీటర్ల తర్వాత డోసోగ్నే వేలికి గాయమైన కారణంగా, నిబంధనలకు అనుగుణంగా మారథాన్ మళ్లీ మొదటి నుంచి మొదలు పెట్టాల్సి వచ్చినా నిరాశ పడలేదు.

'శారీరక ఒత్తిడి కంటే మానసిక ఒత్తిడి కష్టంగా ఉంటుంది. శారీరకంగా, మానసికంగా బాగుంటేనే రోజుకు నాలుగు గంటలు పరుగెత్తగలం' అంటుంది డోసోగ్నే.

వృత్తిరీత్యా బయో-ఇంజనీర్ అయిన డోసోగ్నే ప్రతిరోజూ మధ్యాహ్నం మారథాన్‌కు శ్రీకారం చుట్టేది. స్నేహితులు, విట్‌నెస్‌లు ఆమెతోపాటు ఉండేవారు. తన సాహసానికి సామాజిక ప్రయోజనం కూడా జోడించింది. ఏడాదిలో 15,444 కిలోమీటర్లు పరుగెత్తడంతోపాటు రొమ్ము క్యాన్సర్ పరిశోధనల కోసం 60,000 యూరోలు సేకరించింది.

డోసోగ్నే ప్రతిరోజూ మారథాన్‌కు సంబంధించిన జీపీఎస్ డేటా, ఫొటోలు, వీడియోలు, విట్‌నెస్ రిపోర్ట్‌లను వరల్డ్ రికార్డ్స్‌కు సమర్పించనున్నారు. అక్కడ ఆమోదం లభిస్తే మూడు నెలల్లోనే రికార్డ్ నమోదు అవుతుంది.

కొత్త ఏడాది కొత్త కొలువులు

ఉద్యోగం చేయాలని గట్టిగా అనుకున్నా... పని ఒత్తిడి వల్ల ఇల్లు దాటలేని పరిస్థితిలో ఉంటారు చాలామంది మహిళలు. ఇలాంటి వారికి కొత్త సంవత్సరంలో వర్క్-ఫ్రమ్ హోమ్ ఉద్యోగాలు స్వాగతం పలుకుతున్నాయి. ఇంటి పని, ఉద్యోగ బాధ్యతలను సమన్వయం చేసుకుంటూ ఇల్లు దాటకుండానే చేసే ఉద్యోగాలకు డిమాండ్ పెరుగుతోంది. మచ్చుకు కొన్ని...



ప్రతీకాత్మక చిత్రం

■ వర్చువల్ అసిస్టెంట్

వీఏ (వర్చువల్ అసిస్టెంట్) ఉద్యోగాలకు కొత్త సంవత్సరంలో మరిన్ని అవకాశాలు పెరగబోతున్నాయి.

ఇ-మెయిల్స్, అపాయింట్‌మెంట్స్, బుకింగ్స్, ట్రావెల్ అండ్ పబ్లిక్ రిలేషన్ అకౌంట్లు...మొదలైన క్లరికల్, సెక్రటేరియల్ విధులను నిర్వహించే ఉద్యోగం వర్చువల్ అసిస్టెంట్. బాగా ఆర్గనైజ్డ్‌గా ఉండి వర్చువల్ పనులను సంబంధించి సులభంగా కమ్యూనికేట్ చేయగల సామర్థ్యం ఉన్న మహిళలకు ఈ ఉద్యోగం సరియైనది.

■ సోషల్ మీడియా మేనేజర్

వివిధ వ్యాపారాలకు ఇప్పుడు సోషల్ మీడియా తప్పనిసరి అవసరం కావడంతో 'సోషల్ మీడియా మేనేజర్' ఉద్యోగాలకు డిమాండ్ పెరిగింది. వివిధ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లకు సంబంధించి 'పోస్ట్' ప్లానింగ్ చేయడం, పోస్ట్‌కు సంబంధించిన కంటెంట్ జనరేట్ చేయడం, ఫాలోవర్స్‌తో ఎంగేజై ఉండడం... మొదలైనవి సోషల్ మీడియా మేనేజర్ పనులలో ఉన్నాయి. కొత్త ట్రెండ్స్‌ను ఫాలో అయ్యే, కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్న మహిళలు ఈ ఉద్యోగాన్ని సులభంగా చేయవచ్చు.

■ ఆన్‌లైన్ ఈవెంట్ ప్లానర్

వెబినార్స్, కాన్ఫరెన్స్‌లు, ఆన్‌లైన్ వర్క్‌షాప్‌లు... మొదలైన ఆన్‌లైన్ ఈవెంట్స్ నిర్వహించే ఉద్యోగం ఆన్‌లైన్ ఈవెంట్ ప్లానర్. ఆర్గనైజేషనల్, కమ్యూనికేషన్, క్రియేటివ్ స్కిల్స్‌కు సంబంధించిన ఉద్యోగం ఇది.

ఈవెంట్స్ కో ఆర్డినేట్ చేయడం, వెండర్ అండ్ స్పీకర్ మేనేజ్‌మెంట్, టెక్నికల్ కోఆర్డినేషన్.. మొదలైనవి ఆన్‌లైన్ ఈవెంట్ ప్లానర్ బాధ్యతల్లో ఉంటాయి.

■ ఆన్‌లైన్ ట్యుటోరింగ్

కరోనా కాలంలో ఆన్‌లైన్ ట్యుటోరింగ్ అనేది ఉపాధిమార్గంగా బలపడింది. భాషా ప్రావీణ్యం నుంచి గణితం, సైన్స్‌లాంటి సబ్జెక్ట్‌లలో ప్రతిభ వరకు ఆన్‌లైన్ ట్యుటోరింగ్ మీకు ఉపయోగపడుతుంది. వేదాంతు, బైజు, ట్యుటోర్‌మీ... మొదలైన ఎన్నో ఆన్‌లైన్ ట్యుటోరింగ్ మోడల్స్ ఉన్నాయి. జాతీయంగానే కాదు అంతర్జాతీయ స్థాయిలో ఇంటి నుంచే ఉద్యోగం చేయవచ్చు.

■ కస్టమర్ సపోర్ట్ రిప్రెజెంటివ్

కస్టమర్ సర్వీస్ ఉద్యోగావకాశాలు పెరుగుతున్నాయి. ఇంటినుంచి ఉద్యోగం చేయాలనుకునే మహిళలకు ఈ ఉద్యోగాలు అనుకూలం. కస్టమర్ల సందేహాలకు ఫోన్, ఇ-మెయిల్, చాట్... మొదలైన వాటి ద్వారా సమాధానం ఇవ్వడం లాంటి పనులు ఉంటాయి. ఎంత జటిలమైన విషయాన్ని అయినా సులభంగా అర్థమయ్యేలా చెప్పే సామర్థ్యం మీలో ఉంటే ఈ ఉద్యోగం మీకోసమే.

హెల్దీ డైట్ | మిక్స్‌డ్ చుడువా



కావలసినవి: మఖానా– కప్పు; జీడిపప్పు– కప్పు; బాదం పలుకులు– కప్పు అటుకులు – కప్పు; కిస్‌మిస్– కప్పు; ఎండు కొబ్బరి పలుకులు– కప్పు; వేరుశనగపప్పు– కప్పు; గుమ్మడి గింజలు – అర కప్పు; కరివేపాకు– 2 రెమ్మలు; నల్ల ఉప్పు – చిటికెడు; ఉప్పు– అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; జీలకర్ర పొడి– టేబుల్ స్పూన్; ఆమ్‌చూర్ పౌడర్– అర టీ స్పూన్; చక్కెర పొడి– టేబుల్ స్పూన్; నూనె– 2 టీ స్పూన్‌లు.

తయారీ:

- మఖానీ, జీడిపప్పు, బాదం, వేరుశనగపప్పు, గుమ్మడి గింజలను విడివిడిగా నూనె లేకుండా మందపాటి బాణలిలో దోరగా వేయించాలి.
- బాణలిలో నూనె వేడి చేసి ఎండు కొబ్బరి, అటుకులను వేయించాలి. అవి వేగిన తరవాత అందులో కరివేపాకు, ఉప్పు, నల్ల ఉప్పు, జీలకర్ర పొడి, ఆమ్‌చూర్ పౌడర్ కిస్‌మిస్, చక్కెర పొడి వేసి కలపాలి. ఆ తర్వాత ముందుగా వేయించి పెట్టుకున్న గింజలన్నింటినీ వేసి సమంగా కలిసే వరకు కలపాలి.

పోషకాలు: వందగ్రాముల మిశ్రమంలో...
- కేలరీలు– 480
- ప్రొటీన్– 10 గ్రాములు
- కార్బొహైడ్రేట్‌లు – 35 గ్రాములు
- ఫ్యాట్ – 35 గ్రాములు
- ఫైబర్ – 6 గ్రాములు
- ఐరన్ – 2.5 గ్రాములు
- క్యాల్షియమ్ – 50మిల్లీగ్రాములు
- విటమిన్ ఈ– 3 మిల్లీగ్రాములు

మఖానాలో మెగ్నీషియం సమృద్ధిగా ఉంటుంది. గుమ్మడి గింజల్లో జింక్, మెగ్నీషియం ఉంటాయి. నట్స్‌లో ఆరోగ్యకరమైన కొవ్వులు, ప్రొటీన్, ఈ, బీ6 వంటి విటమిన్‌లు ఉంటాయి. ఇవన్నీ దేహక్రియలను మెరుగుపరచడంతో పాటు వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయి.



డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

ఆల్‌టైమ్ అట్రాక్షన్











సందర్భాన్ని బట్టి ఒక డ్రెస్‌ను గ్రాండ్‌గా ధరించవచ్చు అదే మోడల్‌ని సింపుల్‌గానూ అలంకరించవచ్చు. ఇండో-వెస్ట్రన్ స్టైల్ ఎప్పుడూ ట్రెండ్‌లో ఉండేదే. బ్రైడల్ అయినా క్యాజువల్ అయినా ప్రత్యేక సందర్భం అయినా మీ డ్రెస్‌ని కేప్/షావల్/ జాకెట్‌గా పేరున్న ఒకే ఒక టాప్‌తో లుక్‌ని పూర్తిగా మార్చేయవచ్చు.

మెడ నుంచి భుజాల మీదుగా చేతులను కప్పుతూ ఉంటుంది కాబట్టి దీనిని షావల్ టాప్ అంటుంటారు. ఈ టాప్ లుక్ మోడల్‌ని స్టైల్‌కి తగినట్టు మార్చుకోవచ్చు. ట్రెండ్‌లో ఉన్న ఈ మోడల్ జాకెట్స్ హుందాతనం, రిచ్ లుక్‌తో ఆకట్టుకుంటున్నాయి.

- వివాహ వేడుకల్లో గ్రాండ్‌గా వెలిగిపోవాలంటే ఎంబ్రాయిడరీ చేసిన కేప్‌ని ఎంచుకోవచ్చు.
- గెట్ టు గెదర్ వంటి ఈవెనింగ్ పార్టీలకు లేస్‌తో డిజైన్ చేసిన టాప్‌తో స్టైల్ చేయచ్చు.
- శారీ గౌన్స్ మీదకు మాత్రమే అచ్చమైన పట్టు చీరలకు కూడా ఈ సింగిల్ పీస్‌తో స్పెషల్ అట్రాక్షన్‌ను తీసుకురావచ్చు.
- లెహంగా బ్లౌజ్ మీదకు దుపట్టా ప్లేస్ షాల్ జాకెట్ మరింత ప్రత్యేకతను తీసుకువస్తుంది.
- థ్రెడ్ వర్క్, ప్రింటెడ్ షావల్ జాకెట్స్ ఇండో వెస్ట్రన్ డ్రెస్సులకు స్పెషల్ లుక్‌ని జత చేస్తాయి.

బ్యూటీ | ఫ్యాషన్

పిగ్మెంటేషన్ సమస్యా?!

చర్మంపై బ్లాక్ స్పాట్స్, మచ్చలు కనిపించడం అన్ని వయసుల వారిలోనూ వచ్చే సమస్యే. కానీ, ఇటీవల యువతలో ఈ సమస్యను ఎక్కువ చూస్తున్నాం.

ఎవరిలో అధికం అంటే...

అధిక బరువు ఉన్నవారిలో మెడపైన, వీపు పైన మచ్చలు కనిపిస్తుంటాయి. నేరుగా ఎండ బారిన పడేవారికి చేతులు, ముఖం, పాదాలపై ట్యాన్ ఏర్పడుతుంది. కొంతమందిలో విటమిన్ల లోపం వల్ల మంగు మచ్చలు కూడా వస్తున్నాయి. సాధారణంగా యుక్తవయసులో మొటిమలు వస్తుంటాయి. మొటిమలను గిల్లడం, వాటిలో ఉండే పస్ తీయడం.. వంటి వాటి వల్ల మచ్చలు, ఇంకొందరిలో చర్మంపై గుంటలు ఏర్పడవచ్చు. కొందరికి సరైన అవగాహన లేక బ్యూటీ ప్రొడక్ట్స్‌ని ఇష్టం వచ్చినట్లు ఉపయోగించడం వల్ల చర్మం దెబ్బతిని మచ్చలు ఏర్పడతాయి. ఇంకొందరిలో చర్మం రకరకాల ఇన్ఫెక్షన్లకు లోనవుతుంటుంది. నిర్లక్ష్యం చేస్తే మచ్చలు ఏర్పడి, అది దీర్ఘకాలిక సమస్యగా మారుతుంది.



త్వరగా గుర్తించి...

- ముందుగానే సమస్యను గుర్తించి చికిత్స తీసుకుంటే ఇబ్బంది ఉండదు. థైరాయిడ్, ఒబేసిటీ, పీసీఓడీ సమస్యలు ఉంటే వాటికి చికిత్స తీసుకోవాలి. ఎండ నేరుగా తాకకుండా సన్‌స్క్రీన్ వాడటం ముఖ్యం. వీటిలో బ్లూ లైట్ కాంపొనెంట్ ఉండే సన్‌స్క్రీన్స్ బెటర్. మంగు మచ్చలు వస్తున్నాయనుకునేవారు వారి వంశంలో ఈ సమస్య ఉంటే, ముందే మరిన్ని జాగ్రత్తలు తీసుకోవడం అవసరం.
- మొటిమలు, యాక్నె వంటి సమస్యలు ఉన్నప్పుడు వాటిని గిల్లకూడదు. పింపుల్స్ తగ్గే ఆయింట్‌మెంట్స్‌ను నిపుణుల సూచనల మేరకు వాడాలి. పింపుల్స్ ఉండేవారు పింపుల్ ట్రీట్‌మెంట్ తీసుకోవాలి. ఏజ్‌తో పాటు వస్తాయి అవే పోతాయి అనుకోకూడదు. ఒకసారి చెక్ చేసుకొని, చికిత్స తీసుకోవాలి.
- విటమిన్ బి12 లోపం ఉందేమో చెక్ చేసుకోవాలి. క్యారట్, టొమాటో, విటమిన్– సి ఉన్న పండ్లు తీసుకుంటే చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.
- ఆన్‌లైన్‌లో చూసి, ఇష్టం వచ్చిన ప్రొడక్ట్స్ వాడకూడదు. అవి మీ చర్మతత్త్వానికి సరిపడతాయా లేదా అని చూడాలి.
- ఇంట్లో సౌందర్య లేపనాలను ఉపయోగిస్తూ, పార్లర్ ఫేషియల్స్ చేయకూడదు. ఏదైనా ఒకదాని మీద మాత్రమే ఆధారపడాలి.



డాక్టర్ స్వప్నప్రియ,
క్లినికల్ డెర్మటాలజిస్ట్

ముగ్గు | ముచ్చట





సుజాత పి.వి.ఎల్
సికింద్రాబాద్


21 చుక్కలు, 7 వరుసలు
7 వచ్చేవరకు, సరిచుక్కలు



13 చుక్కలు, సందు చుక్క
7 వచ్చేవరకు



గద్దిగాని సరళ, ఎలగందల్
కరీంనగర్



14 చుక్కలు
2 వరుసలు
2 వరకు



టి.డి. శిరీష,
అనంతపురం

ముగ్గులకు ఆహ్వానం



ముగ్గులు పంపవలసిన చిరునామా:
ముగ్గు-ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్,
రోడ్ నెం.1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34.
ఈ మెయిల్:
muggulu.sakshi@gmail.com

యువర్స్

● టెక్... టాక్

వాట్సాప్‌లో ఈ ఫోన్‌లు నిలిపివేయబడును...

జనవరి ఒకటి తరువాత యాప్ సపోర్ట్ నిలిపివేసే ఆండ్రాయిడ్ స్మార్ట్‌ఫోన్‌ల పూర్తి జాబితాను వాట్సాప్ విడుదల చేసింది. దశాబ్దం క్రితం విడుదలైన శాంసంగ్, ఎల్జీ, సోనీలాంటి ప్రముఖ బ్రాండ్లకు చెందిన కొన్ని మోడల్స్‌తో సహా ఎన్నో డివైజ్‌లపై ఈ నిర్ణయం ప్రభావాన్ని చూపనుంది.

వాట్సాప్‌ను యాక్సెస్ చేయలేని ఆండ్రాయిడ్ ఫోన్‌లు...
శాంసంగ్: గెలాక్సీ ఎస్3, గెలాక్సీ నోట్ 2. గెలాక్సీ ఎస్ 3, గెలాక్సీ ఎస్ 4
మోటోరోలా: మోటో జీ(ఫస్ట్ జనరేషన్), రేజర్ హెచ్‌డీ, మోటో ఈ 2014
హెచ్‌టీసీ: వన్ ఎక్స్, వన్ ఎక్స్ ప్లస్, డిజైర్ 500, డిజైర్ 601
ఎల్జీ: ఆప్టిమస్ జీ, నెక్సస్ 4, జీ2 మినీ, ఎల్ 90
సోనీ: ఎక్స్ పీరియా టీ, ఎక్స్ పీరియా వి

న్యూ ఇయర్ ఫీచర్స్

2025 Happy New Year

కొత్త సంవత్సరాన్ని దృష్టిలో పెట్టుకొని మెసేజింగ్ ప్లాట్‌ఫామ్ వాట్సాప్ కొత్త ఫీచర్‌లను తీసుకువచ్చింది. న్యూ ఇయర్–ఇన్‌స్పైర్‌డ్ కాలింగ్ ఎఫెక్ట్స్, స్టిక్కర్స్... మొదలైనవి వాటిలో ఉన్నాయి. జనవరి 3, 2025 వరకు ఈ ఫీచర్‌లు అందుబాటులో ఉంటాయి. ఈ ఫెస్టివల్ ఫీచర్స్‌ను యాక్సెస్ చేసుకోవడానికి లేటెస్ట్ యాప్ వెర్షన్‌ను అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది.

● ఎన్‌వైఇ కాలింగ్ ఎఫెక్ట్స్: వీడియో కాల్స్ కోసం కొత్త ఫిల్టర్లు, ఎఫెక్ట్‌లతో కొత్త ఫెస్టివ్ బ్యాక్‌గ్రౌండ్‌ను తీసుకువచ్చింది
● ఎన్‌వైఇ స్టిక్కర్స్: న్యూ ఇయర్ కోసం డిజైన్ చేసిన న్యూ స్టిక్కర్ ప్యాక్, అవతార్ స్టిక్కర్స్.

బ్లూ స్కై దూకుడు

కొత్త సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'బ్లూ స్కై'కి నూతన సంవత్సరంలో మరింత ఆదరణ పెరగనుంది అంటున్నారు విశ్లేషకులు. 'ఎక్స్' అంటే ఇష్టపడని యువతరానికి ఇది ప్రత్యామ్నాయంగా మారనుంది. తాజాగా 'బ్లూ స్కై' యూజర్‌ల సంఖ్య 25 మిలియన్‌లకు చేరింది. 'ట్విట్టర్' ప్రారంభ రోజులను గుర్తు చేసేలా 'బ్లూ స్కై' దూసుకుపోతోంది. 'ఇన్వైట్–వోన్లీ' టైమ్‌లో వివిధ టూల్స్, ఫీచర్‌లతో 'బ్లూ స్కై'ని ఆధునీకరించారు.



ఇన్‌ఫినిక్స్ జీరో ఎక్స్ ఫ్లిప్

డిస్‌ప్లే: 6.90 అంగుళాలు రిఫ్రెష్ రేట్: 120 హెచ్‌జెడ్
మెమోరీ: 256జీబి 8జీబి ర్యామ్/ 512 జీబి 8జీబి ర్యామ్
ఫ్రంట్ కెమెరా: 50 ఎంపీ ఓఎస్: ఆండ్రాయిడ్ 14




షావోమీ స్మార్ట్ బ్యాండ్ 9

సైజ్: 1.74 అంగుళాలు
రిజల్యూషన్: 336x480 పిక్సెల్స్
● 2.6డీ కర్వ్ ● డీప్ స్లీప్ రీడింగ్
● హార్ట్ రేట్ రీడింగ్ ● బ్యాటరీ లైఫ్: 14 రోజులు

● సాహస పథం





శిఖరాలు ఆశీర్వదించాయి

**నిరాశ అనేది పరాజయాలకు 'సుస్వాగతం' బోర్డ్‌లాంటిది.
ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడం అనేది అన్వీష్ వర్మ కల.
అయితే వివిధ కారణాల వల్ల రెండు సార్లు తన కలను నెరవేర్చుకోవడంలో విఫలం అయ్యాడు.
అయినా సరే...పట్టువదలని అన్వీష్ వర్మ మూడో ప్రయత్నంలో తన కల నెరవేర్చుకున్నాడు.
ఆ తరువాత ఏడు ఖండాల్లోని ఎత్తైన శిఖరాలను అధిరోహించాడు....
తాజాగా ప్రపంచంలో ఎత్తైన అగ్నిపర్వతం మౌంట్ ఓజోస్ డెల్స్ సలెదోని అధిరోహించాడు...**

కొందరికి మాత్రమే సాధ్యం అయ్యే ప్రపంచంలో ఎత్తైన పర్వతాల అధిరోహణలో సత్తా చాటుతున్నాడు మధురవాడకు చెందిన అన్వీష్‌వర్మ. ట్రెక్కింగ్ తన జీవితాశయంగా గత పదేళ్ల నుంచి దేశ, విదేశాల్లో ప్రయాణం సాగిస్తున్నాడు. చిన్నప్పటి నుంచే పర్వతారోహణ, సాహస క్రీడలు అంటే అన్వీష్‌కు ఇష్టం. స్నేహితులతో కలిసి సింహాచలం కొండ ఎక్కేవాడు. ఆ సమయంలోనే భూమి మీద ఎత్తైన శిఖరాలను ఎక్కాలనే లక్ష్యానికి బీజం పడింది.

మార్షల్ ఆర్ట్స్ టు మౌంట్ ఎవరెస్ట్

మార్షల్ ఆర్టిస్ట్ అయిన అన్వీష్ వరల్డ్ బాక్సింగ్, కరాటే అసోసియేషన్ గ్రీస్, ఆస్ట్రేలియాలో నిర్వహించిన పోటీల్లో విజేతగా నిలిచాడు.

మార్షల్ ఆర్టిస్ట్‌గా రాణిస్తూనే పర్వతారోహణపై దృష్టి సారించాడు. ఎవరెస్ట్ ఎంత ఎత్తు, ఎలా ఎక్కాలి, ఎంత ఖర్చు అవుతుందో కూడా తెలియదు. అయితే ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడం అనేది ఎంతో కష్టం, ఖర్చుతో కూడుకున్నదనే విషయం అర్థమైంది. ఎవరెస్ట్ శిఖరం ఎక్కాలనుకునే వారి కోసం వెలువడిన నోటిఫికేషన్ పర్వతారోహణ వైపు తొలి అడుగు వేసేలా చేసింది.విజయవాడ బీఆర్ ఆకాడమీలో సెలక్షన్స్ జరగగా నలభై మంది ఎంపికయ్యారు. అందులో అన్వీష్ ఒకరు. డార్జిలింగ్‌లో ఉన్న హిమాలయ మౌంటెనరీ ఇనిస్టిట్యూట్‌లో బేసిక్ మౌంటెనరీ ట్రైనింగ్ తీసుకున్నాడు.

మూడో ప్రయత్నంలో కల నిజమైంది!

2018లో అయిదు మంది ఎవరెస్ట్ అధిరోహించే క్రమంలో రాంబాబు అనే వ్యక్తికి తలలో బ్లడ్ క్లాట్ అవడంతో కుప్ప కూలిపోయాడు. అతడిని రక్షించడం కోసం వెనక్కి వచ్చేశారు. 2021లో రెండోసారి 8,500 మీటర్లు డెత్ జోన్‌కి చేరుకునేసరికి తనకి సహాయంగా వచ్చిన షెర్ప అనారోగ్యానికి గురికావడంతో రెండో సారి కూడా వెనక్కి రావాల్సి వచ్చింది.

రెండు సార్లు విఫలం కావడంతో నిరాశకు గురవుతారు. అయితే వివిధ కారణాల వల్ల ఎవరెస్ట్‌ను అధిరోహించకపోయినా నిరాశను దరి చేరనివ్వకుండా మూడో ప్రయత్నంలో తన కల నెరవేర్చుకున్నాడు. ఈ విజయంతో తన మీద తనకు నమ్మకం రెట్టింపు అయ్యింది. అలా తన జైత్రయాత్ర మొదలైంది. ఆఫ్రికాలోని కిలిమంజారో నుంచి యూరప్‌లోని మౌంట్ ఎల్‌బ్రస్ వరకు మొదటి ప్రయత్నంలోనే ఏడు ఖండాల్లో ఎత్తైన శిఖరాల అధిరోహణను మూడు ఏళ్లలోనే ఆ పని పూర్తి చేశాడు.

తాజాగా ప్రపంచంలో ఎత్తైన అగ్నిపర్వతం మౌంట్ ఓజోస్ డెల్స్ సలెడో(చిలీ) అధిరోహించాడు. అన్వీష్ వర్మ మరిన్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం.

– రామునాయుడు, సాక్షి, మధురవాడ, విశాఖపట్నం

అలా నా కల నెరవేరింది

నాకు ఏమీ తెలియదు...నేనేం చేయగలను అనుకుంటే ఉన్నచోటే ఉండిపోతాం. తెలుసుకోవాలనే తపన ఉంటే ఎన్ని విజయాలు అయినా సాధించవచ్చు. ఎవరెస్ట్‌కు ముందు పర్వతారోహణ గురించి నాకు పెద్దగా తెలియదు. అయితే ముందుకు వెళుతున్న కొద్దీ ఎన్నో విషయాలు తెలుసుకోగలిగాను. నా కలను నిజం చేసుకున్నాను.

- అన్వీష్ వర్మ

● గేమింగ్

తిరుగులేని యోధుడు వస్తున్నాడు....తప్పుకోండి...



వీడియో గేమ్ 'డైనస్టీ వారియర్స్: ఆరిజిన్స్' ఈ నెల విడుదల కానుంది. 'డైనస్టీ వారియర్స్' సిరీస్‌లో భాగంగా వస్తున్న గేమ్ ఇది. తాజా గేమ్‌ను చైనీస్ నవల 'రొమాన్స్ ఆఫ్ ది త్రీ కింగ్‌డమ్స్' ఆధారంగా రూపొందించారు. 14వ శతాబ్దపు చారిత్రక నవల ఇది. చైనా చరిత్రలో హాన్ రాజ వంశం కాలంలోని కల్లోల సంవత్సరానికి సంబంధించిన కథ ఇది.

గేమ్ ప్లే విషయానికి వస్తే... హ్యాక్ అండ్ స్లాష్, స్ట్రాటజిక్ ఎలిమెంట్స్ ఉన్నాయి. మెయిన్ క్యారెక్టర్‌ను ప్లేయర్ కంట్రోల్ చేయాల్సి ఉంటుంది. దళాలకు ఆదేశాలు ఇవ్వాల్సి ఉంటుంది. మల్టీపుల్ వెపన్స్ ఉంటాయి.

ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 5, విండోస్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్
జానర్స్: హ్యాక్ అండ్ స్లాష్
మోడ్: సింగిల్ ప్లేయర్

English Idioms

రూల్ ది రూస్ట్

ఏదైనా సందర్భం, పరిస్థితుల్లో అత్యంత బలమైన వ్యక్తి, ఒక బృందానికి సంబంధించి కార్యకలాపాలను కంట్రోల్ చేసే వ్యక్తికి సంబంధించే వాడే మాట...రూల్ ది రూస్ట్. **ఉదా:** ఇన్ ది స్మాల్ ఫ్యామిలీ బిజినెస్, ఇట్ వాజ్ గ్రాండ్‌మా హు రూల్‌డ్ ది రూస్ట్, మేకింగ్ ఆల్ ది ఇంపార్టెంట్ డిసిషన్స్.

టఫ్ కుకీ

ప్రతికూల పరిస్థితుల్లో దృఢంగా ఉండే వ్యక్తి విషయంలో ఉపయోగించే మాట... టఫ్ కుకీ.
ఉదా: యు హ్యావ్ టు బీ ఏ టఫ్ కుకీ టు సర్వైవ్ ఇన్ సచ్ ఏ కాంపిటేటివ్ ఇండస్ట్రీ.

సినిమా



● మహేశ్‌బాబు

అడ్వెంచర్ ఆరంభం

మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో ఓ భారీ బడ్జెట్ చిత్రం రూపొందుతున్న సంగతి తెలిసిందే. దుర్గా ఆర్ట్స్ పతాకంపై కేఎల్ నారాయణ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రారంభోత్సవం గురువారం హైదరాబాద్ శివార్లలోని అల్యూమినియం ఫ్యాక్టరీ దగ్గర్లోని రాజమౌళి కార్యాలయంలో జరిగినట్లుగా తెలిసింది. ఫారెస్ట్ అడ్వెంచరస్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రానికి విజయేంద్రప్రసాద్ కథ అందించారు. కాగా గురువారం ప్రారంభోత్సవం జరిపి, ఆ తర్వాత ఓ రెండు మూడు రోజుల పాటు షూట్‌ని ప్లాన్ చేశారట. ఈ సినిమా కోసం ఆల్రెడీ సెట్స్ వర్క్ ప్రారంభమైంది. ఈ సెట్స్‌లోనే షూటింగ్ ప్లాన్ చేశారని సమాచారం. ఇక రెగ్యులర్ షూటింగ్‌ను వేసవిలో ప్రారంభించాలని టీమ్ ప్లాన్ చేస్తోందని టాక్. అలాగే ఈ సినిమా రెండు భాగాలుగా విడుదల కానుందని, తొలి భాగం 2027లో, రెండో భాగం 2029లో రిలీజ్ కానుందనే ప్రచారం సాగుతోంది. ఇంకా ఈ చిత్రంలో ప్రియాంకా చోప్రా హీరోయిన్‌గా నటిస్తారని, మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా నటిస్తారనే ప్రచారం జరుగుతోంది. ఒక్క హీరో మినహా ఈ సినిమా హీరోయిన్, ఇతర కీలక పాత్రలకు సంబంధించిన నటీనటుల గురించి అధికారిక ప్రకటన రాలేదు. ఇదిలా ఉంటే.. ఈ సినిమాలో మహేశ్‌బాబు లుక్ బయటకు రాకూడదని, మేకర్స్ ఈ ఓపెనింగ్ ఫొటోలు, వీడియోలను రిలీజ్ చేయలేదట. ఈ ప్రారంభ వేడుకలో మహేశ్‌బాబు, రాజమౌళి, రమా రాజమౌళి, కీరవాణి... ఇలా చాలా తక్కువ మంది మాత్రమే పాల్గొన్నారని తెలిసింది. అయితే ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.



● రకుల్ ప్రీత్ సింగ్



● రాజమౌళి, రామ్‌చరణ్, శంకర్, 'దిల్' రాజు, శిరీష్

డైరెక్టర్లకు శంకర్‌గారే గ్యాంగ్‌స్టర్

- ఎస్ఎస్ రాజమౌళి

''ప్రస్తుతం ఉన్న యువ దర్శకులు మమ్మల్ని చూసి గర్వపడుతుంటారు. కానీ, మేం మాత్రం శంకర్‌గారిని చూసి గర్వపడుతుంటాం. ఆయనే డైరెక్టర్లకు ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్. మన కున్న పెద్ద కలల్ని సినిమాగా తీస్తే డబ్బులు వెనక్కి వస్తాయని నమ్మకం ఇచ్చారాయన. తాజాగా ఆయన తీసిన 'గేమ్ చేంజర్' ట్రైలర్‌ను రిలీజ్ చేసే అవకాశం నాకు ఇచ్చినందుకు థ్యాంక్స్'' అని డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి అన్నారు. రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'గేమ్ చేంజర్'. కియారా అద్వానీ, అంజలి హీరోయిన్లుగా నటించారు. అనిత సమర్పణలో శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్, జీ స్టూడియోస్, 'దిల్' రాజు ప్రొడక్షన్ బ్యానర్స్‌పై 'దిల్' రాజు, శిరీష్ నిర్మించారు. ఈ చిత్రం తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఈ నెల 10న విడుదల కానుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన 'గేమ్ చేంజర్' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి రాజమౌళి ముఖ్య అతిథిగా హాజరై, ట్రైలర్ రిలీజ్ చేశారు. అనంతరం **రాజమౌళి మాట్లాడుతూ–** ''ఒకే ఒక్కడు' నాకు చాలా ఇష్టమైన సినిమా. ఆ మూవీని మించేలా 'గేమ్ చేంజర్' ఉంటుందనిపిస్తోంది. 'మగధీర' నుంచి 'ఆర్ఆర్ఆర్' మూవీకే రామ్‌చరణ్ ఎంతో ఎదిగిపోయాడు. 'గేమ్ చేంజర్'ని అందరూ థియేటర్లలోనే చూడండి'' అని చెప్పారు. **శంకర్ మాట్లాడుతూ–** ''ఓ పొలిటికల్ లీడర్, ఓ ఐఏఎస్ ఆఫీసర్ మధ్య జరిగే కథే ఈ మూవీ. రామ్‌చరణ్‌గారు అద్భుతంగా నటించారు. నన్ను తెలుగుకి పరిచయం చేసిన 'దిల్' రాజుగారికి థ్యాంక్స్. హాలీవుడ్‌లా మనం సినిమాలు తీయాలనుకుంటాం. కానీ, హాలీవుడ్ కూడా ఇప్పుడు మనలా సినిమాలు తీయాలని అనుకుంటున్నారు... దానికి కారణం రాజమౌళిగారు'' అని చెప్పారు. **రామ్‌చరణ్ మాట్లాడుతూ–** ''రాజమౌళి, శంకర్ గార్లు ఏ విషయంలోనూ రాజీ పడరు. వారు అనుకున్నది వచ్చే వరకు షూట్ చేస్తుంటారు. ఇద్దరూ పర్ఫెక్షన్ కోసం ప్రయత్నిస్తుంటారు. 'దిల్' రాజు, శిరీష్‌గార్లు ఈ సినిమాను అద్భుతంగా నిర్మించారు'' అని పేర్కొన్నారు. **'దిల్' రాజు మాట్లాడుతూ –**''తమిళ సినిమాను శంకర్‌గారు పాన్ ఇండియాగా చేశారు. రాజమౌళిగారు తెలుగు సినిమాను గ్లోబల్ స్థాయికి తీసుకెళ్లారు. ఆ ఇద్దరి వల్లే ఇప్పుడు ఇలాంటి భారీ చిత్రాలు వస్తున్నాయి. ఇప్పటి వరకు మేం చూపింది కేవలం యాభై శాతమే. అసలు విషయం జనవరి 10న తెలుస్తుంది'' అన్నారు. ఈ కార్యక్రమంలో మ్యూజిక్ డైరెక్టర్ తమన్, రైటర్ సాయి మాధవ్ బుర్రా, నటీనటులు అంజలి, శ్రీకాంత్, ఎస్‌జే సూర్య, సముద్రఖని మాట్లాడారు.

యాక్షన్... థ్రిల్



● జేడీ చక్రవర్తి, సీరత్ కపూర్, నరేష్ అగస్త్య

జేడీ చక్రవర్తి, నరేష్ అగస్త్య, సీరత్ కపూర్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జాతస్య మరణం ధ్రువం'. శ్రవణ్ జొన్నాడ దర్శకత్వం వహించారు. 'తమ్ముడు, నరసింహనాయుడు, అధిపతి' చిత్రాల్లో నటించిన ప్రీతీ జంగియాని 'జాతస్య మరణం ధ్రువం'తో రీ ఎంట్రీ ఇస్తున్నారు. త్రిష సమర్పణలో మల్కాపురం శివకుమార్ నిర్మించిన ఈ చిత్రానికి 'జాతస్య మరణం ధ్రువం' టైటిల్ ఖరారు చేసి, ఫస్ట్ లుక్‌ని లాంచ్ చేశారు. ''యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రమిది. 'జాతస్య మరణం ధ్రువం' అన్నది ఒక సంస్కృత పద బంధం. 'పుట్టినవారికి మరణం తప్పదు' అని అర్థం. తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమాని విడుదల చేస్తాం'' అని మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రానికి సంగీతం: జిబ్రాన్, రాజ్ ఆషూ, కెమెరా: అర్జున్ రాజా.

అల్లు అర్జున్‌ని బాధ్యుణ్ణి చేయడం సరి కాదు




- బోనీకపూర్

''నటీనటులను దక్షిణాదిలోనే ప్రేక్షకులు ఎక్కువగా అభిమానిస్తారు. వారి కోసం గంటల తరబడి వేచి చూస్తారు. ఇటీవల హైదరాబాద్‌లో ఓ సంఘటన (సంధ్య థియేటర్ తొక్కిసలాటని ఉద్దేశించి) ఎక్కువ మంది జనాలు రావడంతోనే జరిగింది. అందుకు అల్లు అర్జున్ బాధ్యుడు కాదు'' అని ప్రముఖ బాలీవుడ్ నిర్మాత బోనీ కపూర్ అన్నారు. అల్లు అర్జున్ హీరోగా నటించిన 'పుష్ప 2: ది రూల్' ప్రీమియర్ షో సందర్భంగా డిసెంబరు 4న హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట జరిగిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో రేవతి అనే మహిళ మృతి చెందగా, ఆమె తనయుడు శ్రీతేజ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనలో అరెస్ట్ అయిన అల్లు అర్జున్‌కి తెలంగాణ హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడంతో విడుదలైన సంగతి తెలిసిందే. తాజాగా ఈ సంఘటనపై బోనీ కపూర్ ఓ ఇంటర్వ్యూలో స్పందించారు. ''నటీనటులను దక్షిణాది ప్రేక్షకులు ఎక్కువగా అభిమానిస్తారు. తమ అభిమాన హీరోల సినిమాలను తొలి రోజే చూసేందుకు ఆసక్తిగా ఉంటారు. ఓసారి హీరో అజిత్ నటించిన ఒక చిత్రాన్ని చూసేందుకు అర్ధరాత్రి నేను థియేటర్ వద్దకు వెళ్లాను. ఆ సమయంలో అక్కడ దాదాపు 20 వేల మందికి పైగా ఉన్నారు. ఓ సినిమా హాలు వద్ద అంత మంది ప్రేక్షకులను నేను చూడటం అదే మొదటి సారి. నేను పూర్తి సినిమా చూసి బయటకు వచ్చే సరికి తెల్లవారుజామున దాదాపు నాలుగైంది. అప్పుడు కూడా జనాలు అక్కడే నిలబడి ఉన్నారు. అజిత్ అనే కాదు... రజనీకాంత్, చిరంజీవి, రామ్ చరణ్, మహేశ్ బాబు, అల్లు అర్జున్ వంటి స్టార్ హీరోలకు అభిమానులు ఎక్కువగా ఉంటారు. వారి సినిమాలు రిలీజ్ అయినప్పుడు ఫ్యాన్స్ పెద్ద సంఖ్యలో వస్తారు. ఎక్కువ మంది జనాలు రావడంతో ఆ విషాదం జరిగింది. ఈ విషయంలో అల్లు అర్జున్‌ని నిందించాల్సిన అవసరం లేదు. తనని బాధ్యుణ్ణి చేయడం సరికాదు'' అని తెలిపారు.

లవ్ ట్రయాంగిల్ నహీ హై!

అర్జున్ కపూర్, రకుల్ ప్రీత్ సింగ్, భూమీ ఫడ్నేకర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న రొమాంటిక్ కామెడీ ఫిల్మ్ 'మేరే హజ్బెండ్‌కీ బీబీ'. 'లవ్ ట్రయాంగిల్ నహీ హై... సర్కిల్ హై' (ప్రేమ ముక్కోణం కాదు... వలయం) అనేది ఈ సినిమా క్యాప్షన్. ముదస్సర్ అజీజ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. వసు భగ్నానీ, జాకీ భగ్నానీ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఫిబ్రవరి 21న రిలీజ్ చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. మరి... లవ్ సర్కిల్‌లో ఫైనల్‌గా ఏ ఇద్దరి ప్రేమ గెలిచిందో చూడాలంటే కొన్ని రోజులు వెయిట్ చేయక తప్పదు. ఇక ఈ సినిమాయే కాకుండా హిందీలో అజయ్ దేవగన్ 'దే దే ప్యార్ దే 2' చిత్రంలో ఓ హీరోయిన్‌గా నటిస్తున్నారు రకుల్. అలాగే కమల్‌హాసన్, కాజల్ అగర్వాల్ హీరో హీరోయిన్లుగా నటించిన 'ఇండియన్ 3' చిత్రంలో రకుల్ ప్రీత్ సింగ్ ఓ లీడ్ రోల్‌లో నటించారు. 'దే దే ప్యార్ దే 2' జూలైలో విడుదల కానుంది. 'ఇండియన్ 3' కూడా ఈ ఏడాదే రిలీజ్ అవుతుంది. అయితే విడుదల తేదీపై ఓ స్పష్టత రావాల్సి ఉంది.

దేవా వస్తున్నాడు



● షాహిద్ కపూర్

ఈ నెలాఖర్లో థియేటర్స్‌లోకి వస్తున్నాడు దేవా. షాహిద్ కపూర్ టైటిల్ రోల్‌లో నటించిన బాలీవుడ్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'దేవా'. ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటించారు. మలయాళ దర్శకుడు రోషన్ ఆండ్రూ ఈ సినిమాతో బాలీవుడ్‌కు పరిచయం అవుతున్నారు. 'దేవా' చిత్రం గత ఏడాదే విడుదల కావాల్సింది. అయితే కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. తాజాగా ఈ సినిమాను జనవరి 31న విడుదల చేయనున్నట్లుగా చిత్రయూనిట్ అధికారికంగా ప్రకటించింది. 'లాక్ అండ్ లోడ్' అంటూ ఈ సినిమా కొత్త రిలీజ్ డేట్ పోస్టర్‌ను షేర్ చేశారు షాహిద్ కపూర్. జీ స్టూడియోస్, రాయ్ కపూర్ ఫిలింస్ నిర్మించిన ఈ సినిమాకు విశాల్ మిశ్రా సంగీతం అందించగా, జేక్స్ బిజోయ్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించారు.

సాక్షి బిజినెస్

శుక్రవారం
3-1-2025

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు	
సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
1,436	446
79,944	24,189

విదేశీ సూచీలు (శుక్రవారం మంగళవారం ముగింపు)

నాస్‌డాక్	19,183	▽ 127
డోజోన్స్	42,335	▽ 209
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,260	▲ 87
డాక్స్	3,263	▲ 89
షాంఘై	20,205	▲ 116
నికాయ్	39,895	▲ 387

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	77,079 ▲ 496
బంగారం (99.5 స్వచ్ఛత)	76,770 ▲ 494
వెండి (కిలో)	87,167 ▲1,112

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	85.30	86.32
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	105.36	109.63
€	యూరో	ఒకటి	87.71	90.31
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	53.91	55.25
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.26	54.45
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.93	65.00
SAR	సౌదీ రియాల్	ఇరవైఐదు	21.93	23.44
UAE D	యూఏఈ దిర్హామ్	ఇరవైఐదు	22.43	24.15
¥	చైనా యువాన్	ఇరవైఐదు	10.97	12.56



క్రెటా ఈవీ @ 470 కి.మీ!

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హ్యుందాయ్ మోటార్ ఇండియా ఫ్లాగ్‌షిప్ ఎస్‌యూవీ క్రెటా ఎలక్ట్రిక్ టీజర్ విడుదలైంది. న్యూఢిల్లీ వేదికగా జనవరి 17 నుంచి జరిగే భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో సందర్భంగా క్రెటా ఈవీని ప్రదర్శించనున్నారు. డిజైన్ పరంగా ఇంటర్నల్ కంబషన్ ఇంజన్ ఆధారిత క్రెటాను ఇది పోలి ఉంది. 42, అలాగే 51.4 కిలోవాట్ అవర్ బ్యాటరీ ఆప్షన్స్‌తో నాలుగు వేరియంట్లలో వస్తున్నట్టు సమాచారం. ఒకసారి చార్జింగ్‌తో వేరియంట్‌నుబట్టి 390–470 కిలోమీటర్ల వరకు పరుగెడుతుంది. లాంగ్ రేంజ్ వేరియంట్ 7.9 సెకన్లలో గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకుంటుంది. 58 నిమిషాల్లో 10 నుంచి 80 శాతానికి చార్జ్ అవుతుంది. మోనోటోన్‌లో ఎనమిది, డ్యూయల్ టోన్‌లో రెండు కలర్ ఆప్షన్స్‌లో లభిస్తుంది. లెవెల్–2 అడాస్, ఎలక్ట్రిక్ పనోరమిక్ సన్‌రూఫ్, చార్జింగ్ పోర్ట్‌తో కూడిన పిక్సెలేటెడ్ గ్రాఫిక్ ఫ్రంట్ గ్రిల్, పిక్సెలేటెడ్ గ్రాఫిక్ బంపర్స్, ఎల్‌ఈడీ టెయిల్ ల్యాంప్స్, మెరుగైన కూలింగ్ కోసం యాక్టివ్ ఎయిర్ ఫ్లాప్స్, లో రోలింగ్ రెసిస్టెన్స్ టైర్స్‌తో ఆర్17 ఏరో అలాయ్ వీల్స్ వంటి హంగులున్నాయి. ధర రూ.20–30 లక్షలు ఉండొచ్చని అంచనా.

10 నిమిషాల్లో అంబులెన్స్

బ్లింకిట్ కొత్త సర్వీస్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: క్విక్ కామర్స్ రంగంలో సంచలనానికి బ్లింకిట్ తెరతీసింది. ఇప్పటి వరకు ఆహారం, లైఫ్‌స్టైల్ ఉత్పత్తులకు పరిమితమైన క్విక్ కామర్స్ రంగంలో ఏకంగా అంబులెన్స్ సేవలకు కంపెనీ శ్రీకారం చుట్టింది. పైలట్ ప్రాతిపదికన ఈ సేవలను మొదట గురుగ్రామ్‌లో గురువారం ప్రారంభించింది. త్వరలో మరిన్ని నగరాలకు ఈ సర్వీసులను విస్తరిస్తారు. ఆక్సిజన్ సిలిండర్, ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డిఫిబ్రిలేటర్ (ఏఈడీ), స్ట్రెచర్, మానిటర్, సక్షన్ మెషీన్, అత్యవసర మందులు, ఇంజెక్షన్లు ఈ అంబులెన్సుల్లో ఉంటాయి. డ్రైవర్‌తోపాటు పారామెడిక్, డ్యూటీ అసిస్టెంట్ సైతం ఉంటారు. 'నగరాల్లో త్వరిత, విశ్వసనీయ అంబులెన్స్ సేవలను అందించే విషయంలో ఉన్న సమస్యను పరిష్కరించే దిశగా మొదటి అడుగు వేస్తున్నాం. గురుగ్రామ్‌లో తొలి ఐదు అంబులెన్స్‌లు రోడ్డెక్కనున్నాయి. వచ్చే రెండేళ్లలో అన్ని ప్రధాన నగరాలకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. లాభం లక్ష్యం కాదు. కస్టమర్లకు సరసమైన ధరతో ఈ సేవను నిర్వహిస్తాం. దీర్ఘకాలికంగా ఈ క్లిష్ట సమస్యను నిజంగా పరిష్కరించడంలో పెట్టుబడి పెట్టాం' అని బ్లింకిట్ సీఈవో అల్బిందర్ ధిండ్సా చెప్పారు.



బుల్.. రప్పా రప్పా!



ముంబై: కొత్త ఏడాదిలో రెండోరోజూ సూచీల జోరు కొనసాగింది. ఫైనాన్సియల్, ఆటో, ఐటీ షేర్లలో కొనుగోళ్లు వెల్లువెత్తడంతో సూచీలు గురువారం రెండువారాల గరిష్టం వద్ద ముగిశాయి. సెన్సెక్స్ 1,436 పాయింట్లు ఎగసి 79,944 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 446 పాయింట్లు బలపడి 24,189 వద్ద నిలిచింది. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్ల నుంచి మిశ్రమ సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం స్వల్ప లాభాల్లో మొదలయ్యాయి. ట్రేడింగ్ గడిచే కొద్ది కొనుగోళ్లు ఊపందుకోవడంతో భారీ లాభాల దిశగా కదిలాయి. ఒక దశలో సెన్సెక్స్ 1525 పాయింట్లు దూసుకెళ్లి 80,033 వద్ద, నిఫ్టీ 484 పాయింట్లు ఎగసి 24,226 వద్ద గరిష్టాలు నమోదు చేశాయి. నూతన సంవత్సర సెలవుల తర్వాత మొదలైన అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లు మిశ్రమంగా ట్రేడవుతున్నాయి.

- ✔ సెన్సెక్స్ సూచీలో సన్‌ఫార్మా (0.62%) మినహా మిగిలిన 29 షేర్లూ లాభపడ్డాయి. బజాజ్ ఫిన్‌సర్వ్ 8%, బజాజ్ ఫైనాన్స్ 6.50%, మారుతీ సుజుకీ 5.50%, టైటాన్, ఎంఅండ్‌ఎం 4%, లాభపడ్డాయి.
- ✔ విస్తృత స్థాయిలో అన్ని రంగాల షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్‌ఈలో మిడ్ క్యాప్ ఇండెక్స్ 1%, స్మాల్ క్యాప్ సూచీల అర శాతం లాభపడ్డాయి. సూచీల వారీగా అత్యధికంగా ఆటో ఇండెక్స్ 4% ర్యాలీ చేసింది. ఐటీ 2.50%, కన్జూమర్ డిస్క్రేషరీ 2.25%, కన్జూమర్ డ్యూరబుల్స్ 2%, కమోడిటీ ఇండెక్స్ ఒకటిన్నర శాతం లాభపడ్డాయి.
- ✔ డాలర్ మారకంలో రూపాయి విలువ 11 పైసలు బలహీనపడి సరి కొత్త కనిష్టం 85.75 వద్ద ముగిసింది.

రెండో రోజూ న్యూ ఇయర్ పార్టీ

- సెన్సెక్స్ 1,436 పాయింట్లు ప్లస్
- నిఫ్టీ లాభం 446 పాయింట్లు
- ఫైనాన్స్, ఐటీ, ఆటో షేర్లలో భారీ కొనుగోళ్లు
- రూ.8 లక్షల కోట్లకు పైగా సంపద సృష్టి

ఫారెక్స్ మార్కెట్లో ఉదయం బలహీనంగా మొదలైన దేశీయ కరెన్సీ ఇంట్రాడేలో 85.79 వద్ద కనిష్టాన్ని 85.68 వద్ద గరిష్టాన్ని నమోదు చేసింది.

- ✔ డిసెంబర్ నెలలో వాహన అమ్మకాల వృద్ధి 30% నమోదుతో మారుతీ సుజుకీ షేరు దూసుకెళ్లింది. బీఎస్‌ఈలో అయిదున్నర శాతం లాభపడి రూ.11,838 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఆరున్నర శాతం ర్యాలీ చేసి రూ.11,856 వద్ద గరిష్టాన్ని తాకింది.

రెండు రోజుల్లో రూ.8.52 లక్షల కోట్లు

కొత్త ఏడాది తొలి రెండు రోజుల్లో సెన్సెక్స్ 1804 పాయింట్లు ర్యాలీ చేయడంతో స్టాక్ మార్కెట్లో రూ.8.52 లక్షల కోట్లు సంపద సృష్టి జరిగింది. దీంతో బీఎస్‌ఈలో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.450.47 లక్షల కోట్లకు చేరింది.

లాభాలు ఎందుకంటే...

- బలహీన డిమాండ్‌కు భిన్నంగా డిసెంబర్‌లో అంచనాలకు మించి వాహన విక్రయాలు జరడంతో ఆటో రంగ షేర్లు దూసుకెళ్లాయి. ఐషర్ మోటార్స్ షేరు 8.50%, మారుతీ 6%, ఎంఅండ్‌ఎం షేరు 4%, అశోక్ లేలాండ్ షేరు 6% చొప్పున రాణించాయి.
- అంతర్జాతీయ బ్రోకరేజ్ సంస్థలైన సీఎల్‌ఎస్‌ఏ, సిటీ డిసెంబర్ క్వార్టర్‌తో పాటు 2025 ఏడాది మొత్తంగా ఐటీ కంపెనీల ఆదాయాల్లో వృద్ధి బలంగా ఉండొచ్చనే తాజాగా అంచనా వేశాయి. ఫలితంగా ఈ రంగంలోని షేర్లు ఇన్ఫోసిస్ 4%, హెచ్‌సీఎల్ 3%, ఎల్‌టీటీఎస్ 2%, టీసీఎస్ 1.50% మేర, హెచ్‌సీఎల్, టెక్ మహీంద్రా షేర్లు ఒక శాతం చొప్పున రాణించాయి. సెన్సెక్స్ ఆర్జించిన మొత్తం పాయింట్లలో ఈ షేర్ల వాటాయే 360 పాయింట్లు కావడం విశేషం.
- గతకాలంగా అమ్మకాల ఒత్తిడితో నష్టాల బాటపట్టిన బ్యాంకింగ్, ఫైనాన్స్ షేర్లలో అనూహ్య రికవరీ జరిగింది. అత్యధికంగా బజాజ్ ఫిన్‌సర్వ్ 8%, బజాజ్ ఫైనాన్స్ 6.50% లాభపడ్డాయి. కోటక్ బ్యాంక్ 3%, ఇండస్ ఇండ్ 2%, ఎస్‌బీఐ షేరు ఒకశాతం చొప్పున పెరిగాయి.

కేపీపై మళ్లీ సెబీ నిషేధం

- మరో ఇద్దరిపై సైతం చర్యలు
- రూ. 65.77 కోట్ల అక్రమార్జన ఆరోపణ



ముంబై: రెండు దశాబ్దాల క్రితం దేశీ స్టాక్ మార్కెట్లలో కుంభకోణాలకు తెరతీసి అనూహ్య పతనానికి కారణమైన బ్రోకర్ కేతన్ పరేఖ్ మరోసారి అక్రమాలతో వెలుగులోకి వచ్చాడు. మరో ఇద్దరితో కలసి మరోసారి స్టాక్ మార్కెట్లో చట్ట విరుద్ధ లావాదేవీలకు పాల్పడినట్లు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ పేర్కొంది. దీంతో కేపీగా పిలిచే కేతన్ పరేఖ్‌సహా రోహిత్ సాల్గావాకర్, అశోక్ కుమార్ పొద్దార్‌ను స్టాక్ మార్కెట్ల నుంచి నిషేధించింది. నిజానికి గతంలో తమ బ్రోకింగ్, ఇన్వెస్ట్‌మెంట్ సంస్థల ద్వారా కేపీ కొన్ని షేర్ల రిగ్గింగ్‌కు పాల్పడిన సంగతి తెలిసిందే. దీంతో 2001లో స్టాక్ మార్కెట్ కుప్పకూలింది. ఫలితంగా సెబీ 14 ఏళ్లపాటు కేపీపై నిషేధాన్ని విధించింది. తాజాగా అక్రమ లావాదేవీలకు కారణమైన కేపీతోపాటు మరో ఇద్దరిని వెనువెంటనే అమల్లోకివచ్చే విధంగా స్టాక్ మార్కెట్ల నుంచి సెబీ నిషేధించింది. 2021 జనవరి 1 నుంచి 2023 జూన్ 20 మధ్య కాలంలో చేపట్టిన దర్యాప్తు నేపథ్యంలో తాజా చర్యలకు ఉపక్రమించింది. వీళ్లు ఫ్రంట్ రన్నింగ్ పథకంలో భాగంగా అక్రమంగా వ్యవహరించినట్లు సెబీ పేర్కొంది. ఒక ఫండ్ హౌస్ ద్వారా లభించిన సమాచారంతో పరేఖ్‌సహా 22 సంస్థలు రూ. 65.77 కోట్లు అక్రమంగా ఆర్జించినట్లు ఆరోపించింది. బ్రోకర్, విశ్లేషకుల ద్వారా లభించిన ముందస్తు సమాచారాన్ని క్లయింట్లకు అందించక ముందే ఏదైనా సంస్థ ద్వారా చట్టవిరుద్ధంగా లావాదేవీలు చేపట్టడాన్ని ఫ్రంట్ రన్నింగ్‌గా పిలుస్తారు.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

బడ్జెట్‌లో దీర్ఘకాలిక పొదుపును ప్రోత్సహించాలి	డిసెంబర్‌లో తయారీ రంగం డీలా

సాక్షి స్పోర్ట్స్

"మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న పురస్కారానికి ఎంపిక కావడం చాలా ఆనందంగా ఉంది. దేశ ఖ్యాతిని మరింత ఇనుమడింపజేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చెప్పిన మాటలు నాకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకం. భవిష్యత్తులో 64 గళ్ల క్రీడలో మరిన్ని విజయాలు సాధిస్తా. కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయా ప్రోత్సాహం మరవలేనిది.

–దొమ్మరాజు గుకేశ్, ప్రపంచ చెస్ చాంపియన్

రోహిత్‌ను తప్పించి తుది సమరానికి!

భారత టెస్టు క్రికెట్ చరిత్రలో గాయం, నిషేధం లేదా మరో వ్యక్తిగత కారణంతో కాకుండా ఫామ్ లేకపోవడంతో తుది జట్టుకు దూరమైన కెప్టెన్ ఇప్పటి వరకు ఎవరూ లేరు! కానీ ఇప్పుడు తొలిసారి రోహిత్ శర్మ అలాంటి స్థితిలో నిలిచాడు. వరుస వైఫల్యాలు, డ్రెస్సింగ్ రూమ్‌లో విభేదాలవంటి వార్తల నేపథ్యంలో రోహిత్‌పై వేటు పడింది. నేటి నుంచి ఆస్ట్రేలియాతో జరిగే చివరి టెస్టులో అతడిని టీమ్ మేనేజ్‌మెంట్ తప్పించడం ఖాయమైంది. సిరీస్‌లో తొలి పోరులో భారత్‌ను గెలిపించిన బుమ్రా నాయకత్వంలోనే ఇప్పుడు సిరీస్‌ను సమం చేసే లక్ష్యంతో టీమిండియా బరిలోకి దిగుతోంది. భారత్ గెలిస్తే 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ'ని నిలబెట్టుకోవడంతో పాటు వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ చేరే ఆశలు ఇంకా మిగిలి ఉంటాయి. ఆసీస్ గెలిస్తే ఆ జట్టు డబ్ల్యూటీసీ ఫైనల్లోకి ప్రవేశిస్తుంది.

- టీమిండియా కెప్టెన్‌పై వేటు
- నేటి నుంచి భారత్, ఆస్ట్రేలియా చివరి టెస్టు
- విజయం సాధిస్తే సిరీస్ సమం
- ఆసీస్ గెలిస్తే డబ్ల్యూటీసీ ఫైనల్‌కు
- ఉదయం 5 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్–1లో ప్రత్యక్ష ప్రసారం

1 సిడ్నీలో ఆస్ట్రేలియా జట్టుతో భారత్ ఇప్పటి వరకు 13 టెస్టులు ఆడింది. టీమిండియా ఒక్క టెస్టులో మాత్రమే (1978లో) గెలిచి, ఐదు టెస్టుల్లో ఓడిపోయింది. మరో 7 టెస్టులు 'డ్రా'గా ముగిశాయి.

సిడ్నీ: భారత్, ఆస్ట్రేలియా మధ్య సుదీర్ఘ టెస్టు సిరీస్ చివరి అంకానికి చేరింది. నేటి నుంచి జరిగే ఐదో టెస్టులో ఇరు జట్లు తాడోపేడో తేల్చుకోనున్నాయి. ఆసక్తికరంగా సాగిన సమరంలో ప్రస్తుతం 1–2తో వెనుకబడిన భారత్ ఎలాగైనా గెలిచి సిరీస్ సమం చేయాలని పట్టుదలగా ఉంది. సొంతగడ్డపై భారత్ చేతిలో గత రెండు 'బోర్డర్–గావస్కర్ ట్రోఫీ' సిరీస్‌లు ఓడిన ఆస్ట్రేలియా ఈసారి ఎలాగైనా తమ స్థాయిని ప్రదర్శించి ట్రోఫీని గెలుచుకోవాలని భావిస్తోంది. ఈ మ్యాచ్‌లో భారత్ ఓడితే డబ్ల్యూటీసీ ఫైనల్‌కు చేరే అవకాశాలు పూర్తిగా కోల్పోతుంది. సిడ్నీ పిచ్ అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్‌కు సమానంగా సహకరించవచ్చు. మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించే అవకాశాలు తక్కువ.

రోహిత్ స్థానంలో గిల్...

కెప్టెన్ రోహిత్ శర్మ ఈ టెస్టులో ఆడే విషయంపై స్పందిస్తూ గురువారం 'ఇప్పుడే ఏమీ చెప్పలేను' అని కోచ్ గంభీర్ చెప్పడంలోనే రోహిత్ స్థానంలో సందేహం కనిపించింది. ఈ సిరీస్‌లో వ్యక్తిగత కారణాలరీత్యా తొలి టెస్టుకు దూరమైన రోహిత్... ఆ తర్వాత 5 ఇన్నింగ్స్‌లలో కలిపి 31 పరుగులే చేశాడు. ఇది ఆందోళనకరమే అయినా... వేటు పడవచ్చని ఎవరూ ఊహించలేదు. కానీ కోచ్ గంభీర్, సెలక్టర్ అగార్కర్‌తో చర్చించిన తర్వాత మ్యాచ్‌కు దూరంగా ఉండేందుకు రోహిత్ సిద్ధమయ్యాడు. అతని స్థానంలో శుబ్‌మన్ గిల్ జట్టులోకి రానున్నాడు. గాయంతో బాధపడుతున్న పేసర్ ఆకాశ్‌దీప్ స్థానంలో ప్రసిధ్ కృష్ణ లేదా హర్షిత్ రాణా ఆడే అవకాశం ఉంది. ఈ రెండు మార్పుల అనంతరం భారత జట్టు సిద్ధమైంది. అయితే పెర్త్‌లో సెంచరీ మినహా వరుసగా విఫలమైన కోహ్లి ఈ సారైనా రాణిస్తాడా అనేది చూడాలి. రాహుల్, పంత్, జడేజా కూడా తమపై ఉన్న అంచనాలకు అనుగుణంగా ఆడాల్సి ఉంది. బౌలింగ్‌లో బుమ్రాకు సిరాజ్ తగిన మద్దతు ఇస్తే ఆసీస్‌ను నిలువరించవచ్చు.

మార్ష్ స్థానంలో వెబ్‌స్టర్...

ఆస్ట్రేలియా కూడా ఒక మార్పుతో బరిలోకి దిగనుంది. ఫామ్‌లో లేని మిచెల్ మార్ష్ స్థానంలో మరో ఆల్‌రౌండర్ వెబ్‌స్టర్ టెస్టు క్రికెట్‌లో అరంగేట్రం చేయనున్నాడు. మెల్‌బోర్న్ విజయం ఇచ్చిన ఉత్సాహంతో మరో గెలుపుపై కంగారూలు గురి పెట్టారు. ఖ్వాజా మినహా మిగతా ఆటగాళ్లంతా ఫామ్‌లో ఉన్నారు. ఆల్‌రౌండర్ నైపుణ్యంతో సారథి కమిన్స్ జట్టును సమర్థంగా నడిపిస్తుండగా...10 వేల పరుగుల మైలురాయికి 38 పరుగుల దూరంలో ఉన్న స్మిత్ అతని సొంత మైదానంలో చెలరేగితే ఆసీస్ భారీస్కోరు సాధించడం ఖాయం.



బుమ్రా, గంభీర్, రోహిత్

రోహిత్ అన్యమనస్కంగా...

టెస్టుకు ముందు రోజు భారత జట్టు ప్రాక్టీస్ సమయంలోనే రోహిత్‌పై వేటుకు సంబంధించిన సంకేతాలు కనిపించాయి. స్లిప్ ఫీల్డింగ్ ప్రాక్టీస్ సమయంలో వరుసగా కోహ్లి, రాహుల్, నితీశ్ రెడ్డి, గిల్ నిలబడగా... రోహిత్ జాడే కనిపించలేదు. నెట్స్‌లో ప్రధాన బ్యాటర్ల సాధన సాగినంత సేపూ అతను ఒక పక్కన నిలబడి బుమ్రాతో కబుర్లు చెబుతూ కనిపించాడు. ఆ తర్వాత అంతా ముగిసిన తర్వాత కొద్దిసేపు ప్రాక్టీస్ చేసినా తీవ్రత కనిపించలేదు. నేరుగా వచ్చిన బంతులను కూడా అతను ఆడే ప్రయత్నం చేయకపోగా, అవన్నీ స్టంప్స్‌ను పడగొట్టాయి. పూర్తి ఏకాగ్రతతో అతను అర గంట కూడా సాధన చేయలేదు. పక్క నెట్‌లోనే నితీశ్, గిల్‌లకు ప్రత్యేక సూచనలిస్తూ సాధన చేయించిన కోచ్ గంభీర్‌తో కనీసం పలకరింపులు కూడా కనపడలేదు. ప్రాక్టీస్ ముగిశాక బుమ్రా, అగార్కర్‌లతో కలిసి రోహిత్ మైదానం వీడాడు.

మరిన్ని క్రీడా వార్తలు
సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

నలుగురు 'ఖేల్ రత్న'లు

మనూ భాకర్, గుకేశ్, హర్మన్‌ప్రీత్, ప్రవీణ్‌లకు దేశ అత్యున్నత క్రీడా పురస్కారం

32 మందికి 'అర్జున' అవార్డు ● ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ జ్యోతి యర్రాజీ, తెలంగాణ పారాథ్లెట్ దీప్తి జివాంజిలకు 'అర్జున'



మనూ భాకర్



గుకేశ్



హర్మన్‌ప్రీత్



ప్రవీణ్

సాక్షి, న్యూఢిల్లీ: విశ్వవేదికపై మువ్వన్నెల జెండాను రెపరెపలాడించిన మేటి క్రీడాకారులకు 'ఖేల్ రత్న' అవార్డు వరించింది. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు పతకాలతో మెరిసిన మహిళా షూటర్ మనూ భాకర్... పిన్న వయసులో చెస్ ప్రపంచ చాంపియన్‌గా అవతరించిన తమిళనాడు గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్... భారత పురుషుల హాకీ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్... పారాథ్లెట్ ప్రవీణ్ కుమార్... 2024 సంవత్సరానికి దేశ అత్యున్నత క్రీడా పురస్కారం 'మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న' పురస్కారానికి ఎంపికయ్యారు. వీరితోపాటు మరో 32 మంది ప్లేయర్లకు 'అర్జున అవార్డు' దక్కింది. ఇందులో 17 మంది పారాథ్లెట్లు కూడా ఉండటం విశేషం. ఈ మేరకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ గురువారం అవార్డుకు ఎంపికైన వారి జాబితాను విడుదల చేసింది. ఈ నెల 17న రాష్ట్రపతి భవన్‌లో జరగనున్న కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా క్రీడాకారులు ఈ పురస్కారాలు అందుకోనున్నారు.

- స్వతంత్ర భారత దేశంలో ఒకే ఒలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి ప్లేయర్‌గా మనూ రికార్డు నెలకొల్పింది. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో హరియాణాకు చెందిన 22 ఏళ్ల మనూ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో, 10 మీటర్ల మిక్స్‌డ్ టీమ్ విభాగంలో కాంస్యాలు నెగ్గింది. కొన్ని రోజుల క్రితం ఈ అవార్డు కోసం మనూ భాకర్ దరఖాస్తు చేసుకోలేదనే వార్తలు వచ్చినా... చివరకు 'పారిస్'లోని ఆమె ప్రదర్శనకు అవార్డు దక్కింది.
- గత ఏడాది చెస్ ఒలింపియాడ్‌లో భారత పురుషుల జట్టుకు స్వర్ణ పతకం దక్కడంలో కీలకపాత్ర పోషించిన గుకేశ్ ఆ తర్వాత సింగపూర్‌లో జరిగిన ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్‌ను ఓడించి జగజ్జేత అయ్యాడు. విశ్వనాథన్ ఆనంద్ తర్వాత (1991–1992లో) 'ఖేల్ రత్న' అవార్డు పొందనున్న రెండో చెస్ ప్లేయర్ గుకేశే కావడం విశేషం.
- 2024 పారిస్ ఒలింపిక్స్‌లో హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలో భారత పురుషుల హాకీ జట్టు కాంస్యం సాధించింది. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్యం గెలుచుకున్న జట్టులోనూ సభ్యుడైన 28 ఏళ్ల హర్మన్‌ప్రీత్ సింగ్... ఆసియా క్రీడలు, కామన్వెల్త్ క్రీడలు, చాంపియన్స్ ట్రోఫీ తదితర ప్రధాన ఈవెంట్లలో భారత్ పతకాలు గెలుచుకోవడంలో కీలకపాత్ర పోషించాడు. మూడుసార్లు అతను అంతర్జాతీయ హాకీ సమాఖ్య అత్యుత్తమ ఆటగాడిగా నిలిచాడు.
- పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్ పేరును కూడా కమిటీ 'ఖేల్‌రత్న' కోసం సిఫారసు చేసింది. పారిస్ పారాలింపిక్స్ హైజంప్ (టి64 క్లాస్)లో ప్రవీణ్ స్వర్ణ పతకం గెలుచుకున్నాడు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో ప్రవీణ్ ఇదే విభాగంలో కాంస్యం సాధించాడు.
- 'ఖేల్ రత్న' అవార్డు గ్రహీతలకు అవార్డుతో పాటు రూ. 25 లక్షల నగదు ప్రోత్సాహకం, అర్జున అవార్డీలకు రూ. 15 లక్షల నగదు బహుమతి లభించనుంది.



జ్యోతి



దీప్తి

జ్యోతి, దీప్తిలకు 'అర్జున'

ఆంధ్రప్రదేశ్ వర్ధమాన అథ్లెట్ జ్యోతి యర్రాజీ... తెలంగాణ పారాథ్లెట్ దీప్తి జివాంజిలకు ఉత్తమ క్రీడాకారులకు అందించే 'అర్జున అవార్డు' లభించింది. వైజాగ్‌కు చెందిన 25 ఏళ్ల జ్యోతి పారిస్ ఒలింపిక్స్‌లో 100 మీటర్ల హర్డిల్స్‌లో పోటీపడింది. 2023 హాంగ్జౌ ఆసియా క్రీడల్లో రజత పతకం గెలిచింది. 2023 ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణం, 200 మీటర్లలో రజతం సాధించింది. 2023, 2024లలో జరిగిన ఆసియా ఇండోర్ చాంపియన్‌షిప్‌లో జ్యోతి 60 మీటర్ల హర్డిల్స్‌లో స్వర్ణ, రజతాలు గెలిచింది.

వరంగల్ జిల్లా కల్లెడ గ్రామానికి చెందిన 21 ఏళ్ల దీప్తి 2024 పారిస్ పారాలింపిక్స్‌లో 400 మీటర్ల టి20 కేటగిరీలో కాంస్యం... 2024 ప్రపంచ పారాథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణం సాధించింది. 2023 హాంగ్జౌ పారా ఆసియా క్రీడల్లో దీప్తి బంగారు పతకం గెలిచింది. దీప్తికి భారత స్పోర్ట్స్ అథారిటీ కోచ్ నాగపురి రమేశ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నారు.

అవార్డీల వివరాలు

'ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న': దొమ్మరాజు గుకేశ్ (చెస్), హర్మన్‌ప్రీత్ సింగ్ (హాకీ), ప్రవీణ్ కుమార్ (పారా–అథ్లెటిక్స్), మనూ భాకర్ (షూటింగ్).

అర్జున అవార్డు (రెగ్యులర్): జ్యోతి యర్రాజీ, అన్ను రాణి (అథ్లెటిక్స్), నీతు, స్వీటీ బూరా (బాక్సింగ్), వంతిక అగర్వాల్ (చెస్), సలీమా టెటె, అభిషేక్, సంజయ్, జర్మన్‌ప్రీత్, సుఖ్‌జీత్ సింగ్ (హాకీ), రాకేశ్ కుమార్ (పారా ఆర్చరీ), దీప్తి జివాంజి, ప్రీతి పాల్, అజీత్ సింగ్, సచిన్ ఖిలారి, ధరమ్‌వీర్, ప్రణవ్ సూర్మ, హొకాటో సీమ, సిమ్రన్, నవ్‌దీప్ (పారా అథ్లెటిక్స్), నితీశ్, తులసిమతి, నిత్యశ్రీ, మనీషా (పారా బ్యాడ్మింటన్), కపిల్ పర్మార్ (పారా జూడో), మోనా అగర్వాల్, రుబీనా (పారా షూటింగ్), స్వప్నిల్ కుసాలే, సరబ్‌జోత్ (షూటింగ్), అభయ్ సింగ్ (స్క్వాష్), సజన్ ప్రకాశ్ (స్విమ్మింగ్), అమన్ సెహ్రావత్ (రెజ్లింగ్).

అర్జున అవార్డు (లైఫ్‌టైమ్): సుచా సింగ్ (అథ్లెటిక్స్), మురళీకాంత్ పేట్కర్ (పారా స్విమ్మింగ్). ద్రోణాచార్య అవార్డు (రెగ్యులర్): సుభాశ్ రాణా (పారా షూటింగ్), దీపాలి దేశ్‌పాండే (షూటింగ్), సందీప్ సాంగ్వాన్ (హాకీ). ద్రోణాచార్య అవార్డు (లైఫ్‌టైమ్): మురళీధరన్ (బ్యాడ్మింటన్), అర్మాండో అనెలో కొలాకో (ఫుట్‌బాల్).

క్లుప్తంగా...

దత్తత గ్రామాలకు సహాయక సామగ్రి

జెండా ఊపి ప్రారంభించిన గవర్నర్



సాక్షి, హైదరాబాద్: భగవాన్ బీర్సాముండా 150వ జయంతి ఉత్సవాల్లో భాగంగా.. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దత్తత తీసుకున్న గ్రామాలకు శీతాకాల సహాయక సామగ్రిని పంపించారు. రాజ్‌భవన్ నుంచి సరుకులు తీసుకెళ్లే నాలుగు వాహనాలను గురువారం గవర్నర్ జెండా ఊపి ప్రారంభించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, అభయ్ ఫౌండేషన్, స్మైల్ ఫౌండేషన్ సంయుక్తంగా గిరిజన ప్రజల కోసం ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నాయి. రాజ్‌భవన్ ఆవరణలో విరాళాలను స్వీకరించి రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధులకు అందజేశారు.

'తెలంగాణ మీ కోసం ఎదురుచూస్తోంది'

పర్యాటక కేంద్రాల ప్రచారం కోసం పాటకు శ్రీకారం చుట్టిన పర్యాటకశాఖ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పర్యాటక కేంద్రాల ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేసేందుకు పర్యాటకశాఖ 'తెలంగాణ మీ కోసం ఎదురుచూస్తోంది'అనే నూతన పాటతో ఆకట్టుకుంటోంది. టూరిజం ప్రమోషన్‌లో భాగంగా రూపొందించిన ఈ ప్రచార వీడియోను గురువారం పర్యాటక శాఖ విడుదల చేసింది. సహజమైన ప్రకృతి అందాలు, వారసత్వ కట్టడాలను 58 సెకన్ల నిడివిగల ఈ వీడియోలో చూపించారు. ఈ వీడియోలో జోడేఘాట్ లోయ, అమ్రాబాద్ టైగర్ రిజర్వ్, కిన్నెరసాని, కుమ్రంభీం ప్రాజెక్ట్, ఎస్ఆర్ఎస్పీ బ్యాక్ వాటర్స్, రామప్ప ఆలయం, భూదాన్ పోచంపల్లి, యాదగిరిగుట్ట ఆలయం, ఘనపురం కోటగుళ్లు, పాండవులగుట్ట, నాగార్జునసాగర్, ఘనపురం చెరువు వంటి పర్యాటక ప్రదేశాలు ఉన్నాయి.

కుంగిన రాళ్లవాగు వంతెన



వెంకటాపురం(కె): ములుగు జిల్లా వెంకటాపురం(కె) మండల పరిధి యాకన్నగూడెం గ్రామ శివారు రాళ్లవాగుపై ఉన్న వంతెన పిల్లర్ల వద్ద గురువారం రాత్రి కుంగిపోయింది. ఈ రహదారి వెంట భారీ వాహనాలు వెళ్తే.. వంతెన కూలి వాగులో పడే ప్రమాదం ఉంది. దీంతో ఎవరూ ఇటువైపు రావొద్దని వెంకటాపురం ఎస్ఐ కొప్పుల తిరుపతిరావు హెచ్చరించారు. కాగా చర్ల, భద్రాచలం వెళ్లే ప్రయాణికులు ఏటూరునాగారం మీదుగా మణుగూరు నుంచి ప్రయాణించాలని ఆయన సూచించారు.

ఎస్‌హెచ్‌జీలకు చేపల విక్రయ వాహనాలు

నేడు సీతక్క చేతుల మీదుగా అందజేత



సాక్షి, హైదరాబాద్: మహిళా, శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క శుక్రవారం ఉదయం 9.30 గంటలకు ప్రజాభవన్ వేదికగా సంచార చేపల విక్రయ వాహనాలను ప్రారంభించనున్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద గ్రామీణ దారిద్ర్య నిర్మూలన సంస్థ (సెర్ప్) ద్వారా స్వయం సహాయక బృందాలకు ఈ వాహనాలను అందజేస్తారు. తొలుత 32 వాహనాలను అందజేయనున్నారు. ఒక్కో వాహనం ఖరీదు రూ.10 లక్షలు కాగా ఫ్యాబ్రికేషన్‌తో కలిపి రూ. 10.38 లక్షలు కానుంది. ప్రధాన మంత్రి మత్స్య సమృద్ధి యోజనతో అనుసంధానించి, లబ్ధిదారులకు 60% సబ్సిడీతో వీటిని అందజేస్తారు. మిగిలిన మొత్తాన్ని బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణాల రూపంలో సెర్ప్ సమకూర్చుతుంది. పచ్చి చేపలతో పాటు చేపల వంటకాలను విక్రయించేలా ఈ సంచార వాహనాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు.



చైల్డ్ పోర్న్‌ను చూసినా, షేర్ చేసినా పట్టేస్తుంది!

హైదరాబాద్‌కు చెందిన ఓ విపరీత మనస్తత్వంగల యువకుడు చైల్డ్ పోర్న్ వీడియోను దర్జాగా తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశాడు. ఇదేమీ పెద్ద నేరం కాదని.. తన చర్యను ఎవరూ పసిగట్టరని అనుకున్నాడు. కానీ అతను వీడియో పోస్ట్ చేసిన కాసేపటికే అమెరికాకు చెందిన ఓ సంస్థ నిందితుడి చర్యను కనిపెట్టింది. చిటికెలో అతని ఐపీ అడ్రస్ ద్వారా జాడ కనుక్కొని ఆ వివరాలన్నింటినీ హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులకు పంపింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు బుధవారం నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు మొదలుపెట్టారు.

- ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ప్రపంచవ్యాప్తంగా నిందితుల్ని గుర్తిస్తున్న అమెరికా స్వచ్ఛంద సంస్థ
- వివిధ దేశాల్లోని నోడల్ ఏజెన్సీల ద్వారా తదుపరి చర్యలకు సిఫార్సు చేస్తున్న ఎన్‌సీఎంఈసీ
- ఆ సంస్థ సమాచారంతో తాజాగా ఓ హైదరాబాదీపై నగర సైబర్ క్రైం ఠాణాలో కేసు నమోదు

సాక్షి, హైదరాబాద్: చిన్నారులపై అత్యంత హేయమైన నేరాల్లో ఒకటైన చైల్డ్ పోర్నోగ్రఫీపై ప్రపంచవ్యాప్తంగా నిషేధం కొనసాగుతోంది. ఈ తరహా వీడియోల కట్టడి, నిందితుల గుర్తింపు కోసం అగ్రరాజ్యం వేదికగా నిరంతర నిఘా కొనసాగుతోంది. అమెరికాకు చెందిన నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లాయిటెడ్ చిల్డ్రన్ (ఎన్‌సీఎంఈసీ) అనే స్వచ్ఛంద సంస్థ ప్రపంచవ్యాప్తంగా సోషల్ మీడియా ఖాతాలను జల్లెడపడుతూ పోర్న్ వీడియోలు చూసిన లేదా షేర్ చేసిన లేదా అప్‌లోడ్/డౌన్‌లోడ్ చేసిన వారిపై నిఘా పెడుతోంది. చైల్డ్ సెక్సువల్ అబ్యూజ్ మెటీరియల్‌ను (సీఎస్ఏఎం) కనిపెట్టడానికి ఈ సంస్థ అత్యాధునిక సాఫ్ట్‌వేర్ వినియోగిస్తోంది.

భారత్‌లో ప్రతి 40 సెకన్లకు ఓ వీడియో...

ఆన్‌లైన్‌లో చైల్డ్ పోర్నోగ్రఫీ అత్యంత వేగంగా పెరుగుతోందని, భారత్‌లో ప్రతి 40 సెకన్లకు ఓ వీడియో క్యాప్చర్ అవుతోందని ఎన్‌సీఎంఈసీ అంచనా వేస్తోంది. సీఎస్ఏఎంని గుర్తించడానికి అమెరికా సంస్థ ప్రత్యేక సాఫ్ట్‌వేర్ సాయం తీసుకుంటోంది. అందులో కొన్ని కీలక పదాలను పొందుపరిచింది. ప్రపంచంలో ఎవరైనా ఆయా సోషల్ మీడియా వేదికలపై సీఎస్ఏఎంను సెర్చ్ చేసినా, వీక్షించినా, డౌన్‌లోడ్/అప్‌లోడ్ చేసినా తక్షణం ఆ సాఫ్ట్‌వేర్ గుర్తిస్తుంది. ఆయా యూజర్లకు సంబంధించిన ఐపీ అడ్రస్‌లను వెంటనే సర్వర్‌లో నిక్షిప్తం చేసుకుంటుంది. ఎన్‌సీఎంఈసీ వాటిని ప్రాధాన్యతా క్రమంలో క్రోడీకరించి ఆయా దేశాల నోడల్ ఏజెన్సీలకు పంపిస్తుంది. భారత్‌లో జాతీయ స్థాయిలో జాతీయ నేర గణాంకాల బ్యూరో (ఎన్సీఆర్బీ), రాష్ట్ర స్థాయిలో సీఐడీ ఎన్‌సీఎంఈసీకి నోడల్ ఏజెన్సీలుగా ఉన్నాయి. ఒకవేళ రాష్ట్ర స్థాయిలో చైల్డ్ పోర్నోగ్రఫీకి సంబంధించిన డౌన్‌లోడ్/అప్‌లోడ్ లేదా వీక్షించడం జరిగితే సీఐడీ అధికారులు ఆ ఐపీ అడ్రస్ వినియోగదారుడు నివసించే స్థానిక సైబర్ క్రైం ఠాణాకు ఆయా వివరాలు పంపిస్తారు. అనంతరం వారికి నోటీసులు ఇవ్వడమో లేదా కేసుపెట్టి అరెస్టు చేసి చార్జిషీట్ దాఖలు చేయడమో జరుగుతుంది.

ఆ సర్వర్లన్నీ విదేశాల్లోనే...

కేవలం చైల్డ్ పోర్నోగ్రఫీయే కాదు.. అన్ని రకాల అసభ్య, అశ్లీల వెబ్‌సైట్లపై ఫిర్యాదులు వచ్చినప్పుడు కేంద్ర ప్రభుత్వం వాటిని నిషేధించి బ్లాక్ చేయిస్తోంది. అయితే వాటి నిర్వాహకులు బ్లాక్‌లిస్ట్‌లోని వెబ్‌సైట్ల పేరును పోలిన లేదా దాని చివర 1, 2 లాంటి అంకెలు, కొన్ని అక్షరాలు కలిపి మరో సైట్ ప్రారంభిస్తున్నారు. ఫలితంగా వాటిపై మళ్లీ ఫిర్యాదులు అందే వరకు ఆ సైట్లు యథేచ్ఛగా పనిచేస్తున్నాయి. ఈ తరహా వెబ్‌సైట్లను హోస్ట్ చేస్తున్న సర్వర్లన్నీ విదేశాల్లో ఉండటం వల్ల వరుసగా ఫిర్యాదులు వచ్చినప్పటికీ వెబ్‌సైట్ల నిర్వాహకుల వివరాలు తెలుసుకోవడానికి, వారిపై చర్యలు తీసుకోవడానికి అవకాశం ఉండట్లేదు.

నేరం రుజువైతే తీవ్ర శిక్షలు



- శివమారుతి, హైదరాబాద్ సైబర్ క్రైం ఠాణా ఏసీపీ

చైల్డ్ పోర్న్ వీడియోలు, ఫొటోలను చూసినా నేరమే. దీన్ని బ్రౌజ్ చేసిన వారి సమాచారం మాకు అందుతుంది. దీని ఆధారంగా బాధ్యులపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటాం. ఈ కేసుల్లో దర్యాప్తు పూర్తి చేసి పక్కా ఆధారాలతో చార్జిషీట్లు దాఖలు చేస్తాం. కోర్టులో నేరం రుజువైతే దోషిగా తొలిసారి నేరం చేసిన వారికి గరిష్టంగా మూడేళ్ల జైలు, రూ. 5 లక్షల వరకు జరిమానా.. రెండోసారి నేరం చేస్తే ఐదేళ్ల వరకు శిక్ష, రూ. 10 లక్షల వరకు జరిమానా పడుతుంది. బాధితులు నేరుగా వచ్చి ఫిర్యాదు చేస్తే పోక్సో చట్టం కింద కేసులను సైతం నిందితులపై నమోదు చేస్తాం. ఆయా కేసుల్లో కోర్టులు వారిని దోషులుగా నిర్ధారిస్తే జీవితఖైదు వరకు పడే ఆస్కారం ఉంది. చైల్డ్ పోర్నోగ్రఫీ అత్యంత హేయమైన నేరమని ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలి.

జన్యువ్యాధులపై పోరు!

- 15 సంస్థల శాస్త్రవేత్తలతో ప్రాజెడ్ పేరుతో పరిశోధన ప్రాజెక్టు
- సీడీఎఫ్‌డీ, నిమ్స్ ఆసుపత్రి సంయుక్త అధ్యయనం..
- దేశంలో 7 కోట్ల మందికి అరుదైన జన్యువ్యాధులు.. సీడీఎఫ్‌డీలో ప్రాజెడ్‌పై అవగాహన కార్యక్రమం

సాక్షి, హైదరాబాద్: జన్యు లోపాలతో మనుషుల్లో వచ్చే వ్యాధులపై పోరాటాన్ని భారత్ మరింత తీవ్రం చేసింది. ఈ రకమైన వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచటంతోపాటు వ్యాధి నిర్ధారణను సులభతరం చేసేందుకు దేశంలోని 15 పరిశోధన సంస్థలకు చెందిన శాస్త్రవేత్తలతో 'మిషన్ ప్రోగ్రామ్ ఆన్ పీడియాట్రిక్ రేర్ జెనెటిక్ డిజార్డర్స్'(ప్రాజెడ్)ను కేంద్ర బయోటెక్నాలజీ విభాగం ప్రారంభించారు. దీనికి హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ డీఎన్ఏ ఫింగర్ ప్రింటింగ్ అండ్ డయాగ్నస్టిక్స్ (సీడీఎఫ్‌డీ) శాస్త్రవేత్త డాక్టర్ అశ్విన్ దలాల్ నేతృత్వం వహిస్తున్నారు. గురువారం సీడీఎఫ్‌డీలో ప్రాజెడ్‌పై అవగాహన పెంచేందుకు ఏర్పాటైన కార్యక్రమంలో ఆ సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ ఉల్లాస్ కొల్తూర్ మాట్లాడుతూ.. దేశంలోని అరుదైన వ్యాధులపై అధ్యయనానికి ప్రాజెడ్ ఎంతో కీలకమని తెలిపారు. దేశవ్యాప్తంగా జన్యువ్యాధులపై పరిశోధనల కోసం 12 సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీల ఏర్పాటు జరుగుతోందని ప్రాజెడ్‌కు నేతృత్వం వహిస్తున్న శాస్త్రవేత్త డాక్టర్ అశ్విన్ దలాల్ తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ శ్వేత త్యాగి, డాక్టర్ రశన భండారీలు జన్యువ్యాధులపై తాము చేస్తున్న పరిశోధనలు, గుర్తించిన కీలక అంశాలను వివరించారు.

Mission Program on Pediatric Rare Genetic Disorders
PRaGeD

7 కోట్ల మందికి జన్యు వ్యాధులు

మనదేశంలో అరుదైన జన్యు వ్యాధులతో బాధపడుతున్న వారి సంఖ్య సుమారు ఏడు కోట్లు ఉంటుందని అంచనా. సికిల్‌సెల్ అనీమియా, డౌన్ సిండ్రోమ్, మస్కులర్ అట్రోఫీ, ఫ్రెడ్రిక్స్ అటాక్సియా తదితర ఎన్నో జన్యు వ్యాధులతో ప్రజలు బాధపడుతున్నారు. జన్యువ్యాధులు ఉన్నవారిని గుర్తించేందుకు కొన్ని సామాన్య లక్షణాలు ఉంటాయి. ఉదాహరణకు దృష్టి, వినికిడి, గుండె, గర్భకోశ, నాడీ సమస్యలు, కండరాల బలహీనత, మానసిక ఎదుగుదల సమస్యలున్న వారిలో కొందరు జన్యుపరమైన వ్యాధికి గురై ఉండవచ్చు. ప్రతి 5 వేల మందిలో ఒకరికి జన్యుపరమైన వ్యాధి ఉండే అవకాశముందని అంచనా. పసిపిల్లల నుంచి యుక్తవయసు వారిలో ఇవి కనిపించే అవకాశం ఉంటుంది.

5 వేల మంది రోగులను పరీక్షిస్తాం



దేశంలో అరుదైన జన్యువ్యాధుల గుర్తింపు, అధ్యయనానికి ప్రాజెడ్ కార్యక్రమం చాలా కీలకం. హైదరాబాద్‌లోని నిమ్స్‌తో కలిసి మేము దీన్ని చేపట్టాం. ఇంకో మూడేళ్లపాటు నడిచే ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం ఐదు వేల మంది జన్యు వ్యాధిగ్రస్తులను గుర్తించి అధ్యయనం చేయాలని నిర్ణయించాం.

- 'సాక్షి'తో సీడీఎఫ్‌డీ డైరెక్టర్ ప్రొ. ఉల్లాస్ కొల్తూర్

తెలుసుకోవాల్సింది చాలా ఉంది

మానవ కణాల్లో సుమారు 19 వేల జన్యువులు ఉంటాయి. వీటిల్లో ఏడు వేల జన్యువుల్లో తేడాలొస్తే వచ్చే వ్యాధుల గురించి మాత్రమే మనకు తెలుసు. మిగిలిన 12 వేల జన్యువులకు సంబంధించి ఎటువంటి సమాచారం లేదు. అందుకే ఈ అరుదైన జన్యువ్యాధుల గుర్తింపునకు ప్రాధాన్యం ఏర్పడింది

- డాక్టర్ అశ్విన్ దలాల్, శాస్త్రవేత్త

రాష్ట్రపతి నిలయంలో ఉద్యాన్ ఉత్సవం



బ్రోచర్‌ను ప్రదర్శిస్తున్న అధికారులు

కంటోన్మెంట్ (హైదరాబాద్)

బొల్లారం రాష్ట్రపతి నిలయంలో 12 రోజులపాటు సాగనున్న 'ఉద్యాన్ ఉత్సవ్'గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. ప్రగతిశీల రైతు సురేశ్ చేతుల మీదుగా ఉత్సవాన్ని ప్రారంభించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఉద్యాన శాఖలు, ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్, శ్రీకొండాలక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం, డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీతో పాటు పలు ఎన్జీఓలు, కమ్యూనిటీ ఆర్గనైజర్స్ ఆధ్వర్యంలో 50 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

12 రోజులపాటు సాగనున్న కార్యక్రమం

తొలిరోజు కార్యక్రమాల్లో భాగంగా రైతు సాధికార సమితి, సహజ వ్యవసాయం, సుస్థిర హార్టికల్చర్ పద్ధతులు, ఆలుగడ్డ, అల్లం పంటల నిర్వహణ, ఆఫ్ సీజన్‌లో కూరగాయల పంటలసాగు తదితర అంశాలపై వర్క్‌షాపులు నిర్వహించారు. సాయంత్రం సౌత్ సెంట్రల్ జోన్ కల్చరల్ సెంటర్, ఒడిశాకు చెందిన శంఖవదనం, రానప్ప, ఛాదేయ, మహారాష్ట్రకు చెందిన లావాని, కోలి, వాఘ్య మురళి నృత్యం, తెలంగాణకు చెందిన మాధురి, బోనాలు, లంబాడీ నృత్యం, మధ్యప్రదేశ్‌కు చెందిన తాత్యా, గొండి, కర్మ, దండర్ వంటి జానపద, ఆదివాసీ నృత్యాలను ప్రదర్శించారు. మహాభారతంలోని రాయబార ఘట్టం ప్రదర్శన సందర్శకులను అలరించింది. విలేకరుల సమావేశంలో మినిస్ట్రీ ఆఫ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ జాయింట్ సెక్రటరీ సామ్యూల్ ప్రవీణ్ కుమార్, ఎండీ డాక్టర్ శరవణన్, ఐకార్ డైరెక్టర్ డాక్టర్ షేక్ మీరా, తెలంగాణ అగ్రికల్చర్ డిపార్ట్‌మెంట్ ఏడీఏ హుస్సేన్ బాబు, అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ అడిషనల్ కమిషనర్ సంజయ్ కుమార్, రాష్ట్రపతి భవన్ డైరెక్టర్ శివేంద్ర చతుర్వేది, రాష్ట్రపతి భవన్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ కుమార్ సమరేశ్, మేనేజర్ రజినీ ప్రియ పాల్గొన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ క్యాడెట్‌లు, ఉద్యాన ప్రేమికులు వందలాది మంది ఉత్సవ్‌లో పాల్గొన్నారు.

త్వరలో మహిళా ఫైర్ ఫైటర్స్..!



- ప్రభుత్వానికి అగ్నిమాపక శాఖ ప్రతిపాదనలు
- అనుమతి రాగానే పోస్టుల భర్తీ ప్రక్రియ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ అగ్నిమాపక శాఖలో త్వరలో మహిళా ఫైర్ ఫైటర్లు అందుబాటులోకి రానున్నారు. మహిళా సిబ్బంది నియామకానికి సంబంధించి ఇప్పటికే అగ్నిమాపకశాఖ ఉన్నతాధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే మహిళా సిబ్బంది నియామకానికి నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. ప్రస్తుతం అగ్నిమాపక శాఖలో 400 వరకు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మహిళా ఫైర్ ఫైటర్స్ నియామకానికి ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తే.. ఈ పోస్టులలో మహిళలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. విధుల్లో ఉండే ఇబ్బందులను తట్టుకునేలా శారీరక దృఢత్వం, మానసిక సన్నద్ధత ఉంటే మహిళలు సైతం అగ్నిమాపక శాఖలో రాణిస్తారని అధికారులు చెబుతున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుంచి ఇప్పటి వరకు ఈ విభాగంలో మహిళా సిబ్బంది లేరు. ప్రభుత్వ ఆమోదం వస్తే తెలంగాణలో మొదటి మహిళా అగ్నిమాపక దళం ఏర్పడనుంది. ప్రస్తుతం తమిళనాడు, కేరళ, ఢిల్లీ, మహారాష్ట్రల్లో అగ్నిమాపక శాఖ విధుల్లో మహిళా సిబ్బంది ఉన్నారు.

64 సంవత్సరాల ఏసీబీ...



విజయరంగం

- 1961 జనవరి 2న అవినీతి నిరోధక శాఖ ఏర్పాటు
- ఏసీబీ తొలి డైరెక్టర్‌గా ఐపీఎస్ అధికారి విజయరంగం

సాక్షి, హైదరాబాద్: అవినీతి నిరోధక శాఖ ఏర్పడి గురువారానికి 64 ఏళ్లు పూర్తయ్యాయి. 1961 జనవరి 2న యాంటీ కరప్షన్ బ్యూరో (ఏసీబీ)ని ఏర్పాటు చేస్తూ అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏసీబీ తొలి డైరెక్టర్‌గా ఐపీఎస్ అధికారి ఎస్. విజయరంగం పనిచేశారు. ఏసీబీ 64 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని గుర్తు చేస్తూ ఏసీబీ డైరెక్టర్ విజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తొలుత సీఐడీలోనే ఎక్స్ బ్రాంచ్‌గా కొనసాగిన ఏసీబీని తర్వాత ప్రత్యేక విభాగంగా ఏర్పాటు చేశారు. హైదరాబాద్‌లో తొలుత ఏసీబీ కేంద్ర కార్యాలయం రామ్‌కోఠిలో ఉండేది. ఆ తర్వాత 1975లో ట్రూప్ బజార్‌కు, 1981లో అబిడ్స్‌కు, 1985లో మొజంజాహీ మార్కెట్‌కు మార్చారు. కాగా, 2013లో బంజారాహిల్స్‌లోని శాశ్వత కార్యాలయం భవనం ఏర్పడే వరకు మొజంజాహీ మార్కెట్‌లోనే ఏసీబీ కేంద్ర కార్యాలయం కొనసాగింది. 64 ఏళ్ల సుదీర్ఘ ప్రస్థానంలో ఈ విభాగం ప్రజల్లో భరోసా నింపడంలో సఫలీకృతమైనట్టు డైరెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. ఇందుకు సహకరించిన ప్రభుత్వానికి, అధికారులు, సిబ్బందికి, ఇతర భాగస్వాములకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇక ముందు కూడా ఈ విభాగాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

అందుబాటులోకి టీజీజీబీ సేవలు

భువనగిరి టౌన్: తెలంగాణ గ్రామీణ బ్యాంకు (టీజీజీబీ) సేవలు గురువారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా అందుబాటులోకి వచ్చాయి. ఒక రాష్ట్రం ఒకే గ్రామీణ బ్యాంకు నినాదంతో గ్రామీణ బ్యాంకులను పటిష్టపరిచేలా కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయం మేరకు దేశంలో అతిపెద్ద గ్రామీణ బ్యాంకుల్లో ఒకటిగా తెలంగాణ గ్రామీణ బ్యాంకు (టీజీజీబీ) అవతరించింది. ఈ బ్యాంకుల విలీనం నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ గ్రామీణ్ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ) వినియోగదారుల్లో ఆందోళన నెలకొంది. తమ ఖాతాలు పూర్తిగా నిలిచిపోతాయా? తమ డబ్బు పరిస్థితి ఏంటి? ఏటీఎం కార్డు పనిచేస్తుందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అయితే ఏపీజీవీబీలో ఖాతా ఉన్న వారికి ఇకపై తెలంగాణ గ్రామీణ బ్యాంకు సేవలు అందించనుంది. ఈ నేపథ్యంలో ఏపీజీవీబీ ఖాతాదారులకు తెలంగాణ గ్రామీణ బ్యాంక్ కొన్ని మార్గదర్శకాలు జారీచేసింది.

మార్గదర్శకాలు ఇవీ..

- ఏపీజీవీబీ తెలంగాణ కస్టమర్లు తమ బ్యాంకు ఏటీఎం కార్డును మార్చుకోవాలి. అందుకు ఖాతాగల బ్రాంచ్‌కు వెళ్లి వివరాలు సమర్పించాలి.
- చెక్‌బుక్ కలిగిన ఏపీజీవీబీ ఖాతాదారులకు కొత్త చెక్ బుక్‌లు వారి చిరునామాలకు అందుతాయి.
- వినియోగదారులు ఇకపై పాత చెక్ బుక్‌లను వాడరాదు. ఒకవేళ పాత చెక్ బుక్ ఉంటే ఖాతా ఉన్న బ్రాంచీకి వెళ్లి వాటిని అప్పగించాలి.
- ఇప్పటికే ఎవరైనా చెక్ జారీ చేస్తే 90 రోజుల వరకు చెల్లుబాటు అవుతుంది.
- ఏపీజీవీబీ మొబైల్ బ్యాంకింగ్ యూజర్లు ప్లేస్టోర్ లేదా యాపిల్ స్టోర్ నుంచి టీజీబీ మొబైల్ బ్యాంకింగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.
- ఇంటర్నెట్ బ్యాంకింగ్ కోసం www.tgbhyd.in ను సందర్శించి లావాదేవీలు నిర్వహించుకోవచ్చు.
- కొత్త కోడ్ ప్రకారం లావాదేవీలు నిర్వహించాల్సి ఉంటుంది.
- తెలంగాణ గ్రామీణ బ్యాంకు వాట్సాప్ బ్యాంకింగ్ అండ్ మిస్డ్ కాల్ అలర్ట్ సేవల కోసం **92780 31313**ను సంప్రదించాలి.

ఏపీజీవీబీ తెలంగాణ ప్రాంత కస్టమర్లకు మాత్రమే ఈ నిబంధనలు వర్తిస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లోని వినియోగదారులకు ఏపీజీవీబీనే యథావిధిగా సేవలందిస్తుంది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.


వరి నాట్లు వేస్తున్న బిహార్ కూలీలు

పనులు చక్కబెట్టేది పొరుగువాళ్లే..

వరినాట్లు వేయడం, ధాన్యం బస్తాలు మోయడంలో బిహారీలు

- ఇళ్ల నిర్మాణ పనుల్లో రాజస్తాన్, యూపీ, మహారాష్ట్ర వాళ్లే ఎక్కువ
- హోటళ్లు, రెస్టారెంట్లలో ఒడిశా, బెంగాల్ కార్మికులు
- బోరు డ్రిల్లింగ్, వరికోత మెషీన్ల నిర్వహణలో ఛత్తీస్‌గఢ్ వాసులు
- పూజారులూ పొరుగు రాష్ట్రాల వారే...

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి: సొంతూళ్లో పని దొరకడం లేదంటూ మనవారు గల్ఫ్ దేశాలకు వలస వెళ్తుంటే.. ఇతర రాష్ట్రాల ప్రజలు తెలంగాణ వచ్చి పనులు చేసుకుని బతుకుతున్నారు. ప్రతి పనికీ పొరుగు రాష్ట్రాల వారిపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఏరంగంలోనైనా సరే బిహార్, మహారాష్ట్ర, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, బెంగాల్, జార్ఖండ్ తదితర రాష్ట్రాల కూలీలు, కార్మికులు తెలంగాణలోని వివిధ జిల్లాల్లో పనుల్లో చేరుతున్నారు. వ్యవసాయ పనులతో పాటు ఇళ్ల నిర్మాణాలకు తాపీమేస్త్రీలు, పీవోపీ వర్కర్లు, ఇంటీరియర్ డిజైనింగ్ పనులు, కప్‌బోర్డుల తయారీ వంటి పనులు పొరుగు రాష్ట్రాల వాళ్లే చేస్తున్నారు. బంగారు ఆభరణాల తయారీలో హైదరాబాద్‌లో లక్షలాది మంది బెంగాలీలు పనిచేస్తున్నారు. రాష్ట్రంలోని ఆయా జిల్లాల స్వర్ణకారులు, వ్యాపారులు బెంగాలీలతోనే పనులు చేయిస్తున్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లు, స్వీట్ హోంలు.. ఒకటేమిటి అన్నింటా వాళ్లే ఉంటున్నారు. ఆఖరికి ఆలయాల్లో పూజారులుగా కూడా పొరుగు రాష్ట్రాల బ్రాహ్మణులే దిక్కవుతున్నారు.

పొరుగు రాష్ట్రాల పూజారులు

ఆలయాల్లో పూజారుల కొరత ఏర్పడింది. దీంతో ఇతర రాష్ట్రాల నుంచి పూజారులను తీసుకువస్తున్నారు. జార్ఖండ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల నుంచి పూజారులు వస్తున్నారు. వాళ్లంతా హిందీలోనే శ్లోకాలు వల్లె వేస్తున్నారు. చాలాచోట్ల వాళ్ల పూజా విధానాలనే ఇక్కడ చేస్తుండడంతో.. ఇక్కడి భక్తులు కొంత ఇబ్బంది పడుతున్నారు. తెలుగు పంచాంగం కాకుండా వాళ్లు పాటించే పంచాంగాలనే ఇక్కడ వాడుతున్నారు.

ఎంబ్రాయిడరీ పనుల్లోనూ..

మహిళల బ్లౌజ్‌లతో పాటు డ్రెస్సులు, ఇతర దుస్తులకు ఎంబ్రాయిడరీ వర్క్ అంతా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారే చేస్తున్నారు. బొటిక్స్ నిర్వాహకులు ఇతర రాష్ట్రాలకు చెందిన వర్కర్స్‌ను నియమించుకుని వారికి వసతి కల్పించి పనులు చేయిస్తున్నారు. వాళ్లకు వేరే వ్యాపకాలు లేకపోవడంతో అన్ని పనులు త్వరగా అవుతున్నాయని చెబుతున్నారు.

నాట్లేయాలంటే బిహారీలే దిక్కు

వ్యవసాయ పనులు గతంలో స్థానిక రైతులు, రైతు కూలీలే చేసుకునేవారు. కానీ ప్రస్తుతం వరి నాట్లు వేయడానికి స్థానిక కూలీలు రావడం లేదు. కొన్ని ప్రాంతాల్లో మాత్రమే స్థానిక ఆడ కూలీలు నాట్లు వేస్తున్నారు. ఇటీవలి నుంచి బిహార్‌కు చెందిన మగ కూలీలు వరి నాట్లు వేయడానికి వేలాది మంది తెలంగాణ జిల్లాలకు వలస వస్తున్నారు. వానాకాలం సీజన్, తరువాత యాసంగి సీజన్లలో వరి నాట్లు వేయడానికి బిహార్ కూలీలు ఎక్కువ సంఖ్యలో వస్తున్నారు. వాళ్లు వరినాట్లు ఎకరానికి ధర మాట్లాడుకుని యంత్రంలా చకచకా చేసేస్తున్నారు. దీంతో పెద్ద రైతులంతా వాళ్లకే పని చెబుతున్నారు. నిజాంసాగర్ ఆయకట్టులో వరి నాట్లకు బిహార్ కూలీలు ఎక్కువగా వస్తున్నారు. వరి కోతల సమయంలో కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లుల్లో పనిచేయడానికి హమాలీల సమస్య తీవ్రంగా ఉంది. దీంతో బిహార్ నుంచి వందలాది మంది హమాలీలు దిగుతున్నారు. వడ్లు నింపడం, కాంటా వేయడం, మోయడం వంటి పనులన్నీ వారే చేస్తున్నారు. వరికోత యంత్రాలైన హార్వెస్టర్‌ను నడిపేది కూడా ఇతర రాష్ట్రాల వారే కావడం విశేషం. దాదాపు వ్యవసాయ పనులన్నింటికీ వారే దిక్కవుతున్నారు.

గృహనిర్మాణంలో పొరుగు రాష్ట్రాల వాళ్లే..

పల్లెలు, పట్టణాలు అంతటా ఇళ్ల నిర్మాణ పనులు సైతం ఇతర రాష్ట్రాల వారే చేయాల్సి వస్తోంది. మేస్త్రీలుగా గతంలో ఆంధ్ర ప్రాంతీయులే ఎక్కువ మంది ఉండేవారు. ఇప్పుడు మహారాష్ట్ర, యూపీ, బిహార్, ఛత్తీస్‌గఢ్ వంటి రాష్ట్రాల నుంచి వస్తున్నారు. తక్కువ కూలితో పనిచేస్తుండడంతో బిల్డర్లు, కాంట్రాక్టర్లు వాళ్లను పనిలో పెట్టుకుంటున్నారు. ఇళ్లలో సీలింగ్ పీవోపీ పనుల్లో దాదాపు అందరూ యూపీకి చెందిన వారే ఉంటున్నారు. కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో వందలాది మంది పీవోపీ వర్కర్లు ఉన్నారు. టైల్స్ వేయడం, ప్లంబింగ్ పనులకూ వస్తున్నారు. కప్‌బోర్డులు, ఇంటీరియర్ పనుల్లో చాలా మంది యూపీ, రాజస్తాన్ వాళ్లే ఉంటున్నారు. పెయింటింగ్ పనులకూ ఇతర రాష్ట్రాల వాళ్లే వస్తున్నారు.

హోటళ్లు, రెస్టారెంట్లలో..

చాలాచోట్ల హోటళ్లు, రెస్టారెంట్లలో ఛత్తీస్‌గఢ్, ఒడిశా, బిహార్, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన వర్కర్లే కనిపిస్తున్నారు. మగవాళ్లే కాకుండా ఆడపిల్లలు చాలా మంది ఆయా రాష్ట్రాల నుంచి వచ్చి ఇక్కడ పనిచేస్తున్నారు. వాళ్ల పండుగల సమయంలో మాత్రమే సొంత రాష్ట్రాలకు వెళ్తున్నారు. మిగతా సమయమంతా తెలంగాణలోనే ఉండి పనులు చేస్తున్నారు. బార్లలో కూడా ఇతర రాష్ట్రాల వాళ్లే పనిచేస్తు న్నారు. స్వీట్ హోంలు అయితే అత్యధికంగా గుజరాత్, రాజస్తాన్ రాష్ట్రాల యజమానులు, ఆయా ప్రాంతాల కార్మికులే ఉంటారు. గప్‌చుప్ బండ్ల యజమానులు కూడా వాళ్లే ఎక్కువ మంది ఉంటారు. ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో మాస్టర్లుగా, చెఫ్‌లుగా చాలా మంది ఇతర రాష్ట్రాల వాళ్లే పనిచేస్తున్నారు.

బోర్ డ్రిల్లింగ్ యంత్రాలపై ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ ముద్ర..

ఎక్కడైనా బోర్ వెల్ డ్రిలింగ్ యంత్రాలపై వర్కర్లు ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన వారే కనిపిస్తుంటారు. వరికోత యంత్రాలు, జేసీబీలు, పెద్ద పెద్ద యంత్రాలు నడిపేవారంతా వివిధ రాష్ట్రాలకు చెందినవారే పనిచేస్తున్నారు. వరికోత యంత్రాలు కూడా వాళ్లే నడుపుతున్నారు. వాటిపై స్థానికులు తక్కువ మందే ఉంటున్నారు. చికెన్ సెంటర్లలోనూ పొరుగు రాష్ట్రాల వర్కర్లే పనికి వస్తున్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో బస్తాలు నింపుతున్న బిహార్ కూలీలు


ధాన్యం బస్తాలు మోస్తున్న బిహార్ కూలీలు


విద్యార్థులతో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ

యువ సంగంతో విద్యార్థులకు మేలు

గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

సాక్షి, హైదరాబాద్: భారతదేశం నిజమైన సారాన్ని కనుగొనడంలో విద్యార్థులకు యువ సంగం కార్యక్రమం ఉపయోగపడుతుందని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ), హమీర్‌పూర్, హిమాచల్ ప్రదేశ్, మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ సంయుక్తంగా ఏర్పాటు చేసిన యువ సంగం ఫేజ్–5 కార్యక్రమాన్ని రాజ్‌భవన్‌లో గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హిమాచల్ ప్రదేశ్ విద్యార్థులతో గవర్నర్ ముచ్చటించారు. మౌలానా ఆజాద్ నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ, హైదరాబాద్, ఎన్ఐటీ హమీర్‌పూర్‌లోని అధ్యాపకులు, హిమాచల్ ప్రదేశ్ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు.

మహనీయురాలు సావిత్రీబాయి ఫూలే: కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: సంప్రదాయ నిర్బంధాలను బద్దలుకొట్టి బడుగుల అభ్యున్నతి, స్త్రీ విద్య కోసం జీవితాన్ని ధారపోసిన మహనీయురాలు సావిత్రీబాయి ఫూలే అని బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు కొనియాడారు. సావిత్రీబాయి ఫూలే జయంతి సందర్భంగా అమె చేసిన సామాజిక కృషి, అణచివేతకు గురైన కులాల స్వేచ్ఛ కోసం ఫూలే దంపతులు చేసిన త్యాగాలను కేసీఆర్ స్మరించుకున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా, మెజారిటీ ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు కోసం త్యాగాలు చేసిన భారతీయ మహనీయుల్లో ఫూలే దంపతులు ముందు వరుసలో ఉంటారని కేసీఆర్ పేర్కొన్నారు. సామాజిక, రాజకీయ, సాంస్కృతిక, ఆర్థిక రంగాల్లో దళిత బహుజన వర్గాలను మరింత భాగస్వాములను చేసే దిశగా సాధించుకున్న తెలంగాణ అన్ని రంగాల్లో పదేళ్లలోనే కుదురుకుందన్నారు. ఫూలే దంపతుల ఆశయాలకు అనుగుణంగా చేపట్టిన నాటి బీఆర్ఎస్ కార్యాచరణ నేడు ఫలితాలను అందిస్తోందన్నారు. దళిత బహుజన వర్గాలకు పట్టుగొమ్మలైన పల్లె తెలంగాణ నేడు ప్రగతి పథంలో పయనిస్తూ భవిష్యత్ తరాలకు బంగారు బాటలు వేసిందని కేసీఆర్ గుర్తుచేశారు. గురుకుల విద్య సహా బడుగు వర్గాల బిడ్డలను భావితరాలకు ప్రతినిధులుగా తీర్చిదిద్దాలనే దార్శనికతతో విద్యారంగంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం వేసిన పునాదిలో సావిత్రీబాయి ఫూలే దంపతుల ఆశయాలు ఇమిడి ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఆడబిడ్డలకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తేవడానికి ప్రత్యేక గురుకులాలను, ఇంటర్, డిగ్రీ కళాశాలను స్థాపించామని కేసీఆర్ గుర్తుచేశారు. మహిళా సాధికారత కోసం నాటి తమ ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిందన్నారు. అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ సబ్బండ వర్గాల్లో నిత్య చైతన్యాన్ని నింపడమే ఫూలే వంటి మహనీయులకు మనమందించే ఘన నివాళి అవుతుందని అని కేసీఆర్ పేర్కొన్నారు.



హైకోర్టు సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఖాద్రీ

సాక్షి, హైదరాబాద్: హైకోర్టు సర్వీస్ అసోసియేషన్ అధ్యక్షునిగా ఎస్ఎంపీ ఖాద్రీ, కార్యదర్శిగా ఇ.నిశాంత్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సర్వీస్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవం కావడం ఇది మూడోసారి. ఉపాధ్యక్షురాలిగా వి.రేణుక, ఆర్గనైజింగ్ సెక్రటరీగా రామసురారెడ్డి, కోశాధికారిగా జి.వెంకటేశ్‌తో పాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన సంవత్సరం సందర్భంగా కొత్త కమిటీ సభ్యులు గురువారం ప్రధాన న్యాయమూర్తిని కలిశారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరిస్తాం

మంత్రి పొంగులేటి హామీ

సాక్షి, హైదరాబాద్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ (టీయూడబ్ల్యూజే) మీడియా డైరీని తెలంగాణ సచివాలయంలో గురువారం మంత్రి పొంగులేటి ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ ఎస్.హరీశ్, దేవులపల్లి అమర్, ఐజేయూ మాజీ అధ్యక్షుడు కె.విరాహత్ అలీ, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు రాం నారాయణ, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దీప్తికి 'అర్జున'పై మంత్రి సురేఖ హర్షం

సాక్షి, హైదరాబాద్: పారిస్ పారా ఒలింపిక్స్‌లో 400 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకం సాధించిన జివాంజి దీప్తి కేంద్రం అర్జున అవార్డు ప్రకటించడంపై అటవీశాఖ మంత్రి కొండా సురేఖ హర్షం వ్యక్తం చేశారు. మానసిక సామర్థ్య సమస్యలతో బాధ పడుతున్నప్పటికీ, కుంగిపోకుండా, విధిని ఎదిరించి తన శక్తిసామర్థ్యాలను ప్రపంచానికి చాటిన అథ్లెట్ దీప్తి ఎందరికో స్ఫూర్తినిచ్చిందని కొనియాడారు. దీప్తి మరెన్నో కీర్తి శిఖరాలను అధిరోహించాలని మంత్రి ఆకాంక్షించారు.

తెగ కొనేశారు!

డిసెంబర్ 31న ఆన్‌లైన్‌లో దుమ్మురేపిన అమ్మకాలు

- క్విక్ కామర్స్, ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్స్‌కు రికార్డు ఆర్డర్లు
- గోవాలో ఒక కస్టమర్ అత్యధికంగా రూ.70,325లకు ఆర్డర్
- ఏజెంట్‌కు అత్యధికంగా రూ.2,500 టిప్ ఇచ్చిన హైదరాబాదీ
- నెల్లూరులో ఆర్డర్ చేసిన 164 సెకండ్లలోనే బిర్యానీ డెలివరీ



సాక్షి, హైదరాబాద్: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా దేశంలో క్విక్ కామర్స్, ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్స్ రికార్డు స్థాయి అమ్మకాలు నమోదు చేశాయి. వివిధ వస్తువులు, ఆహారం వంటివాటి విక్రయాల్లో సాధించిన రికార్డులను జెప్టో, బ్లింకిట్, స్విగ్గీ, ఇన్‌స్టామార్ట్ తదితర ప్లాట్‌ఫామ్‌ల ఎగ్జిక్యూటివ్‌లు, ప్రతినిధులు ఘనంగా ప్రకటిస్తున్నారు. 'రియల్ టైమ్ ఆర్డర్ల'గణాంకాలను సోషల్ మీడియా మాధ్యమాల్లో షేర్ చేస్తూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. 2023 డిసెంబర్ 31వ తేదీతో పోల్చితే 2024 డిసెంబర్ 31న (మంగళవారం) సాయంత్రం 5 గంటలకే అధిక ఆర్డర్లు వచ్చినట్టు బ్లింకిట్ సహ–వ్యవస్థాపకుడు అల్బిందర్ ధిండ్సా వెల్లడించారు. 2023తో పోల్చితే 2024 చివరి రోజు తమకు 200 శాతం అధిక ఆర్డర్లు వచ్చినట్టు జెప్టో కో–ఫౌండర్, సీఈవో ఆదిత్ పాలిచా తెలిపారు. బ్లింకిట్, జెప్టోల మాదిరిగానే స్విగ్గీ ఇన్‌స్టామార్ట్ డిసెంబర్ 31న గతంలో ఎన్నడూ లేనంత స్థాయిలో ఆర్డర్లు సాధించినట్టు ఆ సంస్థ కో–ఫౌండర్ ఫణి కిషన్ అద్దెపల్లి తెలిపారు.

ఆర్డర్లలో రికార్డులివే..

- గోవాలోని ఒక కస్టమర్ అత్యధికంగా రూ.70,325లకు ఇన్‌స్టామార్ట్ ప్లాట్‌ఫామ్‌పై ఆర్డర్ చేశాడు.
- కోల్‌కత్తాకు చెందిన ఒక వినియోగదారుడు బ్లింకిట్‌లో రూ.64,988లకు ఆర్డర్ ఇచ్చాడు.
- అన్ని క్విక్ కామర్స్ ప్లాట్‌ఫామ్స్‌పై డిస్పోజబుల్ గ్లాసులు, ఆలుగడ్డ చిప్స్, ఐస్‌క్యూబ్స్, చాక్‌లెట్లు, టానిక్‌వాటర్, నిమ్మకాయలు, సోడాలు, కూల్‌డ్రింక్‌లు, ఇతర వస్తువుల ఆర్డర్లు అధికంగా వచ్చాయి.
- ఫుడ్ డెలివరీ యాప్‌లలో వివి ధరకాల ఆహార పదార్థాలను కస్టమర్లు ఆర్డర్ చేశారు. స్విగ్గీలో బిర్యానీ ప్రాధాన్యత ఆహారంగా నిలిచింది.
- ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరులో ఆర్డర్ చేసిన 164 సెకండ్లలోనే (మూడు నిముషాల లోపే) బిర్యానీని వినియోగదారుడి ఇంటి ముంగిటికి స్విగ్గీ చేర్చింది.
- కేక్‌ల కోసం మొత్తం 2,96,711 ఆర్డర్లు స్విగ్గీకి వచ్చాయి.
- తమ డెలివరీ భాగస్వాములతో కలిపి స్విగ్గీ సంస్థ డెలివరీ ఏజెంట్లు ఆర్డర్లను అందజేసేందుకు మొత్తం 65,19,841 కి.మీ దూరం ప్రయాణించారు (ఇది భూమి నుంచి చంద్రుడిపైకి ఎనిమిది మార్లు వెళ్లి వచ్చినదానికంటే అధిక దూరం)
- రెస్టారెంట్ రిజర్వేషన్ సర్వీస్ స్విగ్గీ డైనౌట్‌లో మొత్తం ఆర్డర్లలో బెంగళూరు ప్రథమస్థానంలో నిలిచింది.
- ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ 'మ్యాజిక్ పిన్'బిజినెస్ టైమ్‌లో నిమిషానికి 1,500 ఆర్డర్లు అందుకుంది. ఈ ప్లాట్‌ఫామ్‌పై ఢిల్లీకి చెందిన కస్టమర్ రూ.30 వేల అతిపెద్ద ఆర్డర్ ఇచ్చాడు.

అత్యధిక టిప్ హైదరాబాదీదే..

- బ్లింకిట్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్‌లకు సంబంధించి డిసెంబర్ 31న ఓ హైదరాబాదీ ఫుడ్ ఆర్డర్ తెచ్చిన డెలివరీ ఏజెంట్‌కు అత్యధికంగా రూ.2,500 టిప్‌గా ఇచ్చాడు.
- మొత్తంగా అన్ని నగరాలు కలుపుకుంటే.. అత్యధికంగా బెంగళూరు వాసులు రూ.1,79,735 టిప్పులు ఇచ్చారు.
- బర్గర్లకు సంబంధించి మొత్తం 35 వేలకు పైగా ఆర్డర్లు రాగా.. వీటిలో బెంగుళూరు కస్టమర్లు అగ్రభాగాన నిలిచారు.
- డిసెంబర్ 31న క్యూకామర్స్ ప్లాట్‌ఫామ్స్‌పై చేసిన ప్రతీ 8 ఆర్డర్లలో ఒకటి కూల్ డ్రింక్.
- కాక్‌టెయిల్ మిక్సర్లు, సోడా, మింట్ ఫ్రెష్ ఇంగ్రీడియెంట్స్‌కు స్విగ్గీలో 2,542 శాతం డిమాండ్ నమోదైంది.
- నాన్ ఆల్కహాలిక్ బీర్లకు 1,541 శాతం డిమాండ్ పెరిగింది.
- గేమ్స్, పజిల్స్ వంటి వాటి డిమాండ్ 600 శాతం పెరిగింది.
- క్లౌడ్ కిచెన్ స్టార్టప్ క్యూర్‌ఫుడ్స్‌కు 2023 కంటే 2024 చివరి రోజు అధిక ఆర్డర్లు వచ్చారు. అధికంగా ఇచ్చిన ఆర్డర్లవారీగా చూస్తే వరుసగా బెంగళూరు, చెన్నై, ముంబై, హైదరాబాద్, ఢిల్లీ నిలిచాయి.
- బ్లింకిట్‌లో 1,22,356 ప్యాకెట్ల కండోమ్స్, 45,531 మినరల్ వాటర్ బాటిళ్లకు ఆర్డర్లు వచ్చాయి.
- ఇదే ప్లాట్‌ఫామ్‌పై 2,34,512 ఆలూ బుజియా ప్యాకెట్లు, 45,531 టానిక్ వాటర్ కాన్లు, 6,834 ప్యాకెట్ల ఐస్‌క్యూబ్‌లు, 1,003 లిప్‌స్టిక్‌లు, 762 లైటర్స్ అమ్ముడయ్యాయి.


మోమిన్‌పేటలోని ఏన్మతలలో లేగదూడను తొట్టెలో వేసి పాటలు పాడుతున్న కుటుంబం

లేగదూడకు తొట్టెల వేడుక

మోమిన్‌పేట: తమ దొడ్లో పుట్టిన లేగదూడకు తొట్టెల వేడుక నిర్వహించారు రైతు దంపతులు. వికారాబాద్ జిల్లా ఏన్కతల గ్రామానికి చెందిన కుమ్మరి అంజయ్య, కమలమ్మ దంపతుల పాడి ఆవు 21 రోజుల క్రితం లేగదూడకు జన్మనిచ్చింది. దీంతో బంధువులు, గ్రామస్తులను ఆహ్వానించి గురువారం దూడకు తొట్టెల పండుగ జరిపారు. అతిథులందరికీ విందు భోజనాలు పెట్టించారు.


గురువారం సాయంత్రం సచివాలయం వద్ద మేఘాలు ఇలా కనువిందు చేశాయి

క్లుప్తంగా...

'మహాశిల్పం' ప్రాంగణంలో వ్యాపారాలు తగదు

- సీఎంకు కేవీపీఎస్ లేఖ

సాక్షి, అమరావతి: విజయవాడ స్వరాజ్ మైదానంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం ప్రాంగణాన్ని ఇతర కార్యకలాపాల కోసం కేటాయించడం సరికాదని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) అభ్యంతరం తెలిపింది. ఈ విషయమై సీఎం చంద్రబాబుకు రాసిన లేఖను కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి గురువారం మీడియాకు విడుదల చేశారు. ప్రపంచ ప్రఖ్యాత అంబేడ్కర్ విగ్రహ ప్రాంగణంలో ట్రైల్ బేస్‌గా తాత్కాలిక డ్వాక్రా వాణిజ్య సముదాయాన్ని ఏర్పాటు చేయడం వెనుక పెద్ద కుట్ర ఉందన్నారు.

జీవో 91పై పూర్తి వివరాలు సమర్పించండి

రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: ఎస్సీల్లోని ఉప కులాల సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనంపై అధ్యయనానికి విధి విధానాలు ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 91ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఉప కులాల వర్గీకరణ విషయంలో తగిన అధ్యయనం చేసేందుకు స్వతంత్ర కమిషన్‌ను నియమించేలా ఆదేశాలివ్వాలని విజయవాడకు చెందిన పరసా సురేశ్‌కుమార్ కోర్టును కోరారు. ఈ వ్యాజ్యంపై గురువారం విచారణ జరిపిన హైకోర్టు.. ఈ జీవోకు సంబంధించిన పూర్తి వివరాలను తమ ముందుంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 8కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

చంద్రబాబు విజన్ పెద్ద కనికట్టు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు ఎద్దేవా

సాక్షి, అమరావతి: సీఎం చంద్రబాబు చెప్పే విజన్–2047 పెద్ద కనికట్టు లాంటిందని, దాని పేరుతో ప్రజలను భ్రమల్లో ముంచుతున్నారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. విజన్–2047 అంశంపై విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబీవీకే)లో గురువారం సమాలోచన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ గతంలో చంద్రబాబు పెట్టిన విజన్–2020 విఫలమైందని, దానిపై ఇంతవరకు సమీక్ష లేదన్నారు. మరోసారి 2047 విజన్ పేరుతో ప్రజలను మోసం చేయడం తప్ప ప్రయోజనం ఏమీ లేదన్నారు. గతంలో 16వేల ఉద్యోగాలు ఇవ్వలేని చంద్రబాబు ఇప్పుడు 20 లక్షల ఉద్యోగాలిస్తారా? అని ప్రశ్నించారు. ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేస్తున్నారని, కొత్తగా పీపీపీ స్థానంలో పీ4 తీసుకొచ్చారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచడాన్ని నిరసిస్తూ ఈ నెల 13న భోగి మంటల్లో పెంచిన విద్యుత్ బిల్లులను దహనం చేస్తామని ప్రకటించారు.

పవన్‌ను కలిసిన సీఎస్, మాజీ సీఎస్

సాక్షి, అమరావతి: ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన కె.విజయానంద్ గురువారం క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో మర్యాద పూర్వకంగా సమావేశమయ్యారు. అలాగే సీఎస్‌గా పదవీ విరమణ చేసిన నీరబ్ కుమార్ ప్రసాద్ కూడా పవన్‌ను కలిశారు.

ముడి పత్తి కొనుగోలుకే పరిమితమయ్యేలా ఆదేశాలివ్వండి

హైకోర్టులో పిటిషన్

సాక్షి, అమరావతి: కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, మెమోరాండం ఆఫ్ అసోసియేషన్ నిబంధనలకు విరుద్ధంగా రైతుల నుంచి పత్తి కొనుగోలు చేసి జిన్నింగ్, ప్రాసెసింగ్ ప్రక్రియ చేపడుతోందంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. గుంటూరుకి చెందిన సాయి ఆదిత్య దాఖలు చేసిన ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు.. ఈ వ్యవహారంలో పూర్తి వివరాలను తమ ముందుంచాలని సీసీఐని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 6వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. నిబంధనల ప్రకారం సీసీఐ రైతుల నుంచి కొనుగోలు చేసిన ముడి పత్తిని మాత్రమే విక్రయించాల్సి ఉంటుందని పిటిషనర్ తరఫు న్యాయవాది తెలిపారు. కేంద్రం నుంచి అనుమతి తీసుకున్న తరువాతే జిన్నింగ్ చేయాల్సి ఉంటుందన్నారు. సీసీఐ నేరుగా జిన్నింగ్, ప్రాసెసింగ్ ప్రక్రియ చేపట్టడం వల్ల జిన్నింగ్, స్పిన్నింగ్ పరిశ్రమలు మూతపడే దశకు చేరుకున్నాయన్నారు. ముడి పత్తి కొనుగోలుకు మాత్రమే సీసీఐ పరిమితమయ్యేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు.


రేపు స్టేట్ కో-ఆర్డినేషన్ ఫోరం సదస్సు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) ఆధ్వర్యంలో 4వ తేదీన కర్నూలులో స్టేట్ కో-ఆర్డినేషన్ ఫోరం సదస్సు జరగనుంది. రాష్ట్రంలోని విద్యుత్ సంస్థలతో పాటు, కేంద్ర ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థలు ఈ సదస్సులో పాల్గొంటాయి. రాష్ట్ర విద్యుత్ ప్రణాళికతో పాటు పలు అంశాలపై సదస్సులో ప్రతినిధులు చర్చించనున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఆయుర్వేదంతో.. ఆరోగ్యమస్తు!

- మారుతున్న ఆస్పత్రుల రూపురేఖలు
- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే ఆధునికీకరణకు నిధుల కేటాయింపు
- అనకాపల్లి జిల్లాలో 6 ఆస్పత్రుల ద్వారా వైద్యసేవలు
- కన్నూరుపాలెంలో పంచకర్మ చికిత్సకు ప్రత్యేక విభాగం
- ప్రతి నెలా 6 వేలకు పైగా రోగులకు వైద్య చికిత్సలు

సాక్షి, అనకాపల్లి




ఆయుర్వేద వైద్యశాల

ఆయుర్వేద వైద్యానికి ఆదరణ పెరుగుతుంది. ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుపడుతున్న రోగులు ఎక్కువగా ఆయుర్వేదిక్ వైద్యం పట్ల ఆసక్తి చూపుతున్నారు. నాలుగు దశాబ్దాల క్రితం నుంచే అనకాపల్లి జిల్లాలో కొరుప్రోలు, వేంపాడు, కన్నూరుపాలెంలలో ఆయుర్వేదిక్ డిస్పెన్సరీల ద్వారా వైద్యం అందించేవారు. తొలుత దాతల సహాయంతోనే ఈ ఆయుర్వేదిక్ ఆసుపత్రుల నడిచేవి. దాతలు భూమిని సమకూర్చడంతో పెంకులతో భవనం నిర్మించి, అందులోనే వైద్య సేవలు ప్రారంభించారు. వైద్యునితోపాటు ఆరోగ్య సిబ్బందిని నియమించి సేవలందిస్తూ వచ్చారు. కాలక్రమంలో ఈ డిస్పెన్సరీ భవనాలు శిథిలావస్థకు చేరుకోవడంతో 2013లో ఎస్ఆర్‌హెచ్‌ఎం నిధులతో నూతన భవనాలను నిర్మించారు.

జిల్లాలో ఆరు ఆస్పత్రులు

అనకాపలి జిల్లాలో ఎన్‌టీఆర్ ఆసుపత్రిలో, ఎస్.రాయవరం మండలం కొరుప్రోలు, నక్కపల్లి మండలం వేంపాడు, కశింకోట మండలం కన్నూరుపాలెం, నర్సీపట్నం, ఎం.కోడూరులో 6 ఆయుర్వేద ఆస్పత్రులు హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌లుగా అప్‌గ్రేడ్ చేశారు. గత ఏడాది ఆగస్టులో ఎస్.రాయవరం మండలం కొరుప్రోలు ఆయుర్వేద కేంద్రాన్ని స్పెషలిస్ట్ వెల్‌నెస్ అండ్ పంచకర్మ సెంటర్‌గా అప్ గ్రేడ్ చేశారు. వాటితో పాటుగా ఆరు ఆస్పత్రులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిధులు కేటాయించారు.

ఆరు వెల్‌నెస్ సెంటర్ల ఆధునికీకరణ

జన ఆరోగ్య సమితి కమిటీని ఏర్పాటు చేసి ఆస్పత్రుల భవనాల ఆధునికీకరణ పనులు పూర్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలోనే జాతీయ ఆరోగ్య మిషన్ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా ఒక్కో ఆస్పత్రిని రూ.3.5 లక్షలతో ఆధునికీకరించారు. అదనపు సౌకర్యాలు కల్పించి ప్రజలకు విస్తృతంగా వైద్య సేవలందిస్తున్నారు. కశింకోట మండలంలోని కన్నూరుపాలెం ఆస్పత్రిని ఆయుర్వేదిక్ హెల్త్ అండ్ వెల్నెస్ స్పెషాలిటీ ఆస్పత్రిగా అభివృద్ధి చేస్తున్నారు. అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలోని ఆయుష్ విభాగంలో మౌలిక వసతులకు రూ.3.50 లక్షలు మంజూరు చేసింది. తాజాగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఆయుష్మాన్ భారత్ కింద ఆయుర్వేదిక్ ఆస్పత్రులను అభివృద్ధి చేసి, సేవల్ని విస్తృత పరచాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే జిల్లాలోని వేంపాడు, కొరుప్రోలు, కన్నూరుపాలెం ఆయుర్వేదిక్ ఆస్పత్రుల అభివృద్ధికి మొత్తం రూ.10.5 లక్షలు వెచ్చిస్తున్నారు. ఎన్నికల సమయంలో నిలిచిన పనులు మూడు నెలలుగా తిరిగి కొనసాగాయి.

యోగా, ధ్యానం..

ఆరోగ్యాన్ని పెంచే యోగాపై అవగాహన కలిగించేందుకు ఆయుర్వేదిక్ డిస్పెన్సరీలలో శిక్షకులను నియమించారు. వారిలో ఒకరు యోగా, ధ్యానం నేర్పించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరోగ్య మేళాలు గ్రామాల్లో విరివిగా నిర్వహించి ఆయుర్వేద వైద్యం పట్ల ప్రజలకు అవగాహన కలిగిస్తున్నారు.

పంచకర్మ నుంచి జలగ వైద్యం వరకూ...

సగటున ఒక్కో ఆస్పత్రిలో నెలకు 900 నుంచి 1000 మంది వరకూ రోగులకు వైద్యసేవలందుతున్నాయి. జిల్లాలోని ఆరు ఆస్పత్రుల్లో 5 వేల నుంచి 6 వేల మందికి వైద్య సేవలందుతున్నాయి. ఆస్పత్రిలో పక్షవాతం, మోకాళ్ల, కీళ్ల నొప్పులు, ఇతర దీర్ఘకాలిక వ్యాధులతో పాటుగా పంచకర్మ చికిత్సలో అభ్యంగం, స్వేద కర్మ, పిండస్వేద కటివస్తి, జానువస్తి, గ్రీవ వస్తి, క్షారసూత్ర, అగ్రికర్మ, జలగ వైద్యంతో పాటుగా అనేక వైద్యసేవలు అందుబాటులోకి వచ్చాయి. ఇక్కడ ప్రస్తుతం రోజుకు 40 నుంచి 45 మంది వరకూ రోగులు వస్తున్నారు.

పంచకర్మ థెరపీ..

ఆయుర్వేద పంచకర్మ చికిత్స కోసం కేరళ, తమిళనాడు, కర్ణాటకకు ప్రత్యేకంగా థెరపీ వైద్యం కోసం వెళుతుంటారు. అదే తరహా కేరళ మెడికేటెడ్ ఆయిల్ ద్వారా వైద్యం అనకాపల్లి జిల్లాలో ఆయుర్వేద వెల్‌నెస్ సెంటర్లల్లో కూడా అందిస్తున్నారు. పంచకర్మ థెరపీ ద్వారా వైద్యసేవలు అందిస్తున్నారు. నశ్య, వమన, విరేచన, వస్తి, రక్త మోక్షణ వంటి థెరపీల ద్వారా చికిత్సలు అందిస్తున్నారు.

వమన

సొరియాసిస్, రెస్పిరేటరీ వంటి దీర్ఘకాలిక సమస్యలకు అందించే ఆయుర్వేదిక్ వైద్యం. థెరఫిటిక్ మెడిసిన్ ఇచ్చి వాంతులు చేయించి తద్వార శ్వాశకోశ వ్యవస్థ మెరుగ్గా పనిచేసేలా సహాయపడుతుంది..

విరేచన

కడుపు ఉబ్బరం, అల్సర్ ఇతర దీర్ఘకాలిక సంబంధిత వ్యాధుల్లో కడుపులో విరేచన ద్వారా క్లీన్ చేయించి ఈ థెరపీ చేస్తారు. దీని ద్వారా కడుపు క్లీనింగ్ అయి లివర్, జీర్ణాశయం, కిడ్నీలు సక్రమంగా పనిచేసేలా థెరపీ చేస్తారు.

వస్తి..

మగ,ఆడ వారిలో వెన్నుపూస, స్పైనల్ కార్డు వంటి సమస్యల్లో ఈ థెరపీ వాడతారు. మైక్రో ఛానల్ ద్వారా ఆయిల్ రాసి ఈ చికిత్స అందిస్తారు

రక్త మోక్షణ...

శరీరంపై వివిధ అవయవాలల్లో దీర్ఘకాలికంగా పుండ్లుగా ఏర్పడి వాటి నుంచి రసి కారి కుళ్లిపోతే.. అక్కడ ఈ థెరపీ ద్వారా చెడు రక్తం తీసే చికిత్స ఇది. ఈ చికిత్స వచ్చే నెల నుంచి ప్రారంభమవుతుంది.


ఔషధ మొక్కల తోట


ధ్యానంపై శిక్షణ


ఆయుర్వేద వెల్‌నెస్ సెంటర్‌లో ఓపీ సేవలు

అవగాహన పెరిగింది..



జిల్లాలో ఆరు ఆయుర్వేదిక్ హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాల ద్వారా వైద్యసేవల అందిస్తున్నాం. కేరళలో లభ్యమయ్యే మెడికేటెడ్ ఆయిల్‌తో థెరపీ వైద్యం అందుబాటులో ఉంది. ప్రతి ఆస్పత్రిలో ఇద్దరు థెరపిస్టుల ద్వారా వైద్యసేవలందిస్తున్నాం. ఆయుర్వేదిక్ వైద్యం పట్ల ప్రజల్లో అవగాహన పెరిగింది. ఎక్కువగా దీర్ఘకాలికంగా వివిధ వ్యాధులతో బాధపడుతున్న రోగులు వైద్యం కోసం వస్తున్నారు. పంచకర్మ థెరపీతో పాటు అదనంగా ఐఆర్ థెరపీ ద్వారా మోకాళ్ల నొప్పి వంటి సమస్యలకు వైద్య సేవలందిస్తున్నాం. ప్రజలకు ఆశాల ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ఆస్పత్రి ఆవరణలో ఔషధ మొక్కలు, హెర్బల్ గార్డెన్ కూడా పెంచుతున్నాం.

–కె.లావణ్య, ఆయుష్ విభాగం వైద్యాధికారి, జిల్లా ఆయుర్వేదిక్ డిస్పెన్సరీ

అదిరే.. అదిరే..



- పెళ్లి పుస్తకం.. కొత్త సంప్రదాయం!
- ప్రీ వెడ్డింగ్ షూట్ కొత్త పుంతలు
- నిశ్చితార్థం నుంచే లొకేషన్‌ల కోసం వెతుకులాట
- రూ.3 లక్షలైనా తగ్గేదే లేదంటున్న వైనం
- పిల్లల ఇష్టాయిష్టాలు కాదనలేకపోతున్న తలిదండ్రులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రీ వెడ్డింగ్ షూట్ కొత్త పుంతలు తొక్కుతోంది. ఇటీవల గ్రామీణ ప్రాంతాలకూ ఈ సంస్కృతి వ్యాపించింది. ఒకప్పుడు పెళ్లికి నాలుగు లక్షల రూపాయలైందంటేనే అంతా ఆశ్చర్యపోయేవారు. కానీ, నేడు ప్రీ వెడ్డింగ్ షూట్‌కే రూ.3 లక్షలకు పైగా ఖర్చు చేస్తున్నారు. పెళ్లికి ముందు ఏకంగా నాలుగైదు రోజుల పాటు పర్యాటక ప్రాంతాల్లోనే గడుతువున్నారు. సంప్ర దాయాలు అడ్డొస్తున్నా పిల్లల ఇష్టాయిష్టాలను కాదనలేక తల్లిదండ్రులు ఓకే చెబుతున్నారు.

నిశ్చితార్థం నుంచే..

గతంలో పెళ్లయ్యాక హనీమూన్‌కు ఎక్కడికెళ్లాలి అంటూ అందరితో ఆరా తీసేవారు. ఇప్పుడు నిశ్చితార్థం జరిగిన రోజు నుంచే ప్రీవెడ్డింగ్ షూట్‌కు అనువైన ప్రాంతాలను వెతుకుతుండటం గమనార్హం. అనంతపురం, శ్రీ సత్యసాయి జిల్లాలు బెంగళూరుకు దగ్గరగా ఉండటంతో కర్ణాటకలోని పర్యాటక ప్రదేశాలనూ ఇంటర్నెట్‌లో చూస్తున్నారు.

గండికోటకు క్యూ..

ఎక్కువ జంటలు చారిత్రక కట్టడాలను ప్రీవెడ్డింగ్ షూట్‌కు ఎంపిక చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో చాలా మందికి నచ్చుతున్న వేదికల్లో గండికోట మొదటి వరుసలో ఉంటోంది. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోని గండికోట రాజసానికి ప్రతీకగా నిలుస్తోంది. ఇటీవల ఆ ప్రాంతానికి ప్రీ వెడ్డింగ్ షూట్‌కు వెళ్తున్న జంటలు ఎక్కువయ్యాయి. ఆ తర్వాత కర్ణాటకలోని నందిహిల్స్, కూర్గ్, మైసూరు, గోవాతో పాటు బాగా డబ్బున్న వారైతే జైపూర్‌కు వెళుతున్నారు.

ఒకరినొకరు తెలుసుకోవచ్చు..



ఒకరి మనసు మరొకరు తెలుసుకునేందుకు ప్రీ వెడ్డింగ్ షూట్ ఎంతో ఉపయోగపడుతుంది. మా స్నేహితులు, బంధు వులు ఎంతో ఆడంబరంగా ఈ వేడుక జరుపుకున్నారు. సమయాభావం వల్ల మేం మిస్ అయ్యాం.

– పాండ్రే వైష్ణవి, బ్యాంకు ఉద్యోగి

రెండు నుంచి మూడు లక్షలు..

ఒకేరోజులో అంటే ప్రీ వెడ్డింగ్ షూట్ అయ్యేది కాదు. 2,3 రోజులు అక్కడే ఉండాల్సి వస్తోంది. ఓ కెమెరా మెన్ లేదా ఒక ఫొటోగ్రాఫర్‌ను వెంట తీసుకెళ్లాలి. ఈ క్రమంలో కెమెరామెన్, ఫొటోగ్రాఫర్లకే రూ.1.50 లక్షల వరకూ ముట్టజెబుతున్నారు. బస, ఆహారం, దుస్తుల కొనుగోలు తదితర వాటికి మరో లక్ష పైనే ఖర్చవుతోంది. ఈ మూడు రోజుల ప్రక్రియను ఎడిట్ చేసి పెళ్లినాడు ప్రదర్శిస్తున్నారు.

తెలుగును కాపాడే బాధ్యత ప్రభుత్వ పాఠశాలలకేనా?

- మీ పిల్లలు చదువుకునే ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లకు లేదా?
- తెలుగు రచయితల మహాసభల తీర్మానంపై 'విదసం' ప్రశ్న

సీతంపేట/నరసరావుపేట: తెలుగు భాషా వికాసం ముసుగులో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం రద్దు చేసి బడుగుల భవిష్యత్‌ను నాశనం చేయొద్దని విస్తృత దళిత సంఘాల ఐక్య వేదిక (విదసం) కన్వీనర్ బూసి వెంకటరావు అన్నారు. 'ఇటీవల విజయవాడలో జరిగిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో చేసిన ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం రద్దు చేయాలనే తీర్మానాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. తెలుగును కాపాడే బాధ్యత కేవలం పేద పిల్లలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలలకే ఉందా...? మీ వంటి ధనవంతుల పిల్లలు చదువుకునే కార్పొరేట్, ప్రైవేట్ స్కూళ్లకు లేదా...? అని ఆయన ప్రశ్నించారు. విదసం ఆధ్వర్యాన విశాఖపట్నం రామా టాకీస్ రోడ్డులోని అంబేడ్కర్ భవన్‌లో గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం రద్దు చేయాలనే తీర్మానాన్ని ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవద్దని కోరారు. ప్రపంచీకరణ కారణంగా ఉద్యోగాలకు ఇంగ్లిష్ భాష కీలకంగా మారిందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఇంగ్లిష్ మీడియంపై విషం కక్కిన వారి పిల్లలు, మనవలు ఎక్కడ చదువుతున్నారని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం వద్దనడం కేవలం రాజకీయ వైరం మాత్రమేనని, ఇది తెలుగు భాష పరిరక్షణ కోసం కాదని పేర్కొన్నారు. ఈ సమావేశంలో విదసం నాయకులు సోడదాసి సుధాకర్, జాజి ఓంకార్, బూల భాస్కరరావు, గొల్లమాల అప్పారావు, వి.దుర్గారావు, మూర మహేష్, కస్తూరి వెంకటరావు, రవి సంతోష్, రవి శేఖర్ పాల్గొని ఇంగ్లిష్ మీడియం కొనసాగించాలని ప్లకార్డులు ప్రదర్శించారు.


ఇంగ్లిష్ మీడియం కొనసాగించాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విదసం నేతలు

ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం వద్దనటం తగదు: ఈదర గోపీచంద్

ప్రపంచ తెలుగు రచయితల మహాసభల్లో ప్రముఖులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో గత ప్రభుత్వం ఆంగ్ల మీడియం ప్రవేశపెట్టడాన్ని వ్యతిరేకించడం, జీవో నంబర్ 85ను రద్దు చేయాలని ప్రస్తుత ప్రభుత్వాన్ని కోరడం తగదని సామాజిక ఉద్యమ కార్యకర్త ఈదర గోపీచంద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రైవేట్ స్కూళ్లలో కూడా తెలుగు మీడియం ప్రవేశపెట్టాలని నామమాత్రంగానైనా ఎందుకు అడగటం లేదని ప్రశ్నించారు. వైఎస్ జగన్‌తో రాజకీయంగా విభేదిస్తే రాజకీయంగా ఎదుర్కోవాలని, ఆయనపై ద్వేషంతో పేద పిల్లలకు మేలు చేసే పథకాలను రద్దు చేయాలని కోరడం సమంజసం కాదని అన్నారు.

వేట నిషేధ భృతి ఎగ్గొట్టిన కూటమి ప్రభుత్వం

- మత్స్యకారుల నోట్ల మట్టి కొట్టారు.
- అప్సడా మాజీ కో వైస్ చైర్మన్ వడ్డి రఘురాం



సాక్షి, అమరావతి: ఈ ఏడాది వేట నిషేధ భృతిని ఎగ్గొట్టి లక్షలాది మంది మత్స్యకారుల నోట్ల మట్టికొట్టారని వైఎస్సార్‌సీపీ రైతు విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్, అప్సడా మాజీ కో వైస్ చైర్మన్ వడ్డి రఘురాం ఆరోపించారు. అధికారంలోకి రాగానే వేటకు వెళ్లే ప్రతీ మత్స్యకారునికి వేట నిషేధ భృతి కింద రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తామని ఎన్నికల్లో ఊరు, వాడా ప్రచారం చేసి ఓట్లు దండుకున్న కూటమి నేతలు అధికారంలోకి రాగానే వారికిచ్చిన మాటను గాలికొది లేశారని ధ్వజమెత్తారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి వేట నిషేధ భృతి అమలు విషయమై గురువారం జరిగిన కేబినెట్ సమావేశంలో చర్చించినట్లు మంత్రి పార్థసారథి చేసిన ప్రకటన రాష్ట్ర ప్రభుత్వ డొల్లతనాన్ని బట్టబయలు చేసిందన్నారు. 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.4వేల నుంచి రూ.10 వేలకు వేట నిషేధ భృతిని పెంచడమే కాదు... అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది నుంచే అమలు చేసిన ఘనత వైఎస్ జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఏటా సగటున 1.08 లక్షల మంది చొప్పున ఐదేళ్ల పాటు 538 కోట్ల లబ్ధిని చేకూర్చారన్నారు. తాము అధికారంలోకి వస్తే రూ.10వేల నుంచి రూ.20వేలకు పెంచి ఇస్తామంటూ ఎన్నికల్లో కల్లబొల్లి కబుర్లు చెప్పిన కూటమి నేతలు ఆ ఊసెత్తకపోవడం దుర్మార్గమని గురువారం విమర్శించారు.

మోసగించిన ప్రభుత్వం

వేట నిషేధ సమయంలో ప్రతీ ఏటా మే–జూన్‌లలో మత్స్యకారులకు అందించాల్సిన వేట నిషేధ భృతిని ఈ ఏడాది కూటమి ప్రభుత్వం ఇవ్వకుండా మోసగించిందని రాష్ట్ర మత్స్యకార సముదాయ సంఘాల నెట్‌వర్క్(ఫిష్‌కాన్) డైరెక్టర్ అర్జిల్లిదాసు ఆరోపించారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి రూ.20వేల చొప్పున వేట నిషేధ భృతి అందిస్తామని ప్రకటించిన ప్రభుత్వం 2024–25 సంవత్సరంలో మత్స్యకారులకు చెల్లించాల్సిన భృతి సంగతి మాట్లాడకపోవడం భావ్యం కాదన్నారు.

బోరుగడ్డ అనిల్‌కు బెయిల్ నిరాకరణ

- ఆయన ఉపయోగించిన భాషపై మండిపాటు
- ఇలాంటి వారిని క్షమించకూడదని వ్యాఖ్య
- పిటిషన్ కొట్టేసిన హైకోర్టు

సాక్షి, అమరావతి :సోషల్ మీడియా పోస్టుల వ్యవహారంలో బోరుగడ్డ అనిల్‌కు హైకోర్టు బెయిల్ తిరస్కరించింది. బెయిల్ కోసం ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టేసింది. సోషల్ మీడియా పోస్టుల్లో అనిల్ ఉపయోగించిన భాష, పదజాలంపై హైకోర్టు మండిపడింది. ఇలాంటి వారిని క్షమించకూడదని.. అసభ్య పోస్టులను పెట్టడమే పనిగా పెట్టుకున్నట్లు ఉన్నారని ఘాటుగా వ్యాఖ్యానించింది. మరికొంత కాలం జైల్లో ఉండటంవల్ల నష్టం లేదని తెలిపింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌లపై బోరుగడ్డ అనిల్ అనుచిత, అసభ్యకర పోస్టులు పెట్టినందుకు అనంతపురం నాల్గవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ అనిల్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై గురువారం జస్టిస్ శ్రీనివాసరెడ్డి విచారణ జరిపారు. పిటిషనర్ తరఫు న్యాయవాది అభయ్ సిద్ధాంత్ వాదనలు వినిపిస్తూ.. బీఎన్ఎస్ సెక్షన్–111 మినహా మిగిలిన అన్నీ సెక్షన్లు ఏడేళ్ల కంటే తక్కువ శిక్షపడేవేనని.. సోషల్ మీడియాలో పోస్టులకు సెక్షన్–111 వర్తించదని తెలిపారు. పోలీసుల తరఫున ఏపీపీ సాయిరోహిత్ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్ సెక్షన్–111 వర్తిస్తుందన్నారు. సోషల్ మీడియా పోస్టులకు సంబంధించి ఆయనపై నమోదైన రెండు కేసుల్లో చార్జిషీట్లు దాఖలయ్యాయని తెలిపారు. అతనిపై 22 కేసులు నమోదై ఉన్నాయన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి పిటిషనర్ అనిల్‌కు బెయిల్ నిరాకరిస్తూ పిటిషన్‌ను కొట్టేశారు.



ఉపాధ్యాయ వృత్తి ఒక జీవన విధానం

సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు



సాక్షి, అమరావతి: ఉపాధ్యాయ వృత్తి ఒక జీవన విధానమని, భవిష్యత్ తరాలకు దిశానిర్దేశం చేసే గొప్ప బాధ్యత అని సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు అన్నారు. కేజీబీవీ మాస్టర్ ట్రైనర్లకు శిక్షణ గురువారం విజయవాడలో ప్రారంభమైంది. ముఖ్య అతిథిగా పాల్గొన్న శ్రీనివాసరావు మాట్లాడుతూ కేజీబీవీ టీచర్లు బాలికల జీవితాలను తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తారని, వారు బాలికల భద్రతకు, నాణ్యమైన విద్య అందించేందుకు అంకితభావంతో పనిచేస్తున్నారని అభినందించారు. విద్యార్థినుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆరోగ్యం, సంక్షేమం, విద్యకు సమ ప్రాధాన్యత ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ కార్యదర్శి డి.దేవానందరెడ్డి, ఇగ్నస్ పహల్ వ్యవస్థాపకులు సుబీర్ శుక్లా, ఎల్ఎఫ్ఈ ప్రతినిధి సిద్దేశ్ పాల్గొన్నారు.


• మహేశ్‌బాబు • ప్రభాస్ • రామ్‌చరణ్


• నాని


• విజయ్ దేవరకొండ

లుక్కు మారింది.. కిక్కు ఖాయం

సంవత్సరం మారింది... లుక్ మార్చి బాక్సాఫీస్ లెక్కలు కూడా మార్చాలని డిసైడ్ అయ్యారు కొందరు హీరోలు. ఇందు కోసం కథానుగుణంగా గెటప్ మార్చేశారు. ఇలా సరికొత్త లుక్‌లో తమ అభిమాన హీరోలు కనిపించడానికి అభిమానులకు ఓ కిక్కు అని ప్రత్యేకంగా చెప్పలేదు. ఇక ఈ ఏడాది స్క్రీన్‌పై ఆడియన్స్‌ను సర్‌ప్రైజ్ చేసేందుకు రెడీ అవుతున్న కొందరు స్టార్స్ గురించి తెలుసుకుందాం.


• రామ్

సరికొత్త మహేశ్

మహేశ్‌బాబు కెరీర్‌లో ఇప్పటివరకు ఇరవై ఎనిమిది సినిమాలు పూర్తయ్యాయి. అయితే స్క్రీన్‌పై ఎప్పుడూ కనిపించనంత కొత్తగా మేకోవర్ అయ్యే పనిలో పడ్డారు మహేశ్‌బాబు. రాజమౌళి డైరెక్షన్‌లోని కొత్త సినిమా కోసమే మహేశ్‌బాబు సరికొత్తగా మేకోవర్ అయ్యారు. ఈ సినిమాలోని లుక్, మేకోవర్ కోసం ఆయన జర్మనీలో కొంత సమయం గడిపారు. గురువారం ఈ సినిమా లాంచ్ జరిగింది. కానీ మహేశ్ లుక్ బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారు రాజమౌళి అండ్ టీమ్. ఈ సినిమాలో మహేశ్ లాంగ్ హెయిర్‌తో, కాస్త గెడ్డంతో కనిపిస్తారని ఇటీవల బయటికొచ్చిన ఆయన ఫొటోలు స్పష్టం చేస్తున్నాయి. భారీ బడ్జెట్‌తో కేఎల్ నారాయణ ఈ మూవీని నిర్మిస్తున్నారు.

రాజా సాబ్

ప్రభాస్ తొలిసారిగా చేస్తున్న హారర్ మూవీ 'రాజాసాబ్'. ఈ సినిమాలో ప్రభాస్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ఈ సినిమా నుంచి ప్రభాస్ రెండు గెటప్స్‌లో ఉన్న లుక్స్ ఇప్పటికే విడుదలయ్యాయి. అయితే ప్రభాస్ కుర్చీలో కూర్చున్న ఓ గెటప్ మాత్రం కొత్తగా అనిపిస్తోంది. అలాగే ప్రభాస్ ఇటీవల ఎక్కువగా రగ్డ్ లుక్‌తో, గెడ్డంతోనే కనిపించారు. కానీ 'రాజాసాబ్'లో మాత్రం క్లీన్ షేవ్‌తో ఓ గెటప్, కాస్త రగ్డ్ లుక్‌తో మరో గెటప్‌లో కనిపిస్తారు. మారుతి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నిధీ అగర్వాల్, మాళవికా మోహనన్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది. అయితే విడుదల విషయంలో మార్పు ఉండొచ్చనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అలాగే 'అర్జున్ రెడ్డి, యానిమల్' చిత్రాల ఫేమ్ సందీప్ రెడ్డి వంగాతో 'స్పిరిట్' అనే పోలీస్ యాక్షన్ డ్రామా చిత్రం కమిటయ్యారు ప్రభాస్. ఈ చిత్రంలోనూ ప్రభాస్ ఓ డిఫరెంట్ గెటప్‌లో కనిపించనున్నారని టాక్. ఆ మేకోవర్ కోసం హాలీవుడ్ స్థాయి సాంకేతిక నిపుణులను సంప్రదిస్తున్నారట సందీప్ రెడ్డి వంగా.

రగ్డ్ పెద్ది

'గేమ్ చేంజర్' మూవీలో రామ్‌చరణ్ క్లీన్ షేవ్ లుక్స్‌తో కనిపిస్తున్నారు. అయితే ఈ సినిమా ప్రమోషన్స్‌లో మాత్రం గుబురు గడ్డం, కాస్త లాంగ్ హెయిర్‌తో రగ్డ్‌గా కనిపిస్తున్నారు. చరణ్ ఇలా కొత్తగా మేకోవర్ అయ్యింది తన లేటెస్ట్ మూవీ కోసం అని ఊహించవచ్చు. రామ్‌చరణ్ హీరోగా 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సాన దర్శకత్వంలో 'పెద్ది' అనే ఓ స్పోర్ట్స్ డ్రామా రూపొందుతున్న విషయం తెలిసిందే. ఈ సినిమాలో రామ్ చరణ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారని తెలిసింది. ఈ సినిమా కోసమే రామ్‌చరణ్ కొత్తగా మేకోవర్ అయ్యారు. ఇందుకోసం రామ్ చరణ్ విదేశాల్లో స్పెషల్ ట్రైనింగ్ తీసుకున్నారని తెలిసింది. ఫిజిక్ విషయంలోనే కాదు... హెయిర్ స్టైల్‌తోనూ చరణ్ కొత్తగా కనిపిస్తారు. 'పెద్ది' సినిమా తొలి షెడ్యూల్ చిత్రీకరణ మైసూర్‌లో జరిగింది. ఈ షెడ్యూల్‌లో సెలబ్రిటీ స్టైలిస్ట్ అలీమ్ హకీమ్ పాల్గొని, రామ్ చరణ్ హెయిర్ స్టైల్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేశారు. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. మైత్రీ మూవీమేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్ పతాకాలపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్న 'పెద్ది' సినిమాకు ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాను ఈ ఏడాదే రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

ఆఫీసర్ అర్జున్ సర్కార్

రోల్‌కు తగ్గట్లుగా నాని మౌల్డ్ అవుతుంటారు. తాజాగా అర్జున్ సర్కార్ పాత్ర కోసం నాని కొంత మేకోవర్ అయ్యారు. నాని హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'హిట్ 3'. ఈ మూవీలో పోలీసాఫీసర్ అర్జున్ సర్కార్ పాత్రలో నటిస్తున్నారు నాని. ఈ చిత్రంలో నాని కొన్ని సీన్స్‌లో ఫుల్ వైట్ హెయిర్‌తో కనిపిస్తారని తెలిసింది. అంటే... ఓ సీనియర్ పోలీసాఫీసర్ లెక్క అన్నమాట. వాల్ పోస్టర్ సినిమా, యునానిమస్ ప్రొడక్షన్స్‌పై ప్రశాంతి త్రిపిర్నేని నిర్మిస్తున్న 'హిట్ 3' మే 1న రిలీజ్ కానుంది. అలాగే 'దసరా' మూవీ తర్వాత హీరో నాని,


• సాయిధరమ్ తేజ్


• విశ్వక్ సేన్

దర్శకుడు శ్రీకాంత్ ఓదెల ఓ సినిమా చేయనున్న సంగతి తెలిసిందే. ఫుల్ వయొలెన్స్‌తో సాగే ఈ చిత్రంలో ఓ ఫిరోషియస్ లుక్‌లో నాని కనిపించనున్నారు. ఇందుకోసం నాని ప్రత్యేకంగా మేకోవర్ కావాల్సి ఉంది. 'హిట్ 3' చిత్రీకరణ పూర్తయిన తర్వాత నాని కొత్త మేకోవర్ స్టార్ట్ అవుతుందని ఊహించవచ్చు.

రొమాంటిక్ లవ్‌స్టోరీ

గతేడాది వచ్చిన 'డబుల్ ఇస్మార్ట్' మూవీలో కాస్త మాసీ లుక్‌లో కనిపించారు హీరో రామ్. తన తాజా చిత్రం కోసం రామ్ కంప్లీట్‌గా మేకోవర్ అయ్యారు. ఈ రొమాంటిక్ లవ్‌స్టోరీ కోసం లాంగ్ హెయిర్ పెంచారు రామ్. అలాగే బరువు కూడా తగ్గారు. యంగ్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఈ చిత్రంలో రామ్ సరసన భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్నారు. పి. మహేశ్‌బాబు దర్శకత్వంలో ఈ సినిమాను నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఈ ఏడాదే థియేటర్స్‌లోకి వచ్చే చాన్స్ ఉంది.

స్పై డ్రామా

'ఫ్యామిలీ స్టార్' సినిమాలో ఫ్యామిలీ మేన్‌లా కనిపించారు విజయ్ దేవరకొండ. అయితే ప్రస్తుతం గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో చేస్తున్న సినిమాలో అందుకు భిన్నంగా కనిపించనున్నారు. ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ మూవీలో విజయ్ దేవరకొండ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటించనున్నట్లుగా తెలిసింది. దీంతో పోలీస్ రోల్‌కు తగ్గట్లుగా షార్ట్ హెయిర్‌తో, కరెక్ట్ ఫిజిక్‌తో కనిపించనున్నారట విజయ్. కాగా ఈ చిత్రంలో కొన్ని సన్నివేశాల్లో విజయ్ సస్పెండ్ అయిన పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తారని, ఈ సీన్స్‌లో విజయ్ లుక్ రగ్డ్‌గా... చాలా మాస్‌గా ఉంటుందని సమాచారం. ఇలా ఈ చిత్రంలో విజయ్ రెండు గెటప్స్‌లో కనిపించనున్నారట. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 28న విడుదల కానుంది. అయితే ఈ సినిమా విడుదల తేదీలో మార్పు ఉండొచ్చనే టాక్ వినిపిస్తోంది.

మాస్ సంబరాలు

'సంబరాల ఏటి గట్టు' సినిమాలో సాయి దుర్గా తేజ్ మేకోవర్ చూశారుగా... మాసీ లుక్‌లో కనిపిస్తున్నారు. ఈ మాస్ సినిమా కోసం ఫిజికల్‌గా చాలా హార్డ్‌వర్క్ చేశారు సాయి


• అఖిల్


• నిఖిల్

దుర్గాతేజ్. సిక్స్‌ప్యాక్ చేశారు. కేపీ రోహిత్‌ను దర్శకుడిగా పరిచయం చేస్తూ, దాదాపు రూ. వంద కోట్ల భారీ బడ్జెట్‌తో కె.నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా ఈ సినిమా విడుదల కానుందని తెలిసింది. తొలి భాగం సెప్టెంబరు 25న రిలీజ్ కానుంది.

లేడీ గెటప్‌లో..

మాసీ లుక్స్‌తో కనిపించే విశ్వక్ సేన్ తొలిసారిగా లైలాగా అమ్మాయి పాత్రలో కనిపించనున్నారు. ఓ అబ్బాయి లేడీ గెటప్‌లో నటించాలంటే స్పెషల్‌గా మేకోవర్ అవ్వాల్సిందే. అలా లైలాగా కనిపించడానికి విశ్వక్ మౌల్డ్ అయ్యారు. రామ్ నారాయణ్ దర్శకత్వంలో సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ఫిబ్రవరి 14న విడుదల కానుంది. ఈ చిత్రంలో మోడల్ సోను, లైలా అనే అమ్మాయి... ఇలా రెండు డిఫరెంట్ గెటప్స్‌లో కనిపిస్తారు విశ్వక్ సేన్.

లెనిన్‌గా...

'ఏజెంట్' తర్వాత అఖిల్ హీరోగా చేయాల్సిన నెక్ట్స్ మూవీపై మరో అధికారిక ప్రకటన రాలేదు. అయితే 'వినరో భాగ్యము విష్ణు కథ' చిత్రదర్శకుడు మురళీ కిశోర్ అబ్బూరితో అఖిల్ ఓ మూవీ చేస్తున్నారని తెలిసింది. ఈ సినిమాకు 'లెనిన్' అనే టైటిల్ కూడా అనుకుంటున్నారని, ఆల్రెడీ హైదరాబాద్ శివార్లలోని ఓ ప్రముఖ స్టూడియోలో ఈ సినిమా చిత్రీకరణ మొదలైందని, ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారని ఫిల్మ్‌నగర్ టాక్. అలాగే ఈ సినిమా కథ అనంతపురం నేపథ్యంలో సాగుతుందని, లెనిన్ పాత్ర కోసం అఖిల్ ప్రత్యేకంగా మేకోవర్ అయ్యారని తెలిసింది.

పీరియాడికల్ వార్

హీరో నిఖిల్ ప్రస్తుతం చేస్తున్న సినిమా 'స్వయంభూ'. పీరియాడికల్ వార్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమా కోసం నిఖిల్ సరికొత్తగా మేకోవర్ అయ్యారు. చెప్పాలంటే గత ఏడాదిగా ఈ లుక్‌నే మెయిన్‌టైన్ చేస్తున్నారు నిఖిల్. లాంగ్ హెయిర్‌తో, స్ట్రాంగ్ ఫిజిక్‌తో కనిపిస్తున్నారు నిఖిల్. అంతే కాదు... ఈ సినిమా కోసం నిఖిల్ కొన్ని యాక్షన్ సీన్స్‌లో ప్రత్యేకమైన శిక్షణ తీసుకున్నారు. ఠాగూర్ మధు సమర్పణలో భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ సినిమాతో భరత్ కృష్ణమాచారి దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ మూవీని ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

ఈ కోవలో మరికొందరు హీరోలు కూడా తమ కొత్త సినిమాల కోసం ప్రత్యేకంగా మేకోవర్ అయ్యే పనిలో ఉన్నారు.

– ముసిమి శివాంజనేయులు

దబిడి.. దిబిడి...

బాలకృష్ణ హీరోగా బాబీ కొల్లి దర్శకత్వం వహించిన చిత్రం 'డాకు మహారాజ్'. ప్రగ్యా జైస్వాల్, శ్రద్ధా శ్రీనాథ్, చాందినీ చౌదరి హీరోయిన్లుగా నటించగా, బాబీ డియోల్ కీలక పాత్ర చేశారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న విడుదల కానుంది. తమన్ సంగీతం అందించిన 'డాకు మహారాజ్' నుంచి 'దబిడి... దిబిడి...' అంటూ సాగే మూడో పాటని విడుదల చేశారు. ఈ పాటకి కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించగా, వాగ్దేవి పాడారు. ''యాక్షన్, వినోదం, భావోద్వేగాల మేళవింపుతో రూపొందిన చిత్రం 'డాకు మహారాజ్'. 'దబిడి... దిబిడి...' పక్కా మాస్ సాంగ్. ఈ పాటలో బాలకృష్ణతో కలిసి ఊర్వశీ రౌతేలా చిందేశారు. విజయ్ కార్తీక్ కన్నన్ అద్భుతమైన విజువల్స్, శేఖర్ వీజే కొరియోగ్రఫీ ఈ పాటని నిజమైన మాస్ ట్రీట్‌లా మార్చాయి'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి కెమేరా: విజయ్ కార్తీక్.


• ఊర్వశీ రౌతేలా, బాలకృష్ణ

మ్యాజిక్ రిపీట్ అయ్యేలా..


• రవి కృష్ణ

దాదాపు రెండు దశాబ్దాల క్రితం తెలుగు ప్రేక్షకుల ముందుకు వచ్చిన '7/జీ బృందావన కాలనీ' చిత్రం సూపర్‌హిట్‌గా నిలిచిన విషయం తెలిసిందే. సెల్వ రాఘవన్ దర్శకత్వంలో రవికృష్ణ హీరోగా నటించగా, సోనియా అగర్వాల్ హీరోయిన్‌గా చేశారు. ఈ సినిమాకు సీక్వెల్‌గా సెల్వరాఘవన్ దర్శకత్వంలోనే '7/జీ బృందావన కాలనీ 2' రూపొందుతోంది. తొలి భాగంలో చేసిన రవికృష్ణ మలి భాగంలోనూ హీరోగా నటిస్తున్నారు. అయితే హీరోయిన్‌గా అనశ్వర రాజన్ చేస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ తుది దశకు చేరుకుందని, త్వరలోనే ఇతర వివరాలను వెల్లడిస్తామని న్యూ ఇయర్ సందర్భంగా వెల్లడించారు మేకర్స్. జయరామ్, సుమన్ శెట్టి, సుధ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు యువన్ శంకర్ రాజా సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్ర నిర్మాత ఏఎమ్ రత్నం మాట్లాడుతూ– ''7/జీ బృందావన కాలనీ' చిత్రం ప్రేక్షకుల హృదయాలను ఆకట్టుకుంది. ఆ మ్యాజిక్ రిపీట్ అయ్యేలా, ఈ తరం ఆడియన్స్‌కు నచ్చేలా విభిన్నమైన ప్రేమకథా చిత్రంగా '7/జీ బృందావన కాలనీ 2' సినిమాను తీస్తున్నాం'' అని అన్నారు.

ప్రేమ కోసం ప్రతీకారం



• 'గార్డ్' పోస్టర్

విరాజ్ రెడ్డి చీలం హీరోగా, మిమి లియోనార్డో, శిల్పా బాలకృష్ణన్ హీరోయిన్లుగా నటించిన చిత్రం 'గార్డ్'. 'రివెంజ్ ఫర్ లవ్' (ప్రేమ కోసం ప్రతీకారం) అన్నది ట్యాగ్‌లైన్. జగా పెద్ది దర్శకత్వంలో ఈ చిత్రాన్ని అను ప్రొడక్షన్స్‌పై అనసూయ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ను విడుదల చేశారు. ''ప్రేమ, వినోదం, యాక్షన్ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'గార్డ్'. మెల్‌బోర్న్‌లో నివసించే పాతికేళ్ల కుర్రాడైన సుశాంత్ సెక్యూరిటీ గార్డ్‌గా పని చేస్తుంటాడు. తను కష్టపడి సొంతంగా ఓ సెక్యూరిటీ ఏజెన్సీని ఆరంభించాలనుకుంటాడు. ఆ క్రమంలో సామ్ అనే సైకాలజిస్ట్‌తో అతనికి పరిచయం ఏర్పడుతుంది. ఆమెతో ప్రేమలో పడతాడు సుశాంత్. అనుకోని పరిస్థితుల్లో అతని జీవితం ఎలాంటి మలుపు తీసుకుంటుంది? ప్రేమ కోసం ఊహించని శక్తులతో సుశాంత్ ఎలాంటి పోరాటం చేశాడు? అనే కథాంశంతో ఈ మూవీ రూపొందింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషలతో పాటు ఇంగ్లిష్, చైనీస్ భాషల్లోనూ రిలీజ్‌కి సన్నాహాలు చేస్తున్నాం'' అని చిత్ర బృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమేరా: మార్క్ కె.నోఫీల్డ్, సంగీతం: సిద్ధార్థ్ సదాశివుని.

ధైర్యం ఉంటే ప్రపోజ్ చెయ్యమన్నా!



''ఆంటోనీ తటిల్, నేను పదిహేనేళ్లుగా ప్రేమలో ఉన్నాం. 2010లో తన ప్రేమను నాకు వ్యక్తపరిచాడు. అయితే 2016 నుంచి మా ప్రేమ తర్వాతి స్థాయికి వెళ్లింది'' అని పేర్కొన్నారు హీరోయిన్ కీర్తి సురేష్. అందం, అభినయంతో దక్షిణాదిలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సొంతం చేసుకున్నారు కీర్తి సురేష్. నటి సావిత్రి బయోపిక్‌గా రూపొందిన 'మహానటి' సినిమాకి ఉత్తమ నటిగా జాతీయ అవార్డు అందుకున్న ఆమె 'బేబీ జాన్' మూవీతో బాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చారు. వరుణ్ ధావన్, కీర్తి సురేష్ జంటగా కాలీస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం గత డిసెంబరు 25న విడుదలైంది. ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఓ ఇంటర్వ్యూలో తన ప్రేమ, పెళ్లి గురించి కీర్తి సురేష్ మాట్లాడుతూ– ''నేను, ఆంటోనీ క్లాస్‌మేట్స్. ఓ సారి మా ఫ్యామిలీతో కలిసి నేను రెస్టారెంట్‌కు వెళ్లినప్పుడు ఆంటోనీ వచ్చాడు. అక్కడ మా కుటుంబ సభ్యులు ఉండటంతో తనని ప్రత్యేకంగా కలవలేకపోయాను. 'అయితే ధైర్యం ఉంటే నాకు ప్రపోజ్ చెయ్' అని నేను అనడంతో 2010లో మొదటిసారి తన ప్రేమను వ్యక్తపరిచాడు. అయితే 2016 నుంచి మా ప్రేమ తర్వాతి స్థాయికి వెళ్లింది. ఇంటర్ నుంచే మా పెళ్లి గురించి కలలు కనేవాళ్లం. నాకు ప్రామిస్ రింగ్ కూడా ఇచ్చాడు. మా వివాహం వరకు కూడా ఆ ఉంగరం తీయలేదు. నేను నటించిన చిత్రాల్లోనూ ఆ రింగ్ ఉంటుంది. మా ప్రేమ విషయం ఇండస్ట్రీలో సమంత, విజయ్, అట్లీ, ప్రియా, ప్రియదర్శన్, ఐశ్వర్య లక్ష్మి... ఇలా కొందరికి మాత్రమే తెలుసు. ఆంటోనీకి మొహమాటం ఎక్కువ. అందుకే మీడియా ముందు కూడా కనిపించలేదు. గత ఆరేళ్ల నుంచి తను ఖతార్‌లో బిజినెస్ చేస్తున్నాడు. నా కెరీర్‌లోనూ ఎంతో సపోర్ట్‌గా నిలుస్తూ వచ్చాడు. తన జీవితంలోకి నేను రావడం తన అదృష్టం అని అందరూ అంటుంటారు. అయితే నా జీవితంలోకి తను రావడం నా అదృష్టం'' అని పేర్కొన్నారు. కాగా గత డిసెంబర్ 12న కీర్తి సురేష్–ఆంటోనీ తటిల్‌ల పెళ్లి గోవాలో జరిగిన సంగతి తెలిసిందే.


• భర్త ఆంటోనీతో...

సాక్షి ప్లస్
శుక్రవారం । 3-1-2025

బిజినెస్ రీల్

డిసెంబర్‌లో తయారీ రంగం డీలా

12 నెలల కనిష్టానికి సూచీ

న్యూఢిల్లీ: భారత్ తయారీ రంగం డిసెంబర్‌లో డీలా పడింది. హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మ్యానుఫ్యాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ డిసెంబర్‌లో 56.4కు పడిపోయింది. గడచిన 12 నెలల్లో ఇంత తక్కువ స్థాయికి సూచీ పడిపోవడం ఇదే తొలిసారి. కొత్త బిజినెస్ ఆర్డర్లు, ఉత్పత్తిలో మందగమనం కనిపించిందని ఈ మేరకు వెలువడిన సర్వే పేర్కొంది. అయితే సూచీ 50పైన ఉంటే దీనిని వృద్ధి ధోరణిగానే పరిగణించడం జరుగుతుంది. ఆలోపునకు పడిపోతేనే క్షీణతగా భావిస్తారు. దీర్ఘకాలికంగా తయారీ సూచీ 54.1గా ఉండడం గమనార్హం. 2025లో ఉత్పత్తిలో భారీ పెరుగుదల నమోదవుతుందన్న విశ్వాసంలో తయారీదారులు ఉన్నట్లు సర్వే పేర్కొంది.

పేఇన్‌స్టాకార్డ్ కార్యకలాపాల విస్తరణ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫిన్‌టెక్ కంపెనీ పేఇన్‌స్టాకార్డ్ తమ కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఇందులో భాగంగా హైదరాబాద్‌లో కొత్త కార్యాలయాలన్ని ప్రారంభించింది. బ్రాండిక్స్ ఇండియా అపారెల్ సిటీ (బీఐఏసీ) ఇండియా పార్ట్‌నర్, పేఇన్‌స్టాకార్డ్ చైర్మన్ పచ్చిపాల దొరస్వామి, వ్యవస్థాపక సీఈవో సాయికృష్ణ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో సిబ్బంది సంఖ్యను 100కు పెంచుకోనున్నట్లు ఈ సందర్భంగా సాయికృష్ణ తెలిపారు. తక్కువ లావాదేవీ వ్యయాలతో బిల్లులు, అద్దెలు, ఫీజులు మొదలైనవి చెల్లించేందుకు అనువైన సాధనంగా కేవలం ఆరు నెలల వ్యవధిలోనే 1,00,000 మంది పైగా యూజర్లకు చేరువైనట్లు వివరించారు.

యూపీఐ లావాదేవీలు 1,673 కోట్లు

న్యూఢిల్లీ: ఇన్‌స్టంట్ చెల్లింపుల వ్యవస్థ యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) లావాదేవీల సంఖ్య డిసెంబర్‌లో 1,673 కోట్లు నమోదయ్యాయి. నవంబర్‌తో పోలిస్తే ఇవి 8 శాతం పెరిగాయని నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) తెలిపింది. నవంబర్‌లో యూపీఐ లావాదేవీల సంఖ్య 1,548 కోట్లుగా ఉంది. ఇక లావాదేవీల విలువ గత నెలలో రూ.23.25 లక్షల కోట్లకు చేరింది. నవంబర్‌లో ఇది రూ.21.55 లక్షల కోట్లు నమోదైంది. లావాదేవీల సంఖ్య డిసెంబర్‌లో సగటున రోజుకు 53.96 కోట్లు, నవంబర్‌లో 51.6 కోట్లుగా ఉంది. లావాదేవీల విలువ డిసెంబర్ నెలలో సగటున రోజుకు రూ.74,990 కోట్లు, నవంబర్‌లో రూ.71,840 కోట్లుగా ఉంది.

దక్షిణాఫ్రికాలో వరుణ్ బెవరేజెస్ పెట్టుబడులు

న్యూఢిల్లీ: పానీయాల దిగ్గజం పెప్సీకోకు ప్రధాన బాట్లర్ వరుణ్ బెవరేజెస్ విదేశాలలో పెట్టుబడులకు తెరతీసింది. దక్షిణాఫ్రికాలోని అనుబంధ సంస్థ బెవ్‌కోలో రూ. 412 కోట్లు ఇన్వెస్ట్ చేసింది. అక్కడ పెప్సీకో నుంచి లైసెన్స్ పొందిన ప్రొడక్టుల తయారీ, పంపిణీ చేపట్టే బెవ్‌కో సొంత బ్రాండ్ల నాన్‌ఆల్కహాలిక్ పానీయాలను సైతం విక్రయిస్తోంది. తాజా పెట్టుబడుల్లో భాగంగా బెవ్‌కో నుంచి 19.84 లక్షల సాధారణ షేర్లను వరుణ్ బెవరేజెస్ అందుకుంది. తద్వారా బెవ్‌కో మూలధనంలో 2.42 శాతం వాటాను పొందింది. దీంతో బెవ్‌కో ప్రస్తుత రుణ చెల్లింపులతోపాటు, బ్యాలన్స్‌షీట్ పటిష్టతకు వరుణ్ బెవరేజెస్ సహకరించింది.

బీఎస్‌ఈలో వరుణ్ బెవరేజెస్ షేరు 0.3 శాతం నష్టంతో రూ. 648 వద్ద ముగిసింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

3-1-2025

విశాఖ	570-00
చిత్తూరు	563-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	550-00
విజయవాడ	550-00
రిటైల్ ధర (డజను)	84.00
హైదరాబాద్	525-00
వరంగల్	527-00
రిటైల్ ధర	5.85

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	5,714
ఎన్‌ఎస్‌ఈ	99,416
ఎన్‌ఎస్‌ఈ(డెరివేటివ్స్)	2,00,953
ఎఫ్ఐఐ	+ 1,507
డీఐఐ	+ 22

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	73.47 (రాత్రి 11.30కు)	$	71.72 (క్రితం ముగింపు)
బ్రెంట్	76.23 (రాత్రి 11.30కు)	$	74.64 (క్రితం ముగింపు)

దీర్ఘకాలిక పొదుపును ప్రోత్సహించండి

కేంద్రానికి ఆర్థిక రంగం బడ్జెట్ వినతులు



న్యూఢిల్లీ: దీర్ఘకాలిక పొదుపును ప్రోత్సహించేలా బడ్జెట్‌లో ప్రతిపాదనలు చేయాలని కేంద్రాన్ని ఆర్థిక రంగం విజ్ఞప్తి చేసింది. ఫిక్సిడ్ డిపాజిట్లపై పన్ను మినహాయింపులు ఇవ్వాలని కోరింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన ఏడో ప్రీ-బడ్జెట్ సమావేశంలో ఆర్థిక రంగం ప్రతినిధులు ఈ మేరకు వినతులు ఇచ్చారు. క్యాపిటల్ మార్కెట్లను మరింత మెరుగుపర్చేందుకు తీసుకోతగిన చర్యలను కూడా తెలియజేసినట్లు ఎడెల్విస్ మ్యుచువల్ ఫండ్ ఎండీ రాధికా గుప్తా వెల్లడించారు. ఎలక్ట్రిక్ వాహనాలకు, పర్యావరణహిత ప్రాజెక్టులకు రుణాలకు సంబంధించి రీఫైనాన్స్ విండోను ఏర్పాటు చేయాలని నాన్‌బ్యాంకింగ్ ఫైనాన్స్ రంగం కోరినట్లు ఫైనాన్స్ ఇండస్ట్రీ డెవలప్‌మెంట్ కౌన్సిల్ (ఎఫ్ఐడీసీ) డైరెక్టర్ రమణ్ అగర్వాల్ వివరించారు. గృహ రుణాల కంపెనీల తరహాలోనే ఎలక్ట్రిక్ వాహనాలు మొదలైన వాటికి రీఫైనాన్సింగ్ చేసేందుకు సిడ్బి, నాబార్డ్‌ల కోసం నిర్దిష్ట ఫండ్‌ను ఏర్పాటు చేయొచ్చని సూచించినట్లు పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక శాఖ కార్యదర్శి, ప్రధాన ఆర్థిక సలహాదారు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను కేంద్రం ఫిబ్రవరి 1న ప్రవేశపెట్టనుంది.

ఎన్‌సీసీకి రూ.350 కోట్ల ఆర్డర్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: నిర్మాణ రంగ సంస్థ ఎన్‌సీసీ లిమిటెడ్ డిసెంబర్ నెలలో రూ.349.7 కోట్ల విలువైన ఆర్డర్ దక్కించుకుంది. బిల్డింగ్ డివిజన్ ఈ ఆర్డర్‌ను ఓ ప్రైవేట్ కంపెనీ నుంచి చేజిక్కించుకుందని ఎన్‌సీసీ సీఎఫ్‌వో సంజయ్ పూసర్ల వెల్లడించారు. 32 నెలల్లో ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆర్డర్ బుక్ రూ.52,370 కోట్లు ఉన్నట్టు నవంబర్ 7న అనలిస్టులతో జరిగిన కాన్ఫరెన్స్ కాల్ సందర్భంగా ఎన్‌సీసీ స్ట్రాటజీ, ఇన్వెస్టర్ రిలేషన్స్ హెడ్ నీరద్ శర్మ వెల్లడించారు. అలాగే కెన్-బెట్వా లింక్ ప్రాజెక్ట్ అథారిటీ నుంచి రూ.3,389 కోట్ల విలువైన కాంట్రాక్ట్ పొందినట్టు నవంబర్ 29న కంపెనీ ప్రకటించింది. కాగా, ఎన్‌సీసీ షేరు ధర క్రితం ముగింపుతో పోలిస్తే బీఎస్‌ఈలో గురువారం 0.34 శాతం ఎగసి రూ.278.40 వద్ద స్థిరపడింది. 2024 జనవరి 2న నమోదైన రూ.167.20తో పోలిస్తే ఏడాదిలో షేరు ధర 66.5 శాతం దూసుకెళ్లింది. గతేడాది జూలై 31న షేరు గరిష్ట స్థాయిలో రూ.357.95 తాకింది.

టాటా, ఎంఅండ్‌ఎం పీఎల్ఐ దరఖాస్తులకు ఓకే..

న్యూఢిల్లీ: ఆటోమొబైల్, ఆటో విడిభాగాల పరిశ్రమకు ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకానికి సంబంధించి రెండు సంస్థలు సమర్పించిన రూ. 246 కోట్ల క్లెయింలను కేంద్ర భారీ పరిశ్రమల శాఖ ఆమోదించింది. టాటా మోటర్స్, మహీంద్రా అండ్ మహీంద్రా ఈ దరఖాస్తులను దాఖలు చేశాయి. పీఎల్ఐ స్కీము ద్వారా స్థానికంగా తయారీ కార్యకలాపాలను మరింతగా పెంచే దిశగా వాహనాల సంస్థలు సాధించిన పురోగతిపై కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి సంతృప్తి వ్యక్తం చేశారు. టాటా మోటర్స్, ఎంఅండ్‌ఎంలను ప్రశంసించారు. సంబంధిత వర్గాల ప్రకారం.. 2023-24 విక్రయాల ఆధారంగా టాటా మోటర్స్ సుమారు రూ. 142.13 కోట్ల మేర, మహీంద్రా అండ్ మహీంద్రా రూ. 104.08 కోట్ల ప్రోత్సాహకాలను క్లెయిమ్ చేశాయి.

జేకే లక్ష్మీ సిమెంట్‌కు గ్రీన్‌సిగ్నల్

విలీన ప్రతిపాదనకు ఎక్స్ఛేంజీలు ఓకే

న్యూఢిల్లీ: అనుబంధ సంస్థలు మూడింటిని విలీనం చేసుకునేందుకు జేకే లక్ష్మీ సిమెంట్ చేసిన ప్రతిపాదనకు స్టాక్ ఎక్స్ఛేంజీలు ఆమోదముద్ర వేశాయి. ఉదయ్‌పూర్ సిమెంట్ వర్క్స్, హన్స్‌దీప్ ఇండస్ట్రీస్ అండ్ ట్రేడింగ్, హైడ్రైవ్ డెవలపర్స్ అండ్ ఇండస్ట్రీస్‌లను విలీనం చేసుకునేందుకు ఎన్ఎస్ఈ, బీఎస్ఈ అనుమతించినట్లు జేకే లక్ష్మీ సిమెంట్ పేర్కొంది. ఒకే కంపెనీగా సిమెంట్, సిమెంట్ ప్రొడక్టులపై పూర్తిస్థాయిలో దృష్టి పెట్టేందుకు తాజా పునర్వ్యవస్థీకరణ సహకరించనున్నట్లు తెలియజేసింది. విలీనంలో భాగంగా ఉదయ్‌పూర్ సిమెంట్ వర్క్స్ వాటాదారులకు తమవద్ద గల ప్రతీ 100 షేర్లకుగాను 4 జేకే లక్ష్మీ సిమెంట్ షేర్లు జారీకానున్నాయి. గతేడాది(2023-24)కల్లా కంపెనీ సిమెంట్ తయారీ ఉమ్మడి సామర్థ్యం ఏడాదికి 10.6 మిలియన్ టన్నులు(ఎంటీపీఏ)గా నమోదైంది. 2030కల్లా సామర్థ్యాన్ని 30 ఎంటపీఏకు పెంచుకునే ప్రణాళికల్లో ఉంది.

ఎన్ఎస్ఈలో జేకే లక్ష్మీ సిమెంట్ షేరు యథాతథంగా రూ. 835 వద్ద ముగిసింది.

సియారాలో 200 కొలువులు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అమెరికా కేంద్రంగా కస్టమర్ ఎక్స్‌పీరియన్స్ సాఫ్ట్‌వేర్ సేవలు అందించే సియారా సంస్థ తాజాగా హైదరాబాద్‌లో తమ గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఇందులో ప్రాథమికంగా 200 మందిని రిక్రూట్ చేసుకుంటున్నామని, దీన్ని క్రమంగా 500కు పెంచుకుంటామని సంస్థ సీఈవో రిషి రాణా తెలిపారు. ప్రస్తుతం తమకు 11 ప్రోడక్టులు ఉన్నాయని .. మైక్రోసాఫ్ట్, గూగుల్ వంటి దిగ్గజ క్లయింట్లకు సేవలు అందిస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

(అ)సాధారణ బీమా



- హెల్త్ ప్లాన్లపై పన్ను ఉపశమనం సానుకూలం
- మోటార్ థర్డ్ పార్టీ రేట్ల సవరణ
- పరిశ్రమ వర్గాల అంచనా

కోల్‌కతా: సాధారణ బీమా (జీవిత బీమా కాకుండా) రంగం ఈ ఏడాది రెండంకెల వృద్ధిని చూడనుంది. నియంత్రణపరమైన అనుకూల వాతావరణానికి తోడు, వినూత్నమైన ఉత్పత్తుల ఆవిష్కరణ వృద్ధిని నడిపిస్తుందని పరిశ్రమ అంచనా వేస్తోంది. హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంపై జీఎస్టీ మినహాయింపు కల్పించడం, మోటార్ ఇన్సూరెన్స్ థర్డ్ పార్టీ ప్రీమియం రేట్ల సమీక్ష నిర్ణయాలు తమకు అనుకూలిస్తాయని భావిస్తోంది. ''హెల్త్ ఇన్సూరెన్స్ రానున్న సంవత్సరాల్లోనూ వృద్ధిని నడిపించనుంది. నాన్ మోటార్, పెట్ ఇన్సూరెన్స్, లయబిలిటీ, ప్రొఫెషనల్ ఇండెమ్నిటీ, హౌసింగ్ ఇన్సూరెన్స్ వంటి నాన్ హెల్త్ విభాగాల్లోనూ బీమా వ్యాప్తి గణనీయంగా పెరగనుంది''అని ఫ్యూచర్ జనరాలి ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ ఎండీ, సీఈవో అనూప్ రావు తెలిపారు. 14 శాతం మేర వృద్ధిని పరిశ్రమ అంచనా వేస్తున్నట్టు చెప్పారు. జీఎస్టీ, మోటార్ థర్డ్ పార్టీ రేట్ల విషయంలో పరిశ్రమకు సహకారం అవసరమన్నారు. ''హెల్త్ ఇన్సూరెన్స్‌పై జీఎస్టీని తొలగిస్తే వాటి ధరలు మరింత అందుబాటులోకి వస్తాయి. దీంతో ఎక్కువ మందికి బీమా చేరువ అవుతుంది. దీనివల్ల ప్రజారోగ్యంపై ప్రభుత్వానికి భారం తగ్గుతుంది. మోటార్ థర్డ్ పార్టీ ప్రీమియం రేట్లు ఐదేళ్లుగా ఎలాంటి మార్పులకు నోచుకోలేదు. వీటిని తక్షణమే సవరించాల్సి ఉంది''అని రావు వివరించారు. వ్యయాలను తగ్గించుకుని, అత్యవసర బీమా ఉత్పత్తులను అందరికీ చేరువ చేసేందుకు డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ)ను వినియోగించుకోవాల్సి ఉందన్నారు. బీమా సుగం, బీమా విస్తార్, బీమా వాహక్స్ చర్యలు ఇందుకు వీలు కల్పిస్తాయన్నారు.

అందరికీ అందుబాటు..

బీమాను అందుబాటు ధరలకు తీసుకురావాల్సిన అవసరాన్ని హెచ్‌డీఎఫ్‌సీ ఎర్గో జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవో అనుజ్ త్యాగి ప్రస్తావించారు. ''ఉత్పత్తుల అభివృద్ధి, అండర్ రైటింగ్, కస్టమర్ సేవల్లో నూతనత్వం అన్నది బీమాను పౌరులకు మరింత చేరువ చేస్తుంది''అని చెప్పారు. బీమా పరిశ్రమ పరిమాణాత్మక మార్పు వైపు అడుగులు వేస్తోందని బజాజ్ అలియాంజ్ జనరల్ ఇన్సూరెన్స్ ఎండీ, సీఈవో తపన్ సింఘాల్ పేర్కొన్నారు. డిజిటల్ ఆవిష్కరణల ద్వారా వ్యక్తిగత అవసరాలకు అనుగుణమైన బీమా ఉత్పత్తులను అందించడాన్ని ప్రస్తావించారు. విపత్తుల నిర్వహణకు సంబంధించి పారామెట్రిక్ ఇన్సూరెన్స్‌తోపాటు సైబర్ ఇన్సూరెన్స్ సైతం ప్రాముఖ్యతను సంతరించుకోనున్నట్టు చెప్పారు.

పెట్రోల్, డీజిల్‌కు అధిక డిమాండ్


- డిసెంబర్‌లో పెరిగిన వినియోగం
- పెట్రోల్ అమ్మకాలు 10% అధికం



న్యూఢిల్లీ: పెట్రోల్, డీజిల్ వినియోగం డిసెంబర్ నెలలో గణనీయంగా పెరిగింది. క్రితం ఏడాది ఇదే నెలలోని వినియోగంతో పోల్చి చూస్తే, పెట్రోల్ అమ్మకాలు (ప్రభుత్వరంగ సంస్థల) 10 శాతం పెరిగి 2.99 మిలియన్ టన్నులుగా ఉన్నాయి. ప్రభుత్వరంగ ఆయిల్ కంపెనీలు బీపీసీఎల్, ఐవోసీఎల్, హెచ్‌పీసీఎల్ ద్వారా 90 శాతం ఇంధన విక్రయాలు నడుస్తుంటాయి. క్రితం ఏడాది డిసెంబర్ నెలలో పెట్రోల్ అమ్మకాలు 2.72 మిలియన్ టన్నులుగా ఉన్నాయి. డీజిల్ అమ్మకాలు సైతం 4.9 శాతం పెరిగి 7.07 మిలియన్ టన్నులకు చేరాయి. నవంబర్ నెలలోనూ పెట్రోల్, డీజిల్ వినియోగం క్రితం ఏడాది ఇదే నెల గణాంకాలతో పోల్చి చూసినప్పుడు 8.3 శాతం, 5.9 శాతం చొప్పున పెరగడం గమనార్హం. వరుసగా రెండో నెలలోనూ వృద్ధి నమోదైంది. డిసెంబర్‌లో క్రిస్మస్ సెలవుల సందర్భంగా పర్యటనలు పెరగడం, ఖరీఫ్ సాగు సందర్భంగా యంత్రాలకు ఇంధన వినియోగం పెరగడం వినియోగంలో వృద్ధికి దారితీసింది. ఇక ఈ ఏడాది నవంబర్ నెల విక్రయాలతో పోల్చి చూస్తే డిసెంబర్‌లో పెట్రోల్ అమ్మకాలు 3.6 శాతం, డీజిల్ అమ్మకాలు 1.7 శాతం చొప్పున తక్కువగా ఉండడం గమనార్హం. దేశ ఇంధన మార్కెట్లో 40 శాతం డీజిల్ రూపంలోనే వినియోగం అవుతుంటుంది. ముఖ్యంగా 70 శాతం డీజిల్‌ను రవాణా రంగం వినియోగిస్తుంటుంది. ఆ తర్వాత వ్యవసాయ రంగంలో డీజిల్ వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఇక విమానయాన ఇంధనం (ఏటీఎఫ్) అమ్మకాలు డిసెంబర్ నెలలో క్రితం ఏడాది ఇదే నెలతో పోలిస్తే 6.8 శాతం పెరిగి 6,96,400 టన్నులుగా ఉన్నాయి. వంటగ్యాస్ (ఎల్‌పీజీ) వినియోగం 5 శాతానికి పైగా పెరిగి 2.87 మిలియన్ టన్నులకు చేరింది.

పటిష్ట స్థితిలో భారత్ ..

మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా



న్యూఢిల్లీ: సైనిక శక్తి, రాజకీయ సుస్థిరత, బలమైన ప్రజాస్వామ్యం తదితర అంశాల దన్నుతో అంతర్జాతీయంగా భారత్ పటిష్టమైన స్థితిలో ఉందని మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా తెలిపారు. అవకాశాలను అందిపుచ్చుకుని, మరింతగా ఎదిగే సత్తా దేశానికి ఉందని పేర్కొన్నారు. అంతర్జాతీయంగా వివిధ దేశాల మధ్య భాగస్వామ్యాల్లో చోటుచేసుకుంటున్న మార్పులు, అనిశ్చితులను.. భారత్ అవకాశాలుగా మల్చుకోవచ్చని మహీంద్రా చెప్పారు. ప్రపంచ సరఫరా వ్యవస్థలో కీలక భాగంగా మారొచ్చని నూతన సంవత్సరం సందర్భంగా ఉద్యోగులకు ఇచ్చిన సందేశంలో ఆయన పేర్కొన్నారు. అంతర్జాతీయంగా నెలకొన్న అస్థిరత ప్రభావం ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌పై తక్కువగా ఉంటుందని మహీంద్రా తెలిపారు. తమ గ్రూప్ అధిగమించిన కీలక మైలురాళ్లను ప్రస్తావిస్తూ .. అత్యంత విలువైన వాహనాల తయారీ దిగ్గజంగా ప్రపంచంలోనే 11వ స్థానానికి చేరడం, ఎలక్ట్రిక్ వాహనాలు అంచనాలకు మించి విజయవంతం కావడం గర్వించతగ్గ విషయాలని ఆయన పేర్కొన్నారు. గ్రూప్‌లోని ఇతర కంపెనీల పనితీరును కూడా ప్రశంసించారు. ఆకాంక్షలను సాకారం చేసుకోగలమనే స్ఫూర్తితో భవిష్యత్తుపై ఆశావహంగా ఉండాలని సూచించారు.

ఐపీవో బాటలో ఏవన్ స్టీల్స్

సెబీకి ప్రాస్పెక్టస్ దాఖలు



న్యూఢిల్లీ: స్టీల్ తయారీలో సమీకృత కార్యకలాపాలు గల ఏవన్ స్టీల్స్ ఇండియా పబ్లిక్ ఇష్యూ బాట పట్టింది. ఇందుకు అనుగుణంగా క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను దాఖలు చేసింది. వీటి ప్రకారం ఐపీవోకింద రూ. 600 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. మరో రూ. 50 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్లు సందీప్ కుమార్, సునీల్ జలాన్, క్రిషన్ కుమార్ జలన్ ఆఫర్ చేయనున్నారు. తద్వారా మొత్తం రూ. 650 కోట్లు అందుకునే యోచనలో కంపెనీ ఉంది. ప్రస్తుతం కంపెనీలో ప్రమోటర్ల వాటా 85.56 శాతంగా నమోదైంది. ఈక్విటీ జారీ నిధులను అనుబంధ సంస్థ వినయ స్టీల్స్‌లో పెట్టుబడులకు వినియోగించనుంది. దీనిలో భాగంగా విస్తరణకు వీలైన మెషీనరీ కొనుగోలు, సొంత అవసరాల కోసం సోలార్ ఎనర్జీని సమకూర్చుకోవడం తదితరాలు చేపట్టనుంది. అంతేకాకుండా మరికొన్ని నిధులను రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది.

ఆంధ్రప్రదేశ్‌లోనూ

బెంగళూరు కంపెనీ ఏవన్ స్టీల్స్ ఇండియా విభిన్న ప్రొడక్టుల పోర్ట్‌ఫోలియోను కలిగి ఉంది. ముడిస్టీల్ సామర్థ్యంరీత్యా దక్షిణాదిలోని టాప్-5 కంపెనీలలో ఒకటిగా నిలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లోగల యూనిట్‌తోపాటు కర్ణాటకలో మరో 5 ప్లాంట్లను నిర్వహిస్తోంది. ప్రధానంగా స్టీల్ తయారీలో వినియోగించే లాంగ్, ఫ్లాట్ స్టీల్ ప్రొడక్టులుసహా ఇండస్ట్రియల్ ప్రొడక్టులను తయారు చేస్తోంది. 2024 జూన్30కల్లా వార్షికంగా 14.97 లక్షల మెట్రిక్ టన్నుల ఫినిష్డ్ ప్రొడక్టుల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఎంఎస్‌పీ స్టీల్ అండ్ పవర్, బాలాజీ ఇండస్ట్రీస్, శ్యామ్ మెటాలిక్స్ అండ్ ఎనర్జీతో పోటీ పడుతోంది.

దూసుకొస్తున్న దిగ్గజాలు

ఈ టూవీలర్స్ అమ్మకాల్లో ఆధిపత్యం

డిసెంబర్‌లో తొలి స్థానానికి బజాజ్ చేతక్ ● మూడో స్థానంలోకి ఓలా



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన రంగంలో డిసెంబర్ నెలలో బజాజ్ చేతక్ తొలి స్థానంలోకి దూసుకొచ్చింది. గత నెలలో 18,276 యూనిట్లతో బజాజ్ ఆటో 25 శాతం మార్కెట్ వాటాను దక్కించుకుంది. 2020 జనవరిలో ఎలక్ట్రిక్ చేతక్ ద్వారా స్కూటర్స్ రంగంలోకి బజాజ్ రీ-ఎంట్రీ ఇచ్చిన తర్వాత.. ఈ-టూ వీలర్స్ విభాగంలో దేశంలో ఒక నెల అమ్మకాల్లో తొలి స్థానాన్ని కైవసం చేసుకోవడం సంస్థకు ఇదే తొలిసారి. డిసెంబర్ నెలలో 17,212 యూనిట్లతో టీవీఎస్ మోటార్ కంపెనీ రెండవ స్థానంలో నిలిచింది. నవంబర్ వరకు తొలి స్థానంలో కొనసాగిన ఓలా ఎలక్ట్రిక్ గత నెలలో అతి తక్కువగా 13,769 యూనిట్లతో 19 శాతం వాటాతో మూడవ స్థానానికి పరిమితమైంది. 2024లో కంపెనీకి అతి తక్కువ విక్రయాలు నమోదైంది డిసెంబర్ నెలలోనే కావడం గమనార్హం. అక్టోబర్‌లో 41,817 యూనిట్ల అమ్మకాలు సాధించిన ఓలా ఎలక్ట్రిక్ నవంబర్‌లో 29,252 యూనిట్లను నమోదు చేసింది. హోండా ఎలక్ట్రిక్ టూ వీలర్లు రోడ్డెక్కితే ఈ ఏడాది మార్కెట్ మరింత రసవత్తరంగా మారడం ఖాయంగా కనపడుతోంది. సంప్రదాయ ఇంటర్నల్ కంబషన్ ఇంజన్ (ఐసీఈ) ఆధారిత టూవీలర్ రంగాన్ని ఏలుతున్న దిగ్గజాలే ఎలక్ట్రిక్ విభాగాన్ని శాసిస్తాయనడంలో అతిశయోక్తి లేదు. ప్రతి నెల నమోదవుతున్న అమ్మకాలే ఇందుకు నిదర్శనం.


పోటీలో నువ్వా నేనా..

రెండవ స్థానంలో ఉన్న టీవీఎస్ మోటార్ కంపెనీతో నువ్వా నేనా అన్నట్టు పోటీపడుతూ.. 2024 సెప్టెంబర్‌లో 19,213 యూనిట్లతో తొలిసారిగా బజాజ్ ఆటో రెండవ స్థానాన్ని పొంది టీవీఎస్‌ను మూడవ స్థానానిని నెట్టింది. అక్టోబర్, నవంబర్‌లో టీవీఎస్‌కు గట్టి పోటీ ఇచ్చిన బజాజ్ ఆటో మూడవ స్థానానికి పరిమితమైంది. ఇక 2020 జనవరి నుంచి 2023 నవంబర్ వరకు బజాజ్ ఆటో మొత్తం 1,04,200 యూనిట్ల అమ్మకాలను సాధించింది. తొలి లక్ష యూనిట్లకు కంపెనీకి 47 నెలల సమయం పట్టింది. 2024లో ఏకంగా 2 లక్షల యూనిట్ల విక్రయాలకు చేరువైంది. గతేడాది సంస్థ మొత్తం 1,93,439 యూనిట్ల అమ్మకాలతో భారత ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహన రంగంలో మూడవ స్థానంలో ఉంది. ఓలా ఎలక్ట్రిక్ 4,07,547 యూనిట్లతో మొదటి, టీవీఎస్ మోటార్ కో 2,20,472 యూనిట్లతో రెండవ స్థానంలో నిలిచాయి.

రెండింటిలో ఒకటి ఈవీ..

భారత త్రిచక్ర వాహన రంగంలో ఎలక్ట్రిక్ త్రీవీలర్లు దూకుడుమీదున్నాయి. భారత ఈవీ రంగంలో టూవీలర్ల తర్వాత త్రీవీలర్లు రెండవ స్థానంలో నిలిచాయి. 2024లో దేశవ్యాప్తంగా మొత్తం 6,91,011 యూనిట్ల ఈ-త్రీవీలర్స్ రోడ్డెక్కాయి. భారత్‌లో గతేడాది ఎలక్ట్రిక్, ఐసీఈ, సీఎన్‌జీ, ఎల్‌పీజీ విభాగాల్లో కలిపి మొత్తం 12,20,925 యూనిట్ల త్రిచక్ర వాహనాలు అమ్ముడయ్యాయి. ఇందులో ఎలక్ట్రిక్ వాటా ఏకంగా 56 శాతం ఉంది. అంటే అమ్ముడవుతున్న ప్రతి రెండింటిలో ఒకటి ఎలక్ట్రిక్ కావడం విశేషం. ఈ-త్రీవీలర్స్‌లో నాయకత్వ స్థానాన్ని కొనసాగిస్తున్న మహీంద్రా లాస్ట్ మైల్ మొబిలిటీ 10 శాతం వాటా సాధించింది. వేగంగా దూసుకొచ్చిన బజాజ్ ఆటో 6 శాతం వాటాతో మూడవ స్థానాన్ని కైవసం చేసుకుంది. 2023లో అమ్ముడైన 5,83,697 యూనిట్ల ఎలక్ట్రిక్ త్రీవీలర్లతో పోలిస్తే 2024 విక్రయాల్లో 18 శాతం వృద్ధి నమోదైంది. 2023లో సగటున ఒక నెలలో 48,633 యూనిట్లు కస్టమర్ల చేతుల్లోకి వెళితే గతేడాది ఈ సంఖ్య నెలకు 57,584 యూనిట్లకు ఎగసింది. ఐసీఈ, సీఎన్‌జీ, ఎల్‌పీజీ ఆప్షన్స్‌తో పోలిస్తే నిర్వహణ వ్యయాలు తక్కువగా ఉండడం వల్లే ఎలక్ట్రిక్ త్రీ-వీలర్లకు డిమాండ్ పెరుగుతోంది. మెరుగైన రుణ లభ్యత, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, అందుబాటులోకి విభిన్న మోడళ్లు, సరుకు రవాణాకై లాజిస్టిక్స్ కంపెనీల నుంచి డిమాండ్ ఇందుకు మరింత ఆజ్యం పోస్తోంది. త్రీవీలర్స్‌లో సీఎన్‌జీ విభాగానికి 28 శాతం వాటా కాగా, డీజిల్‌కు 11, ఎల్‌పీజీ 3, పెట్రోల్‌కు ఒక శాతం వాటా ఉంది.

జీ ఎంటర్‌టైన్‌మెంట్‌కు మళ్లీ సెబీ షోకాజ్ నోటీసులు



న్యూఢిల్లీ: లిస్టింగ్ నిబంధనల ఉల్లంఘన ఆరోపణల కింద మీడియా దిగ్గజం జీ ఎంటర్‌టైన్‌మెంట్ ఎంటర్‌ప్రైజెస్ (జీల్) వ్యవస్థాపకుడు సుభాష్ చంద్ర, ఆయన కుమారుడు పునీత్ గోయెంకాలతో పాటు కంపెనీపై విచారణ కొనసాగుతుందని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ స్పష్టం చేసింది. వారికి కొత్తగా షోకాజ్ నోటీసు (ఎస్‌సీఎన్) జారీ చేయనున్నట్లు పేర్కొంది. గత నోటీసులో పొందుపర్చిన అంశాలన్నీ తాజా ఎస్‌సీఎన్‌లో కూడా ఉంటాయని తెలిపింది. కీలక వివరాల వెల్లడి నిబంధనలను ఉల్లంఘించిన ఆరోపణల కింద జీల్‌తో పాటు సంస్థ టాప్ మేనేజ్‌మెంట్‌పై సెబీ విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. ఇదే క్రమంలో 2022 జూలైలో తొలుత షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీంతో జీల్, పునీత్ గోయెంకా వివాద సెటిల్మెంట్ కోసం సెబీకి దరఖాస్తు చేసుకున్నారు. కానీ సెబీ హోల్-టైమ్ సభ్యుల కమిటీ దాన్ని తిరస్కరించి, తదుపరి విచారణకు సిఫార్సు చేశారు.

రిలయన్స్ నేవల్ పేరు మార్పు

న్యూఢిల్లీ: రిలయన్స్ నేవల్ అండ్ ఇంజినీరింగ్ సంస్థ పేరు స్వాన్ డిఫెన్స్ అండ్ హెవీ ఇండస్ట్రీస్‌గా మారింది. జనవరి 2 నుంచి ఇది అమల్లోకి వచ్చిందని స్టాక్ ఎక్స్ఛేంజీలకు సంస్థ సమాచారమిచ్చింది. దివాలా పరిష్కార ప్రక్రియ కింద రిలయన్స్ నేవల్ అండ్ ఇంజినీరింగ్‌ను స్వాన్ ఎనర్జీ దక్కించుకుంది.

‘జట్టులో అంతా బాగుంది’


గిల్, గంభీర్, రోహిత్

ఆటగాళ్లతో చర్చలు సహజం ● భారత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ వివరణ

సిడ్నీ: భారత క్రికెట్ జట్టు డ్రెస్సింగ్ రూమ్‌లో విభేదాల గురించి వార్తలపై స్పందించేందుకు హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ నిరాకరించాడు. టీమ్‌లో ఆటగాళ్ల మధ్య చర్చలు సహజమేనని, అవి ఎంత నిజాయితీగా సాగితే అంత మంచి ఫలితాలు వస్తాయని అతను వ్యాఖ్యానించాడు. ‘బోర్డర్–గావస్కర్ ట్రోఫీ’లో భాగంగా మెల్‌బోర్న్‌లో జరిగిన నాలుగో టెస్టులో పరాజయంతో సిరీస్‌లో భారత్ 1–2తో వెనుకబడింది. ఈ ఓటమి తర్వాత టీమిండియా సభ్యుల మధ్య సంబంధాలు చెడిపోయాయని... ఒకరి లోపాల గురించి మరొకరు మాట్లాడుతున్నారని వార్తలు వచ్చాయి. ‘ఇలాంటి వాటికి సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందని నేను అనుకోవడం లేదు. అయితే డ్రెస్సింగ్ రూమ్‌లో అందరూ నిజాయితీగా తమ అభిప్రాయాలు చెప్పారనేది మాత్రం వాస్తవం. ముమ్ముందు ఏదైనా సాధించాలంటే నిజాయితీ చాలా ముఖ్యమని నా నమ్మకం’ అని గంభీర్ అభిప్రాయపడ్డాడు. ప్రస్తుతం సిరీస్‌లో తాము 1–2తో వెనుకబడటం అనేది మరీ తీవ్రమైన విషయం కాదని... ఈ సిరీస్‌కు ముందే ఎవరైనా ఇదే చెబితే తనకు నమ్మకం కలగకపోయేదని అతను అన్నాడు. ‘దాదాపు నెలన్నర క్రితం మేం ఇలాంటి స్థితిలో ఉండబోతున్నామని, మరో మ్యాచ్ గెలిచి సిరీస్ ‘డ్రా’ చేయగలమని ఎవరైనా చెబితే ఆశ్చర్యపడేవాడిని. నిజానికి మేం మెరుగైన పరిస్థితిలోనే ఉన్నాం. ఇంకా ఏదీ మా చేయిదాటిపోలేదు. సిడ్నీలో టెస్టు గెలవగలమని పూర్తి నమ్మకంతో ఉన్నాం. మా జట్టు బ్యాటింగ్ బాగా లేదని గానీ బౌలింగ్ బాగా లేదని గానీ ఎవరైనా అంటే అర్థం లేదు. ఆ రెండూ బాగా లేకపోతే ఒక టెస్టు గెలిచి 1–2తో నిలవగలిగేవాళ్లం కాదు. ఇంతకంటే ఘోరమైన పరిస్థితిలో ఉండేవాళ్లం. కానీ అలా జరగలేదు’ అని గంభీర్ చెప్పాడు. భారత జట్టులో అత్యంత ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉన్నారని, ఈ టెస్టు గెలిచేందుకు అది సరిపోతుందన్న గంభీర్... ఇక్కడ మాత్రమే కాదు రాబోయే రోజుల్లోనూ మరిన్ని సంచలన ఫలితాలు సాధిస్తామని విశ్వాసం వ్యక్తం చేశాడు. మొత్తం జట్టు కోణంలో తమ ప్రదర్శన గురించి మాట్లాడుతున్నానని, వ్యక్తిగతంగా ఎవరినో తప్పు పట్టడం తన పద్ధతి కాదని గంభీర్ స్పష్టం చేశాడు. ‘జట్టులో ప్రతీ ఒక్కరికి తమ బాధ్యతలు ఏమిటో బాగా తెలుసు. నేను ఏ ఒక్కరి గురించో వ్యక్తిగతంగా మాట్లాడటం లేదు. మేం జట్టుగా గెలుస్తాం. జట్టుగా ఓడతాం. దేశం తరఫున ఆడుతున్నప్పుడు అంతా తమవంతు పాత్ర పోషిస్తారు. అది అన్నింటికంటే ముఖ్యం. ఇది ఒక ఆటగాడు, కోచ్ మధ్యలో జరిగే చర్చ కాదు. ఈ విషయం వారిద్దరి మధ్యే ఉండాలి తప్ప బయట ఎవరికీ తెలియకూడదు. బయటి వ్యక్తులు ఫలితాలు మాత్రమే చూడాలి. అయితే ఇద్దరి మధ్య జరిగే సంవాదం డ్రెస్సింగ్ రూమ్‌కే పరిమితం కావాలి’ అని భారత కోచ్ వివరించాడు. టీమ్ స్పోర్ట్స్‌లో వ్యక్తిగత ఇష్టాఇష్టాలకు చోటు ఉండదని, అంతా జట్టు కోణంలోనే సాగుతుందని గంభీర్ వివరించాడు. ‘ఎవరైనా ముందుగా జట్టుకే ప్రాధాన్యతనివ్వాలి. టీమ్ స్పోర్ట్‌లో జట్టుకు ఏది అవసరమో దాని ప్రకారమే ఆడాలి. కొందరు తమ సహజసిద్ధమైన ఆటతీరు కనబరుస్తారు. అయితే నీ శైలిలో కూడా జట్టు కోసమే ఆడాలి. ఏ ఒక్కరి గురించో నేను మాట్లాడటం లేదు. ప్రతీ ఒక్కరికి తమ పరిస్థితి ఏమిటో బాగా తెలుసు’ అని హెడ్ కోచ్ తన ఉద్దేశాన్ని వెల్లడించాడు. ఫలితాలపరంగా ఎలాంటి ఎత్తుపల్లాలు చవిచూసినా భారత క్రికెట్ జట్టు ఎప్పుడూ బలంగానే ఉంటుందని గంభీర్ అభిప్రాయం వ్యక్తం చేశాడు. ‘నిజాయితీ గల వ్యక్తులు పని చేస్తున్నంత కాలం భారత జట్టు ఎప్పుడూ బలంగానే ఉంటుంది. సంధి కాలంలో ఇదే కీలక అంశం. సీనియర్లను పక్కన పెట్టి కుర్రాళ్లను ముందుకు తీసుకురావడం దీనర్థం కాదు. నీ ప్రదర్శన మాత్రమే నీకు డ్రెస్సింగ్ రూమ్‌లో చోటు కల్పిస్తుంది. ఆటగాళ్లకు మాత్రమే కాదు ఇది కోచ్‌లకు కూడా వర్తిస్తుంది’ అని గౌతమ్ గంభీర్ అన్నాడు.

రిత్విక్ జోడీ ఓటమి



బ్రిస్బేన్: కొత్త ఏడాదిలో తాను పాల్గొన్న తొలి టోర్నీలో భారత డబుల్స్ టెన్నిస్ ప్లేయర్, హైదరాబాద్‌కు చెందిన బొల్లిపల్లి రిత్విక్ చౌదరీ ప్రిక్వార్టర్ ఫైనల్ దాటలేకపోయాడు. బ్రిస్బేన్ ఇంటర్నేషనల్ ఏటీపీ–250 టోర్నీలో రిత్విక్ (భారత్)–రాబిన్ హాస్ (నెదర్లాండ్స్) ద్వయం ప్రిక్వార్టర్ ఫైనల్లో 4–6, 2–6తో రింకీ హిజికాటా–జేసన్ కుబ్లెర్ (ఆస్ట్రేలియా) జోడీ చేతిలో ఓడిపోయింది. 65 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో ఇండో–డచ్ జంట ఐదు ఏస్‌లు సంధించింది. తమ సర్వీస్‌ను మూడుసార్లు కోల్పోయింది. తొలి రౌండ్‌లో రిత్విక్–రాబిన్ హాస్ 7–6 (7/4), 3–6, 10–6తో గొంజాలో ఎస్కోబార్ (ఈక్వెడార్)–జాన్ ప్యాట్రిక్ స్మిత్ (ఆస్ట్రేలియా)లపై గెలిచారు. ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిన రిత్విక్–రాబిన్ హాస్‌లకు 2,980 డాలర్ల (రూ. 2 లక్షల 55 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 20 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.



సహజ సంచలనం

సాక్షి, హైదరాబాద్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ75 టోర్నమెంట్‌లో తెలంగాణ క్రీడాకారిణి సహజ యామలపల్లి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. థాయ్‌లాండ్‌లోని నొంతాబురి పట్టణంలో ఈ టోర్నీ జరుగుతోంది. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో సహజ 5–7, 6–0, 6–2తో మూడో సీడ్ హీన్ షి (చైనా)పై సంచలన విజయం సాధించింది. 2 గంటల 25 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ తన ప్రత్యర్థి సర్వీస్‌ను ఎనిమిదిసార్లు బ్రేక్ చేసి, తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయింది. తొలి రౌండ్‌లో సహజ 6–3, 6–4తో కమోన్‌వన్ యోద్‌పెచ్ (థాయ్‌లాండ్)పై గెలిచింది.

అండర్–9 జాతీయ చెస్ విజేత నిధీశ్

దివిత్ రెడ్డికి మూడో స్థానం



నిధీశ్ శ్యామల్


దివిత్

పుణే: జాతీయ అండర్–9 చెస్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ చిన్నారులు నిధీశ్ శ్యామల్, అదుళ్ల దివిత్ రెడ్డి అదరగొట్టారు. గురువారం ముగిసిన ఈ టోర్నీలో ఓపెన్ విభాగంలో నిధీశ్ చాంపియన్‌గా అవతరించగా... దివిత్ రెడ్డి మూడో స్థానాన్ని సంపాదించాడు. నిర్ణీత 11 రౌండ్లపాటు జరిగిన ఈ టోర్నీలో నిధీశ్, ఆరిత్ కపిల్ (ఢిల్లీ) 9.5 పాయింట్లతో సంయుక్తంగా అగ్రస్థానంలో నిలిచారు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా... నిధీశ్‌కు టైటిల్ ఖరారైంది. ఆరిత్ రన్నరప్‌గా నిలిచాడు. 9 పాయింట్లతో దివిత్ రెడ్డి మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. గత ఏడాది వరల్డ్ క్యాడెట్ అండర్–8 చాంపియన్‌షిప్‌లో దివిత్ రెడ్డి స్వర్ణ పతకం గెలిచాడు. విజేతగా నిలిచిన నిధీశ్‌కు విన్నర్స్ ట్రోఫీతోపాటు రూ. 50 వేలు ప్రైజ్‌మనీ లభించింది. హైదరాబాద్‌లోని మ్యాస్ట్రో చెస్ అకాడమీలో క్యాండిడేట్ మాస్టర్ (సీఎం) అమిత్ పాల్ సింగ్ వద్ద నిధీశ్ శిక్షణ తీసుకుంటున్నాడు. జాతీయ చాంపియన్ హోదాలో నిధీశ్ ఈ ఏడాది జరిగే ప్రపంచ, ఆసియా అండర్–9 చాంపియన్‌షిప్‌లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తాడు.

లంక పర్యటనకు కమిన్స్ దూరం

సిడ్నీ: ఆస్ట్రేలియా రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ శ్రీలంక పర్యటనకు దూరం కానున్నాడు. అతని భార్య రెండో కాన్పు సమయంలోనే ఆ టూర్ ఉండటంతో ద్వైపాక్షిక సిరీస్ నుంచి తప్పుకునే అవకాశముందని చెప్పాడు. గతేడాది భారత్ పర్యటనలో ఉండగా కమిన్స్ మాతృమూర్తి మృతి చెందడంతో టూర్ మధ్యలోనే అతను తిరుగుముఖం పట్టాడు.



అప్పటి నుంచి తన జీవితంలో కుటుంబ ప్రాధామ్యాలు మారాయని కమిన్స్ చెప్పుకొచ్చాడు. కెరీర్‌తో పాటు వ్యక్తిగత జీవితానికి తగిన ప్రాధాన్యత ఇచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పాడు. ఈ నెలాఖర్లో లంక పర్యటనకు బయలుదేరనున్న ఆసీస్ అక్కడ రెండు టెస్టుల సిరీస్‌లో పాల్గొంటుంది. వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో ఫైనల్ చేరే రెండో జట్టు ఈ సిరీస్ ఫలితంతోనే ఖరారవుతుంది. జనవరి 29 నుంచి తొలి టెస్టు, ఫిబ్రవరి 6 నుంచి రెండో టెస్టు జరగనున్నాయి. కమిన్స్ గైర్హాజరీలోని ఆస్ట్రేలియాకు అనుభవజ్ఞుడైన స్టీవ్ స్మిత్ లేదంటే హార్డ్ హిట్టింగ్ బ్యాటర్ ట్రావిస్ హెడ్‌లలో ఒకరు నాయకత్వం వహించే అవకాశాలున్నాయి.

అదానీతో గుకేశ్ భేటీ



న్యూఢిల్లీ: టీనేజ్‌లోనే ప్రపంచ క్లాసికల్ చెస్ చాంపియన్‌గా నిలిచిన భారత గ్రాండ్‌మాస్టర్ దొమ్మరాజు గుకేశ్ గురువారం ప్రముఖ పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీతో భేటీ అయ్యాడు. తల్లిదండ్రులు పద్మావతి, డాక్టర్ రజనీకాంత్‌లతో కలిసి గుకేశ్ అహ్మదాబాద్‌లో అదానీని కలిశాడు. ‘ప్రపంచ చెస్ చాంపియన్‌ను ఇలా కలుసుకోవడం చాలా చాలా సంతోషంగా ఉంది. అతని విజయంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకం. అలాంటి వారితో నాకు ఈ భేటీ చాలా ప్రత్యేకమైంది. 18 ఏళ్ల భారత కుర్రాడు ప్రపంచ చెస్‌లో సత్తా చాటుకున్నాడు. మన యువతరానికి ప్రేరణగా నిలిచాడు. దశాబ్దాలపాటు చెస్‌లో భారత ఆధిపత్యం కొనసాగేందుకు గట్టి పునాది వేశాడు. అతని ఆత్మవిశ్వాసం, విజయం అద్భుతం. జై హింద్’ అని ‘ఎక్స్’లో గౌతమ్ అదానీ పోస్ట్ చేశారు. సింగపూర్‌లో ఇటీవల జరిగిన ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో గుకేశ్... చైనాకు చెందిన డిఫెండింగ్ చాంపియన్ డింగ్ లిరెన్‌ను ఓడించాడు. అప్పుడు సోషల్ మీడియా వేదికగా గుకేశ్‌ను అదానీ ప్రశంసించారు. అదానీకి చెందిన స్పోర్ట్స్ ఫౌండేషన్ భారత గ్రాండ్‌మాస్టర్స్ ప్రజ్ఞానంద, అతని సోదరి వైశాలిలను స్పాన్సర్ చేస్తోంది. 1985లో 22 ఏళ్ల వయసులో ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన గ్యారీ కాస్పరోవ్ రికార్డును తాజాగా గుకేశ్ చెరిపేశాడు. చెస్ ఒలింపియాడ్‌లోనూ భారత్ స్వర్ణం గెలిచేందుకు కీలకపాత్ర పోషించిన అతని ప్రదర్శనను గుర్తించిన భారత ప్రభుత్వం ‘మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న’ అవార్డుకు ఎంపిక చేసింది.

భారత్ 11 మాల్దీవులు 1

‘ఫిఫా’ ఫ్రెండ్లీ మ్యాచ్‌లో మహిళల జట్టు విజయం


లింగ్‌డైకిమ్

బెంగళూరు: అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) స్నేహపూర్వక మ్యాచ్‌లో మరోసారి భారత మహిళల జట్టు అదరగొట్టింది. తొలి పోరులో 14–0తో మాల్దీవులును చిత్తు చేసిన భారత్... గురువారం జరిగిన రెండో మ్యాచ్‌లో 11–1 గోల్స్ తేడాతో మట్టికరిపించింది. ఈ మ్యాచ్ ద్వారానే జాతీయ జట్టు తరఫున అరంగేట్రం చేసిన ఫార్వర్డ్ ప్లేయర్ లింగ్‌డైకిమ్ (12వ, 16వ, 56వ, 59వ నిమిషాల్లో) నాలుగు గోల్స్‌తో విజృంభించింది. సిమ్రన్ గురుంగ్ (62వ, 68వ నిమిషాల్లో) రెండు గోల్స్‌తో సత్తా చాటింది. మరో అరంగేట్ర ప్లేయర్ సిబాని దేవి (45+1వ నిమిషంలో)తో పాటు కాజల్ డిసౌజా (15వ ని.లో), పూజ (41వ ని.లో), భూమిక దేవి (71వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. మాల్దీవుల తరఫున మరియం రిఫా (27వ ని.లో) ఏకైక గోల్ సాధించగా... ఆ జట్టు కెప్టెన్ హనీఫా (17వ నిమిషంలో) సెల్ఫ్ గోల్ చేసి భారత్ ఆధిక్యాన్ని మరింత పెంచింది. తొలి అర్ధభాగం ముగిసేసరికి 6–1తో ఆధిక్యంలో నిలిచిన భారత జట్టు... ద్వితీయార్ధంలో కూడా అదే జోరు కొనసాగిస్తూ ప్రత్యర్థికి ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా తిరుగులేని విజయం సాధించింది.

అఫ్గానిస్తాన్ 157 ఆలౌట్

బులవాయో: అద్వితీయ బ్యాటింగ్‌తో జింబాబ్వేతో తొలి టెస్టును ‘డ్రా’ చేసుకున్న అఫ్గానిస్తాన్ జట్టు... రెండో టెస్టులో స్వల్ప స్కోరుకే ఆలౌటైంది. ఇరు జట్ల మధ్య గురువారం ప్రారంభమైన రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో అఫ్గానిస్తాన్ 44.3 ఓవర్లలో 157 పరుగులకు ఆలౌటైంది. రషీద్ ఖాన్ (20 బంతుల్లో 25; 4 ఫోర్లు) టాప్ స్కోరర్ కాగా... మిగిలిన వాళ్లలో ఏ ఒక్కరూ 20 పరుగుల మార్క్ దాటలేకపోయారు. కెప్టెన్ హష్మతుల్లా (13), రహమత్ షా (19), అబ్దుల్ మాలిక్ (17), రియాజ్ హసన్ (12), అఫ్సర్ (16), షహీదుల్లా (12), ఇస్మత్ ఆలమ్ (0) ఒకరి తర్వాత ఒకరు పెవిలియన్‌కు వరస కట్టారు. జింబాబ్వే బౌలర్లలో సికందర్ రజా, న్యూమన్ న్యామురి చెరో 3 వికెట్లు పడగొట్టారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన జింబాబ్వే 3 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 6 పరుగులు చేసింది. వర్షం కారణంగా మ్యాచ్ అర్ధాంతరంగా నిలిచిపోయింది. చేతిలో 10 వికెట్లు ఉన్న జింబాబ్వే ప్రత్యర్థి స్కోరుకు ఇంకా 151 పరుగులు వెనుకబడి ఉంది. జాయ్‌లార్డ్ గుంబీ (4 బ్యాటింగ్), బెన్ కరన్ (1 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.



కివీస్ చేజారిన క్లీన్‌స్వీప్

- చివరి టి20లో శ్రీలంక చేతిలో ఏడు పరుగులతో ఓటమి
- కుశాల్ పెరీరా శతకం
- 2–1తో సిరీస్ న్యూజిలాండ్ సొంతం

నెల్సన్ (న్యూజిలాండ్): కుశాల్ పెరీరా (46 బంతుల్లో 101; 13 ఫోర్లు, 4 సిక్స్‌లు) సెంచరీతో చెలరేగడంతో న్యూజిలాండ్ పర్యటనలో శ్రీలంకకు ఊరట విజయం దక్కింది. మూడు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో తొలి రెండు మ్యాచ్‌ల్లో గెలిచిన న్యూజిలాండ్ చివరి మ్యాచ్‌లో ఓడిపోవడంతో సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేయలేకపోయింది. గురువారం జరిగిన మూడో టి20లో శ్రీలంక చేతిలో ఏడు పరుగుల తేడాతో ఓడిన న్యూజిలాండ్ సిరీస్‌ను 2–1తో దక్కించుకుంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 218 పరుగులు చేసింది. శ్రీలంక తరఫున వేగవంతమైన (44 బంతుల్లో) అంతర్జాతీయ టి20 శతకంతో పెరీరా విజృంభించగా... కెప్టెన్ చరిత అసలంక (24 బంతుల్లో 46; 1 ఫోర్, 5 సిక్స్‌లు) భారీ షాట్లతో చెలరేగాడు. కివీస్ బౌలర్లలో హెన్రీ, డఫీ, ఫోక్స్, సాంట్నర్, మిచెల్ తలా ఒక వికెట్ పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో న్యూజిలాండ్ 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 211 పరుగులకు పరిమితమైంది. రచిన్ రవీంద్ర (39 బంతుల్లో 69; 5 ఫోర్లు, 4 సిక్స్‌లు), డారిల్ మిచెల్ (17 బంతుల్లో 35; 1 ఫోర్, 4 సిక్స్‌లు), టిమ్ రాబిన్‌సన్ (21 బంతుల్లో 37; 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) పోరాడినా ఫలితం లేకపోయింది. లంక బౌలర్లలో చరిత అసలంక 3, హసరంగ రెండు వికెట్లు తీశారు. కుశాల్ పెరీరాకు ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’... జాకబ్ డఫీకి ‘ప్లేయర్ ఆఫ్ ద సిరీస్’ అవార్డులు దక్కాయి. ఇరు జట్ల మధ్య ఆదివారం నుంచి వన్డే సిరీస్ ప్రారంభం కానుంది.


ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ పెరీరా

కాంబ్లీ... నేనే వచ్చి కలుస్తా!
త్వరగా కోలుకో!

మాజీ క్రికెటర్‌కు ధైర్యం చెప్పిన కపిల్‌దేవ్





ముంబై: భారత మాజీ క్రికెటర్ వినోద్ కాంబ్లీకి సాయమందించేందుకు సిద్ధమని ఇదివరకే ప్రకటించిన భారత దిగ్గజ ఆల్‌రౌండర్ కపిల్ దేవ్... అతనితో వీడియో కాల్‌లో ముచ్చటించారు. ఆకృతి హాస్పిటల్ డైరెక్టర్ శైలేశ్ ఠాకూర్ ఇద్దరి మధ్య వీడియో కాల్ చేయగా... కపిల్‌ను చూడగానే భావోద్వేగానికి గురైన కాంబ్లీ ‘కపిల్ పాజీ ఎలా ఉన్నారు మీరు’ అని పలకరించాడు. వెంటనే భారత లెజెండ్ ఒకప్పటి సహచరుడితో ‘నువ్విప్పుడు బాగా కుదుటపడ్డట్లు కనిపిస్తున్నావ్. పూర్తిగా కోలుకో. త్వరగా ఇంటికెళ్లే ఆతృత కనబరచకు. అవసరమైతే ఇంకొన్ని రోజులు ఆసుపత్రిలోనే ఉండి సంపూర్ణ చికిత్స పూర్తయ్యాకే వెళ్లు. డాక్టర్ల సూచనలు పాటించు. ఆరోగ్యం బాగా చూసుకో... నేనే వచ్చి నిన్ను కలుస్తా... లవ్ యూ’ అని కపిల్ వీడియో కాల్‌లో బదులిచ్చారు. కాల్ కలిపిన... కాంబ్లీకి అవసరమైన చికిత్స అందించిన డాక్టర్ శైలేశ్ ఠాకూర్‌కూ కపిల్ కృతజ్ఞతలు చెప్పారు. ‘మీ ప్రత్యేక చొరవ వల్లే కాంబ్లీ మళ్లీ కోలుకున్నాడు. థ్యాంక్యూ శైలేశ్’ అని కపిల్ అభినందించారు. వినోద్ కాంబ్లీ అంటే తనకెంతో అభిమానమని, అలాంటి అభిమాన క్రికెటర్ ఇలా అనారోగ్యానికి గురవడం బాధించిందని, అందుకే ప్రత్యేక శ్రద్ధతో స్పెషాలిటీ ట్రీట్‌మెంట్ అందించామని, ఈ ఖర్చులే కాదు భవిష్యత్తులో అతనికి అయ్యే ఆస్పత్రి ఖర్చులు పూర్తిగా భరించేందుకు మా హాస్పిటల్ సిద్ధంగా ఉందని ఆకృతి హాస్పిటల్ డైరెక్టర్ శైలేశ్ ఠాకూర్ చెప్పారు. గత నెల 21న కాంబ్లీ తీవ్రమైన మూత్రనాళ సంబంధిత అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరారు. ఐసీయూలో ఉంచి చికిత్స అందజేసిన ఆస్పత్రి వైద్యులు తదనంతర పరీక్షల్లో అతని మెదడు రక్తనాళాల్లో రక్తం గడ్డకడుతున్నట్లు గుర్తించి వెంటనే ప్రత్యేక న్యూరో చికిత్స అందజేయడంతో 52 ఏళ్ల కాంబ్లీ కోలుకున్నాడు. ఈ సందర్భంగా కాసేపు వైద్య సిబ్బందితో సరదాగా క్రికెట్ ఆడినట్లు వైద్య సిబ్బంది తెలిపింది.

బంగ్లాదేశ్ విముక్తిని ప్రకటించింది

ముజీబ్ కాదు.. జియా!

పాఠ్యాంశాల్లో మార్పునకు ఆపద్ధర్మ ప్రభుత్వం నిర్ణయం

ఢాకా: బంగ్లాదేశ్‌లోని యూనుస్ సారథ్యంలోని ఆపద్ధర్మ ప్రభుత్వం పదవీచ్యుత ప్రధాని షేక్ హసీనాకు వ్యతిరేకంగా మరిన్ని చర్యలకు ఉపక్రమించింది. ఆమె తండ్రి, బంగబంధు ముజిబుర్ రహ్మాన్‌కు ప్రాధాన్యం తగ్గిస్తూ పాఠ్యాంశాలను మార్చాలని నిర్ణయించింది. పాఠ్యాంశాల్లో చారిత్రక ఘటనలను అతిగా చూపడం, కొందరు వ్యక్తులను అనవసరంగా కీర్తించడం వంటి వాటిని పూర్తిగా తొలగించనుంది. వచ్చే విద్యా సంవత్సరం నాటికి ఒకటి నుంచి పదో తరగతి వరకు కొత్త సిలబస్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించనుంది. దీని ప్రకారం.. 1971లో బంగ్లాదేశ్‌కు స్వాతంత్ర్యాన్ని ప్రకటించింది బంగబంధుగా పిలిచే షేక్ ముజిబుర్ రహ్మాన్ కాదు..జియా ఉర్ రహ్మాన్ అని ఉంటుంది. ఆ సమయంలో బంగ్లాదేశ్ మిలటరీ అధికారిగా జియా పనిచేస్తున్నారు. అనంతర కాలంలో బంగ్లా ఆరో అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. బంగ్లాదేశ్ విముక్తిని ప్రకటించింది ముజీబుర్ రహ్మాన్ కాగా, ఆయన ఆదేశాల మేరకు జియా ఉర్ రహ్మాన్ ఆ ప్రకటనను చదివారనేది అవామీ లీగ్ మద్దతుదారుల వాదన. అయితే, జియా ఉర్ రహ్మానే స్వయంగా స్వతంత్ర ప్రకటనను తయారు చేసి, ప్రకటించారన్నది బీఎన్‌పీ వాదన. బీఎన్‌పీ చీఫ్‌గా మాజీ ప్రధాని ఖలేదా జియా ఉన్నారు. పదవీచ్యుత ప్రధాని షేక్ హసీనా ముజీబ్ కుమార్తె కాగా ఖలేదా జియా కుమార్తె.

హిమాచల్ పోలీసుల అకృత్యం

ఆహారం, మద్యం ఇవ్వనందుకు రిసార్ట్ మేనేజర్‌ను చంపేసిన పోలీసులు

- నూతన సంవత్సర వేడుకల్లో విషాదం
- ఇద్దరు కానిస్టేబుళ్ల అరెస్ట్

బనీఖేత్(హిమాచల్ ప్రదేశ్): నూతన సంవత్సర వేడుకల వేళ అర్ధరాత్రి దాటాక తాము అడిగిన మద్యం, ఆహారం ఇవ్వలేదన్న అక్కసుతో రిసార్ట్ మేనేజర్‌ను పోలీసులు కొట్టి చంపేసిన ఘటన హిమాచల్ ప్రదేశ్‌లో చోటుచేసుకుంది. రిసార్ట్ యజమాని ఇచ్చిన ఫిర్యాదు, నమోదైన ఎఫ్ఐఆర్‌లోని వివరాల ప్రకారం డిసెంబర్ 31వ తేదీ అర్ధరాత్రిదాటాక పర్వతమయ పర్యాటక ప్రాంతం డల్‌హౌసీ దగ్గర్లోని బనీఖేత్‌లోని ఒక ప్రైవేట్ రిసార్ట్‌కు ముగ్గురు కానిస్టేబుళ్లు వచ్చారు. రాత్రి రెండు గంటల సమయంలో తాము అడిగిన భోజనం, మద్యం ఏర్పాట్లు చేయాలని రిసార్ట్ సిబ్బందికి ఆదేశాలిచ్చారు. రాత్రి సమయంలో తాము చేయాల్సిన 'సర్వీస్'సమయం మించిపోయిందని, ఇప్పుడు నిబంధనలు ఒప్పుకోవని, ఈ సమయంలో సర్వీస్ చేయడం కుదరని అక్కడి రిసెప్షనిస్ట్ సచిన్ చెప్పాడు. దీంతో పట్టరాని ఆవేశంతో కానిస్టేబుల్స్ అనూప్, అమిత్‌లు రిసెప్షనిస్ట్‌ను చితకబాదారు. ఇదంతా చూసిన రిసార్ట్ మేనేజర్ రాజేందర్ హుటాహుటిన అక్కడికొచ్చి కానిస్టేబుళ్లను నిలువరించబోయారు. అప్పటికే కోపంతో ఊగిపోతున్న కానిస్టేబుళ్లు రాజేందర్‌పైనా దాడికి తెగించారు. ఈ దాడిలో రాజేందర్ అక్కడికక్కడే చనిపోయారు. దాడి సమయంలో కానిస్టేబుళ్లు పూటుగా మద్యం తాగి ఉన్నారని వార్తలొచ్చాయి. విషయం తెల్సుకున్న స్థానికులు వెంటనే చంబా–పఠాన్‌కోట్ జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తారోకో చేశారు. రాజేందర్ మృతికి కారణమైన కానిస్టేబుళ్లను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఫిర్యాదు అందుకున్న స్థానిక పోలీసులు వెంటనే ఆ ఇద్దరు కానిస్టేబుళ్లను అరెస్ట్‌చేశారు. ఇద్దరినీ విధుల నుంచి తప్పించి దర్యాప్తు మొదలుపెట్టామని చంబా ఎస్పీ గురువారం చెప్పారు. తీవ్రంగా గాయపడిన రిసెప్షనిస్ట్‌ను ఆస్పత్రిలో చేర్పించారు.

ప్రార్థనాస్థలాల చట్టాన్ని పక్కాగా అమలు చేయండి

సుప్రీంకోర్టులో ఎంపీ అసదుద్దీన్ పిటిషన్

- ఫిబ్రవరి 27న విచారణ చేపడతామన్న న్యాయస్థానం

సాక్షి, న్యూఢిల్లీ: ప్రార్థనా స్థలాల (ప్రత్యేక నిబంధనలు) చట్టం–1991ని పకడ్బందీగా అమలుపరచాలంటూ ఎంఐఎం చీఫ్, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ దాఖలు చేసిన పిటిషన్ విచారణకు సుప్రీంకోర్టు అంగీకరించింది. చట్టంలో పేర్కొన్నవిధంగా దేశంలో 1947 ఆగస్ట్ 15వ తేదీ నాటికి ఉన్న ప్రార్థనాస్థలాల యథాతథ స్థితిని కొనసాగించాలని అందులో కోరారు. హిందూ కక్షిదారులు పిటిషన్లపై వివిధ న్యాయస్థానాలు స్పందిస్తూ..మసీదుల్లో సర్వేలు చేపట్టాలంటూ తీర్పులు ఇస్తున్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. గురువారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్‌ల ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారించింది. 1991 చట్టాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లకు అసదుద్దీన్ పిటిషన్‌ను జతచేయాలని ఆదేశించింది. ఒవైసీ తరఫున న్యాయవాది నిజాముద్దీన్ పాషా వాదనలు వినిపిస్తూ.. 1991 చట్టానికి సంబంధించిన పెండింగ్ పిటిషన్లతోపాటు తమ అభ్యర్థనను కూడా పరిగణలోకి తీసుకోవాలని కోరారు. అందుకు సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా అంగీకరిస్తూ.. అన్నిటిపైనా ఫిబ్రవరి 17న విచారణ చేపడతామన్నారు. వారణాసిలో జ్ఞానవాపి, మథురలోని షాహి ఇద్గా మసీదు, సంభాల్‌లోని షాహి జామా మసీదు తదితర 10 మసీదులున్న చోట అంతకుముందు హిందూ దేవాలయాలున్నాయంటూ దాఖలైన 18 పిటిషన్లపై ఎలాంటి విచారణ చేపట్టరాదని, ఆదేశాలివ్వరాదని గతేడాది డిసెంబర్ 12వ తేదీన సుప్రీంకోర్టు దిగువ న్యాయస్థానాలకు స్పష్టమైన ఆదేశాలివ్వడం తెలిసిందే.

పార్లమెంట్‌కు

గాలెంట్ గుడ్‌బై

రాజీనామా చేసిన ఇజ్రాయెల్ మాజీ రక్షణ మంత్రి

- నవంబర్‌లో కేబినెట్ నుంచి తొలగించిన ప్రధాని నెతన్యాహు

జెరూసలేం: ఇజ్రాయెల్ మాజీ రక్షణ మంత్రి యోవ్ గాలెంట్ పార్లమెంటు సభ్యత్వానికి రాజీనామా చేశారు. మిత్రపక్షాలకు వ్యతిరేకంగా తరచూ సొంత నిర్ణయాలు తీసుకుంటున్న ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వైఖరికి నిరసనగా రాజీనామా చేస్తున్నట్లు గాలెంట్ బుధవారం ప్రకటించారు. గాజాలో హమాస్‌కు వ్యతిరేకంగా యుద్ధ నిర్వహణపై నెలల తరబడి విభేదాల తరువాత గాలెంట్‌ను ప్రభుత్వం నుంచి తొలగిస్తున్నట్టు నెతన్యాహు నవంబర్‌లో ప్రకటించారు. ఆ తరువాత సెనేట్‌లో ఆయన కొనసాగారు. ఇప్పుడు పార్లమెంటు సభ్యత్వానికి సైతం రాజీనామా చేశారు. ''యుద్ధభూమిలో ఉన్నట్లే ప్రజాసేవలో కూడా అంతే. లక్ష్యాలను సాధించడానికి ఒక దిశను ఎంచుకోవాల్సిన సందర్భం వచ్చింది''అని గాలెంట్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

ప్రధానితో విభేదాలు

ప్రధాని నెతన్యాహు, మాజీ రక్షణ మంత్రి గాలెంట్ మధ్య చాలాకాలంగా విభేదాలు ఉన్నాయి. న్యాయ వ్యవస్థను సమూలంగా మార్చే వివాదాస్పద ప్రణాళికలపై విభేదాలు రావడంతో నెతన్యాహు 2023 మార్చిలో తొలిసారిగా గాలెంట్‌ను తొలగించారు. ప్రజల నుంచి పెద్ద ఎత్తున నిరసన రావడంతో తిరిగి నియమించారు. ఈ సంఘటన 'గాలెంట్ నైట్'గా ప్రసిద్ధి చెందింది. ఆ తరువాత కూడా నెతన్యాహుపై గాలెంట్ బహిరంగంగా అసహనం వ్యక్తం చేస్తూనే ఉన్నారు. గాజాలో పౌర, సైనిక పాలనను చేపట్టే యోచన ఇజ్రాయెల్‌కు లేదని నెతన్యాహు బహిరంగంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అంతేకాదు, ఇజ్రాయెల్ అల్ట్రా ఆర్థోడాక్స్ పౌరులను సైన్యంలో పనిచేయడం నుంచి మినహాయించే ప్రణాళికలపైనా అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలోనే ఇద్దరు నేతల మధ్య విశ్వాస సంక్షోభం తొలగింపు దాకా దారితీసింది. గాలెంట్‌పై తన విశ్వాసం క్షీణించిందని, అందుకు తొలగిస్తున్నానని నెతన్యాహూ ప్రకటించారు. తొలగింపుపై స్పందించిన గాలెంట్... ఇజ్రాయెల్ భద్రత ఎప్పటికీ తన జీవిత లక్ష్యమన్నారు.



సరైన బట్టల్లేక.. దుప్పట్లు లేక..

వారంలో ఎనిమిది మంది శిశువులు మృతి

గాజాలో పిల్లల ప్రాణాలు తీస్తున్న చలి

యుద్ధంతో అతలాకుతమైన గాజాను ఇప్పుడు చలి పులి చంపేస్తోంది. ముఖ్యంగా చలి నుంచి దాచుకోవడానికి వెచ్చని దుస్తులు లేక, కప్పుకోవడానికి దుప్పట్లు లేక గాజా స్ట్రిప్‌లో చిన్నారులు మృత్యువాత పడుతున్నారు. ఆహారం, ఇంధనం, మందులు, మౌలిక సదుపాయాలు లేక గాజాలోని కుటుంబాలు వణికిపోతున్నాయి. కళ్లముందే పిల్లలు ప్రాణాలు కోల్పోతుండటంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదిస్తున్నారు.

డెయిర్ అల్–బలాహ్: ఓవైపు యుద్ధంతో విధ్వంసమైన గాజాను ఇప్పుడు చలి వణికిస్తోంది. చలి తీవ్రత బాగా పెరగడంతో రక్షించుకోవడానికి సరైన బట్టలు, దుప్పట్లు లేకపోవడంతో వారం రోజుల వ్యవధిలో ఎనిమిది మంది పిల్లలు చనిపోయారు. బాంబు దాడుల నుంచి తప్పించుకుని వచ్చామని, ఇక్కడ చలికి పిల్లల ప్రాణాలు పోతున్నాయని తన నవజాత శివువును పోగొట్టుకున్న యహ్యా అల్–బత్రాన్ రోదిస్తున్నాడు. కొద్దిరోజుల కిందే చనిపోయిన తన చిన్నారి దుస్తులను చూపిస్తూ కన్నీటిపర్యంతమయ్యాడు. ఇజ్రాయెల్–హమాస్ యుద్ధం కారణంగా పూర్తిగా నిరాశ్రయులైన బత్రాన్ కుటుంబం పదేపదే కొత్త ప్రాంతాలకు వలసపోతూ చివరకు డేర్ ఎల్–బాలాహ్‌లోని చిరిగిపోయిన దుప్పట్లు, బట్టలతో చేసిన తాత్కాలిక గుడారానికి చేరింది. అతని భార్య నెలలు నిండకుండానే కవల పిల్లలకు జన్మనిచ్చింది. కవలల్లో ఒకరు జుమా దక్షిణ గాజాలోని ఆసుపత్రిలో ఇంటెన్సివ్ కేర్ యూనిట్లో చికిత్స పొందుతుండగా.. అలీ కొంత ఆరోగ్యంగా ఉండటంతో ఇంక్యుబేటర్ నుంచి బయటకు తీశారు. ప్రస్తుతం ఖర్జూరం తోటలో నివసిస్తున్న వందలాది మంది మాదిరిగానే, వారు భారీ వర్షాలు, ఎనిమిది డిగ్రీ సెల్సియస్ అత్యల్ప ఉష్ణోగ్రతల మధ్య పిల్లలను వెచ్చగా ఉంచడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారు. సరిపడా దుప్పట్లు లేవు. తగిన దుస్తులు లేవు. ''చలికి తట్టుకోలేక నా బిడ్డ శరీరం మొత్తం గడ్డకట్టడం, అతని చర్మం నీలం రంగులోకి మారింది. నా కళ్లముందే చలిపులి అతని ప్రాణాలుతీసింది''అంటూ ఆ తల్లి కంటతడి పెట్టుకుంది. వర్షంలో తడిసిన చాపపై కూర్చొని చిరిగిపోయిన దుప్పట్లును కప్పి దగ్గరకు పట్టుకుని తన ఇద్దరు పిల్లలను కాపాడుకుంటున్నాడు బత్రాన్. ఎండిపోయిన రొట్టె, స్టవ్ మీద చిన్న కుండలో ఉన్న వేడి నీళ్లు. ఒక రోజుకు వాళ్లకవే ఆహారం.

20 లక్షల మంది భద్రతకు ముప్పు

గాజా స్ట్రిప్‌లో వేలాది ఇతర కుటుంబాల ఆహారం, ఇంధనం, ఔషధాల తీవ్ర కొరతను ఎదుర్కొంటున్నాయి. దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్‌లో ఉంటున్న మహమూద్ అల్–ఫాసిహ్ మూడు వారాల వయసున్న తన కూతురును కోల్పోయాడు. వారి కుటుంబం అల్–మవాసి బీచ్ సమీపంలోని చిన్న గుడారంలో ఉంటుండగా చలికి శిశువు గడ్డకట్టుకుపోయింది. ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు చెప్పారు. తీవ్రమైన హైపోథెర్మియా వల్ల చిన్నారి గుండె హఠాత్తుగా కొట్టుకోవడం ఆగిపోయిందని నాజర్ ఆసుపత్రి అత్యవసర, పిల్లల విభాగం డైరెక్టర్ అహ్మద్ అల్ ఫరా తెలిపారు. చలితో మరో 20 రోజుల పసికందు ఆయేషా అల్ ఖాస్సాస్ మృతి చెందింది. ''మీరు ఇంకా గాజా స్ట్రిప్‌లో ఉన్నారంటే ఇజ్రాయెల్ బాంబుదాడులతో మరణించాలి లేదంటే ఆకలితోనో, చలికో చచ్చిపోతారు''అంటూ దుఃఖిస్తున్నారు ఆయేషా తల్లిదండ్రులు. రాబోయే రోజుల్లో మరింత కఠినమైన వాతావరణ పరిస్థితులను ఎదుర్కోవాల్సిన దారుణ పరిస్థితి దాపురిస్తుందని గాజాలోని హమాస్ ఆరోగ్య శాఖ హెచ్చరించింది. ఇది నిర్వాసితులైన 20 లక్షల మంది భద్రతకు ముప్పు. ఈ వాతావరణ తీవ్రతకు శిశువులు, వృద్ధులు మరణించే అవకాశం ఉందని డాక్టర్ ఫరా హెచ్చరించారు.

అందుబాటులోకి

టిన్‌టిన్, పొపాయ్

అమెరికాలో పలు అలనాటి అపురూప రచనలు, కామిక్ పాత్రలకు ముగిసిన కాపీరైట్స్ గడువు

ఇప్పుడు ఉచితంగా ప్రజలకు వినియోగించుకునే సదవకాశం

పిల్లలు మొదలు పెద్దలదాకా ప్రపంచవ్యాప్తంగా అందరినీ అలరించే దిగ్గజ 'టామ్ అండ్ జెర్రీ' కార్టూన్ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో కనువిందుచేయడం తెల్సిందే. దశాబ్దాలు గడిచిపోవడంతో ఈ వీడియోలపై ఇప్పుడు ఎలాంటి కాపీరైట్ వంటి మేథోహక్కులు ఎవరికీ లేవు. ఇప్పుడు వీటిని అందరూ ఉపయోగించుకోవచ్చు. రచయితకు ఎలాంటి రాయితీ చెల్లించకుండానే వాడుకోవచ్చు. అచ్చం ఇలాగే అమెరికాలో జనవరి ఒకటో తేదీ నుంచి ఇంకొన్ని కార్టూన్ పాత్రలు, అలనాటి అపురూప రచనలకు కాపీరైట్ గడువు ముగిసింది. దీంతో ఇప్పుడు ప్రజలంతా వాటిని తమకు నచ్చినట్లు ఉచితంగా వినియోగించుకునే అవకాశం లభించింది. ఒకప్పటి క్లాసిక్స్ అయిన టిన్‌టిన్, పొపాయ్ కార్టూన్ పాత్రలతోపాటు మరికొన్ని ప్రసిద్ధ రచనలపై కాపీరైట్ గడువు జనవరి ఒకటో తేదీతో ముగిసింది. వర్జీనియా వూల్ఫ్ రాసిన 'ఎ రూమ్ ఆఫ్ వన్స్ ఓన్', ఎర్నెస్ట్ హెమ్మింగ్‌వే రాసిన 'ఎ ఫేర్వెల్ టు ఆర్మ్స్', మార్క్స్ బ్రదర్స్ మొదటి చలన చిత్రం 'ది కోకోనట్స్' వంటి క్లాసిక్స్ ఈ జాబితాలో ఉన్నాయి. 1924లోని సౌండ్ ట్రాక్స్ కూడా కాపీరైట్ రహితం అయ్యాయి.

జాబితాలో ఏమేమున్నాయి?

కొత్త సంవత్సరంలో కాపీరైట్ కోల్పోనున్న సాంస్కృతిక రచనల జాబితాను 'సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ ది పబ్లిక్ డొమైన్' ప్రతి డిసెంబర్‌లో ప్రచురిస్తుంది. ఆగ్నేయ అమెరికా రాష్ట్రమైన నార్త్ కరోలినాలోని డ్యూక్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ లాలో భాగమైన ఈ కేంద్రం ఈ జాబితాను తన వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. జనవరి ఒకటో తేదీ నుంచి అమెరికా పబ్లిక్ డొమైన్‌లోకి ప్రవేశించిన సాహిత్యంలో వర్జీనియా వూల్ఫ్ రాసిన 'ఎ రూమ్ ఆఫ్ వన్స్ ఓన్', ఎర్నెస్ట్ హెమ్మింగ్‌వే రాసిన 'ఎ ఫేర్వెల్ టు ఆర్మ్స్', విలియం ఫాల్క్‌నర్ రాసిన 'ది సౌండ్ అండ్ ది ఫ్యూరీ', జర్మన్ రచయిత ఎరిక్ మారియా రెమార్క్ రాసిన 'ఆల్ క్వైట్ ఆన్ ది వెస్టర్న్ ఫ్రంట్' ఆంగ్ల అనువాదం ఉన్నాయి. ఆల్‌ఫ్రెడ్ హిచ్‌కాక్ దర్శకత్వం వహించిన 'బ్లాక్ మెయిల్', ఆస్కార్ అవార్డు గ్రహీత జాన్ ఫోర్డ్ రూపొందించిన మొదటి సౌండ్ ఫిల్మ్ 'ది బ్లాక్ వాచ్' కూడా పబ్లిక్ డొమైన్‌లోకి వచ్చాయి. ఫ్రెంచ్ స్వరకర్త మారిస్ రావెల్ 'బొలెరో', జార్జ్ గెర్ష్విన్ 'యాన్ అమెరికన్ ఇన్ పారిస్' వంటి ట్రాక్స్ సైతం అందుబాటులోకి వచ్చాయి. ఈ సంవత్సరం కాపీ రైట్ రహితమైన కార్టూన్ పాత్రల్లో టిన్‌టిన్, పొపాయ్ ది సెయిలర్ ఉన్నాయి. కామిక్ పాత్ర టిన్‌టిన్.. 1929లో బెల్జియం వార్తాపత్రికలో అరంగేట్రం చేసింది. కార్టూనిస్ట్ ఎల్జీ క్రిస్లర్ సెగర్ సృష్టించిన పొపాయ్ ది సెయిలర్ అంతర్జాతీయంగా గుర్తింపు పొందాయి.

95 ఏళ్ల తరువాత...

అమెరికా కాపీరైట్ చట్టం ప్రకారం పుస్తకాలు, చలన చిత్రాలు, ఇతర కళాకృతులకు 95 సంవత్సరాల తర్వాతే కాపీరైట్స్ ముగుస్తాయి. అలా 1929కి చెందిన వేలాది రచనలు, 1924లో రికార్డ్ అయిన అనేక సౌండ్స్ అమెరికాలో ఇప్పుడు ఉచితంగా అందుబాటులోకి వచ్చాయి. వేలాది సినిమాలు, పాటలు, పుస్తకాలు జనవరి 1 నుంచి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. 2024 కాపీరైట్స్ పూర్తయిన మిక్కీమౌస్, 2023లో పబ్లిక్ డొమైన్‌లోకి ప్రవేశించిన విన్నీ ది పూహ్ ఇప్పటికే సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్



హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం మనాలిలోని సొలాంగ్ నాలాలో గురువారం మంచు కురిసింది. దీంతో, పర్యాటకులు పెద్ద సంఖ్యలో చేరి మంచులో ఉల్లాసంగా తిరుగుతూ గడిపారు



మహాకుంభ్ సమీపిస్తున్న వేళ ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో సందడి మొదలైంది. చౌనీ ప్రవేశ్ (రాజ ప్రవేశం)లో భాగంగా గురువారం శ్రీ మహానిర్వాణీ అఖాడాకు చెందిన సాధువులు ఒంటెలపై ఊరేగుతూ సంగం వద్దకు చేరుకున్నారు.

బషర్ అసద్‌పై విష ప్రయోగం?

లండన్: రష్యాలో ఆశ్రయం పొందిన సిరియా పదవీచ్యుత అధ్యక్షుడు బషర్ అసద్(59)పై విష ప్రయోగం జరిగినట్లు వార్తలు వస్తున్నాయి. గత ఆదివారం ఆయన తీవ్ర అనారోగ్యానికి గురైనట్లు రష్యా మాజీ గూఢచారిగా భావిస్తున్న జనరల్ ఎస్‌వీఆర్ అనే ఆన్‌లైన్ ఎకౌంట్‌లో ఈ విషయం బయటకు పొక్కిందని 'ది సన్'పేర్కొంది. అసద్‌కు తీవ్రమైన దగ్గు, ఊపిరాడకపోవడంతో వైద్యం అందించారని తెలిపింది. అసద్‌పై హత్యా ప్రయత్నం జరిగిందనేందుకు ఇదే ఉదాహరణ అని సన్ పేర్కొంది. డిసెంబర్ మొదటి వారం కుటుంబం సహా వెళ్లిన అసద్ మాస్కోలోని సొంత అపార్టుమెంట్‌లోనే ఉంటున్నారు. అక్కడే ఆయనకు వైద్యం అందుతోందని, సోమవారానికి పరిస్థితి కుదుటపడిందని సన్ తెలిపింది.

నేడు ఢిల్లీలో మోదీ పర్యటన

పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించనున్న ప్రధాని

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం ఢిల్లీలో విస్తృతంగా పర్యటించనున్నారు. పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభిస్తారు. రెండు పట్టణాభివృద్ధి ప్రాజెక్టుల ప్రారంభించడంతోపాటు అశోక్ విహార్‌లో మురికివాడల పునరావాస ప్రాజెక్టు కింద నిర్మించిన 1,675 ఫ్లాట్లను లబ్ధిదారులకు అందించనున్నారు. నజఫ్‌గఢ్ ప్రాంతంలో వీర్ సావర్కార్ కాలేజీకి నిర్మాణానికి మోదీ శంకుస్థాపన చేస్తారు. ద్వారక ప్రాంతంలో రూ.300 కోట్లతో నిర్మించిన సీబీఎస్‌ఈ ఇంటిగ్రేటెడ్ ఆఫీసు కాంప్లెక్స్‌ను సైతం ప్రారంభిస్తారు. అలాగే ఢిల్లీ యూనివర్సిటీకి సంబంధించి రూ.600 కోట్లకుపైగా విలువైన మూడు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. వచ్చే నెలలో ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో మోదీ తలపెట్టిన ఢిల్లీ పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

యూకేలో కొత్త ఏడాది వేడుకలకు వరదల అంతరాయం

లండన్: కొత్త ఏడాది వేడుకల వేళ బ్రిటన్‌ను వరదలు ముంచెత్తాయి. భారీ వర్షాలు, బలమైన గాలులతో బ్రిటన్‌లోని కొన్ని ప్రాంతాలు జలమయమయ్యాయి. మాంచెస్టర్ ప్రాంతంలోని అనేక కమ్యూనిటీలు వరదల్లో చిక్కుకున్నాయి. నెల రోజుల వర్షపాతం కేవలం రెండు రోజుల్లో కురిసింది. దీంతో ఇళ్లు ఖాళీ చేశారు. రోడ్లపై, పార్కింగ్ ప్రదేశాల్లో కార్లు మునిగిపోయాయి. ఈ ప్రాంతంలో రహదారులను మూసివేశారు. రైళ్లను రద్దు చేశారు. స్థానికంగా ఉన్న నదులు, జలాశయాలన్నీ నిండుకుండలా మారాయి. వరదలు, ఈదురుగాలులు నూతన సంవత్సర వేడుకలను దెబ్బతీశాయి. ఎడిన్‌బర్గ్‌తో సహా అనేక నగరాల్లో వేడుకలు రద్దయ్యాయి. బురదమయమైన ఇళ్లలో చిక్కుకుపోయిన వారిని కాపాడేందుకు మౌంటెన్ రెస్క్యూ బృందాలను పిలిపించామని గ్రేటర్ మాంచెస్టర్ పోలీసులు తెలిపారు. వరదలు మరింతే పెరిగే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేశారు. ఉష్ణోగ్రతలు పడిపోవడంతో వారాంతం వరకు భారీగా మంచు కురిసే అవకాశం ఉందని ఉత్తర ఐర్లాండ్, నార్త్ వేల్స్‌లోని కొన్ని ప్రాంతాలు, ఇంగ్లాండ్, స్కాట్లాండ్‌లకు హెచ్చరికలు జారీ చేశారు.

ముగ్గురు చిన్నారులు సహా 18 మంది మృతి

మృతుల్లో గాజా పోలీస్ చీఫ్, డిప్యూటీ చీఫ్ కూడా..

డెయిర్ అల్–బలాహ్: గాజా ప్రాంతంపై గురువారం ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడుల్లో ముగ్గురు చిన్నారులు సహా 18 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో హమాస్ సారథ్యంలోని గాజా పోలీసు చీఫ్ మహ్మద్ సలాహ్, డిప్యూటీ చీఫ్ హుస్సామ్ షహ్వాన్ కూడా ఉన్నారు. మువాసిలో వర్షంతోపాటు అతిశీతల పరిస్థితుల మధ్య తలదాచుకుంటున్న శరణార్థుల టెంట్లపై ఈ దాడి జరిగింది. ఘటనలో మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. దాడి జరిగిన చోట కాలుతున్న టెంట్లు, చెల్లాచెదురుగా పడిన శిథిలాల మధ్య ప్రాణాలతో ఉన్న వారి కోసం స్థానికులు గాలిస్తున్న దృశ్యాలు మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. ఈ ప్రాంతాన్ని ఇజ్రాయెల్ ఆర్మీ మానవతా జోన్‌గా ప్రకటించడం గమనార్హం. సెంట్రల్ గాజాలోని మరో ప్రాంతంపై జరిగిన దాడిలో ఎనిమిది మంది అసువులు బాశారు. వీరంతా సహాయక బృందాలకు రక్షణ కల్పించే వారని అల్–అక్సా మార్టిర్స్ ఆస్పత్రి తెలిపింది. మొత్తమ్మీద గురువారం వేర్వేరు చోట్ల జరిగిన దాడుల్లో 52 మంది వరకు చనిపోయినట్లు వైద్య విభాగం అంటోంది. ఈ ఘటనలపై ఇజ్రాయెల్ ఆర్మీ స్పందించలేదు.

రాజ్‌కోట్‌లో ఉద్రిక్త వాతావరణం

రాజ్‌కోట్: గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. స్థానిక నవాబ్ మసీదులో ప్రాంగణంలో హిందువులు నిర్వహించే మూడు దుకాణాలను బలవంతంగా మూసివేశారు. దుకాణదారులను వెళ్లగొట్టి, అందులోని సామగ్రిని బయటపడేశారు. అది వక్ఫ్ బోర్డుకు చెందిన ఆస్తి కాగా, వారసుల పేరుతో అక్రమంగా బదిలీ చేయించుకున్నారంటూ ఆరోపణలు చేశారు. ఈ ఘటనకు ఐదుగురు వ్యక్తులు కారణమంటూ బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, గుజరాత్ వక్ఫ్‌బోర్డు ఆదేశాల మేరకే దుకాణాలను ఖాళీ చేయించినట్లు ట్రస్టీలు పోలీసులకు తెలిపారు. వక్ఫ్ బోర్డుకు తెలియజేయకుండానే దుకాణదారులు తమ వారసుల పేరిట యాజమాన్య హక్కులు రాయించుకున్నారన్నారు. పదిహేనేళ్లుగా కరెంటు బిల్లులు, ట్యాక్సులు బకాయిపడ్డారన్నారు. అయితే, తమకు మాట మాత్రం కూడా చెప్పకుండా, నోటీసులు ఇవ్వకుండానే దౌర్జన్యంగా ఖాళీ చేయించారని హిందూ దుకాణదారులు తెలిపారు. దుకాణాలను బలవంతంగా ఖాళీ చేయించడంపై పోలీస్ కమిషనర్‌తో మాట్లాడామని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరామని స్థానిక బీజేపీ ఎమ్మెల్యే దర్శితా షా చెప్పారు.

'స్పీడ్ బ్రేకర్'

ప్రాణం పోసింది!

చనిపోయాడనుకున్న వ్యక్తి అంబులెన్స్‌లో బతికొచ్చిన వైనం

కొల్హాపూర్: వైద్యుడు నిర్లక్ష్యంగా ఓ రోగి చనిపోయాడని చెప్పినా ఒక స్పీడ్‌బ్రేకర్ కారణంగా ఆ రోగి మళ్లీ బతికొచ్చిన వైనం మహారాష్ట్రలో చోటుచేసుకుంది. రెండు వారాల క్రితం జరిగిన ఈ వింత ఘటన తాలూకు వివరాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. గత ఏడాది డిసెంబర్ 16వ తేదీన కొల్హాపూర్ జిల్లాలోని కసాబా–బావడా ప్రాంతానికి చెందిన 65 ఏళ్ల పాండురంగ ఉల్పే అనే వ్యక్తికి గుండెపోటు రావడంతో వెంటనే హుటాహుటిన దగ్గర్లోని ఆస్పత్రిలో చేరారు. అయితే అప్పటికే ఆయన మృతిచెందినట్లు ఆ ఆస్పత్రిలోని వైద్యులు ప్రకటించారు. దీంతో మృతదేహాన్ని తిరిగి సొంతూరుకు తీసుకెళ్లేందుకు ఒక అంబులెన్సును సిద్ధంచేశారు. పాండురంగ పరమపదించారన్న వార్త అప్పటికే సొంతూరిలో పాకింది. వెంటనే బంధువులు, స్నేహితులు, తెల్సిన వాళ్లు ఇంటికి రావడం మొదలెట్టారు. అందరూ ఇంటి వద్ద వేచి చూస్తుండటంతో మృతదేహాన్ని త్వరగా ఇంటికి తరలించాలన్న ఆత్రుతలో అంబులెన్సుకు డ్రైవర్ వేగంగా పోనిచ్చాడు. మార్గమధ్యంలో రహదారిపై ఉన్న ఒక పెద్ద స్పీడ్‌బ్రేకర్‌ను చూడకుండా అలాగే వేగంగా పోనిచ్చాడు.

దీంతో వాహనం భారీ కుదుపులకు లోనైంది. ఈ సమయంలో పాండురంగ శరీరం అటుఇటూ కదలిపోయింది. తర్వాత శరీరాన్ని స్ట్రెచర్‌పైకి సవ్యంగా జరిపేటప్పుడు పాండురంగ చేతి వేళ్లు కదలడం చూసి ఆయన భార్య హుతాశురాలైంది. వెంటనే అంబులెన్సుకు ఇంటికి బదులు దగ్గర్లోని మరో ఆస్పత్రికి పోనిచ్చి పాండురంగను ఐసీయూలో చేర్పించారు. ఆయన ఇంకా ప్రాణాలతో ఉన్నారని తేల్చిన అక్కడి వైద్యులు పాండురంగకు వెంటనే యాంజియోప్లాస్టీ చేశారు. రెండు వారాల తర్వాత ఆయన పూర్తిగా కోలుకుని సోమవారం ఇంటికొచ్చారు. దీంతో ఆశ్చర్యపోవడం అందరి వంతైంది. ''ఆ స్పీడ్‌బ్రేకర్ లేకపోయి ఉంటే మా ఆయన ఇలా ఇంటికి కాకుండా నేరుగా శ్మశానానికే వెళ్లేవారు''అని పాండురంగ భార్య నవ్వుతూ చెప్పారు. బతికున్న రోగిని చనిపోయాడని సర్టిఫై చేసిన ఆస్పత్రిపై చర్యలు తీసుకోవాలని పాండురంగ కుటుంబం నిర్ణయించుకుంది. త్వరలో ఆస్పత్రికి నోటీసులు పంపి కోర్టుకీడుస్తామని పేర్కొంది.

సాక్షి ప్లస్
శుక్రవారం। 3-1-2025

ఢిల్లీని నిర్మించిన తోమార్ రాజు?

మధ్యయుగ భారతదేశ చరిత్ర
(8వ శతాబ్దం - 18వ శతాబ్దం)

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ

సోలంకీలు

అనిల్‌వారా రాజధానిగా గుజరాత్, కథియవార్ ప్రాంతాలను దాదాపు నాలుగు శతాబ్దాల పాటు సోలంకీలు పాలించారు. వీరిని అనిల్‌వారా చాళుక్యులు అని కూడా అంటారు.

మూలరాజు

అనిల్‌వారా కేంద్రంగా సోలంకీ రాజ్యాన్ని స్థాపించిన రాజు మూలరాజు. రాజధానిలో రెండు శైవాలయాలను నిర్మించాడు.

మొదటి భీమ

ఇతడి పాలనా కాలంలో గజనీ మహ్మద్ సోమనాథ్‌లోని దేవాలయాన్ని ముట్టడించాడు. భీముడు ఈ దాడిని ఎదుర్కోలేక కచ్‌కు పారిపోయాడు. ఇతడు తన కుమారుడు కర్ణ కోసం సింహాసనాన్ని త్యాగం చేశాడు.

కర్ణ


ఇతడు తన రాజ్యంలో అనేక నిర్మాణాలు చేపట్టాడు. పలు దేవాలయాలతోపాటు తన పేరుతో ఒక నగరాన్ని కూడా నిర్మించాడు. అదే నేటి అహ్మదాబాద్.

జయసింహ సిద్ధరాజు

సిద్ధరాజ అనే బిరుదుతో ఇతడు సింహాసనాన్ని అధిష్ఠించాడు. సోలంకీలందరిలో అగ్రగణ్యుడిగా పేరుగాంచాడు. అనేక యుద్ధాలు చేసి పరమారులు, చాందేలులు, చౌహాన్‌లు, కల్యాణి చాళుక్యలను ఓడించాడు. మరోవైపు భాషా సాహిత్యాలను ప్రోత్సహించాడు. ఇతడి ఆస్థానంలోని ప్రముఖ కవి హేమచంద్రుడు. జయసింహుడు సిద్ధపురలో రుద్ర మహాకాల దేవాలయాన్ని నిర్మించాడు.

కుమారపాల

హేమచంద్రుడు ఇతడి ఆస్థాన కవిగానూ కొనసాగాడు. కుమారపాల చరిత్ర, త్రిశష్టి శలక పురుష, పరిశిష్ట పర్వన్ అనే గ్రంథాలను రచించాడు. ఇతడి ప్రభావంతో కుమారపాలుడు జైనమతాన్ని పోషించడమే కాకుండా తన రాజ్యంలో జంతువధను, జూదాన్ని నిషేధించాడు.



అజయపాల

ఇతడు జైన దేవాలయాలను ధ్వంసం చేసి, జైన మత గురువు రామచంద్రను వధించాడు.

రెండో మూలరాజు

ఇతడు బాలుడు కావడంతో తల్లి నాయికీదేవి సంరక్షకురాలిగా ఉండి రాజ్య పాలనను చేపట్టింది. వీరి ఆధ్వర్యంలోనే 1178 మౌంట్ అబూ యుద్ధంలో సోలంకీ సేనలు ఘోరీ మహ్మద్‌ను ఓడించాయి.

రెండో భీమ

ఇతడి వద్ద తేజపాల, వస్తుపాల అనే సోదరులు మంత్రులుగా ఉండేవారు. రెండో భీముడి పాలనా కాలంలో క్రీ.శ. 1197లో కుతుబుద్దీన్ ఐబక్ ఇతడి రాజ్యంపై దాడి చేశాడు. ఇల్‌టుట్‌మిష్ దాడిని వస్తుపాలుడు తిప్పికొట్టాడు. భీముడి తర్వాత ఈ రాజ్యాన్ని వాఘేలా వంశస్థులు ఆక్రమించారు. చివరికి అల్లావుద్దీన్ ఖిల్జీ మొత్తం గుజరాత్‌ను ఆక్రమించాడు.

చౌహాన్‌లు

ప్రతీహారుల తరహాలో చౌహాన్‌ల్లోనూ అనేక శాఖలున్నాయి. శాకంబరిని(అజ్మీర్)కేంద్రంగా చేసుకొని పాలించిన చౌహాన్ రాజ్యం వాటన్నింటిలోకి అతి ముఖ్యమైంది. వీరు మొదట ప్రతీహారులకు సామంతులుగా ఉండి తర్వాత స్వాతంత్ర్యం ప్రకటించుకున్నారు.

వాసుదేవుడు

క్రీ.శ. 6వ శతాబ్దంలో చౌహాన్ వంశాన్ని స్థాపించిన రాజు వాసుదేవుడు.

వాక్పతి రాజు

వాసుదేవుడి అనంతరం పలువురు రాజులు పాలించిన తర్వాత వాక్పతి రాజు రాజ్యానికొచ్చాడు. ఇతడు పుష్కరలో ఒక శైవాలయాన్ని నిర్మించాడు. దీన్ని విమర్శకులు శివుడి కైలాసంతో పోల్చారు.

సింహరాజు

చౌహాన్ వంశంలోని తొలి స్వతంత్ర పాలకుడు సింహరాజు. ఇతడు మహారాజాధిరాజ అనే బిరుదును పొందాడు.

రెండో విగ్రహరాజు

ఇతడు చౌహాన్ రాజ్య వాస్తవ స్థాపకుడు. గుజరాత్‌పై దాడి చేసి మూలరాజును ఓడించాడు.

మొదటి పృథ్వీరాజు

రెండో విగ్రహరాజు తర్వాత పాలకుల్లో ముఖ్యమైన రాజు మొదటి పృథ్వీరాజు. పుష్కర్‌పై జరిగిన చాళుక్యుల దాడిని తిప్పికొట్టాడు. 700 మందిని అంతం చేశాడు.

రెండో అజయరాజు

శాకంబరికి గజ్నవీ రాజుల నుంచి పొంచి ఉన్న ముప్పును దృష్టిలో ఉంచుకొని ఇతడు అజయమేరు(అజ్మీర్) అనే నూతన నగరాన్ని, కోటను నిర్మించాడు. తన రాజధానిని శాకంబరి నుంచి అజ్మీర్‌కు మార్చాడు. ఇతడు తన చివరికాలంలో రాజ్యాన్ని తన కుమారుడు అర్ణ రాజుకు అప్పగించి సన్యాసాన్ని స్వీకరించాడు.

నాలుగో విగ్రహరాజు

ఇతడు గొప్ప విజేత. అనేక ప్రాంతాలను జయించి తన రాజ్యంలో కలుపుకున్నాడు. తోమారులను ఓడించి వారి నుంచి ఢిల్లీని ఆక్రమించాడు. ఇతడు స్వయంగా కవి, సాహిత్య పోషకుడు. హరికేళి అనే నాటకాన్ని రచించాడు. మహాకవి సోమదేవుడు ఇతడి గురించి లలిత విగ్రహ రాజనాటకం అనే గ్రంథాన్ని రచించాడు. భోజుడు ధారలో నిర్మించిన సరస్వతి కంఠాభరణ విద్యాలయ నమూనాలో ఇతడు అజ్మీర్‌లో సంస్కృత కళాశాలను నిర్మించాడు. విశాల్‌పూర్ అనే నూతన నగరాన్ని కూడా నిర్మించాడు.

మూడో పృథ్వీరాజు

మూడో పృథ్వీరాజుకు ముందు అపరాంగగేయ, రెండో పృథ్వీరాజు, సోమేశ్వర అనే రాజులు పాలించారు. చౌహాన్ రాజుల్లో అగ్రగణ్యుడు మూడో పృథ్వీరాజు. ఇతడు తన సమకాలీన రాజులైన గహద్వాలులు, చాందేలులు, సోలంకీలతో అనేక యుద్ధాలు చేశాడు. ఘోరీ మహ్మద్‌తో రెండు యుద్ధాలు చేశాడు. 1191లో మొదటి తరైన్ (స్థానేశ్వర్) యుద్ధంలో ఘోరీని ఓడించాడు. 1192లో జరిగిన రెండో తరైన్ యుద్ధంలో ఘోరీ మహ్మద్, పృథ్వీరాజును ఓడించి అంతమొందించాడు. అనంతరం పృథ్వీరాజు వారసులు రణతంభోర్ కేంద్రంగా కొంతకాలం పాటు పాలించారు. చివరికి అల్లావుద్దీన్ ఖిల్జీ ఈ రాజ్యాన్ని జయించి ఢిల్లీ సామ్రాజ్యంలో కలిపివేశాడు.

జనరల్ నాలెడ్జ్ ఫర్ గ్రూప్స్

ద్రవ్య విధానం- చక్రవర్తి కమిటీ సిఫారసులు

- స్వాతంత్ర్యానంతరం దేశంలో పంచవర్ష ప్రణాళికల అమలు కోసం అవసరమైన వనరుల సమీకరణకు భారత ద్రవ్య వ్యవస్థ తోడ్పడింది.
- ఆర్థికాభివృద్ధిని త్వరితగతిన సాధించే క్రమంలో ద్రవ్యోల్బణ ఒత్తిళ్లను తగ్గించే దిశగా ద్రవ్య వ్యవస్థ పనిచేసింది.
- ద్రవ్యవ్యవస్థ పనితీరును సమీక్షించే నేపథ్యంలో రిజర్వ్‌బ్యాంకు 1982లో సుఖమోయ్ చక్రవర్తి అధ్యక్షతన కమిటీని ఏర్పాటు చేసింది.
- ప్రణాళికాబద్ధ ఆర్థిక ప్రగతి నేపథ్యంలో ద్రవ్యవ్యవస్థ నిర్మాణ, నిర్వహణను సమీక్షించాలని కమిటీని కేంద్ర బ్యాంకు కోరింది.

మాదిరి ప్రశ్నలు

1. మహ్మద్ ఘోరీని మౌంట్ అబూ యుద్ధంలో ఓడించిన రాజు?
   1) మొదటి భీమ 2) రెండో మూలరాజ
   3) నాలుగో విగ్రహరాజు
   4) మూడో పృథ్వీరాజు
2. గుజరాత్‌పై జరిగిన ఇల్‌టుట్‌మిష్ దాడిని తిప్పికొట్టిన రాజు?
   1) రెండో భీమ 2) మొదటి భీమ
   3) మొదటి నాగభట 4) రెండో నాగభట
3. మౌంట్ అబూలోని విమల దేవాలయ నిర్మాతలు?
   1) చౌహాన్‌లు 2) సోలంకీలు
   3) పరమారులు 4) గహద్వాలులు
4. సోలంకీలు నిర్మించిన సూర్య దేవాలయం ఎక్కడ ఉంది?
   1) మార్తాండ్ 2) కోణార్క్
   3) మధుర 4) బరోడా
5. గజనీ మహ్మద్ ధ్వంసం చేసిన సోమనాథ్ దేవాలయాన్ని పునర్నిర్మించినవారు?
   1) రెండో భీమ 2) రెండో మూలరాజు
   3) విగ్రహరాజు 4) సామంతరాజు
6. అజ్మీర్ నగర నిర్మాత?
   1) నాలుగో విగ్రహరాజు
   2) మొదటి అజయరాజు
   3) రెండో అజయరాజు
   4) మూడో పృథ్వీరాజు
7. హరికేళి నాటకం అనే గ్రంథంలోని వ్యాఖ్యలు గోడలపై కలిగి ఉన్న కట్టడం?
   1) అఢై దిన్‌కా జోప్రామసీద్
   2) కువ్వాతుల్ ఇస్లామ్ మసీద్
   3) అజ్మీర్‌లోని సరస్వతి మందిరం
   4) చిత్తోర్ కీర్తి స్తంభం
8. కవిబాంధవ అనే బిరుదు ఉన్న రాజు?
   1) మూడో పృథ్వీరాజు
   2) నాలుగో విగ్రహరాజు
   3) కుమార పాల
   4) జయసింహ సిద్ధరాజు
9. ముస్లిం చరిత్రకారులు రామ్‌పితూర అని ఎవరిని పిలిచారు?
   1) రాణా ప్రతాప్‌సింగ్
   2) రాణా సంగ్రామ్‌సింగ్
   3) మూడో పృథ్వీరాజు
   4) గహద్వాల జయచంద్ర
10. మూడో పృథ్వీరాజు ఆస్థానంలోని ప్రముఖ కవులు?
    1) విద్యాపతి, జనార్దన
    2) జనార్దన, విశ్వరూప
    3) విశ్వరూప, జయనాక, పద్మనాభ
    4) పై వారందరూ
11. రాణీ సంయుక్తతో మూడో పృథ్వీరాజు ప్రేమాయణం గురించి రాసిన 'పృథ్వీ రాజ రాసో'' అనే గ్రంథ రచయిత?
    1) చాంద్ బర్దాయ్
    2) మాలిక్ మహ్మద్ జయసీ
    3) జయనాక 4) అల్ బెరూనీ
12. ఢిల్లీని నిర్మించిన తోమార్ రాజు?
    1) వజ్రపాలుడు 2) అనంగపాలుడు
    3) వస్తుపాలుడు 4) తేజపాలుడు
13. 'నవ సాహసాంక చరితం' అనే గ్రంథాన్ని రచించిన సంస్కృత కవి?
    1) పద్మగుప్త 2) పద్మసాంభవ
    3) ధనంజయ 4) జోనరాజ
14. చౌహాన్‌ల ఆగర్భ శత్రువులు?
    1) చాందేలులు 2) గహద్వాలులు
    3) సోలంకీలు 4) ప్రతీహారులు
15. జ్ఞానపీఠ్ అవార్డ్‌లోని వాగ్దేవి ప్రతిమతో సంబంధం ఉన్న రాజు?
    1) పరమార భోజుడు
    2) చాందేల విద్యాధరుడు
    3) చాళుక్య జయసింహుడు
    4) మూడో పృథ్వీరాజు
16. సోమనాథ్ దేవాలయాన్ని ఏ దేవుడికి అంకితమిచ్చారు?
    1) సూర్యుడు 2) గణేశుడు
    3) కార్తికేయుడు 4) శివుడు
17. శపథ లక్ష దేశమని ఎవరి రాజ్యానికి పేరు?
    1) చాందేలు 2) గహద్వాలు
    3) పరమారు 4) చౌహాన్
18. గజనీ మహ్మద్ దాడితో రాజధాని కనౌజ్‌ను వదిలి పారిపోయిన ప్రతీహార రాజు?
    1) యశ పాలుడు 2) రాజ్య పాలుడు
    3) రెండో భోజుడు 4) విజయ పాలుడు
19. దాసరూప గ్రంథాన్ని రచించిన పరమారుల ఆస్థాన కవి?
    1) హలాయుధుడు 2) ధనిక
    3) ధనంజయ 4) పద్మగుప్త
20. కవి రాజు అనే బిరుదు ఉన్న రాజులు?
    1) హాలుడు 2) సముద్ర గుప్తుడు
    3) భోజుడు 4) పై వారందరూ
21. పతంజలి యోగ సూత్రాలపై వ్యాఖ్యానం రాసిన రాజు?
    1) ముంజ 2) భోజ
    3) మొదటి భీమ 4) కర్ణ
22. ఏ రాజు పాలనా కాలంలో గజనీ మహ్మద్ సోమనాథ్ దేవాలయంపై దాడి చేశాడు?
    1) మొదటి భీమ 2) మొదటి నాగభటుడు
    3) మొదటి భోజ 4) జయసింహ సిద్ధరాజ
23. సిద్ధ హేమచంద్ర అనే ప్రముఖ వ్యాకరణ గ్రంథ రచయిత?
    1) సోమదేవుడు 2) హేమచంద్రుడు
    3) మహావీరాచార్యుడు 4) శ్రీహర్షుడు
24. తన రాజ్యంలో జంతువధను నిషేధించిన జైన రాజు?
    1) జయసింహ సిద్ధరాజ
    2) అమోఘవర్ష 3) కుమారపాల
    4) వాక్పతి ముంజ
25. కలికాల సర్వజ్ఞ అనే బిరుదు కలిగిన జైనకవి?
    1) సోమదేవసూరి
    2) హరి విజయసూరి
    3) కాలకాచార్యుడు
    4) హేమ చంద్రుడు

సమాధానాలు

1) 2; 2) 1; 3) 2; 4) 3; 5) 1;
6) 3; 7) 1; 8) 2; 9) 3; 10) 4;
11) 1; 12) 2; 13) 1; 14) 2; 15) 1;
16) 4; 17) 4; 18) 2; 19) 3; 20) 4;
21) 2; 22) 1; 23) 2; 24) 3; 25) 4.

రోహులా జాతీయ పార్కు ఏ రాష్ట్రంలో ఉంది?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం
జాగ్రఫీ

మాదిరి ప్రశ్నలు

1. బంగ్లాదేశ్‌లో గంగానదిని ఏమని పిలుస్తారు?
   1) కర్ణావతి 2) భాగీరథి
   3) జమున 4) పద్మ
2. కింది వాటిలో గంగానది ఒడ్డున లేని నగరం ఏది?
   1) వారణాసి 2) అలహాబాద్
   3) కాన్పూర్ 4) లక్నో
3. జతపరచండి.
   జాబితా I
   i) కుమవున్ హిమాలయాలు
   ii) నేపాల్ హిమాలయాలు
   iii) పంజాబ్ హిమాలయాలు
   iv) అసోం హిమాలయాలు
   జాబితా II
   a) ఇండస్, సట్లెజ్ మధ్య
   b) కాళీ, తీస్తా మధ్య
   c) తీస్తా, బ్రహ్మపుత్ర మధ్య
   d) సట్లెజ్, కాళీ మధ్య
   1) i-c, ii-d, iii-b, iv-a
   2) i-c, ii-b, iii-d, iv-a
   3) i-d, ii-b, iii-a, iv-c
   4) i-d, ii-c, iii-a, iv-b
4. సాత్పురా, వింధ్య పర్వతాల మధ్య ప్రవహించే నది ఏది?
   1) నర్మద 2) గండక్ 3) తపతి 4) గోదావరి
5. భారతదేశంలో బ్రహ్మపుత్ర నది మొదట ఏ రాష్ట్రంలో ప్రవేశిస్తుంది?
   1) అసోం 2) త్రిపుర
   3) సిక్కిం 4) అరుణాచల్‌ప్రదేశ్
6. కజిరంగా జాతీయ పార్కు ఏ రాష్ట్రంలో ఉంది?
   1) అసోం 2) బిహార్
   3) పశ్చిమ బెంగాల్ 4) కర్ణాటక
7. కింది వాటిలో సరైన జత ఏది?
   1) బందీపూర్ - తమిళనాడు
   2) మానస్ - ఉత్తరప్రదేశ్
   3) రణతంబోర్ - రాజస్థాన్
   4) సిమ్లిపాల్ - జార్ఖండ్
8. 'ఘనా'పక్షి సంరక్షణ కేంద్రం ఏ రాష్ట్రంలో ఉంది?
   1) ఒడిశా 2) కర్ణాటక
   3) రాజస్థాన్ 4) పశ్చిమ బెంగాల్
9. కింది వాటిలో బయోస్పియర్ రిజర్వ్ కానిది ఏది?
   1) అగస్త్యమలై 2) నల్లమలై
   3) నీలగిరి 4) పంచమర్హి
10. భారతదేశంలో తొలి జీవ వైవిధ్య రక్షిత స్థలాన్ని ఎక్కడ ఏర్పాటు చేశారు?
    1) గ్రేట్ నికోబార్ 2) గల్ఫ్ ఆఫ్ మన్నార్
    3) నందాదేవి 4) నీలగిరి
11. ప్రసిద్ధి చెందిన 'కన్హ వన్యమృగ సంరక్షణ కేంద్రం' ఏ రాష్ట్రంలో ఉంది?
    1) బిహార్ 2) మధ్యప్రదేశ్
    3) కర్ణాటక 4) అసోం
12. కేరళలోని ఏ అభయారణ్యం ఏనుగులకు ప్రసిద్ధి చెందింది?
    1) పరకల్ 2) పెరియార్
    3) చంద్రప్రభ 4) కన్హ
13. జతపరచండి.
    జాబితా - I / జాబితా - II
    i) సిమ్లిపాల్ a) ఉత్తరప్రదేశ్
    ii) బందీపూర్ b) ఒడిశా
    iii) మానస్ c) కర్ణాటక
    iv) చంద్రప్రభ d) అసోం
    1) i-c, ii-d, iii-a, iv-b
    2) i-d, ii-c, iii-b, iv-a
    3) i-b, ii-c, iii-d, iv-a
    4) i-a, ii-b, iii-c, iv-d
14. 'సైలెంట్ వ్యాలీ' ఏ రాష్ట్రంలో ఉంది?
    1) తమిళనాడు 2) కేరళ
    3) అసోం 4) అరుణాచల్ ప్రదేశ్
15. 'రంగనతిట్టు' పక్షి సంరక్షణ కేంద్రం ఏ రాష్ట్రంలో ఉంది?
    1) కేరళ 2) అసోం
    3) రాజస్థాన్ 4) కర్ణాటక
16. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఏ తేదీన నిర్వహిస్తారు?
    1) జూన్ 5 2) జూన్ 9
    3) అక్టోబర్ 5 4) సెప్టెంబర్ 10
17. భారత్‌లో అతిపెద్ద పులుల సంరక్షణ కేంద్రం ఏది?
    1) గిర్ అడవి (గుజరాత్)
    2) బందీపూర్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం (కర్ణాటక)
    3) నాగార్జున శ్రీశైలం వన్యప్రాణి సంరక్షణ కేంద్రం (ఆంధ్రప్రదేశ్, తెలంగాణ)
    4) దండకారణ్యం (ఛత్తీస్‌గఢ్)
18. మధ్యప్రదేశ్‌లోని 'పన్నా' నేషనల్ పార్కు ద్వారా ప్రవహించే నది ఏది?
    1) నర్మద 2) తపతి 3) కెన్ 4) సట్లెజ్
19. కింది వాటిలో ఖడ్గ మృగాలకు ప్రసిద్ధి చెందిన జాతీయ పార్కు ఏది?
    1) దచిగామ్ 2) సలీం అలీ
    3) రోహులా 4) జల్దపార
20. భారత్‌లో ఏర్పాటు చేసిన తొలి జాతీయ పార్కు ఏది?
    1) గిర్ నేషనల్ పార్క్
    2) జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్
    3) సిమ్లిపాల్ నేషనల్ పార్క్
    4) జల్దపార నేషనల్ పార్క్
21. భారతదేశంలో తొలి పక్షి సంరక్షణ కేంద్రం ఏది?
    1) వేదాంతంగల్ 2) రంగనతిట్టు
    3) ఘనా 4) కొల్లేరు
22. జాతీయ పార్కులకు సంబంధించి కింది వాటిలో సరికానిది ఏది?
    1) గిండి జాతీయ పార్కు - తమిళనాడు
    2) వ్యాలీ ఆఫ్ ఫ్లవర్స్ జాతీయ పార్కు - ఉత్తరాఖండ్
    3) దుద్వా జాతీయ పార్కు - ఉత్తరప్రదేశ్
    4) వాల్మీకి జాతీయ పార్కు - ఛత్తీస్‌గఢ్
23. భారతదేశ వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని ఏ సంవత్సరంలో రూపొందించారు?
    1) 1954 2) 1964 3) 1972 4) 1986
24. 'నామ్‌దఫా' టైగర్ రిజర్వ్ ఏ రాష్ట్రంలో ఉంది?
    1) అసోం 2) అరుణాచల్ ప్రదేశ్
    3) బిహార్ 4) ఒడిశా
25. జతపరచండి.
    టైగర్ రిజర్వ్ / రాష్ట్రం
    i) నామేరి a) కర్ణాటక
    ii) కవ్వాల్ b) ఛత్తీస్‌గఢ్
    iii) ఇంద్రావతి c) తెలంగాణ
    iv) బద్రా d) అసోం
    1) i-b, ii-c, iii-a, iv-d
    2) i-d, ii-c, iii-b, iv-a
    3) i-a, ii-c, iii-d, iv-b
    4) i-b, ii-d, iii-a, iv-c
26. రోహులా జాతీయ పార్కు ఏ రాష్ట్రంలో ఉంది?
    1) ఉత్తరాఖండ్ 2) హిమాచల్ ప్రదేశ్
    3) ఉత్తరప్రదేశ్ 4) రాజస్థాన్
27. 'గరమ్ పానీ' శాంక్చుయరీ ఏ రాష్ట్రంలో ఉంది?
    1) రాజస్థాన్ 2) మధ్యప్రదేశ్
    3) ఉత్తర ప్రదేశ్ 4) అసోం
28. కింది వాటిలో రాజస్థాన్‌కు చెందని వన్యమృగ సంరక్షణ కేంద్రం ఏది?
    1) సరిస్క 2) రామ్‌గఢ్ బంధి
    3) తీర్థాన్ 4) ఫల్వారి
29. వన్య మృగ సంరక్షణ కేంద్రాలకు సంబంధించి కింది వాటిలో సరికాని జత ఏది?
    1) భీమ బంధ్ - బిహార్
    2) దచిగామ్ - జమ్ము-కశ్మీర్
    3) హజారీ బాగ్ - జార్ఖండ్
    4) దండేలి - ఒడిశా
30. కింది వాటిలో యునెస్కో జాబితాలో లేని భారత బయోస్పియర్ రిజర్వ్ ఏది?
    1) సుందర్‌బన్స్ 2) కాంచన గంగ
    3) మన్నార్ సింధు శాఖ 4) నందా దేవి
31. 'ఆపరేషన్ టైగర్ ప్రాజెక్టు'ను ఏ సంవత్సరంలో ప్రారంభించారు?
    1) 1952 2) 1972 3) 1973 4) 1985
32. 'సత్కోషియా' టైగర్ రిజర్వ్ ఏ రాష్ట్రంలో ఉంది?
    1) అసోం 2) ఒడిశా 3) కర్ణాటక 4)రాజస్థాన్
33. ఆలివ్ రిడ్లే తాబేళ్లు ఉన్న 'గహిర్మాత బీచ్' ఏ రాష్ట్రంలో ఉంది?
    1) తమిళనాడు 2) గుజరాత్
    3) పశ్చిమ బెంగాల్ 4) ఒడిశా
34. భారత్‌లో 'ఆపరేషన్ క్రొకడైల్'ను ఏ సంవత్సరంలో ప్రారంభించారు?
    1) 1972 2) 1973 3) 1975 4) 1985
35. మనదేశంలో మొసళ్ల సంరక్షణకు 'క్రొకడైల్ బ్యాంక్'ను ఎక్కడ ఏర్పాటు చేశారు?
    1) కోల్‌కతా 2) విశాఖపట్నం
    3) ముంబై 4) చెన్నై
36. 'సంజయ్ దుబ్రి టైగర్ రిజర్వ్'ఏ రాష్ట్రంలో ఉంది?
    1) తమిళనాడు 2) మధ్యప్రదేశ్
    3) న్యూఢిల్లీ 4) కర్ణాటక
37. 11వ ప్రపంచ జీవ వైవిధ్య సదస్సును ఎక్కడ నిర్వహించారు?
    1) కాన్‌కున్ 2) ఢిల్లీ
    3) హైదరాబాద్ 4) కౌలాలంపూర్
38. ఆసియా సింహాలకు ఆవాసమైన 'గిర్' జంతు సంరక్షణ కేంద్రం ఏ ప్రాంతంలో ఉంది?
    1) జునాగఢ్ 2) భావనగర్
    3) గాంధీనగర్ 4) కాంబే
39. కింది వాటిలో సరికానిది ఏది?
    1) ఏనుగులకు సంబంధించిన ప్రాజెక్టు(ప్రాజెక్టు ఎలిఫెంట్)ను 1992లో ప్రారంభించారు
    2) ప్రాజెక్టు ఎలిఫెంట్ ప్రకారం, ఏనుగులు ఉండే ప్రాంతాన్ని గ్రీన్, ఎల్లో, రెడ్ మూడు ప్రాంతాలుగా విభజించారు
    3) భారతదేశంలో అతి వేగంగా అంతరించిపోతున్న తాబేళ్ల జాతి.. ఆలివ్ రిడ్లే తాబేళ్లు
    4) 'ఆపరేషన్ కార్బెట్ సీ టర్టిల్' అనే కార్యక్రమాన్ని 1975లో ప్రారంభించారు
40. రాజాజీ, కార్బెట్ ఏనుగుల రిజర్వ్‌లు ఏ రాష్ట్రాల్లో విస్తరించి ఉన్నాయి?
    1) ఉత్తరప్రదేశ్, బిహార్
    2) మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్
    3) మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్
    4) ఉత్తరాఖండ్
41. 'కోల్డ్ డెజర్ట్ బయోస్పియర్ రిజర్వ్' ఏ రాష్ట్రంలో ఉంది?
    1) హిమాచల్‌ప్రదేశ్ 2) మధ్యప్రదేశ్
    3) మేఘాలయ 4) అసోం
42. జాతీయ పార్కులు, అవి ఉన్న ప్రాంతాలకు సంబంధించి కింది వాటిలో సరికాని జత ఏది?
    1) కిష్టవార్ - జమ్ము-కశ్మీర్
    2) బోరివిల్లీ - ఉత్తరప్రదేశ్
    3) బన్నార్ గట్టా - కర్ణాటక
    4) మాధవ్ - మధ్యప్రదేశ్
43. కింది వాటిలో అరిచే జింకలు ఉన్న జాతీయ పార్కు ఏది?
    1) గిండి జాతీయ పార్కు
    2) శివపురి జాతీయ పార్కు
    3) దుద్వా జాతీయ పార్కు
    4) బోరివిల్లీ జాతీయ పార్కు
44. 'రాణి ఝాన్సీ' వన్యమృగ సంరక్షణ కేంద్రం ఉన్న ప్రాంతం ఏది?
    1) మధ్యప్రదేశ్ 2) ఉత్తరప్రదేశ్
    3) బిహార్ 4) అండమాన్ నికోబార్
45. 'సంజయ్ గాంధీ నేషనల్ పార్కు' అని దేన్ని పిలుస్తారు?
    1) బోరివిల్లీ నేషనల్ పార్కు
    2) కజిరంగా నేషనల్ పార్కు
    3) నాగర్‌సోల్ నేషనల్ పార్కు
    4) శివపురి నేషనల్ పార్కు
46. 'ఇంటాంకీ' వన్యమృగ సంరక్షణ కేంద్రం ఏ రాష్ట్రంలో ఉంది?
    1) మణిపూర్ 2) నాగాలాండ్
    3) మిజోరాం 4) అసోం
47. 2016లో 13వ ప్రపంచ జీవ వైవిధ్య సదస్సును ఎక్కడ నిర్వహించారు?
    1) బాన్ 2) హేగ్
    3) హైదరాబాద్ 4) కాన్‌కున్
48. 'భగవాన్ మహావీర్' వన్యమృగ సంరక్షణ కేంద్రం ఎక్కడ ఉంది?
    1) మహారాష్ట్ర 2) తెలంగాణ
    3) గోవా 4) సిక్కిం
49. కింది వాటిలో సరికాని జత ఏది?
    1) నందన్ కానన్ నేషనల్ పార్కు - ఒడిశా
    2) సోనాయ్ రూపాయ్ వన్యమృగ సంరక్షణ కేంద్రం - అసోం
    3) నవగావ్ జాతీయ పార్కు-పశ్చిమ బెంగాల్
    4) అన్షి జాతీయ పార్కు - కర్ణాటక
50. డాక్టర్ సలీం అలీ బర్డ్ శాంక్చుయరీ ఎక్కడ ఉంది?
    1) గోవా 2) కేరళ
    3) తమిళనాడు 4) అసోం
51. 'ఇందిరాగాంధీ వైల్డ్ లైఫ్ శాంక్చుయరీ' అని దేన్ని పిలుస్తారు?
    1) పెరియార్ శాంక్చుయరీ
    2) షికారీ దేవి శాంక్చుయరీ
    3) రంగనతిట్టు బర్డ్ శాంక్చుయరీ
    4) అన్నామలై శాంక్చుయరీ
52. 'గోవింద్ పశు విహార్' వన్యమృగ సంరక్షణ కేంద్రం ఏ రాష్ట్రంలో ఉంది?
    1) ఉత్తరప్రదేశ్ 2) రాజస్థాన్
    3) మహారాష్ట్ర 4) పశ్చిమ బెంగాల్
53. 'భిత్తర్ కానికా' వన్యమృగ సంరక్షణ కేంద్రం ఏ రాష్ట్రంలో ఉంది?
    1) తమిళనాడు 2) కేరళ
    3) గోవా 4) ఒడిశా
54. చంబల్, బెట్వా, కెన్‌లు ఏ నదికి ఉపనదులు?
    1) నర్మద 2) తపతి
    3) యమున 4) దామోదర్
55. కింది వాటిలో పెన్నా నదికి ఉపనది కానిది ఏది?
    1) కుందేరు 2) సగిలేరు
    3) లోకపావని 4) చెయ్యేరు
56. సోన్ నది గంగానదిలో ఎక్కడ కలుస్తుంది?
    1) అలహాబాద్ 2) పాట్నా
    3) రుద్ర ప్రయాగ
    4) చాప్రా
57. నర్మదానది దేశంలో ఏయే రాష్ట్రాల ద్వారా ప్రవహిస్తోంది?
    1) ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్
    2) ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్
    3) మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, గుజరాత్
    4) మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్
58. దిబాంగ్, లోహిత్ ఏ నదికి ఉపనదులు?
    1) గంగా 2) సింధు
    3) యమున 4) బ్రహ్మపుత్ర
59. గంగా నది ఏ రాష్ట్రంలో అత్యధిక దూరం ప్రవహిస్తోంది?
    1) పశ్చిమ బెంగాల్ 2) ఉత్తరప్రదేశ్
    3) బిహార్ 4) ఉత్తరాఖండ్
60. కింది వాటిలో సరైంది ఏది?
    1) దామోదర్ నది చోటానాగ్‌పూర్ పీఠభూమిలోని 'టోరి' అనే ప్రాంతంలో జన్మిస్తోంది
    2) చంబల్ నది మధ్యప్రదేశ్‌లోని 'మౌ' అనే ప్రదేశంలో జన్మిస్తోంది
    3) పెన్నా నది కర్ణాటకలో నంది దుర్గ కొండల్లో జన్మిస్తోంది
    4) పైవన్నీ సరైనవే

సమాధానాలు

1) 4	2) 4	3) 3	4) 1	5) 4
6) 1	7) 3	8) 3	9) 2	10) 4
11) 2	12) 2	13) 3	14) 2	15) 4
16) 1	17) 3	18) 3	19) 4	20) 2
21) 1	22) 4	23) 3	24) 2	25) 2
26) 2	27) 4	28) 3	29) 4	30) 2
31) 3	32) 2	33) 4	34) 3	35) 4
36) 2	37) 3	38) 1	39) 3	40) 4
41) 1	42) 2	43) 4	44) 4	45) 1
46) 2	47) 4	48) 3	49) 3	50) 1
51) 4	52) 1	53) 4	54) 3	55) 3
56) 2	57) 3	58) 4	59) 2	60) 4

గోల్కొండ ప్రాంతంలో వజ్రాల గనులున్నట్లు రాసిందెవరు?

కాకతీయ వాస్తు, శిల్ప రీతికి తలమానికం రామప్ప దేవాలయం. ఈ దేవాలయంలోని నందికి ఒక ప్రత్యేకత ఉంది. వీక్షకులు ఏ వైపు నుంచి చూసినా అది వారివైపే చూస్తున్నట్లు కనిపిస్తుంది. ఓరుగల్లు కోటలోని నిర్మాణాలు కాకతీయుల కాలంనాటి వాస్తు, శిల్ప కౌశలాన్ని ప్రతిబింబిస్తున్నాయి. ఈ కోటను ఏకశిల చుట్టూ నిర్మించారు.



గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

కాకతీయ యుగ విశేషాలు

పన్నులు

కాకతీయుల కాలంలో స్థూలంగా అయిదు రకాల పన్నులుండేవి.

అవి: 1. భూమి పన్ను, 2. పారిశ్రామిక, ఆస్తి పన్నులు, 3. వృత్తి పన్నులు, 4. వ్యాపార పన్నులు, 5. ఇతర పన్నులు.

ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ మార్గం భూమి శిస్తు. వర్తకం, పరిశ్రమలు, వృత్తులపై విధించే పన్నులు రెండో ఆదాయ మార్గం. పశుగ్రాసానికి పనికి వచ్చే పచ్చికబయళ్లపై వసూలు చేసే పన్ను, అడవుల కలపపై వేసే పన్ను మూడో ఆదాయ మార్గంగా ఉండేది. వర్తక సరకులు, ఎగుమతి దిగుమతులు, తయారైన వస్తువుల మీద వేసే పన్నును 'సుంకం'గా పేర్కొనేవారు. సాధారణంగా సుంకాలు వసూలు చేసే అధికారం వర్తక శ్రేణులకు ఇచ్చేవారు.

న్యాయ పాలన

సామాన్యమైన వివాదాలన్నింటినీ గ్రామ సభల్లో గ్రామ ప్రభువులు పరిష్కరించేవారు. గ్రామాల్లో దొంగతనాలు జరగకుండా 'తలారి' అనే గ్రామోద్యోగి చూసేవాడు. రాజే అంతిమ న్యాయ నిర్ణేత. యాజ్ఞవల్క్య స్మృతి లాంటి ప్రాచీన స్మృతి గ్రంథాల్లో పేర్కొన్న సూత్రాలను అనుసరించి ధర్మాసనాలు ఏర్పరిచేవారు. ఒకరిద్దరు రాజాధికారులతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన సభల్లో న్యాయ సమస్యలు పరిష్కారమయ్యేవి. వీరిని 'మహాజనులు'గా పేర్కొనేవారు. సమస్య పరిష్కారమైన వెంటనే సభ రద్దయ్యేది. ప్రస్తుతం గ్రామ పెద్దల మాదిరిగా ఈ మహాజనులు పనిచేసేవారు. తెగల్లో వివాదాలను 'సమయాలే' పరిష్కరించేవి.

సైనిక వ్యవస్థ

కాకతీయ సైన్యంలో చక్రవర్తి సైన్యం, నాయంకర సైన్యం అని రెండు విభాగాలు ఉండేవి. కాకతీయ చక్రవర్తులు సైన్యానికి స్వయంగా నాయకత్వం వహించేవారు. వీరి రాజ్యంలో స్థల, జల, వన, గిరి అనే నాలుగు రకాల కోటలు ఉన్నట్లు తెలుస్తోంది. కాకతీయుల కాలంలో ఓరుగల్లు, రాయచూరు, గోల్కొండ, భువనగిరి, రాచకొండ, దేవరకొండ, నల్లగొండ, పానుగల్లు కోటలు శత్రు దుర్భేద్యమైనవిగా పేరు పొందాయి.

ఆర్థిక పరిస్థితులు

కాకతీయుల కాలంలో ఆంధ్రదేశం సిరి సంపదలతో విలసిల్లినట్లు అమీర్ ఖుస్రూ, అబ్దుల్లా వాసఫ్, మార్కోపోలో లాంటి విదేశీ యాత్రికుల రచనల ద్వారా తెలుస్తోంది.

వ్యవసాయం: తెలంగాణా ప్రాంతంలో సాగు భూమిని, నీటి వనరులను పెంచడానికి కాకతీయులు ఎనలేని కృషి చేశారు. వీరు చెరువులు నిర్మించి నీటి పారుదలపై శ్రద్ధ వహించారు. రెండో బేతరాజు సెట్టి సముద్రం, కెరె సముద్రం, కేసరి సముద్రం చెరువులను నిర్మించాడు. గణపతిదేవుడు రాజ్యం నలుమూలలా అనేక చెరువులు నిర్మించాడు. గణపతిదేవుడి సేనాని రేచర్లరుద్రుడు 17,258 ఎకరాలకు సాగు నీరు అందించేవిధంగా పాకాల చెరువును నిర్మించాడు. దీని విస్తీర్ణం 12 చ.కి.మీ. రామప్ప చెరువును నిర్మించింది కూడా ఇతడే. రేచర్ల రెడ్లు 35 నీటి వనరులను ఏర్పాటు చేశారు. కాటచమూపతి కాట సముద్రం; చౌడ చమూపతి చౌడ సముద్రం; నామిరెడ్డి సబ్బి సముద్రం, గౌర సముద్రం, కోమటి చెరువు; ఎరకసాని ఎరక సముద్రం నిర్మించారు. వీటితో పాటు చింతల సముద్రం, నామా సముద్రం కూడా ఉండేవి. చెరువుల నిర్మాణంలో పాల్గొన్న శ్రామికులకు దినసరి వేతనాలు చెల్లించేవారు. చెరువులతో పాటు ఊట కాలువలను కూడా నిర్మించారు. మూసీ నది నుంచి సాగే మూసెటి కాలువ; ఆలేరు నది నుంచి ఆలేటి కాలువ; కూచినేని కాలువ, రావిపాటు కాలువ, బొమ్మకంటి కాలువ, ఊటుంకాలువ, చింతల కాలువల గురించి పిల్లలమర్రి శాసనాల్లో పేర్కొన్నారు. ఏతం, మోటలతో కూడా వ్యవసాయం చేసేవారు. కొత్తగా పొలాలను సాగు చేయడానికి కాకతీయ రాజులు కృషి చేశారు. ప్రతాపరుద్రుడి కాలంలో అడవులను నరికేసి విశాల భూభాగాలను సాగులోకి తీసుకువచ్చారు. నేటి రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లోని అనేక గ్రామాలు ప్రతాపరుద్రుడి కాలంలో రూపొందినవేనని ఆ గ్రామ కైఫీయతుల ద్వారా తెలుస్తోంది. తెలంగాణలోని మంథెన, కాళేశ్వరం, చెన్నూరు, నర్సంపేట, అచ్చంపేట, ఖమ్మం మెట్టు, కొత్తగూడెం అటవీ ప్రాంతాల్లోని గ్రామాల్లో ఎక్కువ భాగం కాకతీయుల కాలంలోనే ఏర్పడినట్లు శాసనాల ద్వారా తెలుస్తోంది. గ్రామం, చెరువును నిర్మించడం నాడు పుణ్యకార్యంగా భావించేవారు. గ్రామాలను ఏర్పరచడానికి అన్ని వృత్తుల వారికి ప్రోత్సాహకాలు ఇచ్చేవారు. చాలా మంది కాకతీయ రాజులు, రాణులు అటవీ, బీడు భూములను వ్యవసాయ యోగ్యంగా చేశారు. వీరి పేరు మీద అనేక గ్రామాలు ఏర్పడ్డాయి. గణపవరం, ఘన్‌పూర్, మహాదేవపురం, రుద్రవరం, బయ్యారం, ముప్పవరం, కుందవరం మొదలైనవన్నీ వీటికి ఉదాహరణ. భూమిపై ప్రాథమిక స్వామ్యం రాజుది, ద్వితీయ స్వామ్యం వ్యక్తిది.

రైతులు వరి, గోధుమలు, కొర్రలు, జొన్నలు, మొక్కజొన్నలు, నీలిమందు, ఆముదాలు, నువ్వులు, పెసలు, కందులు, చెరకు, నూనెగింజలు, ఆవాలు, సజ్జలు, మినుములు, ఉలవలు, పత్తి, అల్లం, పసుపు, ఉల్లి తదితర పంటలు పండించేవారు. ఓరుగల్లు ప్రాంతంలో సువాసనలు వెదజల్లే బియ్యం తయారైనట్లు సాహిత్యం ద్వారా తెలుస్తోంది. ఆ కాలంలో కొబ్బరి, చెరకు, మామిడి, జామ, అరటి తోటలు విస్తారంగా ఉండేవి. సాధారణంగా ప్రతి గ్రామంలో బెల్లం, నూనె గానుగలు ఉండేవి. పశు సంపద పుష్కలంగా ఉండేది.

పరిశ్రమలు: నాడు వ్యవసాయంతో పాటు అనేక పరిశ్రమలు కూడా ఉండేవి. పాల్కురికి సోమనాథుడు 'పండితారాధ్య చరిత్ర'లో ఇరవైకి పైగా వస్త్రాల గురించి పేర్కొన్నాడు. ఓరుగల్లులో రత్న కంబళ్లు, ముఖమల్ వస్త్రాలు నేసేవారు. ఏకామ్రనాథుడు ఓరుగల్లులో చిత్తరువులు రాసే ఇళ్లు 1500 వరకు ఉండేవని పేర్కొన్నాడు. నాడు చిత్రకళకు మంచి ఆదరణ ఉండేది. పాల్కురికి 'బసవపురాణం'లో యాభై రకాల దుస్తుల పేర్లను ప్రస్తావించాడు. కాకతీయుల రాజ్యంలో శ్రేష్ఠమైన సన్నని వస్త్రాలు నేసేవారని, అవి సాలెపురుగు జాలె మాదిరిగా ఉండేవని మార్కోపోలో ప్రశంసించాడు. వీటి ఆధారంగా ఆ కాలంలో పద్మశాలీలకు మంచి నైపుణ్యం ఉండేదని తెలుస్తోంది. పల్లకీల మీద చెక్కిన నగిషీల వర్ణనను పరిశీలిస్తే నాటి వడ్రంగుల పని నైపుణ్యం అర్థమవుతుంది. పంచలోహాలతో వివిధ రకాల వస్తువులను తయారు చేసేవారు. నిర్మల్‌లో తయారైన కత్తులకు డమాస్కస్‌లోనూ మంచి ఆదరణ ఉండేది. గోల్కొండ ప్రాంతంలో వజ్రాల గనులున్నట్లు మార్కోపోలో రాశారు. వ్యవసాయానికి అవసరమైన పరికరాలను గ్రామాల్లోనే తయారు చేసేవారు. పానగల్లు, చండూరులో దేవాలయాల్లో ఉపయోగించే కంచు గంటలు, పళ్లాలు, పాత్రలను రూపొందించేవారు.

వర్తక - వాణిజ్యం: శాతవాహనుల తర్వాత క్రమంగా క్షీణించిన దేశీయ, విదేశీ వాణిజ్యాన్ని కాకతీయులు పునరుద్ధరించారు. కాకతీయుల కాలంలో దేశీయ వాణిజ్యానికి ప్రధాన కేంద్రం ఓరుగల్లు. ఆ తర్వాత తెలంగాణలో మంథెన, అలంపురం, జడ్చర్ల, మగతల, పేరూరు ప్రధాన వాణిజ్యకేంద్రాలుగా ఉండేవి. పలనాటి సీమ నుంచి వాడపల్లి, నకిరెకల్, పిల్లలమర్రి మీదుగా వ్యాపారులు వరంగల్ వచ్చేవారు. బళ్లారి-చిత్తూరు, రాయచూరు-కొలనుపాక, బీదరు-కొలనుపాక, కల్యాణి-కొలనుపాక-అనుమకొండ, బీదరు-పటాన్‌చెరువు-వరంగల్ మొదలైనవి ముఖ్యమైన వాణిజ్య మార్గాలుగా ఉండేవి.

కాకతీయుల పాలనలో తెలంగాణలో వర్తక శ్రేణుల నిర్మాణంలో గుర్తించదగిన మార్పు వచ్చింది. ఆ కాలంలో వ్యాపారం బలిజలకు, వైశ్యులకే పరిమితం కాలేదు. రెడ్లు, నాయుళ్లు, బోయలు, దాసర్లు, తెలికలు, పద్మశాలీలు, వ్యవసాయదారుల లాంటి ఉత్పత్తిదారులు, కమ్మరి, కంసాలి, మేదరి లాంటి వృత్తి కులాల వారు వ్యాపారంలోకి వచ్చారు. వివిధ వృత్తికారులు, ఉత్పత్తిదారులు సొంత సమయాలను ఏర్పరచుకొని తమ కులవృత్తులతో పాటు వ్యాపారాలను నిర్వహించుకునేవారు. వీరిలో కొంత మంది కేవలం తమ ఉత్పత్తులనే అమ్ముకునేవారు. అందువల్ల ఇంత మంది వ్యాపారంలోకి వచ్చినప్పటికీ ప్రధానంగా వ్యాపారం వైశ్యుల చేతిలోనే ఉండేది. గోధుమ, పెసలు, వడ్లు, జొన్నలు, ఉప్పు, నూనె, నెయ్యి, మిరియాలు, ఆవాలు, తేనె, తగరం, రాగి, కర్పూరం, కస్తూరి, పట్టు, రత్నాలు, ముత్యాలు, పూసలు, పసుపు, ఉల్లిగడ్డలు, అల్లం, నూలు, దుంపలు మొదలైన ఉత్పత్తుల వ్యాపారం జరిగేది.

విదేశీ వాణిజ్యం: కాకతీయుల కాలంలో 'మోటుపల్లి' విదేశీ వాణిజ్యానికి ప్రసిద్ధమైన రేవు పట్టణంగా గుర్తింపు పొందింది. చాళుక్య, చోళ రాజుల కారణంగా దెబ్బతిన్న విదేశీ వ్యాపారాన్ని గణపతిదేవుడు ఈ రేవు పట్టణం ద్వారా పునరుద్ధరించాడు. దీని ద్వారా ఇండోనేషియా, జావా, సుమత్రా, జపాన్, మలయా, బర్మాతో వ్యాపారం చేసేవారు. మార్కోపోలో ఈ రేవు పట్టణాన్ని సందర్శించాడు. ఇక్కడి నుంచి ఎగుమతయ్యే వస్తువుల్లో వజ్రాలు, పట్టుతో తయారయ్యే సన్నని వస్త్రాలు ముఖ్యమైనవని అతడు పేర్కొన్నాడు. కాకతీయుల నాణేలు ఎక్కువగా లభించలేదు. కానీ శాసనాలు, సాహిత్యంలో నాణేల ప్రస్తావన ఉండేది.

సాంఘిక పరిస్థితులు

కాకతీయుల కాలంనాటి సంఘంలో ప్రధానంగా బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర కులాలు ఉండేవి. ప్రతి కులంలో అనేక ఉపకులాలు ఏర్పడ్డాయి. ఏకామ్రనాథుడు 'ప్రతాపచరిత్ర'లో, వినుకొండ వల్లభరాయుడు 'క్రీడాభిరామం'లో కాకతీయుల కాలంనాటి వివిధ వృత్తుల గురించి ప్రస్తావించారు. కోమట్లు, ఈడురవారు, గొల్లవారు, అక్కలవారు (ఆగసాల), సాలెవారు, మంగలులు, కుమ్మరివారు, బోయవారు, రుంజులు, పిచ్చుకుంట్లు, పంబల, బవని, మేదర, గాండ్ల మొదలైన కులాల పేర్లను శాసనాల్లోనూ పేర్కొన్నారు.

హిందూ మతాన్ని సంస్కరించే ఉద్దేశంతో శైవ, వైష్ణవ మతాలు ఆవిర్భవించాయి. కుల నిర్మూలన కోసం పుట్టిన వీటి ద్వారా సంఘంలో కొత్త కులాలు ఏర్పడ్డాయి. ఈ విధంగా శైవుల్లో లింగాయతులు, బలిజలు, జంగాలు, తంబళ్లు మొదలైన కులాలు ఏర్పడ్డాయి. వైష్ణవుల్లో నంబులు, సాతానులు, దాసర్లు మొదలైన కులాలు ఆవిర్భవించాయి. 'అష్టాదశ కులాలు' అప్పటికే ప్రాచుర్యంలో ఉన్నాయి.

కాకతీయుల కాలంలో బాల్యవివాహాలు జరిగాయి. అనులోమ, ప్రతిలోమ వివాహ పద్ధతులు ఉండేవి. రుద్రమదేవి కుమార్తె రుయ్యమను బ్రాహ్మణ మంత్రి ఇందులూరి అన్నయ్య దేవుడు పెళ్లి చేసుకోవడం దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు. అయినప్పటికీ కుల నిర్మూలన ప్రయత్నాలు విఫలమయ్యాయి. కాకతీయుల కాలంలో వెలమలు సంఘ సంస్కర్తలుగా, రెడ్లు పూర్వాచార పరాయణులుగా ఉన్నట్లు తెలుస్తోంది. నాడు రాజకీయంగా ప్రాబల్యం వహించిన రెడ్లు, వెలమల మధ్య అధికారం కోసం పోటీ ప్రారంభమైంది. ఈ కాలంలో అష్టాదశ వర్ణాల్లో అగ్రవర్ణమైన బ్రాహ్మణ వర్గానికి చెందినవారు రాజకీయ ప్రాబల్యాన్ని కోల్పోయారు. రాజకీయాధికారం చతుర్థ వర్ణ పరమైంది. క్షత్రియ వంశాలు నామమాత్రంగా అధికారంలో ఉండేవి.

కాకతీయుల కాలంనాటి సాంఘిక జీవితానికి సంబంధించిన ఒక ప్రధాన లక్షణం కుల సంఘాలు. వీటిని 'సమయములు' అనేవారు. నగరాలు, గ్రామాలు పేటలుగా విభజించి ఉండేవి. అక్కలవాడ, భోగంవీధి, వెలిపాళె, మేదరవాడ, మోహరినాడు మొదలైనవి ఇలాంటివే. పూటకూళ్ల ఇళ్లు ఉండేవి. బసవ పురాణం ఆధారంగా అనాటికే వెట్టి వ్యవస్థ ఉన్నట్లు తెలుస్తోంది. మహిళలు పాత్ర, గొండ్లి, పేరణి, కోలాటం, గొబ్బిళ్లు, గుర్రం, భంజళి మొదలైన క్రీడలతో వినోదం పొందేవారు.

వాస్తు, శిల్ప కళ

కాకతీయ రాజులు, వారి సామంతులు అనేక జైన, శైవ, వైష్ణవాలయాలను నిర్మించారు. దేవాలయ నిర్మాణంలో కాకతీయులు పశ్చిమ చాళుక్యుల వాస్తు విధానాన్ని అనుసరించారు. వీరు త్రికూటాలయాలను ఇదే పద్ధతిలో నిర్మించారు. బేతిరెడ్డి భార్య ఎరకేశ్వరాలయం నిర్మించారు. నామిరెడ్డి పిల్లలమర్రిలో కాటేశ్వర, కాచేశ్వర, నామేశ్వర ఆలయాలను నిర్మించాడు. పాలంపేట, పిల్లలమర్రి, పానగల్లు, హన్మకొండలో ఉన్న ఆలయాలను త్రికూట పద్ధతిలోనే నిర్మించారు.

నంది విగ్రహాలు కాకతీయ శిల్ప ప్రాభవానికి నిదర్శనాలు. కాకతీయ శిల్పం చాళుక్యుల శిల్పం కంటే నిగ్గు తేలి ఉంది. ఇది కొంత ప్రాంతీయ లక్షణాలను సంతరించుకొని ఉంటుంది. దేశీయ నృత్య రీతులకు ప్రాతినిధ్యం వహిస్తున్న నాట్యగత్తెల కోలాట దృశ్యాలు కూడా కాకతీయుల కళా నైపుణ్యానికి తార్కాణంగా ఉన్నాయి.

మాదిరి ప్రశ్నలు

1. ఏ కాకతీయ పాలకుడి కాలంలో విశాల భూభాగాలు సాగులోకి వచ్చాయి?
   1) గణపతిదేవుడు 2) ప్రతాపరుద్రుడు
   3) రుద్రదేవుడు 4) రెండో బేతరాజు
2. రాయలసీమ, పల్నాడు ప్రాంతాల్లోని అనేక గ్రామాలు ఎవరి కాలంలో ఏర్పడ్డాయని కైఫీయత్తుల ద్వారా తెలుస్తోంది?
   1) బేతరాజు 2) ప్రోలరాజు
   3) ప్రతాపరుద్రుడు 4) రుద్రమదేవి
3. కాకతీయ రాజ్యంలో శ్రేష్ఠమైన వస్త్రాలు ఉన్నాయని ప్రశంసించిన విదేశీ యాత్రికుడు?
   1) మెగస్తనీస్ 2) ప్లీని
   3) మార్కోపోలో 4) నికోలో కాంటి
4. గోల్కొండ ప్రాంతంలో వజ్రాల గనులు ఉన్నట్లు రాసిన విదేశీ యాత్రికుడు?
   1) టాలెమి 2) మార్కోపోలో
   3) ప్లీని 4) కొలంబస్

సమాధానాలు

1) 2; 2) 3; 3) 3; 4) 2.

The smallest memory size is?

BANK EXAMS

COMPUTER AWARENESS



HACKER

(Computer security)

Hacker is considered as hero of computer programs. In computer security, a hacker is someone who focuses on security mechanisms of computer and network systems. He is someone who lives and breathes computers, who know all about computers, who can get a computer to do anything. Equally important, though, is the hacker's attitude. Computer programming must be a hobby, something done for fun, not out of a sense of duty. Hackers are generally computer geniuses because it is due to the extraordinary computer knowledge and skills that they can conveniently break into other computer systems.

CRACKER

Cracker is considered as villain of computer programs. A cracker is someone who breaks into someone else's computer system, often on a network; bypasses passwords or licenses in computer programs; or in other ways intentionally breaches computer security. A cracker does this for profit, maliciously, for some altruistic purpose.

CLASSIFICATION OF HACKERS BASED ON THEIR ATTITUDE:

WHITE HAT

A "White hat" hacker breaks security for non-malicious reasons, perhaps to test their own security system or while working for a security company which makes security software. The term "white hat" in Internet slang refers to an ethical hacker.

BLACK HAT

A "Black hat" hacker is a hacker who "violates computer security for little reason beyond maliciousness or for personal gain". Black hat hackers break into secure networks to destroy, modify, or steal data; or to make the network unusable for those who are authorized to use the network. Black hat hackers are also referred to as the "crackers" within the security industry and by modern programmers.

GREY HAT

A grey hat hacker lies between a black hat and a white hat hacker. Grey hat hackers sometimes find the defect of a system and publish the facts to the world instead of a group of people. Even though grey hat hackers may not necessarily perform hacking for their personal gain, unauthorized access to a system can be considered illegal and unethical.

ELITE HACKER

A social status among hackers, elite is used to describe the most skilled. Newly discovered exploits circulate among these hackers.

SCRIPT KIDDIE

A script kiddie (also known as a skid or skiddie) is an unskilled hacker who breaks into computer systems by using automated tools written by others.

NEOPHYTE

A neophyte ("newbie", or "noob") is someone who is new to hacking or phreaking and has almost no knowledge or experience of the workings of technology and hacking.

BLUE HAT

A blue hat hacker is someone outside computer security consulting firms who is used to bug-test a system prior to its launch, looking for exploits so they can be closed.

PHREAKS

A phreak is a hacker who specializes in phone systems. These days, however, phreaking is more of a cracker activity. At one time, phreaks were enthusiastic about telephone networks and simply wanted to understand how they worked and explore them. Ethical phreaks didn't steal services or cause damage; they just used their technical skill to play with the system. Phone systems have changed and are less susceptible to technological hacks. As a result, modern phreaks intent on cracking the telecommunications systems often rely on criminal acts such as stealing phone cards and cloning cell phones.

HACKTIVISTS

The hacktivist is a gray hat or cracker who defaces Web pages to bring attention to a political agenda or social cause. Companies, organizations, and governments that engage in controversial practices or that have unpopular policies are likely targets of hacktivists. How ethical this behaviour is depends on whether or not you support the hactivist's agenda or believe in his cause.

MODEL QESTIONS

1. Retail employees typically use ________ terminals to process sales transactions.
   1) Point of sale
   2)Transaction point
   3) Automatic teller
   4) Sales processing
   5) None of these
2. The simultaneous processing of two or more programs by multiple processors is _____
   1) Multiprogramming
   2) Multiprocessing
   3) Time-sharing
   4) Multitasking
   5) None of these
3. The ___ folder retains copies of messages that you have started but are not yet ready to send.
   1) Drafts 2) Sent Items
   3)Address Book
   4) Outbox
   5) None of these
4. Inheritance is the ability of an object to pass on its characteristics to its ________.
   1) Subclasses 2)off-spring
   3) Super classes 4) Parents
   5) None of these
5. Which of the following is used for close a tab on a browser?
   1) Ctrl + T 2) Ctrl + Y
   3) Ctrl + A 4) Ctrl + W
   5) None of these
6. A program that converts high level language to machine Language is ______
   1) Linker 2) Assembler
   3) Compiler 4) All of the above
   5) None of these
7. At a time how many operating system can be at work on a computer?
   1) Only one 2) Two
   3) Three 4) Four
   5) None of these
8. A computer that combines the characteristic of analog and digital computers_________
   1) Hybrid Computer
   2) Analog Computer
   3) Digital Computer
   4) Super Computer
   5) None of these
9. The technique that extends storage capacities of main memory beyond the actual size of the main memory is called _______
   1) Multitasking 2) Switching
   3) Multiprocessing
   4) Multiprogramming
   5) Virtual storage
10. The maximum Zoom percentage in MS WORD is_______
    1) 100% 2) 200%
    3) 400% 4) 500%
    5) None of these
11. The smallest memory size is?
    1) Byte 2) GigaByte
    3) KiloByte 4) MegaByte
    5) None of these
12. Android Operating system is an example of which kind of Source Model?
    1) Open Source
    2) Vertical Market Software
    3) Horizontal Market Software
    4) Shareware 5) None of these
13. Which process checks to ensure the components of the computer and operating are connected properly?
    1) Booting 2) Processing
    3) Editing 4) Saving
    5) None of these
14. Codes consisting of lines of varying widths or lengths that are computer-readable are known as?
    1) An ASCII code
    2) An OCR scanner
    3) A magnetic tape
    4) A bar code 5)None of these
15. What is the ultimate purpose of Defragmentation?
    1) Make the PC faster
    2) Create More Free Space
    3) Delete temporary files
    4) Reduce Power consumption
    5) None of these
16. Which input device cannot be used to work in MS Office?
    1) Scanner 2) Mouse
    3) Keyboard 4) Joy stick
    5) Light pen
17. Storage that retains its data after the power is turned off is referred to as?
    1) Volatile storage
    2) Sequential storage
    3) Non-volatile storage
    4) Direct storage
    5) None of these
18. Accessing data on tapes is much ______ than that accessing data on disks?
    1) Same 2) Faster
    3) Slower 4) All of the above
    5) None of these
19. IP-Address 192.5.48.3 belongs to-
    1) Class A 2) Class B
    (3) Class C 4) Class D
    5) None of these
20. Which type of web document is run at the client site?
    1) Static 2) Dynamic
    3) Active 4) All of the above
    5) None of these
21. UDP (User Diagram Protocol) is-
    1) Connectionless
    2) Network Oriented
    3) Connection oriented
    4) a & b 5) None of these
22. Which of the following is NOT a Microsoft Internet tool or technology?
    1) Dreamweaver
    2) Silver light
    3) Internet Explorer
    4) Expression Web
    5) None of these
23. Which Software protects the resources of a private network from users from other networks?
    1) Cache server 2) proxy server
    3) Firewall 4) Router
    5) None of these

KEY

1) 1; 2) 2; 3) 1; 4) 1; 5) 4; 6) 3; 7) 1; 8) 1; 9) 5; 10) 4; 11) 1; 12) 1; 13) 1; 14) 4 15) 2; 16) 4; 17.3; 18) 3; 19) 3; 20) 1; 21.1; 22) 1; 23) 3.